సాంఘిక శాస్త్రం ఆరో తరగతి


తెలంగాణ ప్రభుత్వం
మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ - చైల్డ్ లైన్ ఫౌండేషన్
బడిలోగానీ, బడి బయటగానీ వేధింపులకు గురవుతున్నా
ఆపదలో, కష్టాలలో ఉన్న పిల్లలను రక్షించదానికి
CHILD LINE 1098 NIGHT & DAY
24 HOUR NATIONAL HELPLINE
పిల్లలతో పనిచేయిస్తున్నా, వారిని బడికి పంపకుండా వేరే కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నా
కుటుంబ సభ్యులు గానీ, బంధువులు గానీ ఇబ్బందికరంగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నా
1098 (పది-తొమ్మిది-ఎనిమిది) ఉచిత టెలిఫోన్ సేవా సౌకర్యానికి ఫోన్ చేయండి

IN ANY EMERGENCY
DIAL
100
TELANGANA POLICE
www.tspolice.gov.in
@ Telangana State Police



రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.




తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ

సాంఘిక శాస్త్రం ఆరో తరగతి

# సాంఘిక శాస్త్రం

## ఆరో తరగతి

Free










తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ


SCERT TELANGANA

## భారత రాజ్యాంగము - పౌర విధులు

1. రాజ్యాంగమునకు బద్ధుడై వుండుట, దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకమును,జాతీయ గీతమును గౌరవించుట;
2. జాతీయ స్వాతంత్ర్య పోరాటమునకు స్ఫూర్తినిచ్చిన ఉన్నతాదర్శములను మనస్సుయందు ఉంచుకొని వాటిని అనుసరించుట;
3. భారత సార్వభౌమత్వం, ఐక్యత, అఖండతను సమర్థించుట మరియు సంరక్షించుట.
4. దేశమును రక్షించుట మరియు కోరినపుడు జాతికి సేవ చేయుట;
5. భారత ప్రజల మధ్య మత, భాష, ప్రాంతీయ, వర్గ వైవిధ్యములను అధిగమించి, సామరస్యమును, సోదర భావమును పెంపొందించుట, స్త్రీల గౌరవం తగ్గించు ఆచారములను విడనాడుట;
6. మన ఉమ్మడి సంస్కృతినీ, సుసంపన్న సంప్రదాయాలను గౌరవించి రక్షించుట;
7. అడవులు, సరస్సులు, నదులు, అడవి జంతువులతో సహా ప్రాకృతిక పరిసరాలను కాపాడి అభివృద్ధి చేయుట మరియు సమస్త జీవుల యెడల కరుణార్ద్రత కలిగి వుండుట.
8. శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణ తత్వాన్ని పెంపొందించుకొనటం;
9. ప్రజల ఆస్తిని సంరక్షించుట, హింసను విడనాడుట;
10. ప్రయత్నాలు, సాధనల ఉన్నతస్థాయిలను నిరంతరం అందుకొనునట్లుగా వైయక్తిక, సమిష్టి కార్య రంగాలన్నింటిలో శ్రేష్ఠత కోసం, కృషి చేయుట ప్రాథమిక కర్తవ్యమై వుండవలెను.
11. ఆరు నుండి పద్నాలుగు సంవత్సరముల వయస్సు కలిగిన బాలునికి లేదా బాలికకు తల్లి తండ్రి లేదా సంరక్షకునిగావున్న వ్యక్తి తనబిడ్డ లేదా సందర్భానుసారము తన సంరక్షితునికి విద్యార్జనకు అవకాశములు కల్పించవలెను.

**- భారతరాజ్యాంగము,**

**భాగము IV A (ఆర్టికల్ 51 A)**

## విద్యా హక్కు చట్టం

6 నుండి 14 సంవత్సరముల పిల్లలందరికి ఉచిత నిర్బంధ ఎలిమెంటరీ విద్యనందించడానికి ఉద్దేశించబడినవి. ఇది ఏప్రిల్ 1, 2010 నుండి అమల్లోకి వచ్చింది.

**చట్టంలోని ముఖ్యాంశాలు:**

- పిల్లలందరికి అందుబాటులో పాఠశాలలను ఏర్పాటుచేయాలి.
- పాఠశాలలకు మౌలిక వసతులను కల్పించాలి.
- పిల్లలందరిని వయస్సుకు తగిన తరగతిలో చేర్పించాలి.
- వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చిన తర్వాత తోటి వారితో సమానంగా ఉండటానికి ప్రత్యేకశిక్షణ ఇప్పించాలి.
- ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు సాధారణ పిల్లలతోపాటు విద్యకొనసాగించడానికి తగువసతులు ఏర్పాట్లు చేయాలి.
- బడిలో చేర్చుకోడానికి ఎలాంటి పరీక్షలు నిర్వహించరాదు. ఎటువంటి రుసుము, చార్జీలు వసూలు చేయరాదు.
- బడిలో చేరిన పిల్లల పేరు తీసివేయడం, అదే తరగతిలో కొనసాగించడం చేయరాదు.
- పిల్లల్ని శారీరకంగా, మానసికంగా హింసించరాదు.
- వయస్సు నిర్ధారణ పత్రం, ఇతర ధృవీకరణ పత్రాలు లేవనే కారణం చేత పిల్లలకు బడిలో ప్రవేశాన్ని నిరాకరించరాదు.
- తగిన అర్హతలున్న వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలి.
- పిల్లలు నిర్దేశించిన సామర్థ్యాలు సాధించేలా బోధనాభ్యసనం, మూల్యాంకనం ఉండాలి.
- ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పిల్లలకు ఎలాంటి బోర్డు పరీక్షలు నిర్వహించరాదు.
- పద్నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికినీ, ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పాఠశాలలో పిల్లలు కొనసాగవచ్చును.
- బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏ విధమైన వివక్షతకు గురికాకుండా చూడాలి.
- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా, విద్యార్థులను భయం, ఆందోళనకు గురిచేయని రీతిలో వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే పాఠ్యప్రణాళిక రూపొందించాలి.

SCERT TELANGANA

# సాంఘిక శాస్త్రం

## ఆరో తరగతి

### సంపాదకులు


**శ్రీ సి.ఎన్. సుబ్రహ్మణ్యం,**
ఏకలవ్య, మధ్యప్రదేశ్.

**ప్రొ॥ ఐ. లక్ష్మీ,** చరిత్ర విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

**ప్రొ॥ యం. కోదండరాం,** రాజనీతి శాస్త్ర విభాగం,
పి.జి.కళాశాల, సికింద్రాబాద్, హైదరాబాద్.

**ప్రొ॥ కె. విజయబాబు,** చరిత్ర విభాగం,
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.

**డా॥ ఎం.వి. శ్రీనివాసన్,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
డి.ఇ.యస్.యస్.హెచ్. ఎన్.సి.ఇ.ఆర్.టి, న్యూఢిల్లీ.

**డా॥ ఎం.వి.ఎస్.వి. ప్రసాద్,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
డి.ఇ.యస్.యస్.హెచ్. ఎన్.సి.ఇ.ఆర్.టి. న్యూఢిల్లీ.

**డా॥ సి. దయాకర్ రెడ్డి,** అసోసియేట్ ప్రొఫెసర్,
యూనివర్సిటీ కాలేజ్ ఫర్ ఉమెన్, కోఠి, హైదరాబాద్.

**శ్రీ కె. సురేష్,**
మంచిపుస్తకం, హైదరాబాద్.

**ప్రొ॥ జి. ఓంకార్‌నాథ్,** అర్థశాస్త్ర విభాగం,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

**ప్రొ॥ ఎస్. పద్మజ,** భూగోళశాస్త్రం విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

**ప్రొ॥ ఎ. సత్యనారాయణ** (రిటైర్డ్), చరిత్ర విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

**డా॥ కె.కె. కైలాష్,** రాజనీతిశాస్త్ర విభాగం,
హెచ్.సి.యు., హైదరాబాద్.

**శ్రీ అరవింద్ సర్దాన,**
డైరెక్టర్, ఏకలవ్య, మధ్యప్రదేశ్.

**డా॥ కె. నారాయణరెడ్డి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, భూగోళశాస్త్రం
విభాగం, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

**శ్రీ రామ్మూర్తి శర్మ,**
విద్యా విభాగము, పంజాబ్.

**శ్రీ అలెక్స్ ఎం. జార్జ్,**
ఏకలవ్య, మధ్యప్రదేశ్.


### పాఠ్యపుస్తక అభివృద్ధి, ప్రచురణ సమితి


**శ్రీమతి బి. శేషుకుమారి** సంచాలకులు,
యస్‌సిఇఆర్‌టి, తెలంగాణ,
హైదరాబాద్.

**శ్రీ బి. సుధాకర్** సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం,
తెలంగాణ, హైదరాబాద్.

**డా॥ఎన్. ఉపేందర్ రెడ్డి,** ప్రొఫెసర్,
విద్యాప్రణాళిక-పాఠ్యపుస్తక విభాగం, యస్‌సిఇఆర్‌టి,
తెలంగాణ, హైదరాబాద్.

తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు


చట్టాలను గౌరవించండి
హక్కులను పొందండి

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2020-21

© Government of Telangana, Hyderabad.

*First Published 2012*

*New Impressions 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020*

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copyright holder of this book is the Director of School Education, Hyderabad, Telangana.

We have used some photographs which are under creative common licence. They are acknowledged at the end of the book.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

**తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2020-21**

*Printed in India*
at the Telangana Govt. Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

— o —

SCERT TELANGANA

# సాంఘిక శాస్త్రం
## ఆరో తరగతి

### రచయితలు

**డా॥ కె. లక్ష్మారెడ్డి,** సీనియర్ లెక్చరర్, డైట్, కరీంనగర్
**శ్రీ మడితాటి నరసింహారెడ్డి,** జి.హెచ్.ఎం., జి.ప.ఉ. పాఠశాల, పెద్దజంగంపల్లి, వైఎస్ఆర్ కడప
**శ్రీ కె. లక్ష్మీనారాయణ,** లెక్చరర్, డైట్, కృష్ణా
**శ్రీ కె. సుబ్రహ్మణ్యం,** లెక్చరర్, డైట్, కర్నూలు
**శ్రీ మల్యాల పాపయ్య,** లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ
**శ్రీమతి టి.ఎస్. మల్లీశ్వరి,** లెక్చరర్, ఎస్.ఐ.ఇ.టి. తెలంగాణ, హైదరాబాద్,
**శ్రీ కొరివి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, మం.ప.ప్రాథమికోన్నత పాఠశాల, పి.ఆర్.పల్లి, శ్రీకాకుళం
**శ్రీ యు. ఆనంద్‌కుమార్,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, పాతపాల్వంచ, ఖమ్మం
**శ్రీ బి. శ్రీనివాసులు,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, సావెల్, నిజామాబాద్
**శ్రీ ఎస్. రహంతుల్లా,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, బాకరాపేట్, వైఎస్ఆర్ కడప
**శ్రీ సి.హెచ్. రాధాకృష్ణ,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, వెంకటాపురం, శ్రీకాకుళం
**శ్రీమతి బి. సరళ,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, ఇందుకూరుపేట్, పి.ఎస్.ఆర్. నెల్లూరు
**శ్రీ బి. శంకరరావు,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, దేవుపల్లి, విజయనగరం
**శ్రీ మోహన్ రెడ్డి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ.పాఠశాల, యన్మన్‌గండ్ల, మహబూబ్‌నగర్.
**శ్రీ అయాచితుల లక్ష్మణ రావు,** స్కూల్ అసిస్టెంట్, ప్ర.ఉ.పాఠశాల, ధన్‌గర్‌వాడి, కరీంనగర్.
**డా॥ ఆర్. గణపతి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ.పాఠశాల, లాదెల్ల, ఆత్మకూర్, వరంగల్.
**శ్రీ గడ్డమీది రథాంగపాణి రెడ్డి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ.పాఠశాల, జానంపేట, మూసాపేట, మహబూబ్‌నగర్.
**శ్రీ వంగూరి గంగిరెడ్డి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ.పాఠశాల, కొందుర్గు, మహబూబ్‌నగర్.
**డా॥ చకినాల శ్రీనివాస్,** జి.హెచ్.ఎం., ప్ర.ఉ.పాఠశాల, దుర్గమ్మగడ్డ, కరీంనగర్.
**శ్రీ ఎన్.సి.జగన్నాథ్,** ప్ర.ఉ.పాఠశాల, కుల్సుంపుర, హైదరాబాద్.

### సమన్వయం

**ప్రొ॥ జె. రాఘవులు,** ఎస్‌సిఇఆర్‌టి, సి&టి విభాగం, తెలంగాణ
**శ్రీ మల్యాల పాపయ్య,** లెక్చరర్, ఎస్‌సిఇఆర్‌టి, తెలంగాణ
**శ్రీ సువర్ణ వినాయక్,** ఎస్‌సిఇఆర్‌టి, సి&టి విభాగం, తెలంగాణ
**శ్రీ మడితాటి నరసింహారెడ్డి,** జి.హెచ్.ఎం., జి.ప.ఉ. పాఠశాల, పెద్దజంగంపల్లి, వై.ఎస్.ఆర్ కడప
**శ్రీ కొరివి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, మం.ప.ప్రాథమికోన్నత పాఠశాల, పి.ఆర్.పల్లి, శ్రీకాకుళం

### చిత్రకారులు

**శ్రీ కూరెళ్ళ శ్రీనివాస్,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, పోచంపల్లి, నల్గొండ
**శ్రీ బి. కిషోర్‌కుమార్,** మం.ప.ప్రాథమికోన్నతపాఠశాల, ఆల్వాల, నల్గొండ
**శ్రీ పి. ఆంజనేయులు,** జియోమ్యాపర్, సెస్–డిసియస్, హైదరాబాద్

### డిజైనింగ్

**శ్రీ దార కన్నయ్య,** కంప్యూటర్ ఆపరేటర్, ఎస్‌సిఇఆర్‌టి, తెలంగాణ, హైదరాబాదు.
**శ్రీమతి పావని,** గ్రాఫిక్ డిజైనర్, హైదరాబాదు.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2020–21

## విద్యార్థులకు ఉత్తరం

*రోజంతా పొలంలో, ఇంట్లో పని చేసి అలసిపోయిన అమ్మ చెంతనే కూర్చొన్న నాకు ఆడవారి జీవితంలో ఇంత కష్టమెందుకు అనే ఆలోచన కదలాడింది. నేను ఇంటి నుండి బయలు దేరిన వేళ వివిధ రకాల బాషలు మాట్లాడేవారు, ఆచారాలను పాటించేవారు తారసపడుతుంటే ఎవరు వీరు? ఎందుకు ఇన్ని రకాల ప్రజలు, అనే భావన నన్ను అలుముకుంటుంది.*

*కష్టపడి సేద్యం చేసే రైతులు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారన్న వార్తలను వార్తా పత్రికలో చూసి కలవర పడుతుంటాను. పట్టణంలోని వీధులలో నేను వస్తున్నప్పుడు విశాలమైన రోడ్లను, సమున్నతమైన కట్టడాలను, గుడి, చర్చి, మసీదులను చూసినప్పుడు ఎవరు కట్టించారబ్బా! ఎంత వెచ్చించారబ్బా! అని ఆశ్చర్యానికి లోనౌతుంటాను. అందమైన హర్మ్యాలతో కూడిన ఈ పట్టణాలలో నివసించడానికి స్థలం లేక వేలకొద్ది మనుషులు దుర్భర పరిస్థితులలో నివసిస్తున్న తీరు నన్ను విస్మయ పరుస్తుంటుంది.*

*మంచి వాళ్లకు ఓటేసి ఎన్నుకోవాలని పెద్దవాళ్లు మాట్లాడుతుంటే విని, మనలను ఎవరు పరిపాలిస్తున్నారు? ఎలా పరిపాలిస్తున్నారనే ఆసక్తి కలిగింది.*

*గతంలో రాజులు, రాజ్యాలను పరిపాలించే వారని, దేవుళ్లు, యోగులు మన మధ్య తిరిగారని అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు చెప్పగా విని నిజంగా అలా జరగడానికి అవకాశం ఉందా అనే భావన నాలో కలుగుతుంది. ఈ విధంగా నాలో రోజూ ఎన్నో ప్రశ్నలు, సందేహాలు ఉదయిస్తుంటాయి.*

*ఈ ప్రశ్నలకు, సమాధానం ఎక్కడ దొరుకుతుందని ఆలోచిస్తుంటాను. బహుశ ఏ ఒక్కరో నా ప్రశ్నలన్నింటికి సమాధానం ఇవ్వలేరేమో, లేక నా ప్రశ్నల్లో కొన్నింటికి జవాబులు కొందరు చెప్పలేరని అనిపిస్తుంది. వీటికి సమాధానాలన్ని నేనే అన్వేషించుకోవాలి? అది ఎలా? నాకు సహాయపడేదెవరు?*

**ప్రియమైన స్నేహితులారా!**

మీ మస్తిష్కంలో కదలాడుతున్న ముఖ్యమైన పై ప్రశ్నలకు ప్రతి ఒక్కరు సమాధానాలన్నీ కనుగొనవలసిన అవసరం ఉంది. ఇవి సులభమైన ప్రశ్నలు కావు. ఈ ప్రశ్నలలో దేనికి కూడా నిర్దిష్టమైన సమాధానం లేదు. నిజానికి వివిధ వ్యక్తులు ఈ ప్రశ్నలకు వివిధ పరిష్కారాలను సూచిస్తారు. ఈ సమస్యలను క్షుణ్ణంగా, జాగ్రత్తగా చదివిన తరువాత మీరు కూడా స్వయంగా కొన్ని పరిష్కారాలను సూచించ గలుగుతారు. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని ప్రశ్నలను వాటి పరిష్కారానికి కొన్ని పద్ధతులను మన ముందుంచాయి. పాఠశాలల్లో కంటే కళాశాలల్లో తక్కువ మంది ఆడపిల్లలు ఎందుకు చదువుతున్నారని ప్రశ్నిస్తే వివిధ రకాల ప్రజల నుండి వివిధ రకాల జవాబులు లభిస్తాయి. అలాగే ధనికులు నివసిస్తున్న కాలనీలు శుభ్రంగా ఊడ్చే విధంగా మురికి వాడలు ఎందుకు శుభ్రంగా ఊడ్చరని తర్కిస్తే ఎన్నో జవాబులు మీ ముందు ఉంటాయి. పై ప్రశ్నలన్నింటికి ప్రజలు వివిధ సమాధానాలు ఎందుకు ఇచ్చారు? ఈ సమస్యలను అర్థం చేసుకోవడానికి సాంఘిక శాస్త్రం ప్రయత్నిస్తుంది.

ఒక సమస్యకు వచ్చే వివిధ జవాబులను క్రోడీకరించడమే సాంఘిక శాస్త్రపు పని కాదు. సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడానికి సమర్థవంతమైన పద్ధతిని రూపొందించి అధ్యయనం చేస్తుంది. సమస్య ఏ విధంగా మొదలైంది, ఎలా అభివృద్ధి చెందింది, ఎందుకు, ఎలాంటి మార్పులకు లోనైంది, ప్రపంచ వ్యాప్తంగా సమస్య స్వభావం ఒకే విధంగా ఉందా? మారుతూ ఉందా? వంటి విభిన్న కోణాలలో సమస్యను చూసే ప్రయత్నం చేస్తుంది. మన తొలి ప్రశ్ననే తీసుకుంటే కళాశాలల్లో గతంలో కూడా తక్కువ మంది ఆడపిల్లలే చదువుకునే వారా? ప్రపంచ వ్యాప్తంగా ఇదే బాణీ ఉండేదా? ఎందుకు? ఆడపిల్లలు కళాశాలకు వెళ్లకుండా నిరోధించిన అంశాలు ఏమిటి? కళాశాలల్లో ఎందుకు వీళ్ళు లేకుండా పోతున్నారు? కళాశాలలకు ఆడపిల్లలను పంపని, పంపించే తల్లిదండ్రులు ఏమంటున్నారు? ఆ పిల్లల సమాధానం ఏమిటి? అధ్యాపకులు ఏమంటున్నారు? సాంఘిక శాస్త్రవేత్తలు సమస్యకు సమాధానం చెప్పే ముందు వీటన్నింటిని సమగ్రంగా పరిశీలిస్తారు. అలాగని ఏ సాంఘిక శాస్త్రవేత్త ఇదే ఖచ్చితమైన పరిష్కారమని గాని, ఇదే తుది లేక కచ్చితమైన జవాబు అని గాని తెలియజేయలేదు. ఏ సమాధానాన్ని లేక పరిష్కారాన్ని ఆమోద యోగ్యమయినదిగా భావిస్తారో మీరే నిర్ణయించుకోవాలి.

– సంపాదకులు

SCERT TELANGANA

**ఈ పుస్తకం గురించి......**

మీ చుట్టూ ఉన్న సమాజాన్ని అధ్యయనం చేసే ప్రక్రియలో భాగంగా, సాంఘిక శాస్త్ర విద్యా ప్రణాళికలో భాగంగా ఈ పుస్తకం రూపొందింది. ఇది ఆ విద్యా ప్రణాళికలో ఒక చిన్న భాగం మాత్రమే. సాంఘిక శాస్త్ర విద్యా ప్రణాళిక మీకు తెలిసిన అంశాలను తరగతి గదిలో నలుగురితో పంచుకోవడానికి, విశ్లేషించుకోవడానికి దోహదపడుతుంది. సమాజంలోని వివిధ అంశాలను అలా ఎందుకు ఉన్నాయని ప్రశ్నించడానికి, సమస్యలు ఇలా ఎందుకున్నాయి అని ఆలోచించడానికి సాంఘికశాస్త్రం ఉపయోగపడుతుంది. మీరు మీ స్నేహితులు తరగతి గది నుండి బాహ్య ప్రపంచంలోని బజారు, పంచాయితీ, మున్సిపాలిటీ, పల్లె సీమలోని పొలాలు, దేవాలయాలు, మసీదులు, వస్తు ప్రదర్శనశాలలు (మ్యూజియం), ఇంకా ఎన్నో అంశాలను తెలుసుకోవటానికి పురి కొల్పుతుంది. రైతులు, దుకాణదారులు, ఉద్యోగులు, దైవ కార్య నిర్వాహకులు మొదలైన వారందరితో కలిసి చర్చించే అవకాశాన్ని ఈ పుస్తకం కల్పిస్తుంది.

ఈ పుస్తకం మీముందు ఎన్నో సమస్యలను ఉంచి వాటిని అధ్యయనం చేసి అర్థం చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. ఈ పుస్తకంలో అన్ని ప్రశ్నలకు జవాబులు ఉండవు. మీరు ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనాలి. నిజానికి ఇది సంపూర్ణమైన గ్రంథం కాదు. మీ స్నేహితుల, ఉపాధ్యాయుల అనుభవాలు, సందేహాలను విడమర్చి చర్చించి జోడించినప్పుడు పరిపూర్ణత్వం కలుగుతుంది. పుస్తకంలోని చాలా అంశాలతో మీరు విభేదించవచ్చు, సంకోచం లేకుండా కారణాలను తెలపవచ్చు, చివరగా స్వయంగా పరిష్కారాన్ని పొందవచ్చు. అలా పొందిన సమాధానాన్ని తరచి చూడాలనిపిస్తే ప్రశ్నలన్నింటిని జాగ్రత్తగా ఒక పట్టికగా తయారు చేసి స్నేహితుల, ఉపాధ్యాయుల, పెద్దవాళ్ళ సహాయాన్ని అర్థించి స్థిరమైన నిర్ణయాన్ని తీసుకొనండి.

సామాజిక జీవనంలో విభిన్న పార్శ్వాలను అధ్యయనం చేయడానికి ఈ పుస్తకం దోహదపడుతుంది. భూస్వరూపాలు, ప్రజల భిన్నత్వం, ప్రజల జీవనాధారాలు, ప్రజల సామూహిక అవసరాలను, వాటి నిర్వహణను, అసమానత్వంతో కూడిన సమాజంలో సమానత్వ సాధన ఎలాగో, వివిధ దేవుళ్లను, వివిధ మార్గాలలో పూజించే విధానం చివరగా ఒకరితో ఒకరి సంబంధ బాంధవ్యాలను, ఫలితంగా పంచుకునే సంస్కృతిని ఆకళింపు చేసుకోవటానికి, సమాచారం పంచుకోవడానికి ఈ పుస్తకం కల్పిస్తుంది.

పై అంశాలలో కొన్నింటిని అవగాహన చేసుకోవడానికి గాను మనం భూమి, కొండలు, పీఠభూములు, మైదానాలు, నదులు, సముద్రాలు మొదలైన వాటి గురించి అధ్యయనం చేయవలసి ఉంటుంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం ఏమి జరిగిందో, తరచి చూస్తే గాని మరికొన్ని విషయాలను అవగాహన చేసుకోలేం. మొత్తం మీద విభిన్న రకాల ప్రజల వద్దకు వెళ్లి వారితో సంభాషిస్తే కాని సామాజిక జీవనం అర్థం కాదు.

ఈ పుస్తకంలోని పాఠాలను త్వరితంగా పూర్తి చేయడం కంటే ఇచ్చిన ప్రశ్నలు, కృత్యాలను సమర్థవంతంగా నిర్వహించడం అవసరం. ఈ పాఠ్య పుస్తకాన్ని చదువుతున్నప్పుడు మీకు ఎన్నో ప్రశ్నలు, కృత్యాలు ఎదురవుతుంటాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలకోసం ప్రయత్నించాలి. ఇచ్చిన కృత్యాలను, ప్రాజెక్టులను చేసిన తరువాతనే తదుపరి పాఠ్యాంశంలోకి వెళ్ళాలి.

చాలా పాఠాలలో ప్రాజెక్టు పనులు ఉన్నాయి. వాటిని నిర్వహించడానికి కొన్ని రోజులు పడుతుంది. ఇవి సాంఘిక శాస్త్రంలో విషయ సేకరణకు, విశ్లేషణకు, ప్రదర్శనకు కావలసిన నైపుణ్యాలను పెంపొందిస్తాయి. పాఠంలో ఉన్న దానిని బట్టీపట్టడం కాకుండా వాటిని గురించి ఆలోచించి స్వీయ అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవాలి.

- సమాచార నైపుణ్యాలలో పట్టికలు, గ్రాఫ్‌లు, పటనైపుణ్యాలలో పటం చదవడం, పటం గుర్తించడం వంటివి కూడా పాఠ్యాంశాలకు అనుగుణంగా పుస్తకంలో లేనివి కూడా అభ్యాసం/మూల్యాంకనంలో ఇవ్వవచ్చు.
- చర్చించడం, ముఖాముఖి నిర్వహించడం, డిబేట్స్, ప్రాజెక్టులు వంటివి పాఠాల మధ్యలో, మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి తర్వాత ఇవ్వబడినవి. ఇవి పిల్లల్లో సామాజిక స్పృహను, సున్నితత్వాన్ని పెంపొందించి సమస్యల పట్ల సానుకూల వైఖరిని అలవర్చుటకు ఉద్దేశించబడినవి. కావున తప్పక నిర్వహించాలి.

– **సంచాలకులు,**

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, తెలంగాణ, హైదరాబాద్


**కృతజ్ఞతలు**

ఈ పాఠ్యపుస్తక రచన ఉత్తమంగా తీర్చిదిద్దడానికి సహకరించిన డా॥ కె.ఎన్.ఆనందన్, భాషావేత్త, కేరళ, శ్రీ జితేందర్, కవర్ పేజి డిజైనర్, ఏకలవ్య, డా॥ పి. దక్షిణామూర్తి, విశ్రాంత ఉపసంచాలకులు, తెలుగు అకాడమి, శ్రీ ఎ.ఆర్.కె. మూర్తి, విశ్రాంత ఉపసంచాలకులు తెలుగు అకాడమి, దీపా శ్రీనివాసన్, శ్రీతిక విశ్వనాథ్, రాంమూర్తి శర్మలకు కృతజ్ఞతలు. డిజైనింగ్ మరియు లే అవుట్ సహకారాన్ని అందించిన వారికి ధన్యవాదాలు. తెలంగాణ రాష్ట్ర పురావస్తు మ్యూజియం వారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ పుస్తకంలోని కొన్ని చిత్రాలను ఫ్లిక్కర్, ఇతర అంతర్జాల వనరుల నుండి క్రియేటివ్ కామన్ లైసెన్స్ కింద తీసుకున్నాం. ఈ ఫోటోలన్నింటిని ఫిబ్రవరి 28, 2012కు ముందు తీసుకున్నాం.

అనేక మంది పాఠశాల ఉపాధ్యాయులు, విద్యావేత్తలు మరియు ఇతరులు తమ సలహాలు సూచనల ద్వారా పాఠ్యపుస్తకాలను నవీకరించుటలో దోహదపడినందులకు వారికి కృతజ్ఞతలు తెలుపుచున్నాము. పాఠ్యపుస్తకాలను పూర్తి స్థాయిలో సమీక్షించి మెరుగుపరుచుటలో సహకరించిన Indian History Awareness & Research (IHAR) హోస్టన్, టెక్సాస్, అమెరికా సంయుక్త రాష్ట్రాల వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుచున్నాము.


SCERT TELANGANA

## జాతీయ గీతం

– రవీంద్రనాథ్ టాగూర్

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధ్, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగ!
వింధ్య, హిమాచల, యమునా, గంగ!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాంగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

## ప్రతిజ్ఞ

– పైడిమర్రి వెంకట సుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.



SCERT TELANGANA

## విషయ సూచిక



| క్ర.సం. | విషయం | పేజి నెం. | నెల |
|---|---|---|---|
| | **I భూమి - వైవిధ్యం** | | |
| 1. | పటాల అధ్యయనం, తయారీ | 1 - 8 | జూన్ |
| 2. | గ్లోబు - భూమికి నమూనా | 9 - 14 | జూన్ |
| 3. | భూస్వరూపాలు (మొదటి భాగం) | 15 - 18 | జూలై |
| | కృష్ణాడెల్టాలోని ఒక గ్రామం - పెనమకూరు (రెండవ భాగం) | 19 - 26 | జూలై |
| 4. | డోకూర్ - పీఠభూమిలో ఒక గ్రామం | 27 - 35 | జూలై |
| 5. | పెనుగోలు - కొండలలోని ఒక గ్రామం | 36 - 43 | జూలై |
| | **II ఉత్పత్తి, వినిమయం, జీవనాధారాలు** | | |
| 6. | ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తివరకు - ఆదిమానవులు | 44 - 56 | ఆగస్టు |
| 7. | నేటి వ్యవసాయం | 57 - 64 | ఆగస్టు |
| 8. | వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం (మొదటి భాగం) | 65 - 72 | ఆగస్టు |
| | వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం (రెండో భాగం) | 73 - 79 | ఆగస్టు |
| | **III రాజకీయ వ్యవస్థలు, పరిపాలన** | | |
| 9. | తెగలు - సామాజిక నిర్ణయాధికారం | 80 - 84 | సెప్టెంబరు |
| 10. | సామ్రాజ్యాలు, గణతంత్రాల ఆవిర్భావం | 85 - 92 | సెప్టెంబరు |
| 11. | మొదటి సామ్రాజ్యాలు | 93 - 102 | సెప్టెంబరు |
| 12. | ప్రజాస్వామ్య ప్రభుత్వం | 103 - 111 | అక్టోబరు |
| 13. | గ్రామ పంచాయతీలు | 112 - 119 | నవంబరు |
| 14. | పట్టణ ప్రాంతంలో స్థానిక స్వపరిపాలన | 120 - 126 | నవంబరు |
| | **IV సామాజిక వ్యవస్థీకరణ, అసమానతలు** | | |
| 15. | మన సమాజంలో వైవిధ్యం | 127 - 134 | నవంబరు |
| 16. | స్త్రీ, పురుష సమానత్వ దిశగా పయనం | 135 - 142 | డిసెంబరు |
| | **V మతం, సమాజం** | | |
| 17. | ప్రాచీనకాలంలో మతం - సమాజం | 143 - 153 | డిసెంబరు |
| 18. | దేవుని యందు ప్రేమ, భక్తి | 154 - 161 | జనవరి |
| | **VI సంస్కృతి, సమాచారం** | | |
| 19. | భాష, లిపి, గొప్ప గ్రంథాలు | 162 - 168 | జనవరి |
| 20. | శిల్పం, కట్టడాలు | 169 - 180 | ఫిబ్రవరి |
| 21. | తెలంగాణలో పచ్చదనం | 181 - 184 | ఫిబ్రవరి |
| | **రివిజన్ మరియు వార్షిక పరీక్షలు** | | మార్చి |



SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2020-21

THE CONSTITUTION OF INDIA

## భారత రాజ్యాంగ పీఠిక

భారతదేశ ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర, రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని, అంతస్థుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని చేకూర్చుటకు, వారందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి 1949 నవంబర్ 26న మన రాజ్యాంగ పరిషత్‌లో ఎంపిక చేసుకొని శాసనముగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇచ్చుకుంటున్నాం.

Subs. by the constitution [Forty-second Amendment] Act, 1976, Sec.2, for “Sovereign Democratic Republic” (w.e.f. 3.1.1977)

Subs. by the constitution [Forty-second Amendment] Act, 1976, Sec.2, for “Unity of the Nation” (w.e.f. 3.1.1977)

SCERT TELANGANA

పాఠం

1

# పటాల అధ్యయనం - తయారీ

*పటాలు (మ్యాపులు) మనకు వివిధ ప్రదేశాల గురించి అనేక విషయాలను తెలియజేస్తాయి. ఒక ప్రదేశం సముద్రతీరంలో ఉందా, పర్వతంపైన ఉందా, ఎడారిలో ఉందా, అది ఉష్ణప్రదేశమా, శీతలప్రదేశమా, వర్షపాత ప్రాంతమా, అక్కడ ఎటువంటి చెట్లు పెరుగుతాయి, ఏ జాతి ప్రజలు జీవిస్తున్నారు, వాళ్ళు మాట్లాడే భాష, చేసే వృత్తులు, వాళ్ళ నివాసాలు మొదలైనవి మానచిత్రాలద్వారా తెలుసుకోవచ్చు. అయితే అన్ని విషయాలు ఒకే పటంలో ఉండవు. ఇందుకు మీరు వివిధ రకాల పటాలను (భౌతిక పటాలు, రాజకీయపటాలు, చారిత్రక పటాలు మొదలైనవి) అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఈ పాఠంలో పటాలను అధ్యయనం చేయటం, పటాన్ని తయారుచేయటం ఎలాగో నేర్చుకుందాం.*

SCERT TELANGANA

### జిల్లాపటం (రాజకీయ)

భారతదేశ పటం, తెలంగాణ పటం వంటి ఎన్నోరకాల పటాలను మీ తరగతి గదిలో చూసి ఉంటారు. మన జిల్లా పటాన్ని గురించి ఈ రోజు తెలుసుకుందాం.

- తరగతి గదికి మీ జిల్లా (రాజకీయ) పటాలను రెండు లేదా మూడింటిని తీసుకొనిరండి.
- మీ గ్రామం / పట్టణం సమీపంలోని గ్రామాలను, పట్టణాలను, నదులను, జలాశయాలు, వాగులను, మొదలైనవాటిని గుర్తించండి.
- రహదారులు, రైల్వేస్టేషన్ల గురించి పరిశీలించండి.
- పటాలలోని వివిధ ప్రాంతాల మధ్య దూరాన్ని చెప్పగలరా?


### ఆడుకుందాం రండి

రెండు జట్లుగా ఏర్పడండి. ఒకటవ జట్టువారు పటంలోని ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న ప్రదేశం పేరును రహస్యంగా ఒక చీటిపై రాసి టీచర్‌కు అందజేయాలి. ఇప్పుడు రెండవ జట్టువారు ఆ ప్రదేశం గూర్చి ప్రశ్నలు అడగాలి. ఒకటవ జట్టువారు రెండవ జట్టువారు అడిగిన ప్రశ్నలకు అవును, కాదు రూపంలో సమాధానాలు ఇవ్వాలి. ఉదాహరణకు రెండవ జట్టువారు ప్రశ్నలను ఈ విధంగా అడగవచ్చు. ఆ ప్రదేశం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉందా? ఆ ప్రదేశం తీర ప్రాంతంలో ఉందా? అది జిల్లా కేంద్రం పేరేనా! ఇలా రెండో జట్టువారు ఒకటో జట్టువారు ఎంపిక చేసిన ప్రదేశంను తాము అడిగిన ప్రశ్నల ఆధారంగా గుర్తిస్తారు. టీచర్ వారి ఆటను పరిశీలిస్తూ ఎన్ని ప్రశ్నలతో సరియైన సమాధానము చెప్పగలిగారో రికార్డు చేయాలి.

ఇలా గుర్తించిన పిదప రెండో జట్టువారు ఒకటో జట్టువారితో అదేవిధంగా ఆట ఆడతారు. ఈ ఆటలో ఏ జట్టువారైతే తక్కువ ప్రశ్నలతో ప్రాంతం పేరును గుర్తిస్తారో వారే విజేతలు!

### మల్లిక ఇంటికి దారి - చిత్తు పటం

లైలా, మల్లిక నిజామాబాద్‌లో జరిగిన రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమంలో కలుసుకున్నారు. అక్కడ వాళ్ళు సన్నిహిత మిత్రురాళ్ళుగా మారారు. మల్లిక




*చిత్రం 1.1: మల్లిక ఇంటికి దారి చూపే చిత్తు పటం*

వెంకటాపురం గ్రామంలోను, లైలా ఆదిలాబాదులోను నివసిస్తున్నారు. రాబోయే సెలవులలో మల్లిక ఇంటికి లైలా వెళ్ళాలనుకుంది. మీ ఊరి బస్టాండ్‌నుంచి మీ ఇంటికి ఎలా చేరుకోవాలో తెలియజేయమని మల్లికకు ఉత్తరం రాసింది లైలా. స్నేహితురాలు తన ఇంటికి వస్తుందని తెలిసి మల్లిక సంతోషపడింది. మల్లిక తన ఇంటికి మార్గాన్ని చూపిస్తూ గీసిన "చిత్తుపటం"తో తన జవాబును లైలాకు పంపింది.

- చిత్తుపటం సహాయంతో బస్‌స్టాపు నుంచి మల్లిక ఇంటికి మీరు చేరగలరా?
- మల్లిక ఇంటికి చేరడానికి లైలా ఎన్ని మలుపులు తిరిగింది? ఆ మలుపులలో ఏమైనా కొండ గుర్తులున్నాయా?
- పై చిత్తుపటంలో చూపించిన భవనాలు వాస్తవ పరిమాణంలో ఉన్నాయా?
- లైలా ఏ దిశగా నడిచిందో చెప్పగలరా (ఉత్తరానికా, తూర్పునకా)?
- బస్‌స్టాప్ నుంచి మల్లిక ఇంటికి ఎంత దూరమో చెప్పగలరా?

పై చిత్తుపటం ఆధారంగా చివరి రెండు ప్రశ్నలకు జవాబు చెప్పలేం. లైలాకు ఇదే సమస్యగా మారింది. బస్‌స్టాప్ నుంచి మల్లిక ఇంటికి ఎంత దూరమో ఆమె ఆలోచనలకు అందలేదు. చాలా దూరం నడిచి మల్లిక ఇంటికి చేరుకుని "మల్లికా! నేను అలసి పోయాను. చిత్తుపటంలో నువ్వు దూరాన్ని తెలపలేదు. ఇంత దూరమని తెలిస్తే ఆటో ఎక్కేదాన్ని," అని లైలా అన్నది.

"దూరాన్ని తెలపడం మరిచిపోయాను, ఏమీ అనుకోకు లైలా! భవిష్యత్తులో మళ్ళీ ఎప్పుడైనా వస్తే నువ్వు ఆటో ఎక్కి దక్షిణ వెంకటాపురం వెళ్ళాలని చెబితే సరిపోతుంది" అని మల్లిక చెప్పింది.

"అది దక్షిణ వెంకటాపురమో, ఉత్తర వెంకటాపురమో నాకెలా తెలుస్తుంది?" అని లైలా అడిగింది.


"అది చాలా సులభం. ఇప్పుడు నువ్వు ఈ గ్రామానికి దక్షిణ దిశనున్న మా ఇంటికి చేరుకున్నావు, దీని కెదురుగా ఉన్న దిశే ఉత్తరం. ఒక ప్రదేశానికి వివిధ దిక్కులను కనుక్కోవడం ఎలాగో నీకు తెలుసా?" అని మల్లిక అంది.

- మీ పాఠశాల నుంచి మీ ఇంటికి దారి చూపుతూ చిత్తుపటం గీయండి.

SCERT TELANGANA

## దిక్కులు

ఈ కింది చిత్రాన్ని జాగ్రత్తగా గమనించండి.



చిత్రం 1.2: దిక్కులను గుర్తించటం


మధ్యలో నిలబడిన బాలిక ఉదయిస్తున్న సూర్యునికి ఎదురుగా ఉన్నది. ఇప్పుడు ఈ కింది పట్టికను పూరించండి.

| వరస సంఖ్య | దిక్కు | ఆ దిశలో గల వస్తువులు / ప్రదేశాలు |
|---|---|---|
| 1 | తూర్పు | సూర్యుడు, కొండలు |
| 2 | దక్షిణం | |
| 3 | ఉత్తరం | |
| 4 | పడమర | |

మీరు తూర్పుదిక్కుకు అభిముఖంగా నిలబడి ఉంటే కుడిచేతివైపు ఉండేవన్నీ దక్షిణంగాను, ఎడమచేతి వైపు ఉండేవన్నీ ఉత్తరంగాను, వెనక వైపు ఉండేవన్నీ పడమరగానూ ఉన్నట్లు గుర్తించాలి.

దిక్కులను గురించి మరింత అవగాహన చేసుకోవడానికి స్నేహితులతో కలిసి ఆడే ఒక ఆట గురించి మల్లిక వివరించింది.

కుడివైపునున్న చిత్రాన్ని చూడండి. ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఒక ప్రశ్న అడగండి.




చిత్రం 1.3: దిక్కులు

SCERT TELANGANA

- లలిత జాన్‌కు............................ దిక్కులో ఉంది.
- లలిత ఉమకు............................ దిక్కులో ఉంది.
- నాజర్ శేఖర్‌కు............................ దిక్కులో ఉన్నాడు.
- నాజర్ రాముకు..................... దిక్కులో ఉన్నాడు.
- లక్ష్మణ్ సోముకు ......................... దిక్కులో ఉన్నాడు.
- లక్ష్మణ్ శేఖర్‌కు............................. దిక్కులో ఉన్నాడు.
- జాన్‌కు................................... దిక్కులో తార ఉన్నది.

ఈ ఆట ఆడిన తరవాత "అద్భుతం, ఇప్పుడు నాకర్థమైంది" అని లైలా అంది. "దిక్కు అనేదాన్ని ఒక స్థానంనుంచి సాపేక్షంగా చెబుతారు. మనం ఒక స్థలాన్ని దేనితో పోల్చి చూస్తున్నామన్నదాన్ని బట్టి అది తూర్పున, ఉత్తరాన, దక్షిణాన లేదా పశ్చిమాన ఉంది" అంటాం.

- మీ తరగతి గది దిక్కులను గుర్తించి పై పటంలో విధంగా నిలబడి ఎవరెవరు, ఎవరెవరికి ఏ దిక్కులో ఉన్నారో ప్రశ్నించండి.

## పటంలో దిక్కులు

సాధారణంగా ఉత్తర దిక్కు పైకి ఉండే విధంగా, దక్షిణ దిక్కు కిందికి ఉండే విధంగా మానచిత్రాలను తయారు చేస్తారు. అలాగే తూర్పు కుడివైపుకు, పడమర ఎడమవైపుకు ఉంటుంది.


కొన్ని ప్రత్యేక సందర్భాలలో దక్షిణదిశ పైకి వుండే విధంగా లేదా ఎడమ చేతివైపు ఉండే విధంగా పటాలను రూపొందిస్తారు. ఇటువంటి సందర్భాలలో దానికి గల ప్రత్యేకతలను పొందుపరుస్తారు. ఉత్తరం దిక్కును బాణం గుర్తుతో సూచిస్తారు.

తెలంగాణ రాజకీయపటాన్ని గోడకు వేలాడదీసి, దాన్ని పరిశీలించి ఈకింది ప్రశ్నలకు జవాబులు కనుక్కోండి.

- మహబూబ్‌నగర్ వికారాబాదుకు ఏ దిక్కులో ఉంది?
- హైదరాబాదుకు యాదాద్రి ఏ దిక్కులో ఉంది?
- ఖమ్మంకు సూర్యాపేట ఏ దిక్కులో ఉంది?
- ఆదిలాబాద్‌కు కొమరంభీమ్ జిల్లా తూర్పుగా ఉందా?
- మంచిర్యాల నుంచి పెద్దపల్లి వెళ్ళాలనుకుంటే ఏ దిశగా ప్రయాణం చేస్తావు? ఇలాంటి మరి కొన్ని ప్రశ్నలు తయారుచేసి ప్రశ్నించండి.

## స్కేలు లేదా పటంలో దూరం


ఆ సాయంత్రం వాగును చూడడానికి మల్లిక లైలాను తీసుకెళ్ళింది. వాళ్ళక్కడ వంతెనపైన నడుస్తున్నారు. ఆ వంతెన పైన ఆరు దీపపు స్తంభాలు సమాన దూరంలో ఉన్నాయి. ప్రతీ రెండు స్తంభాల మధ్య దూరం 100 మీటర్లు. ఆ వంతెన మొత్తం పొడవు 500 మీటర్లు. కింది చిత్రాన్ని గమనించండి.



*చిత్రం 1.4: వంతెనపై నడుస్తున్న లైలా, మల్లిక*

SCERT TELANGANA

ఇంటికి తిరిగి వచ్చిన లైలా తనతో తీసుకొని వెళ్ళడానికి వీలుగా వంతెన చిత్తుపటాన్ని గీయడం ప్రారంభించింది. ఆ చిత్తుపటాన్ని గీసేటప్పుడు దీపపు స్తంభాలను సమాన దూరాలలో గీచింది. మొదటి, చివరి దీపాల మధ్య దూరం 5 సెం.మీ. వంతెన కంటే ఆమె గీసిన బొమ్మ చాలా చిన్నగా ఉంది.



*చిత్రం 1.5: లైలా గీసిన వంతెన చిత్తుపటం*

లైలా చిత్తుపటంలోని ఒకటో స్తంభం నుంచి ఆరవ స్తంభం వరకు గల మొత్తం దూరాన్ని కొలవండి. ప్రతి రెండు దీప స్తంభాల మధ్య వాస్తవ దూరం.......... మీటర్లు.

చిత్తుపటంలో రెండు దీప స్తంభాల మధ్య దూరం కేవలం......... సెం॥ మీ॥. చిత్తుపటంలో మొత్తం దూరం...... సెం॥మీ॥ మాత్రమే. లైలా దీపస్తంభాలను సమాన దూరాల్లో గీసిందని మీరు గమనించి ఉంటారు.

వంతెనపైనున్న దూరాలను, చిత్తుపటంలో ఉన్న దూరాలను ఇలా రాద్దాం:

చిత్తుపటంలో 5 సెం.మీ = వంతెనపైన ............... మీటర్లు

చిత్తుపటంలో 1 సెం.మీ = వంతెనపైన ............... మీటర్లు

దీనినే 'స్కేలు' అని పిలుస్తారు.


భూమిపై గల వాస్తవ దూరాలను మానచిత్రంలో చూపేటప్పుడు స్కేలు ఉపయోగించి ఆ దూరాలను తగ్గించి చూపిస్తాము.

పటం ఏ స్కేలులో తయారు చేశారో దానిపైన రాసి ఉంటుంది. దీని ఆధారంగా పటంలోని దూరాన్ని కొలచి భూమిపైన గల వాస్తవ దూరం కనుక్కొంటాం.

మీరు పటాలలో 'స్కేలు' అనే పదం ఉండటం చూసే ఉంటారు. స్కేలు పటంలో ఉన్న రెండు బిందువుల (ప్రదేశాల) మధ్య దూరానికి మరియు భూమిపైన ఉండే వాస్తవ దూరానికి మధ్యన ఉండే నిష్పత్తి. దీనిని వివిధ రకాలుగా వ్యక్తీకరిస్తారు.

స్టేట్‌మెంట్ స్కేలు (Statement-Scale) : ఈ స్కేలు నందు '1 సెం.మీ.కు 1 కి.మీ.' మొదలైన పదాల ద్వారా సరళవాక్యాలలో స్కేలును సూచిస్తారు. ఈ సరళమైన ప్రకటనా స్కేలులో పటంలోనున్న రెండు ప్రదేశాల మధ్య దూరం 1 సెం.మీ. అయితే భూమిపైన వాస్తవ దూరం 1 కి.మీ.గా ఉంటుంది.

ప్రక్కన ఇచ్చిన చిత్రంలో మహబూబ్‌నగర్ -వనపర్తి మధ్య దూరాన్ని ఒక రేఖద్వారా చూపారు. ఈ రెండు ప్రాంతాల మధ్య దూరం 50 కి.మీ.




ఈ రెండింటినీ కలుపుతూ చిత్రంలో గీసిన రేఖను కొలవండి.

మహబూబ్‌నగర్-వనపర్తి మధ్య వాస్తవ దూరం .............

పై చిత్రంలో మహబూబ్‌నగర్- వనపర్తి మధ్యదూరం .....................

ఈ చిత్రానికి స్కేలును రూపొందించగలరా? చిత్రంలో ఒక సెం.మీ. ఉంటే వాస్తవంగా భూమి మీద ఎంత దూరం ఉంటుంది?

1 సెం.మీ = ................ కి.మీ.


మీ జిల్లా పటాన్ని పరిశీలించి స్కేలు ఎంత ఇచ్చారో గమనించండి. మీ గ్రామం/ పట్టణం నుంచి ఇతర గ్రామాలకు/ పట్టణాలకు మధ్య గల దూరాన్ని కొలిచి వాస్తవ దూరాలను కనుక్కోండి.

ఇప్పుడు ఒక దారం సహాయంతో పటంలో భారతదేశ తీర ప్రాంత పొడవును కొలిచి, వాస్తవ తీర ప్రాంత పొడవును స్కేలు సహాయంతో కనుగొనండి.


SCERT TELANGANA

## చిహ్నాలు

మానచిత్రాలు చాలా చిన్నవి అని మీకు తెలుసు. వాస్తవంగా ఉన్నవాటిని అదే విధంగా చిత్రించలేం. ఉదాహరణకు పాఠశాల, బస్‌స్టాండును, మల్లిక ఇంటిని అదేవిధంగా చూపాలంటే చాలా స్థలం కావాలి. అందువల్ల మానచిత్రం తయారీలో చిహ్నాలను ఉపయోగిస్తాం. మీ గ్రామాన్ని/పట్టణాన్ని చుక్కలతో, వృత్తాలతో జిల్లాపటంలో చూపించడాన్ని గమనించి ఉంటారు. సాధారణంగా మానచిత్రాలు తయారు చేసేవాళ్ళు వాళ్ళ అవసరాలకు అనుగుణంగా సరైన చిహ్నాలను రూపొందించుకుంటారు. కాని మనం కొన్ని సాధారణ చిహ్నాలను తరచుగా ఉపయోగిస్తూంటాం. వీటినే 'సాంప్రదాయక చిహ్నాలు' అంటాం. ఈ కింద ఉన్న మానచిత్రంలో చిహ్నాలు, స్కేలు, ఉత్తరదిక్కును సూచించే బాణంగుర్తు ఉన్నాయి. గమనించండి.




*పటం 1: చిహ్నాలను ఎలా ఉపయోగించాలో ఈ పటాన్ని గమనించి తెలుసుకోండి*




SCERT TELANGANA

ప్రక్క పేజీలోని పటాన్ని పరిశీలించి కింద ఇచ్చిన ప్రశ్నలకు జవాబు ఇవ్వండి.

- చర్చికి ఏ దిశలో నది ప్రవహిస్తున్నది?
- శ్రీపురం గ్రామానికి దక్షిణాన ఎటువంటి రహదారి ఉంది?
- శ్రీపురం గ్రామానికి సమీపాన ఏ రకమైన రైల్వేమార్గం ఉంది?
- రైల్వే స్టేషనుకు ఏ దిక్కున పోలీస్ స్టేషన్ ఉన్నది?
- రైలు మార్గానికి ఉత్తరాన ఉన్న గ్రామమేది?
- పై పటంలోని పాఠశాలలో మీరు ఉన్నారని అనుకోండి. బడి నుంచి బయటకు వస్తుంటే ఏ దిశ వైపుకు నడుస్తుంటారు?

## కృత్యం

తూర్పునకు అభిముఖంగా నిలబడి మీ చేతులను చాచి దిక్కుల పేర్లు చెప్పండి (ఉదా: ఉత్తరం, దక్షిణం). తరవాత వేరొక దిక్కునకు అభిముఖంగా నిలబడి పైవిధంగానే చేయండి.

**కీలకపదాలు**

చిత్తుపటం (స్కెచ్)
పటం
స్కేలు
దిక్కు (దిశ)

SCERT TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. వివిధ రకాల పటాలను సేకరించి, పరిశీలించండి. ఉపాధ్యాయులను అడిగి మీ సందేహాలను నివృత్తి చేసుకోండి.
2. పటంలో మీ మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి గల దూరాన్ని కొలిచి వాస్తవ దూరం ఎంతో తెలుసుకోండి.
3. భూమిపైనున్న వాస్తవ దూరాన్ని పటంలో ఎందుకు తగ్గించాలి?
4. పటాల తయారీలో చిహ్నాల ఆవశ్యకతను వివరించండి.
5. వివిధ జలాశయాలను, ఆరాధన స్థలాలను, ప్రభుత్వ కార్యాలయాలచిహ్నాలను గీసి తరగతి గదిలో ప్రదర్శించండి.
6. మీ ఇంటి చిత్తుపటం వేసి, దాన్ని పటంగా మార్చండి.
7. పటంలో ఏ అంశాలు ముఖ్యమైనవని మీరు అనుకుంటున్నారు?
8. పేజి నెం. 6లోని 'చిహ్నాలు' చదివి, వ్యాఖ్యానించండి.
9. అట్లాస్‌లోని వివిధ రకాల పటాలను పరిశీలించి, వివరాలను కింది పట్టికలో నమోదు చేయండి.

| క్ర.సం. | పటం పేరు | ఉపయోగించిన చిహ్నాలు | ముఖ్యాంశాలు |
|---|---|---|---|
| | | | |

## ప్రాజెక్టు

ఈ కింది సూచనలను పాటిస్తూ మీ తరగతి పటాన్ని తయారు చేయండి.

ఎ) మొదట మీరు ఉత్తరాభిముఖంగా నిలిచి తరగతి గదికి నాలుగు దిక్కులను గుర్తించండి.

బి) పటంలో చూపాలనుకున్న గోడలు, తలుపులు, కిటికీలు, నల్లబల్లలు, అల్మారాలు మొదలైనవాటి జాబితా తయారు చేయండి. నోటు పుస్తకంలో వాటికి చిహ్నాలను ఏర్పరుచుకోండి.

సి) గోడలు, ఇతర వస్తువులు ఎక్కడ ఉన్నాయో చూపుతూ, తరగతిగది చిత్తుపటాన్ని గీయండి. ఉత్తర దిక్కున ఉన్న గోడను చిత్తుపటంలో పైవైపు గీయండి.

డి) ఇప్పుడు చిన్న జట్లుగా ఏర్పడి ప్రతీ గోడనూ స్కేలుతో కొలచి ఆ దూరాన్ని చిత్తుపటంలో చూపించండి.

ఇ) సరైన 'స్కేలు'ను ఎంపికచేసి పటాన్ని గీయండి. ఇది ఒక మీటరుకు ఒక సెంటీమీటరులాగ తీసుకోవాలి. గోడ పొడవు 7 మీటర్లు అయితే కాగితంమీద దాని పొడవును 7 సెంటీమీటర్లుగా గీయండి.

ఎఫ్) గోడలను గీసిన తరవాత, కిటికీలు, తలుపులను సరైన స్థానంలో చూపించండి. అల్మారా, నల్లబల్ల, టేబులు మొదలైనవాటి చిహ్నాలను తగిన స్థానంలో ఉంచండి.


జి) పటంలో ఉపయోగించిన చిహ్నాల జాబితాను తయారుచేసి సూచికను ఏర్పరచండి. 'స్కేలు' ఎంతో రాయండి.

హెచ్) మీరు గీసిన పటాన్ని, మీ స్నేహితులు గీసిన పటంతో పోల్చి సవరణలు చేసుకోండి.

SCERT TELANGANA

పాఠం
# 2 గ్లోబు - భూమికి నమూనా

సుందర్, కల్పన ఒక రోజు సాయంత్రం చంద్రుణ్ణి చూస్తున్నారు. "నేను చంద్రుడి మీదకు వెళ్లి భూమిని చూస్తే ఏ విధంగా కనిపిస్తుంది? అక్కడి నుంచి నేనేమి చూడగలను?" అని సుందర్ అడిగాడు. "మనం అనుకున్న విషయాలన్నీ అంతర్జాలంలో (ఇంటర్నెట్‌లో) సులభంగా చూడవచ్చు," అని కల్పన చెప్పింది. తరవాత చంద్రునిపై నుంచి తీసిన భూమిచిత్రాలను అంతర్జాలంలో చూపించింది. అవి ఇలా ఉన్నాయి.



చిత్రం 2.1: చంద్రునిపై ఉదయిస్తున్న భూమి

భూమి నీలిచందమామలాగ కనిపించటం లేదా? భూమిమీద అధికభాగంలో మహాసముద్రాలు ఆవరించి ఉండడంవల్ల అది నీలంగా కనిపిస్తుంది. పై చిత్రంలో సూర్యకాంతి పడుతున్న భూభాగం మాత్రమే కనపడుతోంది.

- ఈ చిత్రంలో భూమి కింది భాగం ఎందుకు కనిపించడంలేదో మీరు వివరించగలరా?

### భూమి బంతిమాదిరిగా ఉంది

ఈ చిత్రాన్ని చూసి భూమి ఆకారం చంద్రుడిలాగా ఉన్నదని గుర్తించారు కదా!

కొన్ని గ్లోబులను తరగతిగదిలోకి తీసుకొనిరండి. ప్రతి అయిదారుగురు విద్యార్థులు గల జట్టుకు ఒక గ్లోబు ఉండేలా చూడండి. భూమికి గ్లోబు ఒక నమూనా. ఇది భూమి ఆకారాన్ని, నేల, నీరు, ఖండాలు, మహాసముద్రాలు, ప్రపంచంలోని దేశాలను చూపుతుంది.



చిత్రం 2.2: గ్లోబు

SCERT TELANGANA

- ప్రతి విద్యార్థి గ్లోబును జాగ్రత్తగా తన చేతిలోకి తీసుకొని పరిశీలించండి. భూభ్రమణం ఎలా జరుగుతుందో గ్లోబును తిప్పి చూడండి.
- మీ ఉపాధ్యాయుని సహాయంతో ఉత్తర ధ్రువాన్నీ, దక్షిణ ధ్రువాన్నీ, భూమధ్యరేఖను గుర్తించండి.

భూమి ఒక బంతిలాగ గోళాకారంలో కనబడుతుంది. మనుషులు దానిపైన ఎలా నిలబడతారు? గ్లోబుపైన నిలబడి ఉండేటట్లు బొమ్మలను వివిధ స్థలాల్లో ఉంచండి. భూమికి కింది వైపు ఉన్న మనిషి తలకిందులుగా ఉన్నాడనిపిస్తుంది. అలాగే మధ్యలో ఉన్న మనిషి భూమి పైనుంచి పడిపోతాడనిపిస్తుంది. మనం ఎప్పుడూ భూమిమీది నుంచి పడిపోం. ఎందుకంటే భూమి ఒక బలమైన అయస్కాంతంలాగ పనిచేస్తూ మనందరినీ తనవైపు ఆకర్షిస్తూ ఉంటుంది. నిజానికి మనం భూమిమీద పడతాం కాని, భూమి పైనుంచి పడిపోం.

### గోళాకృతి

నిజానికి భూమి ఖచ్చితమైన గోళాకారంలో ఉండదు. ఖచ్చితంగా, గుండ్రంగా ఉండదు. ఉత్తర, దక్షిణ ధ్రువాల దగ్గర కొద్దిగా నొక్కుకు పోయి భూమధ్య రేఖ దగ్గర కొద్దిగా ఉబ్బినట్లు ఉంటుంది. ఈ తేడా అతి తక్కువగా ఉండటంవల్ల చాలా గ్లోబులు, పటాలు దీన్ని చూపించవు.

భూమి ఆకృతికి సంబంధించి మరొక ఆసక్తికరమైన విషయమేమంటే ఒక స్థానంనుంచి ఒకే దిశలో వెనుదిరగకుండా మనం ప్రయాణం చేయడం మొదలు పెడితే తిరిగి అదే స్థానానికి చేరతాం! దీన్ని గ్లోబుమీద ప్రయత్నిద్దాం. ఒక స్థానం వద్ద బయలుదేరి అదే రేఖలో వెళుతూ ఉంటే బయలుదేరిన స్థానానికి తిరిగి చేరతారు.

ప్రాచీన కాలంలోనే భారతదేశము మరియు యూరపులోని శాస్త్రవేత్తలు భూమి, బంతి లేదా గోళం వలె గుండ్రంగా ఉందని గమనించారు. ఇటలీకి చెందిన అన్వేషకుడైన కొలంబస్ వంటి నావికులు సాధారణశకం 1492 ప్రాంతంలో భారతదేశాన్ని చేరుకోవాలని యూరప్ నుండి బయలుదేరారు.

- ప్రపంచ పటం, గ్లోబును తీసుకొని కొలంబస్ ఎలా ప్రయాణించి అమెరికాను చేరుకున్నాడో, ఎలా ప్రయాణించి ఉంటే ఇండియాకు చేరేవాడో తెలుసుకోండి.

### మహాసముద్రాలు, ఖండాలు

గ్లోబును పరిశీలించినప్పుడు ఈ భూమి ఉపరితలంలో అధిక భాగం సముద్రాల నీటితో ఉందని గ్రహించారా? మీరు సముద్రతీర ప్రాంతాలకు వెళ్ళినపుడు ఇది గమనించవచ్చు.

- సముద్రాన్ని గురించి సంక్షిప్తంగా వర్ణించండి లేదా చిత్రాన్ని గీయండి.
- మీరు తాగే నీటికి, సముద్రపు నీటికి ఉండే ముఖ్యమైన తేడా ఏమిటో చెప్పండి.

సముద్రాలు, మహాసముద్రాలు వందల, వేల కిలోమీటర్లు వ్యాపించి అంతులేని నీటితో కూడి ఉంటాయి. సముద్రాలలో ఒకవైపు నుంచి మరొక వైపు ప్రయాణించాలంటే నౌకల ద్వారా పోవాలి. ఆ ప్రయాణం కొన్ని రోజులు లేదా నెలలు పట్టవచ్చు.

- ప్రపంచంలో ఒక మహాసముద్రం గడ్డకట్టుకొని ఉంది - దాని పేరు కనుక్కోండి.

SCERT TELANGANA

- గ్లోబును పరిశీలించి నాలుగు మహాసముద్రాల పేర్లను రాయండి.

1. ........................................
2. ........................................
3. ........................................
4. ........................................

- వీటిలో అతి పెద్ద మహాసముద్రం ఏది? దాని పేరుకింద గీత గీయండి

సహజంగా మనం ఈ మహాసముద్రాల మీద జీవించలేం. మనం నేలమీద జీవిస్తాం. గ్లోబులో పెద్ద పెద్ద భూభాగాలను చూశారు కదా! అవే ఖండాలు. ఏడు ఖండాలు ఉన్నాయి.

- ఖండాల పేర్లు కనుగొని ఈ కింద రాయండి.
  1. ..............................
  2. ..............................
  3. ..............................
  4. ..............................
  5. ..............................
  6. ..............................
  7. ..............................
- ఈ ఖండాలలో ఒక ఖండం మంచుతో కప్పి ఉంది. దాని పేరు, ఉనికి తెలపండి.

భూమిమీద ఉత్తర, దక్షిణ ధ్రువాలు మంచుతో కప్పి ఉండటం ఆసక్తికరంగా లేదూ! ఉత్తర ధ్రువంలో గడ్డ కట్టిన మహాసముద్రం ఉంటే మరొకటి విపరీతంగా కురిసిన మంచుతో నిండి ఉంటుంది! దీన్ని అంటార్కిటికా మంచు కవచం (The Antarctic Shield of Ice) అంటారు.


- గ్లోబులో భారతదేశాన్ని చూడండి. భారతదేశం ఏ ఖండంలో ఉందో చెప్పండి.
- అదేవిధంగా మీరు విన్న దేశాలు గ్లోబులో ఎక్కడ ఉన్నాయో వెతకండి.

ఖండాలలోని దేశాలలో అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాలు ఉంటాయి. కొండలు, లోయలు, వ్యవసాయ భూములు, గనులు, పరిశ్రమలు మొదలైనవాటిని భూమిపైనే చూస్తాం.

### గ్లోబు మీద గల దిక్కులు

ముందు పాఠంలో మీరు నాలుగు దిక్కులను గురించి తెలుసుకున్నారు. ఉత్తర, దక్షిణ ధ్రువాలను గుర్తించారు. ఉత్తరాభిముఖంగా ఉంటే కుడివైపు తూర్పుని, ఎడమవైపు పడమరని తెలుసుకున్నారు. భూమి పడమటి నుంచి తూర్పునకు భ్రమణం చేస్తుంది. గ్లోబును తిప్పి భూభ్రమణం ఎలా జరుగుతుందో తెలుసుకోండి.

ధ్రువాలను చూశారు కదా! ధ్రువాలంటే ఏమిటి? ధ్రువాలనేవి భూమికి రెండు వైపులా ఉండే రెండు చుక్కలు. పై చుక్క నుంచి కింది చుక్కకు భూమి మధ్యలో గుండా ఒక రేఖను గీసినట్లు ఊహిస్తే దానినే 'అక్షం' అంటాం. ఈ అక్షం చుట్టూ భూమి భ్రమణం చేస్తుందని చెప్పవచ్చు. ఈ అక్షానికి ఉండే రెండు చివరలనూ ధ్రువాలు అంటారు.




*చిత్రం 2.3: భ్రమణాక్షం*

దీనిని బాగా అర్థం చేసుకోవడానికి భూమధ్యరేఖ నుంచి ధ్రువాల వరకు వివిధ రంగులలో మూడు లేదా నాలుగు చుక్కలను పెట్టండి. ఇప్పుడు గ్లోబును తిప్పండి. పరిశీలించండి.

SCERT TELANGANA

ధ్రువం పైన పెట్టిన చుక్క కదలనే కదలదని గమనిస్తారు. అంటే అదే స్థలంలో ఉంటుంది. భూమధ్యరేఖమీద చుక్క పెడితే ఏమౌతుంది?


## గ్లోబు మీద రేఖలు

గ్లోబుమీద ఒకదానినొకటి ఖండించుకుంటున్న అనేక రేఖలను చూశారు. కొన్ని ఉత్తర ధ్రువం నుంచి దక్షిణ ధ్రువానికి, మరికొన్ని పడమర నుంచి తూర్పుకు ఉన్నాయి. గ్లోబుమీద ఒక ప్రాంతాన్ని గుర్తించడానికి మానచిత్రాల (మ్యాపు) రూపకర్తలు గీచిన ఊహా రేఖలు ఇవి. వీటిని ఎలా గీస్తారో పై తరగతులలో నేర్చుకుంటారు. ఇప్పుడు మనం ముఖ్యమైన రేఖలను గురించి తెలుసుకుందాం.

గ్లోబుపై అక్షాంశ, రేఖాంశాల భావనలను తెలియజేసే గీతలతో పాటు ధృవాలపై కూడా ఆర్యభట వంటి భారతీయ పూర్వీకులకు స్పష్టమైన అవగాహన ఉండి, ప్రదేశాలను గురించి వివరించడానికి ఆ పదాలను ఉపయోగించారు.

### అక్షాంశాలు

భూమికి అడ్డంగా (పడమర నుంచి తూర్పునకు) గీచి ఉన్న ఊహా రేఖలు అక్షాంశాలు. ఈ అక్షాంశ రేఖలను గుర్తించగలరా? వాటి పొడవులను సరిపోల్చండి. అవన్నీ ఒకే పొడవుంటాయని అనుకుంటున్నారా?





*చిత్రం 2.4: గ్లోబుపై అక్షాంశాలు*

ఈ అక్షాంశాలలో పొడవైనది భూమధ్యరేఖ. ఇది గ్లోబును రెండు సమాన భాగాలుగా చేస్తుంది. ఈ రెండు అర్ధ భాగాలను అర్ధగోళాలు అంటారు. గ్లోబులో భూమధ్యరేఖను గుర్తించి అది ఏయే ఖండాలగుండా పోతుందో రాయండి. అదేవిధంగా ఉత్తర, దక్షిణ అర్ధ గోళాలను గుర్తించండి. ఏ అర్ధగోళంలో భారతదేశం ఉంది? ఏ అర్ధగోళంలో భూభాగం కంటే జలభాగం ఎక్కువగా ఉంది?

### రేఖాంశాలు

ఒక ధ్రువం నుంచి వేరొక ధ్రువాన్ని నిలువుగా కలుపుతూ ఉండే రేఖలను రేఖాంశాలు అని అంటారు. అక్షాంశాల్లా కాకుండా ఇవన్నీ ఒకే పొడవును కలిగివుంటాయి. రెండు ముఖ్యమైన రేఖాంశాలు ఉన్నాయి. ఒకటి గ్రీనిచ్ రేఖాంశం. దీన్నే '$0^0$' రేఖాంశం అని కూడా అంటారు. మరొకటి అంతార్జాతీయ దినరేఖ. దీనిని $180^0$ తూర్పు, పశ్చిమ రేఖాంశం అని కూడా అంటారు. ఈ రేఖల ప్రాముఖ్యాన్ని గురించి మీరు ఉన్నత తరగతులలో తెలుసుకుంటారు.




*చిత్రం 2.5: గ్లోబుపై రేఖాంశాలు*

అక్షాంశాలు, రేఖాంశాలు కలిసి గ్లోబును ఒక 'వల'లాగ కప్పి ఉంచి, ఒక ప్రాంతాన్ని గుర్తించడానికి ఉపయోగపడతాయి. ఒక ప్రాంతపు అక్షాంశం, రేఖాంశం తెలిస్తే ఆ ప్రాంతాన్ని గ్లోబు మీదగానీ, మానచిత్రంలో గాని సులభంగా గుర్తించగలం.

SCERT TELANGANA


## కీలకపదాలు

| | |
|---|---|
| అక్షాంశం | రేఖాంశం |
| అంతర్జాతీయ దిన రేఖ | అక్షం |


## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. తరవాతి పేజీలో ఒక ప్రపంచ పటం ఉంది. ఖండాలు, మహాసముద్రాల పేర్లను గుర్తించి, వాటి స్థానాల్లో రాయండి. తగిన రంగులతో నింపండి. ముఖ్యమైన అక్షాంశాలను గీచి పేర్లను కూడా రాయండి.
2. భూమి బల్లపరుపుగా ఉందని రమేశ్ అంటున్నాడు. మరి మీరు ఏమంటారు?
3. ఒక చేతిగాజును రోజీ బల్లమీద తిప్పుతూంది. మీకు ఏ ఆకారం మనసులో మెదిలింది?
4. కొలంబస్ లాంటి ఇతర అన్వేషకులను గురించి, తెలుసుకొని వారి వివరాలను సేకరించండి.
5. ఒక బంతి ఉపరితలం మీద అక్షాంశ, రేఖాంశాలను గీయండి.
6. "సూర్యుడు ఎల్లప్పుడూ తూర్పున ఉదయిస్తాడు." కారణం కనుక్కోండి.
7. గ్లోబు/ మ్యాపు మీద ఊహారేఖలను ఎందుకు గీయాలి?
8. భూమిని గూర్చి తెలుసుకోవడంలో శాస్త్రజ్ఞులు, నావికులు చేసిన కృషి ఏమిటి?
9. ఈ కింది చిత్రాలను గమనించి, రంగులో చూపించిన అర్ధగోళం పేరును డబ్బాలలో రాయండి.









SCERT TELANGANA




SCERT TELANGANA

పాఠం

3

మొదటి భాగం

# భూస్వరూపాలు

*మనం నివసిస్తున్న భూమి సమతలంగాగాని లేదా ఏకరీతిగా గాని లేదు. అనేక రూపాలలో ఎత్తు పల్లాలుగా ఉంది. కొన్ని చోట్ల ఉన్నతి చెందిన పర్వతాలు, కొండలుగా అత్యధిక వాలుతోను, మరికొన్ని చోట్ల విశాలమైన పల్లపు ప్రదేశాలుగా ఉంది. మీరు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రయాణం చేస్తే, వాటి మధ్య ఎత్తులో అంతరాన్ని గమనిస్తారు. దీనినే భూ నైసర్గిక స్వరూపం అంటాం.*

SCERT TELANGANA

భూ స్వరూపాలు ముఖ్యంగా మూడు రకాలు. అవి పర్వతాలు, పీఠభూములు, మైదానాలు. మీరు పర్వతాల శ్రేణులను చూసే ఉంటారు. పర్వతాలు అత్యధిక ఎత్తులను, వాలులను కలిగి వాటిపైన అతి తక్కువ సమ ఉపరితలాన్ని కలిగిఉండటాన్ని గమనిస్తారు.

భారతదేశ పటంలో హిమాలయాలు, ఆరావళి, వింధ్యా, సాత్పుర పర్వతాలను పరిశీలించండి. ఇవి మన దేశంలోని ముఖ్యమైన పర్వత శ్రేణులు.

మన రాష్ట్రంలో కూడా ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి మరియు జయశంకర్ జిల్లాలలో విస్తరించియున్న కొండల వరుసలు అక్కడక్కడ మనం చూడవచ్చు. ఇవి ఆదిలాబాద్, నిర్మల్‌లలోని సాత్‌మల కొండలు, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌ల లోని బాలఘాట్ శ్రేణులు, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, పెద్దపల్లి, జయశంకర్ జిల్లాలలోని కందికల్ కొండలు మరియు జగిత్యాల జిల్లాలోని రాఖీ కొండలు. వీటిని పటంలో పరిశీలించండి.



*చిత్రం 3. 1:* కొండలు

పీఠభూములు అనేవి ఎత్తైన ప్రదేశాలు. ఇవి విశాలమైన ఉపరితలాన్ని కలిగి ఉంటాయి. వాటి నడుమ అక్కడక్కడ కొండలు ఉంటాయి. పీఠభూములు పర్వతాల వలె కాకుండా స్వల్ప అసమాన ఎత్తులను, పల్లాలను కలిగి ఉంటాయి. భారతదేశంలోని అతిపెద్ద పీఠభూమి దక్కన్ పీఠభూమి.

భారతదేశంలోని దక్కన్ పీఠభూమికీ పశ్చిమం వైపున ఎత్తైన వాలుతో కూడిన ప్రాంతాన్ని పశ్చిమ కనుమలు అని పిలుస్తారు. తెలంగాణలోని అధిక ప్రాంతం దక్కన్ పీఠభూమిలో ఉండుట వలన ఈ ప్రాంతాన్ని తెలంగాణ పీఠభూమి అంటారు. ఇది తూర్పునకు వాలి ఉన్నది.

చిత్రం 3.2: మైదానం



పర్వతాలు, పీఠభూముల వలే కాక సున్నితమైన వాలు కలిగిన సమతల విశాల ప్రాంతాలే మైదానాలు. నదులు మేట వేసిన ఒండ్రుతో ఈ ప్రాంతాలు ఏర్పడతాయి. సింధూ మరియు దాని ఉపనదులు పంజాబ్ మైదానాన్ని ఏర్పరిచాయి. గంగానదీ ఉత్తర ప్రదేశ్, బీహార్ మరియు బెంగాల్ రాష్ట్రాల గుండా ప్రవహిస్తూ గంగా మైదానాన్ని ఏర్పరిచింది. ఈ రెండు విశాల మైదానాలను కలిపి గంగా-సింధూ మైదానము అని పిలుస్తారు. తూర్పు తీర మైదానం భారతదేశపు తూర్పు దిక్కున బంగాళాఖాత తీరానికి ఆనుకొని ఉన్నది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోని అధిక ప్రాంతం తూర్పుతీర మైదానంలోకి వస్తుంది. భారత దేశానికి పశ్చిమాన పశ్చిమ తీర మైదానం ఉన్నది. ఏయే రాష్ట్రాలు వీటి కిందికి వస్తాయో కనుక్కోండి.

చిత్రం 3.3: పీఠభూమి




భూ ఉపరితల స్వరూపాలైన పర్వతాలు, పీఠభూములు, మైదానాలు మొదలైన వాటిని నైసర్గిక లక్షణాలు అంటారు. తెలంగాణ రాష్ట్రం వివిధ నైసర్గిక స్వరూపాలను కలిగి ఉంది. 17వ పేజీలో ఇచ్చిన పటం-1 చూడండి. మన రాష్ట్రంలో పశ్చిమాన ఎగువ తెలంగాణ పీఠభూమి ఉంది. గోదావరి, కృష్ణా నదులు ఈ పీఠభూమి గుండా తూర్పువైపుకు ప్రవహిస్తున్నాయి. మిగిలిన ప్రాంతాన్ని దిగువ తెలంగాణ పీఠభూమి అంటారు. ఇది కూడా తూర్పు వైపునకు వాలి ఉంది. జంటనగరాలైన హైదరాబాద్-సికింద్రాబాద్ నగరాలు, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ పట్టణాలు ఎగువ తెలంగాణ పీఠభూమిలో ఉండగా, వరంగల్, కరీంనగర్ పట్టణాలు దిగువ తెలంగాణ పీఠభూమిలోకి వస్తాయి.

ఈ భూస్వారూపాల గురించి మరియు ఇక్కడి ప్రజల జీవన విధానం ఏ విధంగా ఉందో తరువాత అధ్యాయాలలో తెలుసుకుంటాం.

- ఇక్కడ ఇచ్చిన పర్వతాలు, మైదానాలు, పీఠభూముల చిత్రాలను పరిశీలించి మీ ప్రాంతం వీటిలో దేనిని పోలి ఉందో తెలుపండి.
- తెలంగాణ పటాన్ని పరిశీలించి ఈ క్రింద ఇచ్చిన పట్టణాలలో ఏవి ఎగువ, దిగువ తెలంగాణ పీఠభూములలో ఉన్నాయో గుర్తించండి.

SCERT TELANGANA




***పటం-1 తెలంగాణ భౌతిక స్వరూపం***

SCERT TELANGANA

భువనగిరి, భద్రాచలం, సిద్ధిపేట, మంథని, మంచిర్యాల, షాద్‌నగర్, సిరిసిల్ల, చెన్నూరు, కామారెడ్డి, వికారాబాద్.

- అనంతగిరి కొండలు, దేవరకొండ కొండలు, నిర్మల్ కొండలు, సిర్నపల్లి కొండలు ఏ జిల్లాలలో ఉన్నాయి?

## డెల్టా


మన రాష్ట్రంలో ప్రవహించే నదులలో గోదావరి, కృష్ణా అనే రెండు నదులు ముఖ్యమైనవి. ఈ నదులు పశ్చిమ కనుమల నుంచి ప్రవహిస్తున్నాయి. గోదావరి నది నిర్మల్ జిల్లా, బాసర వద్ద మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. గోదావరి, కృష్ణా నదులు తెలంగాణ పీఠభూమిలోని అనేక చిన్న నదులను తమతో కలుపుకొని, పెద్ద డెల్టా ప్రాంతాన్ని ఏర్పరచి, చివరకు బంగాళాఖాతంలో కలిసిపోతాయి. ఈ రకంగా తూర్పు తీర మైదానంలో ఏర్పడిన రెండు త్రిభుజాకార డెల్టా ప్రాంతాలను పరిశీలించండి (చిత్రం 3.4).

సముద్రంలో కలిసే ముందు నది అనేక చిన్న చిన్న పాయలుగా విడిపోతుంది. ఈ పాయల మధ్య భాగంలో ఇసుక, మెత్తటి మట్టి మేటలుగా ఏర్పడి డెల్టాలుగా ఏర్పడతాయి. సాధారణంగా ఇవి త్రిభుజాకారంగా ఏర్పడతాయి. ప్రతి సంవత్సరం ఈ నదుల వరద నీటితో కొట్టుకొని వచ్చే ఒండ్రు (హ్యూమస్ అంటే ఆకులు, చెట్లు మొ॥ కుళ్ళిపోగా ఏర్పడినవి) వరద ప్రాంతాలలో మేటలుగా ఏర్పడుతుంది. అందువల్ల ఇక్కడి భూములు ఎంతో సారవంతంగా ఉంటాయి.

- నదులకు అడ్డంగా నిర్మించిన ఆనకట్టలు డెల్టా ప్రాంత నేలలను ఏవిధంగా ప్రభావితం చేస్తున్నాయో ఆలోచించండి.
- భారతదేశంలోని ఇంకొన్ని డెల్టాల పేర్లను తెలుసుకోండి.
- కృష్ణా మరియు గోదావరి నదులలో కలిసే రెండు ఉపనదుల పేర్లు చెప్పండి.
- గోదావరి నదిపైన నిర్మించిన అతిపెద్ద ఆనకట్టను గుర్తించండి.
- మెదక్ జిల్లాలో అతిపెద్ద ఆనకట్టను నిర్మించడం ఎందుకు సాధ్యపడదు?




*చిత్రం 3.4: కృష్ణా, గోదావరి డెల్టా ఉపగ్రహ ఛాయ చిత్రం*




*పటం 2: దక్షిణ భారతదేశ ప్రధాన భూస్వరూపాలు*

SCERT TELANGANA

పాఠం

# 3

రెండవభాగం

# కృష్ణాడెల్టాలోని ఒక గ్రామం - పెనమకూరు

మేము కృష్ణా డెల్టాలోని ఒక గ్రామాన్ని చూడాలనుకొని విజయవాడ నుంచి బయలుదేరి ఉయ్యూరు పట్టణం చేరుకున్నాం. మేము ప్రయాణించిన ప్రాంతమంతా సమతలంగా ఉంది. ఎక్కడా పర్వతాలు, వాలులు కనిపించలేదు. ఎన్నో చిన్న చిన్న కాలువలను, వాగులను దాటుకుంటూ ప్రయాణించాం. కాలువలకు రెండువైపులా పచ్చనిచెట్లు, పంట పొలాలు కనిపించాయి.

### బందరు కాలువ

మేము ఉయ్యూరునుంచి మూడు కి.మీ ప్రయాణించిన తరవాత బందరు కాలువను దాటి పెనమకూరు గ్రామాన్ని చేరుకున్నాం. విజయవాడలోని కృష్ణానది మీద ఉన్న ప్రకాశం బ్యారేజ్ నుంచి బందరు కాలువ ప్రవహిస్తుంది. ఈ గ్రామానికి వాయవ్య ప్రాంతంనుంచి ఆగ్నేయ ప్రాంతానికి ఈ కాలువ ప్రవహిస్తుంది. గ్రామంలో పంట భూములకు చిన్న చిన్న కాలువల ద్వారా బందరు కాలువ నీళ్ళు పంపిణీ చేస్తారు. పెనమకూరు గ్రామం బందరు కాలువకు, కృష్ణానదికి (కొన్ని కిలోమీటర్ల దూరంగా గ్రామానికి పశ్చిమాన ప్రవహించే) మధ్యన ఉంది. ఈ గ్రామానికి పశ్చిమ దిక్కులో కృష్ణానది ప్రవహిస్తున్నది.



*చిత్రం 3.5: పెనమకూరు మైదాన ప్రాంతం*



*చిత్రం 3.6: బందరు కాలువను ఆనుకుని ఉన్న పూరిళ్ళు*

### ప్రకాశం బ్యారేజి

కృష్ణానది ఉత్తర ఒడ్డున విజయవాడ నగరం ఉంది. 1853వ సంవత్సరంలో బ్రిటిష్ వారు విజయవాడ దగ్గర కృష్ణా నదిపై బ్యారేజి నిర్మించారు. దీన్ని మనం ప్రకాశం బ్యారేజిగా పిలుస్తున్నాం. ఈ బ్యారేజి నుంచి కాలువల ద్వారా మళ్ళించిన నీటితో 12 లక్షల ఎకరాల భూమి సాగు అవుతుంది.

SCERT TELANGANA

## నేలలు

పెనమకూరు నేలలు చాలా వరకు సారవంతమైన ఒండ్రు, నల్లరేగడి భూములు. నదులు నిక్షిప్తంచేసిన నేలలను ఒండలి నేలలు లేదా "ఒండ్రు భూమి" అంటారు. ఈ భూములు సారవంతంగా ఉండి ఎక్కువ నీటిని పట్టి ఉంచగలుగుతాయి. వీటిలో అధిక పోషకపదార్థాలు ఉంటాయి. ఈ భూములలో పంటలు బాగా పండుతాయని మీరు భావిస్తారా?

ఇక్కడ 15 అడుగుల లోతు వరకు మనకు నల్లరేగడి మట్టి కనిపిస్తుంది. ఈ భూములు వర్షాకాలంలో ఎంతో జిగురుగా ఉండి చాలాకాలం వరకు తేమను పోగొట్టుకోకుండా ఉంటాయి. ఇవి ఆరిపోతున్నప్పుడు భూమి ఉపరితలంమీద పగుళ్ళు ఏర్పడతాయి. ఈ పగుళ్ళ వల్ల భూ ఉపరితలంపైనున్న మట్టి రాలి పగుళ్ళలో చేరుతుంది. దీన్నే సెల్ఫ్ ప్లవింగ్ (స్వయంగా మట్టి మార్పిడి) అంటాం. ఈ ప్రాంతంలోని భూములు ఎల్లప్పుడూ సారవంతంగా ఉండటానికి ఇది ఒక ముఖ్యకారణం.

నదికి దగ్గరగా పశ్చిమ, దక్షిణ భాగంలో ఉన్న గ్రామంలోని కొన్ని ప్రాంతాలలో ఇసుక భూములున్నాయి.


ఈ ప్రాంతంలోని ఎక్కువ భాగం భూమి సారవంతమైనది కావటం వల్ల నీరు సమృద్ధిగా లభిస్తే సంవత్సరానికి రెండు, మూడు పంటలు పండించవచ్చు.

- మృత్తికలోని తేమకు, పంట దిగుబడికి మధ్యగల సంబంధం ఏమిటి?
- పెనమకూరు గ్రామ పటంలో కాలువను, రోడ్లను, గ్రామం మధ్య ప్రాంతాన్ని, గుడిసెలను గుర్తించండి.
- గ్రామపటంలో బందరు కాలువ నుంచి పొలాలకు నీరు చేరవేసే పిల్లకాలువలను గమనించండి. అవి ఏ దిశగా ప్రవహిస్తున్నాయో గమనించండి.
- కాలువల నీటితో వ్యవసాయం చేసే భూమిని గుర్తించి ఛాయాపూరితం (షేడ్) చేయండి.

## వర్షపాతం, సాగునీరు

ఈ ప్రాంతంలో జూన్ నుంచి అక్టోబర్ వరకు నైరుతి ఋతుపవనాల వల్ల ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. నవంబరు నుంచి మే వరకు స్వల్పవర్షం కురుస్తుంది. అనుకూలంగా ఉండే ఉష్ణోగ్రతలవల్ల సంవత్సరం పొడుగునా పంటలు పండించవచ్చు. అక్టోబరు తరవాత వర్షాలు లేనందున పంటలకు కావలసిన నీరు కాలువలు, చెరువులు, బావి లేదా బోరుబావుల ద్వారా నీటిని ఉపయోగిస్తారు.

గ్రామానికి తూర్పు వైపున కాలువలకు దగ్గరగా ఉన్న పల్లపు భూములు సులభంగా కాలువల నీటితో సాగు చేస్తున్నారు. పశ్చిమ, ఉత్తరంవైపున ఉన్న భూములు చాలా మెరకగా ఉండి కాలువల ద్వారా వ్యవసాయం చేయడానికి అనుకూలంగా లేవు. ఇలాంటి ప్రాంతాలలో రైతులు బోరుబావులను ఉపయోగిస్తున్నారు.




పటం : 3
పెనమకూరు గ్రామ పటం

SCERT TELANGANA

పెనమకూరు గ్రామం కృష్ణానదికి దగ్గరగా ఉండటంవల్ల 15 నుండి 25 అడుగుల లోతు వరకు తవ్వగానే నీరు వస్తుంది. అందువల్ల ఇక్కడ బోరు బావి తవ్వడానికి తక్కువ ఖర్చు అవుతుంది. ఈ ప్రాంతమంతటా విద్యుదీకరణ జరిగి ఉండడం వల్ల చాలా బోరుబావులు నీట మునిగి ఉండే (submersible) మోటారులతో పనిచేస్తున్నాయి.



*చిత్రం 3.7: బోరుబావి కింద సాగుచేయబడుతున్న వరి మరియు చెరుకు పంట పొలాలు*

ఈ మధ్య కాలంలో కాలువల నీటి ద్వారా సాగు చేయలేని మెట్ట భూములకు బోరుబావుల ద్వారా సాగు నీటిని అధికంగా ఉపయోగిస్తున్నారు.

- మీ ప్రాంతంలో జూన్ నుంచి అక్టోబరు వరకు వర్షాలు పడతాయా?
- మీ ప్రాంతంలో పడే వర్షం వ్యవసాయం చేయడానికి సరిపోతుందా?
- మీ ప్రాంతాన్ని కృష్ణా డెల్టా ప్రాంతంలోని నీటి లభ్యతతో పోల్చండి.

**తుఫానులు, వరదలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తరచూ వరదలు వచ్చే జిల్లాల్లో కృష్ణాజిల్లా ఒకటి. నదీపరీవాహక ప్రాంతాల్లో బాగా వర్షాలు పడ్డప్పుడు వరదలు వస్తాయి. వరద నీటి వల్ల పెద్ద ఆనకట్టలు పూర్తి స్థాయిలో నిండిపోయినప్పుడు ఆ నీరును దిగువకు విడుదల చేస్తారు. దీని ఫలితంగా ఆనకట్టకు దిగువనున్న లోతట్టు గ్రామాలలోకి వరద నీరు వస్తుంది. వరదనీరు ఎంతో వినాశనకారి, ఉత్పత్తిని పెంచేదిగా కూడా ఉంటుంది. తుఫానుల వల్ల కూడా ఎక్కువ వర్షాలు పడి నదికి వరదలు వస్తాయి. తుఫానుల కారణంగా బలమైన గాలుల వలన పెద్ద పెద్ద చెట్లు, ఇళ్ళు ధ్వంసం అయి నీటిలో కొట్టుకొనిపోతాయి. పెనమకూరు గ్రామం లోతట్టు ప్రాంతంలో లేకపోవడం వల్ల వరదల తీవ్రతకు గురయ్యే అవకాశం తక్కువ. 1997, 2006, 2009 సంవత్సరాలలో కృష్ణానదికి భయంకరమైన వరదలు వచ్చినా ఈ గ్రామానికి నష్టం కలగలేదు.

- వరదలు ఎందుకు వినాశకారో, ఉత్పత్తికారో ఆలోచించండి.
- గతంలో సంభవించిన పెద్ద వరదలను, వాటి ఫలితాల గురించిన సమాచారాన్ని సేకరించండి?
- తుఫానులవల్ల, వరదలవల్ల జరిగే నష్టాన్ని మనం ఏవిధంగా తగ్గించగలం?

**పంటలు**

ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాతీర మైదానంలో ప్రత్యేకించి కృష్ణా జిల్లాలో వరిని విస్తారంగా పండిస్తారు. ముఖ్యంగా పల్లపు భూములలో వరిని నాటుతారు. ఋతుపవన ప్రారంభంలో సాల్వ పంటకు వరినారు పోస్తారు. తరవాత అంటే జూన్, జూలై మాసాలలో దాన్ని పొలాలలో నాటుతారు. దీన్ని సాల్వ పంట అంటారు. ఇక్కడ వరి పంటలో బాగా దిగుబడిని ఇచ్చే యం.టి.యు. 2716, స్వర్ణ, బి.పి.టి లాంటి రకాలు పండిస్తారు. ఈ పంట అక్టోబర్, నవంబర్ నెలలలో కోతకు వస్తుంది. ముఖ్యమైన వ్యవసాయ

SCERT TELANGANA



*చిత్రం 3.8: పసుపు, చెరకు, అరటి తోటలు*

సంబంధమయిన పనులకు, అంటే దున్నడానికి, నూర్పిడి, రవాణాకోసం ట్రాక్టర్లను ఉపయోగిస్తారు. వరి నాట్లు ముఖ్యంగా మహిళలు చేయగా వరి కోతను పురుషులు, మహిళలు కలిసి చేస్తారు. డిసెంబర్ నెల నుండి వేసే శీతాకాలం పంటను 'దాల్వ' అంటారు. ఇది వరి లేదా పప్పుధాన్యాలైన కావచ్చు.

గత కొంతకాలంగా ఇక్కడి రైతులు వరిపంటకు బదులుగా చెరకును పండిస్తున్నారు. ఫిబ్రవరి లేదా మార్చి నెలలో సాగుచేస్తే తొమ్మిది నెలల నుండి సంవత్సరం కాలపరిమితి అనంతరం పంట చేతికి వస్తుంది. చెరకును నరికిన తరవాత రెండో పంటను పండించవచ్చు. చెరకు పంటకు సంవత్సరకాలం అంతా పని ఉంటుంది. ఈ పనిని ముఖ్యంగా మగవారు చేస్తారు.

ప్రస్తుతం ఇక్కడి గ్రామస్తులు మెట్ట భూములలో పసుపు, కంద, అరటి వంటి పంటలను పండిస్తున్నారు. ఈ పంటలను వర్షాకాల ప్రారంభంలో నాటితే ఫిబ్రవరి, మార్చి నెలలలో కోతకి వస్తాయి. వీటిని గ్రామంలో వినియోగించగా మిగిలిన వాటిని వాణిజ్య పరంగా మార్కెట్‌లో అమ్మడానికి పండిస్తారు.

పెనమకూరు గ్రామంలో ఇంతకు పూర్వం కందులు, పెసలు, చిరుధాన్యాలు లాంటి పంటలను మెట్ట భూములలో పండించేవారు. ఈ పంటలకు నీరు అంతగా అవసరం లేదు. కాని ప్రస్తుత కాలంలో ఈ పంటలకు బదులుగా చెరకు, కూరగాయలను పండిస్తున్నారు. వీటికి నీటి పారుదల అవసరం.

### కూరగాయలు

ఈ గ్రామంలోని మెట్టభూమి లేదా గరువు (ఇసుక కలిసిన) భూమి కూరగాయల సాగుకు ఎంతో అనువైనది. పల్లపు భూములలో రెండో పంటకు కాలువల ద్వారా నీరు సమృద్ధిగా రానప్పుడు ఇక్కడి రైతులు వరిపంటకు బదులుగా కూరగాయలను సాగుచేస్తారు. సాధారణంగా వంకాయ, బెండకాయ, దొండకాయ, బీరకాయ, క్యాబేజి లాంటి పంటలను పండించి దగ్గరలోని ఉయ్యూరు రైతుబజారులో విక్రయిస్తారు. వేసవి కాలంలో కొంతమంది వ్యవసాయదారులు వాళ్ళ భూములలో సారం పెంచడానికి జీలుగ, పిల్లిపెసర లాంటివి వేస్తారు. ఈ చిక్కుడు జాతికి చెందిన పంటలవల్ల భూమిలో నత్రజని శాతం పెరుగుతుంది. ఇవి వేసిన 30–40 రోజుల తరవాత ఈ మొక్కలను భూమిలో కలిపి దున్నుతారు. ఇది పంటలకు ఎరువుగా ఉపయోగపడుతుంది.

### తోటలు

కృష్ణానది ఒడ్డున మరియు పెనమకూరు మెట్ట ప్రాంతాలలో మనకు వివిధ రకాల పండ్లమొక్కలు, తోటలు కనిపిస్తాయి. జామ, సపోట, బొప్పాయి లాంటి చెట్లు కనిపిస్తాయి. నది సమీప భూములలో ఎక్కువ భాగం ఇసుకతో కూడిన మట్టి ఉంటుందని రైతులు చెప్పారు. ఈ భూములకు తేమను నిలుపుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ ఇసుక భూములలో వరి పంట సరిగా పండదు. ఈ భూములలో పండ్లమొక్కల వేర్లు నేలలోకి లోతుగా వెళ్ళి అక్కడి నీటిని తీసుకొని బాగా పెరుగుతాయి. అందువల్ల నది సమీప భూములు పండ్లతోటల పెంపకానికి అనువుగా ఉంటాయి.

### సాగునీరు, మార్కెట్, పంటల మార్పిడి

ఇటీవల కాలంలో ఆహార ధాన్యాలైన వరి, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల ఉత్పత్తి నుంచి చెరకు,

SCERT TELANGANA

కూరగాయలు, పండ్లు, పసుపు లాంటి నగదు పంటల వైపు ఇక్కడి రైతులు మొగ్గు చూపుతున్నారు. నీరు సమృద్ధిగా లభించడం, మార్కెట్ సౌకర్యం అందుబాటులో ఉండటం, ఎరువులకు, విత్తనాలకు బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం లభించడమే దీనికి ముఖ్య కారణం.

- ఈ మార్పు ఎందుకు వచ్చిందని మీరు భావిస్తున్నారు?
- ఈ రకమైన మార్పు రైతులకు ఎంతవరకు ఉపయోగకరమని మీరు భావిస్తున్నారు?
- ఈ మార్పులు ఏమైనా సమస్యలకు దారి తీస్తాయా?

## భూమి యాజమాన్యం, కౌలుదారీ విధానం

మొత్తం గ్రామంలో 750 కుటుంబాలు ఉండగా వాటిలో 10 కుటుంబాలకు 10 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉంది. సుమారుగా 150 కుటుంబాలకు 5 ఎకరాల కంటే తక్కువ భూములు ఉన్నాయి. మిగిలిన కుటుంబాలకు ఏ రకమైన భూములూ లేవు. వీరు భూమిని కౌలుకు తీసుకొనడమో లేదా యజమానుల భూములలో కూలి పని చేసుకొంటూనో బతుకుతున్నారు.

- పెనమకూరు లోని నేల రకాలు (సరియైన జవాబులకు √ పెట్టండి)

  ఎ. ఇసుక / రాళ్ళు బి. ఇసుక / బంకమట్టి

  సి. నల్లరేగడి / ఇసుక
- కింద ఇచ్చిన వాటిలో ఏ వాక్యం సరియైనది?

  ఎ. ఇసుక భూములు తేమను కలిగి ఉంటాయి.

  బి. నల్లరేగడి భూములు ఎక్కువ తేమను కలిగి ఉంటాయి.

  సి. నల్లరేగడి – ఇసుక భూములు తేమను కలిగి ఉంటాయి.
- పెనమకూరు గ్రామంలోని రైతులు ........... నేలలో వరిని పండిస్తారు.
- కృష్ణా నది ఒడ్డున పండ్ల మొక్కలు పెంచటానికి కారణం.............................................
- నీవు గ్రామంలో నివసిస్తున్నట్లయితే; మీ ప్రాంతంలోని బోరుబావుల లోతు ఎంత ఉంటుంది? బోరు బావులు తవ్వుతున్నప్పుడు ఏ రకమైన మట్టిపొరలు వస్తాయి? మీ దగ్గరలో ఉన్న భూమిని ఏ విధంగా సాగుచేస్తారు?

## ఇళ్ళు

ఈ గ్రామంలో అనేక కులాలవాళ్ళు, వృత్తుల వాళ్ళు నివసిస్తున్నారు. గ్రామంలోని ముఖ్యప్రాంతంలో భూమి యజమానులు మాత్రమే నివసిస్తున్నారు. ఇతరులు గ్రామంలోని సమీప శివారు ప్రాంతాలలోని బందరు కాలువ ఇరువైపుల, గ్రామానికి దక్షిణ భాగంలో నివసిస్తున్నారు. గ్రామం మధ్యభాగంలో చిన్న కిరాణ దుకాణాలు, మందుల షాపు, క్షౌరశాల, చిన్న హోటళ్లు, ఆర్.యం.పి డాక్టర్లు, ఐరన్ వెల్డింగ్ షాపులు కూడా ఉన్నాయి.



*చిత్రం 3.9: దుంపల పొలాల్లో కూలీలు*

SCERT TELANGANA

ఈ క్రింది గ్రామంలోని ఇళ్ళు, భవనాలకు సంబంధించిన ఫొటోల చిత్రపటాలను చూసి వివరించండి. పై కప్పులు, గోడలు, ప్రహరి గోడల పోలికలను, తేడాలను తెల్పండి.



*చిత్రం 3.10: రైతుల ఇల్లు*



*చిత్రం 3.11: గుడిసె*



*చిత్రం 3.12: చిన్న రైతుల ఇల్లు*



*చిత్రం 3.13: రోడ్లు – ఇళ్లు*

SCERT TELANGANA

### జంతువుల పెంపకం

ఈ గ్రామంలోని మొత్తంభూమి సాగులో ఉండటం వల్ల పశువుల మేతకు భూమి కరువయింది. అందువల్ల కొన్ని ఎద్దులను, ఆవులను, దున్నపోతులను, గొర్రెలను పొలంలో పని చేయటానికి, పాల కొరకు మాత్రమే పెంచుకుంటారు. ఇక్కడివాళ్ళు జంతువులను ఎలా పోషిస్తున్నారో ఊహించండి.

### బుట్టలు అల్లటం, పందుల పెంపకం, చేపలు పట్టటం

బందరు కాలువకు రెండువైపులా బుట్టలు అల్లే 20–30 కుటుంబాలవాళ్ళు నివసిస్తున్నారు. వీళ్ళు వేరే గ్రామం నుంచి పనుల నిమిత్తం ఇక్కడికి వలస వచ్చారు. వీళ్ళ ప్రధాన వృత్తి బుట్టలు అల్లటం, ఎలుకలను పట్టటం, పందులను పెంచటం. జగన్నాథ నాంచారయ్య ఇక్కడికి 30 సంవత్సరాల క్రితం వచ్చి స్థిరపడ్డాడు. ఇతను కాలువకు రెండువైపుల పెరిగే ఈత ఆకులను సేకరించి బుట్టలు అల్లుతాడు. ఇతడు, ఇతని భార్య ఒక రోజుకు ఐదారు బుట్టలు అల్లి పక్క గ్రామంలో విక్రయిస్తారు. ఇతని పొరుగున ఉన్న కట్టా శివయ్య అనే వ్యక్తి కాలువలో బుట్ట వల సహాయంతో చేపలు పట్టి పక్క గ్రామంలో అమ్ముతాడు.

## కోళ్ళ పెంపకం

ఈ గ్రామంలో పూర్తిగా ఆధునికీకరించిన కోళ్ళఫారం ఉంది. నీటిని నిప్పల్స్ ద్వారా, ఆహారాన్ని కన్వేయర్ బెల్ట్ ద్వారా అందిస్తారు. ఈ ఫారంలో 80 వేల కోళ్ళు ఉన్నాయి. ఇవి రోజుకు 50 వేల గుడ్లు పెడతాయి. ఈ గుడ్లను విజయవాడకు, అసోం, బీహార్ రాష్ట్రాలకు ఏజెంట్ల ద్వారా ఎగుమతి చేస్తారు. చేపల ఆహారం కోసం కోళ్ళ పెంటను సమీపంలోని రైతులకు అమ్ముతారు.

## రైసు మిల్లు

ఇక్కడ ఒక బియ్యం మర (రైసు మిల్లు) కూడా ఉంది. ఈ మిల్లు యజమానులు రైతుల దగ్గర ధాన్యం కొని మరపట్టిన అనంతరం బియ్యంను ఇతర ప్రాంతాలలో అమ్ముతారు.

ఇక్కడ కోళ్ల పెంపకం, బియ్యం మరలు వ్యవసాయ ఆధారితమైన పరిశ్రమలు. మైదాన ప్రాంతంలో ఇదే రకమైన పరిశ్రమలు కనపడతాయి. రవాణా సౌకర్యం ఉండటం వల్ల ఇక్కడి వాళ్ళు అవసరమైన ముడి సరుకులను కొనుగోలుచేసి వాటితో ఉత్పత్తి చేసిన వస్తువులను అమ్మకం చేయగలుగుతారు.



*చిత్రం 3.14: కోళ్ల ఫారం*



*చిత్రం 3.15: రైస్ మిల్*



*చిత్రం 3.16: బుట్టల అల్లకం*

SCERT TELANGANA

## రోడ్డు రవాణా, మార్కెట్లు

ఈ ప్రాంతం నుండి వివిధ నగరాలకు, పట్టణాలకు అభివృద్ధి చెందిన రోడ్డు రవాణా వ్యవస్థ ఉంది. వీరి ఉత్పత్తులను సులభంగా విక్రయించడానికి ఇది దోహదపడుతుంది.



చిత్రం : 3.17 రైతుబజారులకు కూరగాయలను, పండ్లను తరలించడం

ఇక్కడి రైతులు చెరకు పంటను ఉయ్యూరులోని పంచదార మిల్లుకు సరఫరా చేస్తారు. వీరు పండించిన కూరగాయలను, అరటిపళ్లను ఉయ్యూరు, విజయవాడలలోని రైతుబజారులకు సరఫరా చేస్తారు. వరిధాన్యాన్ని పంటభూములలోనే మధ్యవర్తుల ద్వారా విక్రయిస్తారు.

## కూలీల లభ్యత

ఈ గ్రామంలో ఉన్న వాళ్లలో ఎక్కువ మందికి ఇక్కడే పని లభిస్తుంది. కొంతమంది వ్యవసాయ కూలీలు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూడా వస్తుంటారు. 10వ తరగతి లేదా ఆ పైన చదువుకున్న యువకులు ఆటో డ్రైవర్లుగా, మెకానిక్‌లుగా, ఎలక్ట్రీషియన్‌లుగా పనిచేస్తున్నారు.

**కీలకపదాలు**

పర్వతం
పీఠభూమి
మైదానం
తీరం
తుఫాను
వరద

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. పెనమకూరు గ్రామంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటున్నాయి?
2. మైదాన ప్రాంతంలో పేదవాళ్ళు, భూమి లేనివాళ్ళు జీవనోపాధిని ఏ విధంగా పొందుతున్నారు?
3. పెనమకూరులాంటి మైదానప్రాంత గ్రామంలో వ్యవసాయం చేయటంలో కలిగే ఇబ్బందులను తెలపండి.
4. గ్రామంలోని రైతులందరూ చెరకు లేదా పసుపు పంటలు మాత్రమే పండిస్తే ఏం జరుగుతుంది?
5. మైదాన ప్రాంతంలో ముఖ్యంగా కృష్ణా డెల్టా లాంటి మైదాన ప్రాంతంలో జనసాంద్రత ఎందుకు ఎక్కువగా ఉంటుంది?
6. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ పటంలో వివిధ భూస్వరూపాలను గుర్తించి, దిగువ రంగులు వేయండి.
   అ. మైదానం – ఆకుపచ్చ  ఆ. పీఠభూమి – పసుపు  ఇ) పర్వతాలు – ముదురు ఊదా
7. చేతివృత్తుల వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందుతున్నాయి?
8. తెలంగాణ నైసర్గిక స్వరూపాలను వివరించండి.

SCERT TELANGANA

పాఠం

4

# డోకూర్ – పీఠభూమిలో ఒక గ్రామం

*గత పాఠంలో కృష్ణా డెల్టా ప్రాంతంలో సమృద్ధిగా నీళ్ళు, సారవంతమైన నేలలు ఉన్న ఒక గ్రామాన్ని చూశాం. వర్షపాతం సాగునీటి సౌకర్యాలు అంతగాలేని, సారవంతం కాని నేలలు ఉండే మరొక ఊరిలో జీవితం ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఎటువంటి తేడాలు ఉంటాయి? తరగతిలో చర్చించండి.*

## దక్కను పీఠభూమి

3వ అధ్యాయంలో పటం–1లో తెలంగాణ భూస్వరూపాలని చూడండి. తెలంగాణ రాష్ట్రం ప్రధానంగా పీఠభూమి అని గమనిస్తారు. అదే అధ్యాయంలోని పటం 2తో దీనిని పోల్చండి. ఈ ప్రాంతం అంతా విస్తృత దక్కన్ పీఠభూమిలో భాగమని చూస్తారు. దక్కన్ పీఠభూమికి ఒక వైపున పశ్చిమ కనుమలు, మరొక వైపున తూర్పు కనుమలు ఉన్నాయి. రెండు వైపులా ఉన్న సముద్ర తీర మైదాన ప్రాంతాలతో పోలిస్తే దక్కన్ పీఠభూమి ఎత్తులో ఉంది. ఈ పీఠభూమిలో పశ్చిమం వైపు నుంచి తూర్పుకి వాలు కలిగి ఉంది. ఈ ప్రాంతాన్ని అర్థం చేసుకోటానికి మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రవహించే గోదావరి నదీ మార్గాన్ని గమనించండి.

కృష్ణా డెల్టా ప్రాంతాల మాదిరి చదునుగా కాకుండా పీఠభూములలో చిన్న కొండలు, పర్వత శ్రేణులు, గుట్టలు ఉండి వాటి మధ్య చదును భూములు ఉంటాయి. ఫలితంగా నివాస ప్రాంతం, సాగుభూమి చిన్న చిన్న విస్తీర్ణాలలో మాత్రమే సాధ్యమవుతాయి. ఈ ప్రాంతం రాళ్ళమయంగా ఉండి మట్టి పొర చాలా పలచగా ఉంటాయి. పీఠభూమిలో మరొక ముఖ్యమైన అంశం వర్షపాతం తక్కువగా ఉంటుంది. ఇటువంటి కష్టమైన ప్రాంతాలలో ప్రజలు ఎలా ఉంటారో తెలుసుకోవాలి అనుకున్నాం. తెలంగాణ పీఠభూమిలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని డోకూర్ గ్రామం సందర్శించి, అధ్యయనం చేశాం.


## డోకూర్ గ్రామం

డోకూర్ గ్రామం దేవరకద్ర మండలంలో ఉంది. ఇది మహబూబ్‌నగర్ పట్టణానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామం పాత పేరు డాకూర్, బందిపోటు అనే అర్థం ఉన్న 'డాకు' పదం నుంచి ఈ పేరు వచ్చింది. ఒకప్పుడు ఈ గ్రామం చుట్టుపక్కల అడవుల్లోని దట్టమైన పొదల్లో తేలికగా దాక్కొగలగటంతో బందిపోటు ముఠాలు ఇక్కడ నివసించేవి. ప్రస్తుతం ఈ ఊరుని డోకూర్ అంటున్నారు.





*చిత్రం 4.1 : డోకూర్ గ్రామానికి ప్రవేశం*

SCERT TELANGANA




పటం 1 : డోకూర్ గ్రామ చిత్తు పటం




- డోకూర్ గ్రామ చిత్తు పటం చూడండి. దీని ఆధారంగా ఇండ్ల రకాలు, రవాణా సాధనాలను వివరించండి. దీనిని మీ ఊరిలో, లేదా మీకు తెలిసిన ఊరితో పోల్చండి.
- మేం ఊరికి వెళ్ళినప్పుడు చెరువు ఎండిపోయి ఉంది. అయినప్పటికీ దానిని నీలం రంగులో చూపించారు. చెరువు ఎండిపోటానికి కారణాలు ఏవై ఉంటాయి?

## వాతావరణం, వర్షపాతం

ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉండే వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు $40^0$ సెల్సియస్ వరకు ఉంటాయి. అయితే, నవంబరు నుంచి జనవరి వరకు చలికాలంలో పగటి ఉష్ణోగ్రతలు $20^0$–$30^0$ సెల్సియస్ మధ్య ఉంటాయి. జూన్ చివరి నుంచి అక్టోబరు వరకు ఈ ప్రాంతంలో వర్షాకాలం. అయితే వర్షపాతం చాలా తక్కువ, మరియు అనిశ్చితత్వం. ఒక సంవత్సరం నుంచి మరొక సంవత్సరానికి వర్షపాతంలో చాలా తేడా ఉంటుంది. కాబట్టి వర్షపాతాన్ని ముందుగా ఊహించలేం. వర్షాభావ సంవత్సరాలలో కరువు పరిస్థితులు నెలకొంటాయి. పంటలు ఎండిపోతాయి. తక్కువ వర్షపాతం కారణంగా చెరువులు నిండవు, భూగర్భ జలాలు పునరుద్ధరింపబడవు. మనుషులకు, పశువులకు తాగునీరు కూడా పెద్ద సమస్య అవుతుంది. సాగునీటి సౌకర్యాలు లేనందున వ్యవసాయం చెయ్యటం చాలా కష్టం అవుతుంది. ఇటువంటి క్లిష్టమైన సంవత్సరాలలో ప్రజలు ఇతర ఉపాధి అవకాశాలను వెతుక్కోవలసి వస్తుంది. ఇలా తక్కువ వర్షపాత సంవత్సరాలు మళ్ళీ, మళ్ళీ వస్తుండటం వల్ల దీనిని కరువు పీడిత ప్రాంతం అంటారు.

SCERT TELANGANA

- డోకూరు ప్రాంతంలోనూ, కృష్ణా డెల్టా ప్రాంతంలోనూ వర్షపాతంలోని తేడాలు ఏమిటి?
- మీ ప్రాంతంలో, గత పది సంవత్సరాలలో వర్షపాతం, క్రమం తప్పి పడిందేమో మీ పెద్దవాళ్ళను అడిగి తెలుసుకోండి.

## నేలలు

ఈ ఊరిలోని సగం వ్యవసాయ భూములు ఎర్రనేలలు. ఈ నేలల పై పొర లోతైనవి కావు, సారవంతమైనవి కావు. పంటల ఎదుగుదలకు అవసరమైన అనేక పోషకాలు ఈ నేలల్లో లోపిస్తాయి. వీటిల్లో ఇసుక శాతం ఎక్కువ కావటం వల్ల నీటిని ఎక్కువగా పట్టి ఉంచలేవు, దాంతో పంటల వేళ్ళు బలంగా, విస్తారంగా పెరగవు. ఒక పంటసాగు చేసిన తరువాత ఈ నేలలు కోల్పోయిన పోషకాలు ప్రకృతి సిద్ధంగా తిరిగి పొందటానికి ఒక కాలం పాటు వీటిని పంట పండిన తరువాత రెండవ పంట కాలాన్ని సాగుచేయకుండా వదిలి వేయాల్సి ఉంటుంది.

నల్ల నేలలు ఉన్న ప్రాంతాలు 60 సెంటీమీటర్ల లోతు వరకు ఉంటాయి. ఈ ఊరిలో వ్యవసాయ భూమిలో చాలా తక్కువ విస్తీర్ణంలో నల్ల నేలలు ఉన్నాయి. పీఠభూమిలోని ఇతర ప్రాంతాలలో ఉండే రేగడి నేలలంత మంచివి కాకపోయినప్పటికీ ఈ నల్లనేలలు పంటలకు అనువైనవి. ఈ నల్ల నేలలు సారవంతమైనవి, తేమను ఎక్కువ కాలం నిల్వ ఉంచుకోగలవు. కాబట్టి పంటలు ఎక్కువ కాలం నిలదొక్కుకుంటాయి. ఈ నేలలు తడిగా ఉన్నప్పుడు బంకగానూ, ఎండినప్పుడు చాలా గట్టిగానూ ఉంటాయి. ఈ నల్లనేలలు చాలా ఉత్పాదకత కలిగి ఉంటాయి.

చవుడు, గరుసు ఇతర ప్రధాన నేల రకాలు గ్రామ భూమిలో ఇవి 30 శాతం వరకు ఉన్నాయి. వీటిల్లో ఎక్కువగా రాళ్ళు ఉండి సాగుకి అనువైనవి కావు.

## నీటి వనరులు – చెరువులు, కుంటలు

డోకూర్ గ్రామంలో ముఖ్యమైన నీటి వనరు పెద్ద చెరువు. డోకూర్ గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరకద్ర చెరువు నిండితేనే ఈ చెరువుకి నీళ్ళు వస్తాయి. డోకూర్‌లోని పెద్ద చెరువు నిండిన తరువాత దీనికి దగ్గరలో ఉన్న చాకలి కోయికుంట, వానివంపు, బడి వంపులకు నీళ్ళు వెళతాయి. అంటే దండలోని ముత్యాల మాదిరి 'గొలుసుకట్టు చెరువులు' ఉన్నయాన్నమాట.

వర్షాకాలం అయిపోయిన తరువాత వాననీటిని ఉపయోగించుకోవటానికి ఒక పద్ధతి ప్రకారం ఈ చెరువులను చాలాకాలం క్రితం తవ్వారు. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతం కావటం వల్ల సాధ్యమైనంత వాననీటిని పట్టి ఉంచటానికి ఈ గొలుసు కట్టు చెరువుల పద్ధతిని రూపొందించారు. ఈ చెరువులలోని నీటివల్ల చుట్టుపక్కల బావులలోని నీళ్ళు కూడా పునరుద్ధరింపబడతాయి.

తెలంగాణ అంతటా ఈ 'గొలుసుకట్టు చెరువుల' విధానాన్ని చూస్తాం. ఇటువంటి నిర్మాణాలకు పీఠభూమి ప్రాంతం ఎలా అనువుగా ఉంటుంది? తరగతిలో చర్చించండి.



చిత్రం 4.2: రాళ్ళతో ఉన్న చవుడు నేలలు, చుట్టుపక్కల కొండలు

SCERT TELANGANA



చిత్రం 4.3: నీటిలో ఉన్న చెరువు, అందులో కలుపు మొక్కలు చూడండి. అంతేకాకుండా చెరువు ఒక పక్క ఆక్రమణకు గురయ్యింది.

ఊళ్ళో వృద్ధరైతు అయిన వెంకటరెడ్డి గతాన్ని ఇలా గుర్తు చేసుకున్నాడు, "గతంలో ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యక్తి వచ్చి చెరువు పూడిక తీయ్యటం, పిచ్చి మొక్కలు తీసేయ్యటం వంటి పనులు చేసేవాడు. వాళ్ళందరూ కలిసి చెరువులో చేపలు పట్టుకునే వాళ్ళు. అలా పట్టుకున్న చేపలను ఊరి మధ్యలో కుప్పగాపోసి అందరూ పంచుకునే వాళ్ళు."

ప్రస్తుతం వరి పంటను చెరువులోని నీటితో కాకుండా దానికి దిగువ వైపున తవ్విన బోరుబావుల నీటిపై ఆధారపడి సాగుచేస్తున్నారు. ఒకప్పుడు ఈ చెరువు ద్వారా 400 ఎకరాల భూమిసాగు అయ్యేది. దాదాపుగా అన్ని వర్గాల ప్రజలకు చెరువు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం సాగుభూమిలో అధికశాతం బోరుబావులపై ఆధారపడి ఉంది.

- గతంలో చెరువుల వ్యవస్థ ఎలా పని చేసేది?
- నీళ్ళను నిల్వ ఉంచటంలో సాగు నీటిలో, భూగర్భ జలాలను పునరుద్ధ- రించటంలో అది ఎలా సహాయపడేది?
- ఈ గొలుసుకట్టు చెరువు వ్యవస్థ ఇప్పుడు ఉపయోగపడని స్థితిలో ఎందుకు ఉంది?

## బావులు, బోరుబావులు

గ్రామంలో 40, 60 అడుగుల లోతులో నీళ్ళు ఉండే బావులు ఉండేవి. అయితే, ఈ బావులు ఇప్పుడు ఎండిపోయాయి. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతం కావటం వల్ల, చెరువులు పాడైపోయి వాటి నుంచి నేలలోకి నీళ్ళు ఇంకక పోవటం వల్ల ఈ బావులలో నీళ్ళు ఉండటం లేదు. ఇప్పుడు ప్రజలు బావులు తవ్వటం లేదు.

పీఠభూమి ప్రాంతంలో చాలా లోతులోగాని భూగర్భ జలాలు ఉండవు. అయితే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ బోరుబావులు కావాలని అనుకుంటున్నారు. కొన్ని బోరు బావుల్లోనే నీళ్ళు పడే అవకాశం ఉండటంతో నీటి కోసం పోటీపడటం పెరుగుతోంది. ప్రతి ఒక్కరు బోర్లు తవ్వుతున్న కారణంగా గత కొంత కాలంగా భూగర్భ జలాలు, ఇంకా అడుగంటి పోతున్నాయి. ఒకప్పుడు 100–150 అడుగుల్లో నీళ్ళు ఉండగా, ఇప్పుడు కొన్ని ప్రాంతాలలో 300 అడుగులు, మరికొన్ని ప్రాంతాలలో 500 అడుగుల వరకు తవ్వాల్సి వస్తోంది. బోరుబావుల తవ్వకం చాలా ఖర్చుతో కూడుకున్నదని, విఫలం అయ్యే అవకాశాలు ఎక్కువని కింది ఉదాహరణలు తెలియచేస్తాయి.

మొగిలన్న అనే చిన్న రైతు ఒక బోరుబావి తవ్వటానికి లక్ష రూపాయల ఖర్చు అవుతుందని తెలియచేశాడు. అతడు నాలుగు బోరుబావులు తవ్వగా ఒక్కదాంట్లో మాత్రమే నీళ్ళు పడ్డాయి. అది చాలదన్నట్లు



చిత్రం 4.4: బోరుబావి ద్వారా అందుతున్న సాగునీరు

SCERT TELANGANA

ఆ బోరుబావి కింద ఒక్క ఎకరం మాత్రమే పారుతుంది. అదే విధంగా ఊరిలోని పెద్ద రైతు అయిన నరేందర్ రెడ్డి తన 20 ఎకరాల భూమిలో 15 బోరుబావులు తవ్వించానని వాటిల్లో రెండింటిలో మాత్రమే నీళ్ళు పడ్డాయని చెప్పాడు.

బోరుబావులు ఖర్చుతో కూడుకున్నవి, విఫలమయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ రైతులందరూ ఈ పద్ధతిలోకే మారిపోయారు. గతంలో చెరువుల వ్యవస్థ బాగా ఉన్నప్పుడు చెరువు కింద ఆయకట్టు భూమితోనూ, బావులతోనూ చిన్న రైతులకు మంచి అవకాశాలు ఉండేవి. ఇప్పుడు పెట్టుబడులు పెట్టి లోతుగా ఉన్న భూగర్భ జలాల ద్వారా పెద్ద రైతులు మాత్రమే ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

- ఈ గ్రామంలో సాగునీటి సౌకర్యాలలో వచ్చిన మార్పులను చర్చించండి.
- మైదాన ప్రాంతంలోని గ్రామం సాగునీటి సౌకర్యాలను, పీఠభూమి గ్రామంలోని సాగునీటి సౌకర్యాలను పోల్చండి.
- ఈ ఊరి సాగునీటి సౌకర్యాలను మీ ఊరితో పోల్చండి.

## వ్యవసాయము మరియు పంటలు

డోకూర్ గ్రామ రైతులు పత్తి, వేరుశనగ, ఆముదం, వరి, సజ్జ, అలసంద, కంది వంటి పంటలు పండిస్తారు. గతంలో ప్రజలు ఆహార పంటలుగా ప్రధానంగా చిరుధాన్యాలను పండించేవాళ్ళు నల్లరేగడి నేలల్లో పత్తి పండించేవాళ్ళు. ఎర్రనేలల్లో వేరుశనగ, ఆముదం సాగుచేసే వాళ్ళు. అడవి పందుల సమస్య కారణంగా వేరుశనగ కింద విస్తీర్ణం తగ్గించి రైతులు ఆముదం సాగు చేస్తున్నారు. చవుడు నేలల్లో సజ్జలు పండించే వాళ్ళు. కంది, అలసంద పంటలను ఇతర పంటలతో మిశ్రమ పంటగా సాగు చేస్తారు.

**తరిగిపోతున్న భూగర్భ జలమట్టాలు–తీవ్రమవుతున్న సమస్య**

ఈ పీఠభూమి ప్రాంతమంత రైతులు వాణిజ్య పంటలు పండించడానికి విపరీతంగా బోరు బావులను తవ్వుతూ పోతున్నారు. ఈ బోరు బావులలో వర్షాల ద్వారా పునరుద్ధరించబడుతున్న నీటి కన్నా వీటి నుండి ఎక్కువ నీటిని తోడుతున్నారు. తత్ఫలితంగా ప్రతి సంవత్సరం కొద్ది రోజులు ఉపయోగించగానే బావులలో నీరు తగ్గిపోతున్నాయి, బోరు బావులు ఎండిపోతున్నాయి. కారణాలు తెలుసుకొని చర్చించండి. తగిన పరిష్కారాలు కనుక్కోండి.

పెద్ద చెరువు, సంపెంగ వాగులోని నీటితో వరి సాగు చేస్తారు. వాగులో గుంతలు తవ్వి, మోటర్ల సహాయంతో నీళ్ళు తోడుతారు. వాగు ఎండిపోతే వరిపంట కూడా ఎండిపోతుంది.

అక్టోబరు–జనవరి నెలలు మధ్య రబీ పంటగా బోరుబావులపై ఆధారపడి వరి, వేరుశనగ సాగుచేస్తారు. వరి నుంచి ఎకరానికి 20–30 క్వింటాళ్ళ దిగుబడి పొందవచ్చని రైతులు చెపుతారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగటం వల్ల, హార్వెస్టర్ల వినియోగం (కోత యంత్రం) వల్ల గత దశాబ్దాలలో వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయి. సాంప్రదాయంగా వస్తున్న పెంటపోగు ఎరువు వినియోగం గణనీయంగా తగ్గిపోయింది.

- ఈ గ్రామంలోని వానకాల లేక ఖరీఫ్ పంటలను, రబీ పంటలను గుర్తించండి.
- వేరుశనగ పంట సాగులో ఎదురయ్యే సమస్యలు ఏమిటి? తరగతిలో చర్చించండి.

## పండ్లతోటలు

డోకూర్‌లోని కొంత మంది రైతులకు మామిడి చీనీ తోటలు (బత్తాయి/మోసంబి) ఉన్నాయి. ఈ పంటలకు వరి కంటే తక్కువ నీళ్ళు అవసర–మవుతాయి. వేరుశనగకి అనువైన నేలల్లో వీటిని పండించవచ్చు. ఈ పండ్ల చెట్లతో పాటు రబీ కాలంలో అంతరపంటగా వేరుశనగను సాగు చేస్తారు. ఈ ప్రాంతంలోని పెద్ద రైతులు సాగునీటిని అందించటానికి తుంపర సేద్య విధానాన్ని అవలంబిస్తున్నారు.

SCERT TELANGANA



*చిత్రం 4.5: బిందు సేద్యంతో సాగు చేస్తున్న చీనీ తోట*

## డోకూర్‌లో భూమి వినియోగం 'సుస్థిర'మైనదేనా?

మన భూమి రాబోయే అనేక తరాలపాటు సారవంతంగా ఉండేలా మన భూవినియోగం ఉండాలని పర్యావరణ వాదులు విశ్వసిస్తారు. దీని కోసం మనం సుస్థిర భూవినియోగ విధానాన్ని అనుసరించాలి. అంటే భూసారాన్ని కాపాడుకుంటూ ఉండాలి. భూగర్భ జలాలు పునరుద్ధరింపబడుతుండాలి. అటవీ భూమి, పచ్చిక బీళ్ళు, సాగుభూమి మధ్య సమతౌల్యం ఉండాలి.

- భూసారాన్ని ఎలా పెంచవచ్చు?
- గ్రామంలో పంటల విధానాన్ని రైతులందరూ కలిసి నిర్ణయించటం సాధ్యమేనా?
- పచ్చికబీళ్ళు, అటవీ ఉత్పత్తులను ఎలా పంచుకుంటారు?

## ఇతర జీవనోపాధులు

ఆరు నెలల పాటు మాత్రమే వ్యవసాయ పనులు దొరుకుతాయి. కాబట్టి చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం పట్టణాలు, నగరాలకు వలస వెళుతున్నారు. హైదరాబాదుకే కాకుండా ఇతర రాష్ట్రాలైనా గోవా, మహారాష్ట్రలోని పూనా వంటి ప్రాంతాలకు కూడా వలస వెళ్ళి, మళ్ళీ జూన్‌లో తిరిగి వస్తారు. వ్యవసాయం ద్వారా ఖచ్చితమైన ఆదాయం వస్తుందన్న నమ్మకం లేనందున ఈ గ్రామంలోని రైతులు తమ జీవనోపాధికి వ్యవసాయేతర పనులు కూడా చేపడతారు.

### పశుపోషణ

డోకూర్‌లోని కొంతమంది రైతులు పాడిపశువులను పెంచుతున్నారు. ప్రభుత్వ సహకార సంఘాలకు పాలు అమ్ముతున్నారు. పాలలోని వెన్నశాతం బట్టి దానికి లభించే ధర ఆధారపడి ఉంటుంది. లీటరు పాలకు 35 నుంచి 40 రూపాయలు లభిస్తాయని ఆ రైతులు చెప్పారు. పాలకోసం ఎక్కువగా బర్రెలను పెంచుతారు.

డోకూర్‌లో తక్కువ భూమి ఉన్న సుమారు 20 కుటుంబాలు తమ జీవనోపాధికి ప్రధానంగా గొర్రెల పెంపకంపై ఆధారపడి ఉన్నాయి. వానాకాలంలో గొర్రెలు ఊరి ఉమ్మడి భూముల్లో మేస్తాయి. గొర్రెల కాపరి అయిన నాగరాజు ఇలా చెప్పాడు, "గ్రామం చుట్టు పక్కల ఉన్న రియల్ ఎస్టేటు భూముల్లోనూ,

### భిన్నమైన వ్యవసాయ విధానం

ఈ ప్రాంతంలో నేలలు అంతగా సారవంతమైనవి కావని, వర్షపాతం తక్కువగా ఉండటమే కాకుండా దానిపై ఆధారపడలేమని కూడా చూశాం. అంటే ప్రతి సంవత్సరం వేరుశనగ వంటి పంటను సాగుచెయ్యాలంటే రైతులు రసాయనిక ఎరువులు వాడాలి, బోరుబావులపై ఆధారపడాలి. అయితే మూడవ సమస్య కూడా ఉంది. అది తెగుళ్ళు, పురుగులు సమస్య. వీటిని నియంత్రించటానికి రైతులు ఖరీదైన పురుగు మందులు వాడుతున్నారు. ఈ పద్ధతులను మార్చాలని గత కొద్ది కాలంగా కొంత మంది రైతులు ఆలోచిస్తున్నారు. సమతల (కాంటూరు) కట్టలు వేయటం, సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా భూసారాన్ని పెంచటం ముఖ్యమని వీళ్ళు భావిస్తున్నారు. వాణిజ్య పంటయైన వేరుశనగను ఏకపంటగా సాగుచెయ్యటం కాకుండా పలు ఆహార పంటలను పండించాలంటున్నారు. పాత చెరువులను, నీళ్ళు వచ్చే కాలవలను బాగు చెయ్యటం ద్వారా భూములకు సాగునీరు అందించటానికి ప్రయత్నిస్తున్నారు. పురుగుల నియంత్రణకు వేప కషాయం వంటి సేంద్రియ పద్ధతులను అవలంబిస్తున్నారు. వీటి గురించి మీ అభిప్రాయం, మీ తల్లిదండ్రుల అభిప్రాయం ఏమిటి? ఇంటిలోనూ, తరగతిగదిలోనూ వీటిని చర్చించండి.

SCERT TELANGANA



చిత్రం 4.6: మేస్తున్న గొర్రెలు

దగ్గరలోని మన్యంకొండలోనూ గొర్రెలను మేపుతాం. వేసవిలో గొర్రెలతో పాటు నల్గొండ, మరియు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు వెళ్ళి అక్కడ వాటిని మేపుతాం. మాకు సంవత్సరానికి సుమారు లక్ష రూపాయల ఆదాయం ఉంటుంది."

## ఇతర పనులు

డోకూర్‌లో వ్యవసాయేతర పనుల్లో వడ్రంగం, లోహ పని, రైసుమిల్లు వంటివి ఉన్నాయి. వడ్రంగం పని చేసే రెండు కుంటుంబాలు గ్రామంలో ఉన్నాయి. ఇళ్ళు కట్టుకోటానికి తలుపులు, కిటికీలు, పైకప్పులు వంటివి వీళ్ళు తయారు చేస్తారు. ప్రస్తుతం వీళ్ళు అనేక పనులకు విద్యుత్తు పరికరాలు వాడుతున్నారు. గ్రామంలో వడ్రంగిగా పని చేస్తున్న ప్రభాకర చారి తమకు నెలకు 3000 రూపాయల సంపాదన ఉంటుందని చెప్పాడు. కమ్మరి పని చేసే కుటుంబాలు రెండు, మూడు గ్రామంలో ఉన్నాయి. వ్యవసాయ పరికరాల మరమ్మతుతో పాటు వీళ్ళు వెల్డింగ్ పని కూడా చేస్తారు. ఇవి కాక ఊళ్ళో ఒక రైస్ మిల్ కూడా ఉంది.

ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలు 20 దాకా ఊళ్ళో ఉన్నాయి. డ్రైవర్లుగా పని చేసేవాళ్ళు, వాహనాలు ఉండి వాటిని బాడుగకి నడిపేవాళ్ళు కూడా ఉన్నారు.

## మార్కెటు, రవాణా

పండించిన వరిని దేవరకద్రలోని వ్యవసాయ మార్కెట్లో అమ్ముతారు. పత్తిని జడ్చర్లలోనూ, మదనపురం (వనపర్తి రోడ్డు) లోనూ అమ్ముతారు. గ్రామంలో కొన్ని కాంటాలు ఉన్నాయి. మార్కెట్లలోని కాంటాలు సరిగా ఉండవని చాలా మంది రైతులు వీటినే ఉపయోగిస్తారు. వర్తకులు వాళ్ళ ఇష్టం వచ్చినట్లు ధరలను నిర్ణయించటం రైతులు ఎదుర్కొనే సమస్యలలో ఒకటి. విత్తనాలు రసాయనిక ఎరువులు, పురుగు మందులు కొనటానికి చాలామంది రైతులు వర్తకుల మీద ఆధారపడి ఉన్నారు. కాబట్టి వాళ్ళు చెప్పిన ధరకు తమ పంటను అమ్మక తప్పదు. పంటలు సరిగా పండని సంవత్సరాలలో అప్పులు తిరిగి చెల్లించలేక వ్యాపారస్తులకు రైతులు రుణపడి ఉంటున్నారు, కొంత మంది తమ భూములను కోల్పోతున్నారు.

- వ్యాపారస్తులపై రైతులు ఎందుకు ఆధారపడి ఉన్నారు? ఎటువంటి మార్కెటింగ్ వ్యవస్థ రైతులకు న్యాయం చేకూరుస్తుంది? చర్చించండి.
- గ్రామంలో వ్యవసాయేతర పనులను ఇంకా ఏ రకంగా పెంచవచ్చు?
- మీ గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పథకం ఉందా? దీని వల్ల ఏ కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయి?

చిత్రం 4.7, 4.8, 4.9: కింది వ్యక్తులు చేస్తున్న పనులను గుర్తించి, వాటిని వివరించండి.



చిత్రం 4.7



చిత్రం 4.8



చిత్రం 4.9

SCERT TELANGANA



ఉపయోగించేవాళ్ళు కాదు. కొత్తగా కడుతున్న ఇళ్ళల్లో ఇటుక, ఇనుము, కాంక్రీటు ఉపయోగిస్తున్నారు. దగ్గరలోని క్వారీల నుంచి రాయి, మట్టి తేలికగా దొరుకుతాయి. పేదవాళ్ళ ఇంటి కప్పులు లేదా రేకులతో కప్పి ఉంటాయి. గ్రామంలోని చాలా ఇళ్ళకు విద్యుత్తు సౌకర్యం ఉంది.

గతంలో డోకూర్ గ్రామ ప్రజలు తాగునీటికి బావులపై ఆధారపడే వాళ్ళు. ప్రస్తుతం బోరు పంపులతో నీళ్ళు ట్యాంకులోకి ఎక్కించి తాగునీటిని పంపుల ద్వారా సరఫరా చేస్తున్నారు. రెండు రోజులకు ఒకసారి ఈ మంచి నీళ్ళు వస్తాయి. ప్రభుత్వ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన పంపులు అన్ని ఇళ్ళకు ఉన్నాయి.

## గ్రామ నివాస ప్రాంతం


2011 జనాభా గణన ప్రకారం ఈ గ్రామంలో 570 కుటుంబాలు ఉన్నాయి. మొత్తం జనాభా 3400. ఇందులో వివిధ కులాలకు చెందిన 350 కుటుంబాలకు ఊళ్ళో భూమి ఉంది. మిగిలిన 220 కుటుంబాలు ఈ ఊళ్ళో, చుట్టుపక్కల ఊళ్ళల్లో కూలి పనులపై ఆధారపడి ఉన్నాయి. వీళ్ళకి అర ఎకరం కంటే తక్కువ భూమి ఉంది. వీళ్ళందరూ వ్యవసాయ కూలీలు. వీళ్ళు వలసలు కూడా వెళతారని ఇంతకు ముందు తెలుసుకున్నాం.

భూమి ఉన్న 350 కుటుంబాలలో 30 ఎకరాల భూమి ఉన్న పెద్ద రైతులు ముగ్గురు, నలుగురు ఉన్నారు. అధిక శాతం రైతులకు అరఎకరం నుంచి అయిదు ఎకరాల లోపు భూమి ఉంది. అంటే రైతులలో అధికశాతం చిన్న రైతులే.

గతంలో ఇళ్ళు మట్టి గోడలతో, పెంకుతో వేసిన కప్పులతో ఉండేవి. ఇళ్ళకు కలప అంతగా

## రోడ్లు, అంగళ్ళు

కిరాణా, కోడి మాంసం, కూరగాయలు, పాన్ వంటివి అమ్మే అంగళ్ళు కొన్ని ఊళ్ళో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి డోకూర్ బస్సు సౌకర్యం ఉంది. N.H. 44 కి కలిపే దేవరకద్ర నుంచి వనపర్తికి వెళ్ళే కొన్ని బస్సులు డోకూర్ మీదగా వెళతాయి. గ్రామస్థులలో అధికశాతం షేర్ ఆటోలలో ప్రయాణం చేస్తారు. ఊరికి ఉత్తరం వైపున ఒక రైల్వేస్టేషను ఉంది. అక్కడ మూడు ప్యాసింజరు రైళ్ళు ఆగుతాయి.



చిత్రం 4.12

*చిత్రం 4.10, 4.11, 4.12: మార్కెట్‌లోని కొన్ని దృశ్యాలు*



చిత్రం 4.10



చిత్రం 4.11

SCERT TELANGANA


చిత్రం 4.13



చిత్రం 4.14

*చిత్రం 4.13, 4.14: డోకూర్‌కి వెళ్ళాలంటే ఈ రవాణా సాధనాలు మీకు దోహదం చేస్తాయి.*

**కీలకపదాలు**

| | | |
|---|---|---|
| పీఠభూమి | చెరువు | భూగర్భ జలాలు |
| నేల రకాలు | గొర్రెల పెంపకం | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. కృష్ణా డెల్టా మరియు పీఠభూములలోని బోరు బావులలో నీటి లభ్యతను పోల్చండి.
2. పెనమకూరు, డోకూర్‌లలో పంటల సరళిలో మార్పులను పోల్చండి.
3. డోకూర్ వంటి గ్రామాలలో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందా?
4. ఈ ప్రాంతంలో వర్షపాతం పెరిగితే గ్రామంలో ఎటువంటి మార్పులు వస్తాయి?
5. మీ ఊళ్ళో ఏ ఏ వ్యవసాయేతర పనులు ఉన్నాయి? ఒకదాని గురించి వివరాలు సేకరించండి.
6. కింద పేర్కొన్న వాటి గురించి ఒక వాక్యంలో వివరణ ఇవ్వండి.

| క్రమ సంఖ్య | అంశం | డోకూర్ |
|---|---|---|
| 1. | నేలలు | |
| 2. | నీళ్ళు | |
| 3. | పంటలు | |
| 4. | మార్కెట్ | |
| 5. | పనులు/వృత్తులు | |

7. 32వ పేజీలోని 1వ పేరా "మన భూమి రాబోయే ..... ని చదివి మీ అభిప్రాయం రాయండి.

### ప్రాజెక్టు

భూములను మెట్ట, తరి అని రెండు రకాలుగా విభజిస్తారు. సాంప్రదాయంగా మెట్ట భూములలో సాగునీరు లేకుండా అపరాలను, తరి భూములలో సాగునీటితో వరి పంటను పండించే వాళ్ళు. మీరు గ్రామంలో నివసిస్తున్నట్లయితే మీ ఊళ్ళో నేలలు ఎటువంటివో తెలుసుకొండి. వాటిని మీ ఊళ్ళో ఏమంటారు, ఎలా వివరిస్తారు? నీటిని గ్రహించే గుణం (ఎక్కువ, తక్కువ), నీటిని పట్టి ఉంచే గుణం (ఎక్కువ, తక్కువ), ఇసుక శాతం (ఎక్కువ, తక్కువ) నేల రంగు. డోకూర్‌లో పేర్కొన్న వివిధ రకాల నేలల మధ్య తేడాలను గుర్తించి, వాటిని మీ గ్రామంలోని నేలలతో పోలుస్తూ ఒక పట్టిక తయారుచేయండి.

SCERT TELANGANA

పాఠం

5

# పెనుగోలు - కొండలలోని ఒక గ్రామం

*గత రెండు అధ్యాయాలలో కృష్ణా డెల్టా ప్రాంతంలోని, తెలంగాణా పీఠభూమి ప్రాంతంలోని గ్రామల గురించి తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో మరో భిన్నమైన ప్రాంతం - కొండలలోని గ్రామం గురించి తెలుసుకుందాం. మీరు కొండలపైకి వెళ్ళి ఉండవచ్చు, లేదా అక్కడ నివసిస్తూ ఉండవచ్చు. కొండని చూడండి. అక్కడ ఏం కనపడతాయి? అక్కడి ప్రజలు ఏం చేస్తారు?*




*చిత్రం 5.1:* పెనుగోలు గ్రామం చుట్టు ఉన్న కొండలు

## తూర్పు కనుమలు

దెక్కన్ పీఠభూమిలో తెలంగాణ పీఠభూమి ఒక భాగం. ఈ పీఠభూమికి ఒక మూలన తూర్పు కనుమలు ఉన్నాయి. తెలంగాణలోని కొండలు పశ్చిమ కనుమలలోనివి. అయితే తూర్పు కనుమలు జయశంకర్ జిల్లాకు తూర్పు సరిహద్దున ఉన్నాయి. తెలంగాణ జిల్లాల పటాన్ని చూసి పై ప్రాంతాన్ని గుర్తించండి. ఈ కొండలు ఛత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలోకి విస్తరించి ఉన్నాయి.

కొండలలో ఉండే అధికశాతం ప్రజలు వివిధ గిరిజన తెగలకు చెందిన వాళ్ళు సవర, కొండ దొర, గదబ, గోండు, మన్నె దొర, ముఖ దొర, కోయ. ఈ స్థానిక ప్రజలకు తమదైన ప్రత్యేక సాంస్కృతిక వారసత్వం ఉంది. చాలా మంది అటవీ ఉత్పత్తుల సేకరణ మీద, వేట మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రాంతం వారికి అడవి, అటవీ సంపద గురించిన జ్ఞానం చాలా అపారమైనది, లోతైనది. అయితే ఈ




తెగలు ప్రస్తుతం వాళ్ళ జీవితాలను ఛిద్రం చేసే అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీటిల్లో కొన్నింటిని ఈ అధ్యయంలో తెలుసుకుందాం.

వాజేడు మండలంలో గోదావరి నది తీరంలోని కొండలలో పెనుగోలు ఉంది. (పటం 1 చూడండి). ఇక్కడ కోయతెగ వాళ్ళు నివసిస్తున్నారు. కోయ అంటే "కొండలలో ఉంటున్న మంచి మనిషి' అని అర్థం. వీళ్ళు కోయ భాష మాట్లాడతారు. వీళ్ళు పక్క రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ కొండలలో ఉన్నారు. అయితే, చాలా మంది కోయలు కొండల నుంచి వలస వెళ్ళిపోయి ఆదిలాబాదు, కరీంనగర్, వరంగల్, తూర్పు గోదావరిలోని కొన్ని ప్రాంతాలలో స్థిరపడ్డారు. ఇటువంటి వాళ్ళు ఇప్పుడు కోయ భాష మాట్లాడరు. తెలుగునే తమ భాషగా చేసుకున్నారు.

ఈ గ్రామానికి చుట్టూ గుట్టలు ఉన్నాయి. ఉత్తరాన ఛత్తీస్‌గఢ్‌లో కర్రెగుట్ట లేదా నల్లగుట్ట, దక్షిణాన వంక మామిడి గుట్ట, తూర్పున కల్లు కుంటల గుట్ట, పడమరన చిన్న కుమ్మరి లంక, పెద్దకుమ్మరి లంక ఉన్నాయి. పై పటంలో ఈ గుట్టలను చూపించండి.

వాజేడు మండలం ఉత్తరాన నల్లగుట్ట నుంచి ప్రవహించే నల్లందేవి వాగు, గోదావరి నదిని కలిసే ప్రాంతంలో ఉంది. వాజేడు కొండల నుంచి దిగువున ఉన్న గుమ్మడి దొడ్డె గ్రామం చేరుకున్నాం. ఇక్కడి నుంచి ఒక కాలిబాట కొండలపైకి వెళుతుంది. ఈ బాట చాలా ఏటవాలుగా, సన్నగా, జారుతూ ఉంది. ఎవరైన పొరపాటున కాలు జారితే కింద లోయలో పడతారు. దారిలో చీకుపల్లి దగ్గర ప్రఖ్యాత బొగతా జలపాతం చూశాం. పైకి ఎక్కుతున్న క్రమంలో దట్టమైన అడవులు, చెట్లు నరికి శుభ్రం చేసిన భూములు కనిపించాయి. ఇలా ఖాళీ చేసిన భూములు కొండలలో అక్కడక్కడ ఉన్నాయి. ఎర్రనేలతో వాలుగా ఉన్న ఈ భూములు అంత సారవంతమైనవి కావు. ఆ పొలం నిండా పెద్ద, చిన్న రాళ్ళు చాలా ఉన్నాయి. మండల కేంద్రమైన వాజేడుకి ఇది 20 కిలోమీటర్ల దూరంలో ఉంది.



*చిత్రం 5.2: బొగతా జలపాతం*

SCERT TELANGANA



*చిత్రం 5.3: అడవి దగ్గర ఉన్న ఒక చేను*

## పోడు

కోయలు పోడు అనే ప్రత్యేక పద్ధతిలో పంటలు సాగు చేస్తారు. కొండలలో వ్యవసాయం చేసే ప్రత్యేకమైన విధానం ఇది. దీనినే "ఝూమ్"సాగు అని కూడా అంటారు. కొండ రెడ్డి వంటి ఇతర తెగలు కూడా ఈ పద్ధతిని ఆచరిస్తాయి. ఈ పద్ధతి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో కూడా ఉంది.

ప్రతి గ్రామానికి వాళ్ళు వ్యవసాయానికి ఉపయోగించుకోటానికి నిర్దిష్ట కొండలు, ప్రాంతం ఉంటాయి. ఈ ప్రాంతం లోపల వాళ్ళు కొంత అడవిని నరికి తగలబెడతారు. కొన్ని సంవత్స-రాలపాటు ఈ భూమిలో వ్యవసాయం చేస్తారు. ఆ తరువాత దానిని వదిలిపెట్టి మళ్ళీ అడవి పెరగనిస్తారు. ఈ లోగా వాళ్ళు అడవిలోని ఇంకో ప్రాంతంలో చెట్లు నరికి అక్కడ వ్యవసాయం చేస్తారు. ఈ విధంగా వాళ్ళ సాగుభూమి ప్రతి కొన్ని సంవత్సరాలకు మారుతూ ఉంటుంది, ఒకసారి సాగు చేసిన భూమికి చాలా సంవత్సరాల తరువాత మళ్ళీ తిరిగి వస్తారు.

కొండలలో నవంబర్‌లో వానలు ఆగిపోతాయి. కోయలు డిసెంబరు నెలలో గొడ్డళ్ళతో కొంత ప్రాంతంలో చెట్లు నరుకుతారు. కొట్టిన చెట్ల కొమ్మలు కొన్ని నెలలపాటు ఎండనిస్తారు. ఈ ఎండిన కొమ్మలను వానలకు ముందు ఏప్రిల్ లేదా మే నెలలో తగలబెడతారు. వానలు పడే సమయానికి నేల బూడిదతో కప్పి ఉంటుంది. జూన్‌లో వానలు పడినప్పుడు కట్టెలతో పొడిచి విత్తులు విత్తుతారు. ఈ విధంగా వాళ్ళు అనేక రకాల పంట విత్తనాలు కలిపి చల్లుతారు. వాళ్ళు నాగలిగాని, పారగాని ఉపయోగించరు. ఎటువంటి రసాయనిక ఎరువులు ఉపయోగించరు.

నేలను దున్నితే మట్టి వదులయి, వానలు పడినప్పుడు పైమట్టి తేలికగా కొట్టుకుపోతుంది. కాబట్టి నేలను దున్నరు. పైమట్టి కొట్టుకుపోతే నేల సారాన్ని కోల్పోతుంది. బూడిద, రాలిన ఆకులతో పై మట్టి సారవంతంగా ఉంటుంది. కాబట్టి అది కొట్టుకు



*చిత్రం 5.4: కట్టెతో పొడిచి విత్తులు విత్తటం, 1940ల నాటి ఫొటో*

SCERT TELANGANA

పోకుండా కాపాడాలని రైతులు ప్రయత్నిస్తారు. వీళ్ళు పండించే ముఖ్యమైన పంటలు : జొన్నలు, మొక్క జొన్నలు, దుంపలు; చిరుధాన్యాలు (సామలు, కొర్రలు, పప్పు (*sode*), అడుసులు)నువ్వులు; కందులు, పెసర్లు వంటి అపరాలు; వంకాయ, పచ్చిమిరప, గోంగూర వంటి కూరగాయలు. ఎటువంటి సాగునీరు లేకుండా మిశ్రమ పంటలు పండిస్తారు. వాళ్ళు పండించే పంటలు సాధారణంగా ఆరు నెలల వరకు ఆహారంగా సరిపోతాయి.

ఈ పొలాలు అడవి పక్కన ఉంటాయి. కాబట్టి అందులోని జంతువులు, పక్షులు పంటల మీద దాడి చేస్తాయి. కోయలు పొలాల్లో మంచెకట్టి డిసెంబరు వరకు పంటను కాపాడుకుంటారు.

కొంతకాలం ఒక పొలాన్ని సాగుచేసిన తరువాత మరొక పొలానికి వెళతారని చూశాం. పాత రోజుల్లో సగటున ప్రతి కుటుంబం 2-2.5 ఎకరాల అటవీ భూమిని సాగు చేసేది. పోడు పద్ధతిలో జొన్న సగటున ఎకరానికి 250 కిలోల దిగుబడిని ఇస్తుంది. అంటే ప్రతి కుటుంబానికి 600 కిలోల జొన్నలతో పాటు 150-250 కిలోల చిరుధాన్యాలు లభించేవి. గతంలో కొండలలో ఎక్కువ విస్తీర్ణం పోడుకు లభించింది. కాని ప్రస్తుతం 1-1.5 ఎకరాలు మాత్రమే ఉంది. దాంతో ప్రతి కుటుంబానికి అందే ఆహారధాన్యాలు తగ్గి-పోయాయి. అటవీ విస్తీర్ణం తగ్గిపోవటం వల్ల పోడు చేసి వదిలిపెట్టిన ఒక ప్రాంతానికి గతంలో కంటే త్వరగా తిరిగి రావలసి వస్తోంది. ఈ సమయం తగ్గిపోవటం వల్ల నేల గతంలో మాదిరి తన సారాన్ని పూర్తిగా తిరిగి పొందలేక పోతోంది.

- ఇటీవల కాలంలో పోడు విస్తీర్ణం తగ్గటానికి కారణాలు ఏమిటి?
- కొండవాలుల్లో పంటలు సాగు చెయ్యటానికి ఇతర పద్ధతులు మీకు తెలుసా?
- పంటల ఎదుగుదలకు బూడిద ఏ విధంగా సహాయపడుతుంది?
- మీ ప్రాంతంలో కూడా పంటలపై అడవి జంతువులు దాడి చేస్తాయా? అటువంటప్పుడు పంటల రక్షణకు ప్రజలు ఏం చేస్తారు?

## పెరటిలో కూరగాయల తోట

ఈ గ్రామంలో ఇళ్ళ చుట్టు వెదురు కంచెలు ఉన్నాయని దూరం నుంచే గమనించాం. వ్యవసాయ భూములు వాలుగా, రాళ్ళతో ఉన్నాయి కానీ ఇంటి చుట్టూ ఉన్న స్థలం చదును చేసి ఉంది. ఇంటి చుట్టు ఉన్న ఈ స్థలంలో కూరగాయలు పండిస్తారు. ఈ తక్కువ విస్తీర్ణంలోనే చిక్కుళ్ళు, బీర, సొరవంటి తీగ జాతి కూరలు, మిరప వంటివి సాగు చేస్తారు. కంచెపై గుమ్మడి తీగలు వంటివి ఉన్నాయి. కొంతమంది ఈ పెరట్లో కోళ్ళను కూడా పెంచుతారు. మరి కొంత మంది మేకలు, గొర్రెలు, పశువులు, కుక్కలు వంటివి పెంచుతారు.



*చిత్రం 5.5.: ఇల్లు, ఇంటి చుట్టూ కూరగాయల తోట, దడి*

SCERT TELANGANA



చిత్రం 5.6: పశువులను మేపటానికి తీసుకెళ్తున్న రైతులు

## కలపేతర అటవీ ఉత్పత్తులు

గ్రామస్తులతో మాట్లాడినప్పుడు చేలు, పెరటి దొడ్డిలో పండే ఆహార ధాన్యాలు, కూరగాయలు కుటుంబ అవసరాలకు సంవత్సరమంతా సరిపోవని తెలిసింది. కాబట్టి వాళ్ళ జీవనోపాధిలో అటవీ ఉత్పత్తుల సేకరణ, వేట ముఖ్య భాగం అయ్యాయి. అడవులు గొప్ప బాంఢాగారాలు వంటివి. వందల ఏళ్ల సహజీవనంలో అడవిలో దొరికే అనేక రకాల ఆహారాలను, మూలికలను గుర్తించారు. ఈ గ్రామంలోని ప్రజలు సంవత్సరం పొడవునా అడవిపై ఆధారపడి బతుకుతారు. గిరిజనుల కాలమానిని (క్యాలెండరు) రకరకాల పళ్ళు, దుంపలు ఆకులు చిన్న జంతువుల వేటకి సంబంధించిన కాలాలతో నిండి ఉంటుంది. మనుషులకు గానీ, పశువులకు గానీ జబ్బు చేసినప్పుడు అడవిలోని మూలికలకు సంబంధించిన జ్ఞానంతో వాళ్ళు చికిత్స చేసుకుంటారు.

పంటకోతకి కొన్ని నెలలు ముందు, తరువాత తప్పించి గిరిజన మహిళలు, పిల్లలు అడవి నుంచి ఆహార ఉత్పత్తుల సేకరణలో మునిగి ఉంటారు. అడవి నుంచి సేకరించే తేనె, వెదురు చిగుళ్ళు రెండు ముఖ్యమైన ఆహార వనరులు. ఒక్క వెదురుతో చేసిన నిచ్చెనతో చెట్లు ఎక్కి తేనె సేకరిస్తారు. లేత వెదురు చిగుళ్ళను కరి కొమ్ములు అంటారు, వీటిని వెదురు పొదల చివర్ల నుంచి సేకరిస్తారు. పై పొర తీసేసిన తరువాత ఈ చిగుర్లను వండుతారు. ఇది చాలా రుచికరమైన వంట. ఈ కుటుంబాలకు మరొక ముఖ్యమైన ఆహారం ప్రత్యేకించి వేసవిలో తాటికల్లు. కుటుంబ సభ్యులందరూ కలిసి చేలల్లో, అడవిలో, వేటలో కలిసి పని చేస్తారు. వ్యవసాయం, పశుపోషణలో ఎక్కువ పనులు మగవాళ్ళు చేస్తారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, బుట్టలు అల్లటం వంటి పనులు ఆడవాళ్ళు, పిల్లలు చేస్తారు.

కొన్ని అటవీ ఉత్పత్తులను వారం వారం జరిగే సంతలలో అమ్ముతారు. ఉదాహరణకు ఈ సంతలలో ప్రధానంగా ఇప్ప గింజలు అమ్ముతారు. ఈ సరుకులు అమ్మటం ద్వారా వచ్చిన డబ్బుతో వాళ్ళు బట్టలు, ఇతర అవసరమైన వస్తువులు కొనుక్కుంటారు.

- మీరు ఏఏ అటవీ ఉత్పత్తులు తింటారు? ఒక జాబితా తయారు చెయ్యండి.
- అడవిలో ఏమైన ఆహార ఉత్పత్తులు మీరు సేకరించారా? సేకరించినట్లయితే మీ అనుభవాలను పేర్కొనండి.

## తాగు నీళ్ళు

ఈ గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీర్చే ఎన్నో సహజ నీటి ఊటలు ఉన్నాయి. ఇవి కాక కొండల నుంచి ప్రవహించి శబరి లేదా గోదావరి నదిలో కలిసే ఎన్నో వాగులు ఉన్నాయి. రాళ్ళు ఉండటం వల్ల కొండలలో బావులు తవ్వటం చాలా కష్టం నీటి ఊటలలో సంవత్సరం పొడవునా నీళ్ళు లభిస్తాయి,

SCERT TELANGANA

కొన్ని వేసవిలో ఎండిపోతాయి. వానలు అయిపోయిన తరువాత కొన్ని నెలల పాటు వాగులు ప్రవహిస్తాయి. నీటికోసం గ్రామస్తులు 30 నిమిషాలు నడిచి వెళ్ళాల్సి ఉంటుంది.



చిత్రం 5.7: ఊట నుంచి నీళ్ళు తీసుకెళుతున్న ప్రజలు

## వెదురు

ఇంతకు ముందు తెలుసుకున్నట్టు అడవిలో వెదురు దండిగా దొరుకుతుంది. అది వాళ్ళకు ఆహారంగానే కాకుండా ఇళ్ళు, దడులు కట్టుకోటానికి ఉపయోగ పడుతుంది. వెదురుతోటి బుట్టలు, చాటలు, కోళ్ళ గంపలు వంటివి అల్లి సంతలలో అమ్ముతారు. అడవి నుంచి వెదురు సేకరించే హక్కు పేపరు మిల్లులకు కూడా ఉంది. వెదురు కొట్టించి మిల్లులకు సరఫరా చేసే ఏజెంట్లు ఉంటారు. దీని ద్వారా వాళ్ళు కొంత కూలీ పొందుతారు. మొదట్లో దీనికి చాలా తక్కువ కూలీ లభించేది గత కొద్ది సంవత్సరాలలో ఇది మెల్లగా పెరిగింది. పంటలు అయిపోయిన తరువాత వెదురు కొట్టే పనికి వెళతారు. ఈ పనిద్వారా రోజుకి 150 రూపాయలు సంపాదిస్తారు.

- వెదురును పేపరుమిల్లు ఉపయోగించుకోటానికీ, గిరిజనులు తమ జీవితంలో ఉపయోగించుకోవటానికీ మధ్య తేడాలు చర్చించండి.

## ఇళ్ళు, నివాస ప్రాంతాలు

వెదురు, మట్టి, గడ్డితో ఇళ్ళు కట్టుకుంటారని చూశాం. ఇంటి చుట్టూతా పశువులకు, కూరగాయలు పెంచటానికి స్థలం ఉంటుంది. ఇంటి చుట్టూ ఉండే కంచె పశువులకు, కూరగాయ మొక్కలకు రక్షణగా ఉంటుంది. ఇంటికీ, ఇంటికీ మధ్య కొంచెం దూరం ఉంటుంది.

పెనుగోలులో ఇళ్ళు గుట్టలపైన ఉంటాయి. ఇక్కడ మొత్తం 32 కుటుంబాలు ఉన్నాయి. 124 మంది ఉన్నారు. ఈ నివాస ప్రాంతాలు శాశ్వతమైనవి కావు. ఏవైనా అంటురోగాలు ప్రబలినా, ఇతర కారణాల వల్లా ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టి మరొక చోట ఇళ్ళు కట్టుకుంటారు.

- పీఠభూమిలోను, కొండలలో ఉండే నివాస ప్రాంతాలలో పోలికలు, తేడాలు ఏమిటి?

## ఆచారాలు

ఈ గ్రామస్తులు ప్రకృతి దేవతలను పూజిస్తారు. కాలంలో మార్పులకు అనుగుణంగా పండగలు ఉంటాయి. చింత చెట్టు కింద ఉండే ముత్యాలమ్మ రాతి విగ్రహాన్ని పూజిస్తారు. ఎల్లనంపదం (భూమి పూజ), కొడతల పండగ (పెద్దల పండగ), భీమిని



చిత్రం 5.8: వెదురు, గడ్డితో చేసిన గుడిసె

SCERT TELANGANA

పండగ (ఇప్ప పువ్వు పండగ) వంటి పండుగలు జరుపు-కుంటారు. సెప్టెంబరులో కొడతల పండగ చేస్తారు. తమ దేవుడికి కూరలు పెట్టిన తరువాత వాటిని తింటారు. విత్తటం, కొయ్యటం, అడవి నుంచి వేళ్ళు సేకరించటం వంటి ముఖ్యమైన పనులన్నీ పండగ చేసిన తరువాతే మొదలవుతాయి. ఈ పండగలలో వేరు వేరు ప్రాంతాలలో నివసిస్తున్న తెగ సభ్యులందరూ సమావేశం అవుతారు.



చిత్రం 5.9: గమను-పూజలు చేసే చోటు

## కోయల భవిష్యత్తు

ఈ కొండ తెగలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. అయితే వీళ్ళు చాలా పురాతన కాలం నుంచి తమ జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. వాళ్ళు జీవన విధానాన్ని కొనసాగించే హక్కు వాళ్ళకు ఉంది. ఆధునిక వ్యవసాయం లాగా వాళ్ళు ప్రకృతిని విధ్వంసం చెయ్యరు. వ్యవసాయం కోసం వాళ్ళు అడవిని నరికే ప్రాంతం కొన్ని సంవత్సరాల తరువాత పునరుద్ధరింపబడేలా వాళ్ళు జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే, ప్రస్తుతం వాళ్ళకు చాలా తక్కువ అటవీ ప్రాంతం అందుబాటులో ఉన్నందు వల్ల వాళ్ళ జీవన విధానం దెబ్బతినే ప్రమాదం ఉంది. చెట్లను కొట్టివేస్తూ ఉండటం వల్ల, పేపరు మిల్లులకు ప్రతిరోజు పెద్ద మొత్తంలో కావలసిన వెదురు వల్ల అడవులు క్రమేపీ అంతరించి పోతున్నాయి. చాలా కాలంగా వాళ్ళ జీవనోపాధులు ప్రమాధకర స్థితిలో ఉన్నాయి. పోడు వ్యవసాయాన్ని ఆపటానికి అటవీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

- పీఠభూమి ప్రాంతంలో వ్యవసాయ సుస్థిరత గురించి తెలుసుకున్నారు. ఈ మూడు గ్రామాలలోని ప్రజలు అవలంబిస్తున్న జీవనోపాధుల సుస్థిరతను పోల్చండి.
- తమ జీవన విధానం పై కోయ ప్రజలకు హక్కు ఉండేలా చెయ్యటానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి?

అటవీ పర్యావరణం గురించి, అడవిలో దొరికే పళ్ళ గురించి వాళ్ళకు అపార జ్ఞానముంది. ఈ ప్రజల అవసరాలు చాలా తక్కువ. వాళ్ళు ఉండే అడవులు అపార సంపద కలిగి ఉన్నాయి అని తెలుసుకుంటే వాళ్ళు ప్రకృతిలో ఎంతో సామరస్యంతో జీవిస్తున్నారని అర్థమవుతుంది. అలా జీవించే హక్కు వాళ్ళకు ఉండకూడదా?

ఈ గ్రామంలో బడి, ఇతర సౌకర్యాలు వంటివి, చాలా తక్కువ. ఇక్కడ ఒక గిరిజన ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉంది. ఉన్నత పాఠశాల, ఆసుపత్రి సౌకర్యం కోసం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రం వాజేడు దాకా వెళ్ళవలసిందే.

SCERT TELANGANA



*చిత్రం 5.10: పెనుగోలు గ్రామానికి వెళ్ళేదారి*

**కీలకపదాలు**

పోడు     తెగ     వెదురు     పెరటితోట     అటవీ ఉత్పత్తులు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. తమ చుట్టు పక్కల ఉన్న అడవులపై కోయలు ఏ విధంగా ఆధారపడి ఉన్నారు?
2. కొండ ప్రాంతంలో వివిధ జీవనోపాధులను పేర్కొనండి.
3. కోయలు పంటలు పండించటానికి ఒక చోటు నుంచీ ఇంకొక చోటుకి ఎందుకు మారతారు?
4. మీరు తెలుసుకున్న మూడు గ్రామాలలోని భూముల మధ్య తేడాలను, పోలికలను పేర్కొనండి.
5. గత మూడు అధ్యాయాలలోని ఉపశీర్షికలు చదవండి. ఈ మూడు గ్రామాలలోని వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని కింది పట్టికలో నింపండి. (అవసరమైతే మరిన్ని అడ్డ వరసలు చేర్చండి, ఆ అంశం ఒక ఊరిలో లేకపోతే 'సమాచారం లేదు' అని రాయండి)

| ఉపశీర్షిక/శీర్షిక | కొండల మీది గ్రామం | పీఠభూమి ప్రాంత గ్రామం | మైదాన ప్రాంత గ్రామం |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |
| | | | |

6. మీ ఊరు/పట్టణం ఇప్పుడు ......... రకం నేల రూపంలో ఉంది. ఇందుకు భిన్నమైన నేల రూపంలోని మీ ఊరు ఉందని ఊహించుకుని దాని గురించి రాయండి.

చర్చ : చెట్లు లేకపోతే ఏమవుతుంది? దాని ప్రభావం, మన బాధ్యతను చర్చించండి.

పాఠం
6


# ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తివరకు - ఆదిమానవులు

SCERT TELANGANA

మీరు తినే ఆహారాన్ని మీ కుటుంబం ఎలా సమకూర్చుకుంటుందో మీకు తెలుసా? ఆహార ఉత్పత్తి ఎలా అవుతుందో, అందుకు ఎలాంటి పరికరాలను ఉపయోగిస్తున్నారో, ఆ పరికరాలను ఎవరు కనుగొన్నారో తెలుసా?

ఎలాంటి ఆహారపంటలను పండించకుండా కేవలం ప్రకృతిలో లభ్యమయ్యే ఆహారాన్ని తింటూ జీవించే ప్రజల జీవన విధానాన్ని మీరు ఊహించగలరా ?

కొన్ని వేల సంవత్సరాల క్రితం జీవించిన మానవుల జీవన విధానాన్ని తెలుసుకోవటానికి ఈ కింది చిత్రాలను పరిశీలించండి.



చిత్రం 6.1: ఆదిమానవుల జీవన విధానం



చిత్రం 6.2: ఆదిమానవులు – ఆహార సేకరణ

- పై చిత్రాల్లో మానవులు ఆహారాన్ని ఎలా సేకరిస్తున్నారు?
- వారు ఎటువంటి దుస్తులను వేసుకున్నారు?
- పై చిత్రాల్లో 5 లేదా 6 రకాల పనిముట్లు, ఆయుధాలు ఉన్నాయి. వాటిని గుర్తు పట్టగలరా?
- 6.2వ చిత్రంలో అడవి నుంచి స్త్రీ, పురుషులు ఏమి తెస్తున్నారో చెప్పండి.
- వారు ఎటువంటి పనులను చేస్తున్నారో వివరించండి.

## ఆహార సేకరణ, వేట

కొన్ని వేల సంవత్సరాల క్రితం మానవులు అడవులలో ప్రకృతి సిద్ధంగా దొరికే ఫలాలు, పుష్పాలు, తేనె, గింజలు, దుంపలు, వేర్లను సేకరించేవారు. వాటితో పాటు పక్షులను, జంతువులను వేటాడుతూ జీవనాన్ని గడిపేవారు. వారికి పంటలను పండించడం, జంతువులను మచ్చిక చేసుకోవటం తెలియదు.

- మీరు తినే ఆహారంలో పండించినవి కాకుండా అడవుల నుంచి ప్రకృతి సిద్ధంగా దొరికే వాటి జాబితాను సిద్ధం చేయండి. తినటానికి వీలుగా వాటిని ఎలా తయారు చేసుకుంటారు?

మిమ్మల్ని అడవికి పంపితే అక్కడ తినదగిన ఆహారం ఏమి లభిస్తుందో కనుక్కోగలరా? ఈ విషయం తెలియాలంటే ఏ ఫలాలు తినవచ్చో, అవి ఏ కాలంలో పండుతాయో మీకు తెలిసి ఉండాలి. వాటిని ఎలా తినాలో, పచ్చిగా తినాలా, ఉడికించి తినాలా, నూరి తినాలా, మరికొన్ని పదార్థాలతో కలిపి రుబ్బి తినాలా, నీటిలో నానబెట్టి తినాలా అనే విషయాలను మీరు తెలుసుకోవాలి.

వేటాడటానికి ఆ ప్రాంతంలో సంచరించే జంతువుల అలవాట్లు, జీవన విధానం గురించి వేటగాళ్ళు తెలుసుకునే వారు. నీటి కొరకు జంతువులు ఏప్రాంతానికి వస్తున్నాయో గమనించేవారు. అవి ప్రమాదకరమైనవా, కావా, వాటి శరీర భాగాల ఉపయోగాలు తెలుసుకునే వారు. ఆదిమానవులు ఈ విషయాలను వారి పూర్వీకుల ద్వారా తెలుసుకొని తమ సంతతికి తెలియచేసేవారు.



SCERT TELANGANA

- నేటి మానవులు, ఆదిమానవుల ఆహార అలవాట్లలోని భేదాలు, పోలికలను ఊహించి రాయండి.
- ఆదిమానవులు ఏ విధమైన దుస్తులు వేసుకొనే వారో మీకు తెలుసా?

## రాతి పనిముట్లు

నేడు మనం యంత్రాలను, ట్రాక్టర్లను, ఉక్కు పనిముట్లను ఉపయోగిస్తున్నాం. ఆదిమానవులు రాళ్ళు, ఎముకలు, కొయ్యతో చేసిన పనిముట్లను ఉపయోగించేవారు. పెద్దరాళ్ళను జాగ్రత్తగా వేరొక రాయితో కొట్టి నునుపుగా, పదునుగా చేసి పనిముట్లు తయారు చేసుకొనేవారు. ఈ పెద్దరాతి పనిముట్లు మాంసం కోయటానికి, భూమిలోనుంచి దుంపలను తవ్వటానికి, జంతువులను వేటాడడానికి ఉపయోగపడేవి.

కొన్ని వేల సంవత్సరాల తర్వాత వారు ముడిరాతి నుంచి నునుపుగా, అనువుగా ఉండేలా చిన్న రాతి పనిముట్లను తయారుచేయటం మొదలు పెట్టారు. ఇలాంటి పనిముట్లను 'సూక్ష్మ రాతి పరికరాలు' అనేవారు. వీటికి కొయ్య లేదా ఎముక పిడిని బిగించి వాటిని కత్తులు, బాణాలు, కొడవళ్ళ లాగా ఉపయోగించేవారు. ఈ పరికరాలు నేలలో గోతులు తవ్వటానికి, చెట్లను నరకటానికి, బెరడు తీయటానికి, జంతువుల చర్మం తీయడానికి, వాటిని శుభ్రం చేసి దుస్తులుగా కుట్టుకోవడానికి, మాంసం, ఎముకలను కోయటానికి, వేర్లు, పండ్లు కోయటానికి, జంతువులను వేటాడటానికి ఉపయోగపడేవి.



*చిత్రం 6.3: రాతి పనిముట్ల తయారీలో ఒక విధానాన్ని వివరించే చిత్రం*




*చిత్రం 6.8 (ఎ & బి): పురాతన రాతి గొడ్డలి, సూక్ష్మ రాతి పరికరాలు – రాతి కొడవలి*





*చిత్రం 6.4 (ఎ, బి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాదులో పెద్ద మొత్తంలో బయల్పడిన పురాతన పనిముట్లు*



*చిత్రం 6.5: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో బయల్పడిన రాతి పలకల నుంచి తయారు చేసిన పనిముట్లు*



*చిత్రం 6.6: నల్గొండ జిల్లా ఏలేశ్వరంలో బయల్పడిన రాతి నుంచి చెక్కిన బ్లేడ్లు*



*చిత్రం 6.7: ఆదిలాబాద్ జిల్లా ఘనపూర్‌లో బయల్పడిన సూక్ష్మ రాతి పరికరాలు*

SCERT TELANGANA

ఆనాటి రాతిపనిముట్లు లభ్యమైన ప్రాంతాల ద్వారా, రాతిపనిముట్లను అధ్యయనం చేయడం ద్వారా ఆదిమానవుల జీవనవిధానాల గురించి తెలుసుకోగలం.

- నేటి ప్రజలు రాళ్ళను ఏయే పనులకు ఉపయోగిస్తున్నారు?

## నిప్పు

నిప్పును కనుక్కోవడంతో ఆదిమానవుల జీవితంలో గొప్ప మార్పు చోటు చేసుకుంది. బహుశా వారు రెండు రాళ్ల మధ్య లేదా ఎండుపుల్లల మధ్య రాపిడి చేసి నిప్పును పుట్టించి వుంటారు. వారు ఆహారంగా తీసుకొనే పచ్చి మాంసాన్ని ఆ నిప్పుతో కాల్చి తినటానికి వీలుపడింది. వండుకొని తినే ఆహారానికి ఇది నాంది పలికింది. ఆ నిప్పును అనేక రకాలుగా ఉపయోగించుకొనే వారు. క్రూరమృగాలను తరిమేయటానికి, తాము నివసించే గుహలలో వెలుగు నింపటానికి ఉపయోగించేవారు. చెక్కను గట్టిపరిచి ఉపయోగించటానికి దానిని నిప్పుపై వేడి చేసేవారు.

- నేడు మనమందరం నిప్పును దేనికి ఉపయోగిస్తున్నాం?
- ఆది మానవుల జీవిత అనుభవాన్ని పొందటానికి చెకుముకి రాళ్ళను ఉపయోగించి రాపిడితో నిప్పును పుట్టించి వాటి కింద పత్తిని కానీ లేదా ఎండుటాకులను కానీ ఉంచి మండించండి.

## సంచార జీవనం

ఆదిమానవులు చిన్న చిన్న గుంపులుగా గుహలలో, చెట్లు లేదా రాళ్ళ నీడలో నివసించేవారు. ఇళ్ళను నిర్మించుకొనే వారు కాదు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి పోతూ సంచారజీవనం గడిపేవారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నిరంతరం సంచరించే వారిని 'సంచార జీవులు' అని అంటారు.

- ఏయే కారణాల వల్ల ఆదిమానవులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచరించేవారో మీరు ఊహించగలరా?
  - ఒక గుంపు ప్రజలు ఒక ప్రాంతంలోని పండ్లను లేదా జంతువులను పూర్తిగా ఉపయోగించుకుంటే ఏమి జరుగుతుంది?
  - జంతువులు ఒకే ప్రాంతంలో నివసిస్తాయా? లేదా అవి సంచార జీవితం గడుపుతాయా?
  - సంవత్సరం పొడవునా ఒకే ప్రాంతంలో నీరు దొరుకుతుందా?
- ఇప్పటికీ చాలా మంది ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారుతూ ఉన్నారు. అలా మారేటప్పుడు వారు ఏ ఏ వస్తువులను తమతో తీసుకు వెళుతుంటారు?
- ఆదిమానవులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస వెళ్లేటప్పుడు తమతో ఏ వస్తువులను తీసుకు వెళ్లేవారు?
- నేడు మానవులు సంచార జీవితం గడపక ఇళ్ళు నిర్మించుకొని అక్కడే నివసించడానికి గల కారణాలేవి?



*చిత్రం 6.9: పాండవులగుట్ట (రేగొండ, జయశంకర్ జిల్లా) గుహలోని చిత్రాలు*

SCERT TELANGANA

**చిత్రకళ**

వివిధ ప్రాంతాలలోని గుహల గోడలపై, రాతిస్థావరాలపై ఆదిమానవులు జంతువులను, వారు వేటాడే సంఘటనలనూ చిత్రించారు. వారు కొన్ని రకాల రంగు రాళ్ళను పిండి చేసి, జంతువుల కొవ్వును కలిపి చిత్రాలు వేయటానికి అవసరమైన రంగులను తయారు చేసుకొనేవారు. చిత్రించటానికి వెదురు కుంచెలను ఉపయోగించేవారు. బహుశా వారు ఇలా చిత్రించటానికి మతపరమైన ప్రాముఖ్యత ఉండి ఉండవచ్చు.

- మీ ప్రాంతంలోని ప్రజలు వివిధ పర్వదినాల ప్రాముఖ్యతను చిత్రాలద్వారా, ముగ్గులద్వారా తెలియచేస్తారా?

## తెలంగాణలో రాతియుగపు – స్థావరాలు


తొలి రాతియుగానికి చెందిన పూర్వచారిత్రక కాలంనాటి మానవులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నివసించారు. వారు తయారుచేసిన రాతి పనిముట్లు దాదాపు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో బయల్పడ్డాయి. అవి జయశంకర్ జిల్లాలో ఎక్కల, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమరాబాద్, నల్గొండ జిల్లాలోని ఏలేశ్వరం, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు, నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, సంగారెడ్డి జిల్లాలోని మంజీర లోయ, భద్రాద్రి జిల్లాలోని చర్ల.

- ఉపాధ్యాయుల సహాయంతో మీ జిల్లాలో వున్న రాతియుగపు స్థావరాన్ని దర్శించండి. మీ సమీప పట్టణంలో వున్న మ్యూజియంలోని రాతి పనిముట్లను చూడండి.

### సూక్ష్మరాతి, రాతి చిత్రకళా స్థావరాలు

పూర్వ చారిత్రక కాలం నాటి తెలంగాణ ప్రజలు పెద్ద సంఖ్యలో వారి సూక్ష్మరాతి పరికరాలను, చిత్రాలను ఇక్కడ వదిలివెళ్ళారు. ఇటువంటి చిత్రాలు వరంగల్ జిల్లా తిరుమలగిరి గ్రామంలోని పాండవుల గుట్టలో గల రాతిగుహల గోడలపై కనుగొనబడ్డాయి. ఈ రాతి చిత్రకళ ప్రపంచంలోనే తెలంగాణకు ఒక విశిష్ట గుర్తింపు తెచ్చాయి. పూర్వ చారిత్రక యుగం నుండి కాకతీయులు లేదా పద్మనాయక రాజుల కాలం వరకు ఈ చిత్రకళ ఒక ప్రత్యేకతను కలిగి ఉంది.

- పటం 6.9లో పాండవుల గుట్ట గుహలలోని చిత్రాలను పరిశీలించండి. ఏమి గమనించారు? చిత్రాల గురించి వర్ణించండి. వాటిలో ఆదివాసులు గీసిన చిత్రాలను గమనించారా? పాత చిత్రాల మీదనే వాటిని ఎందుకు గీసి ఉంటారు?




*చిత్రం 6.10: ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం, రామచంద్రాపురంలో గల నీలాద్రి గుట్టల్లోని రాతి స్థావరం*

SCERT TELANGANA

- చిత్రం యొక్క రంగు ఏమిటి? ఈ చిత్రాలను గీయటానికి రంగులు మరియు కుంచెలు తయారుచేసుకోడానికి ఏ వస్తువులను ఉపయోగించి ఉంటారో కనుక్కోగలరా?
- క్రింద ఇవ్వబడిన పటంలో మీ జిల్లాలోని రాతి చిత్రకళా స్థావరాన్ని గుర్తించండి.

రాతి చిత్రకళలలో వేట, పోరాడుతున్న సన్నివేశాలు, తేనె సేకరణ, నృత్యం మరియు సంగీతం మొదలైనవి చూపించారు. ఎద్దు, బర్రె, మూపురం ఎద్దు, జింక, ఏనుగు, అడవిమేక, పులి, మొసలి, తేలు, ముల్లపంది, ఎండ్రకాయ, కప్ప, పాకే కీటకాలు, చేప, తాబేలు, బల్లి, కోతి, ఎలుగుబంటి మరియు పక్షులు, గ్రద్ధలాంటి పక్షులు, రాబందు, కొంగ, నెమలి, కాకి, తేనెటీగలు, సీతాకోకచిలుక వీటితో పాటు రేఖాగణిత చిహ్నాలు, మానవ చిత్రాలు, విల్లు, బాణం, కత్తి, బరిసె వంటి ఆయుధాలు కనిపిస్తాయి.




*పటం 1: తెలంగాణలోని ముఖ్యమైన రాతి చిత్ర కళా స్థావరాలు*

SCERT TELANGANA

## నేటి కాలంలో వేటగాళ్ళు

నేటికి కూడా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో అనేక సమూహాల మానవులు వేటాడడం, ఆహార సేకరణ ద్వారా జీవితాన్ని గడుపుతున్నారు. మన రాష్ట్రంలో కొంతమంది యానాదులు, చెంచులు ఈ విధమైన జీవితాన్ని నేటికీ గడుపుతున్నారు. వారి జీవన విధానాన్ని అర్థం చేసుకోవాలని కొంతమంది పరిశోధకులు వారితో సహజీవనం సాగించి వారి గురించి అధ్యయనం చేస్తున్నారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం ఆదిమానవులు అడవులలో ఏవిధమైన జీవితం గడిపేవారో ఊహించుకోవటానికి ఈ అధ్యయనం తోడ్పడుతుంది.



చిత్రం 6.11(ఎ)



చిత్రం 6.11(బి)



చిత్రం 6.11(సి)

*చిత్రం 6.11(ఎ), (బి), (సి): 80 సంవత్సరాల క్రితం నాటి చెంచుల చిత్రాలు*

## సమ జీవనం

ఆదిమానవులు చిన్న సమూహాలుగా ఏర్పడి సంచార జీవనాన్ని గడిపేవారని తెలుసుకున్నాం. అప్పుడు స్త్రీ, పురుషులు అందరూ కలిసి వేటాడి ఆహారాన్ని సంపాదించుకునేవారు. ఆహార అన్వేషణలో స్త్రీలు, పిల్లలు చాలా ఉత్సాహంగా పాల్గొని చిన్న జంతువులను వేటాడి ఆహారాన్ని సంపాదించేవారు. పెద్ద జంతువులను వేటాడడాన్ని కొన్ని రోజుల ప్రణాళిక ద్వారా పురుషులు నిర్వహించేవారు.

ఆనాటి వేటగాళ్ళు వేటాడిన ఆహారాన్ని వారి సమూహంలోని ప్రజలందరితో పంచుకొనేవారు. మాంసం, చేపలు, పండ్లు, ఆకులు, దుంపలు, అడవి ధాన్యాలను నిలువ చేసే వసతులు ఆనాటి మానవులకు ఉండేవి కావు. కానీ నేటికాలంలో మనం తినే ధాన్యాలు, పప్పుదినుసులు త్వరగా చెడిపోవు. అంతేకాక కొన్ని నెలల వరకు చెడిపోకుండా కాపాడుకోటానికి జాడీలు,

SCERT TELANGANA

డబ్బాలు లభిస్తున్నాయి. కానీ సంచార జీవితం గడిపిన ఆదిమానవులకు ఇలాంటి వసతులు ఉండేవి కావు.

వేటాడిన, అడవిలో దొరికిన ఆహారాన్ని పంచుకొనటం వల్ల వారిలో ధనిక, పేద తేడాలు ఉండేవి కావు. ఒకరితో మరొకరు సమానంగా వ్యవహరించేవారు. అందరూ కలసి మెలసి చర్చించి కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను తీసుకొనేవారు.

ఆదిమానవులు అడవిలోని జంతువులను వేటాడినప్పటికి అడవిలోని వృక్షాలు, జంతువులు, నదులు, పర్వతాల పట్ల ఎంతో గౌరవాన్ని కలిగి వుండేవారు. వారికి నరిపడేంత ఆహారం సంపాదించుకోవడానికి వీటిని తరుచుగా పూజించేవారు.



*చిత్రం 6.12: వేటాడిన జింకకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆదిమానవులు*

ఆహారం కోసం వేట, సేకరణ ద్వారా అడవుల్లో గడిపే ఆదిమానవుల జీవన విధానాన్ని మనం ఊహించవచ్చు.

- ఆదిమానవులు ఆహారాన్ని ఎందువల్ల చాలా కాలం నిలువ చేసుకోలేక పోయేవారు?
- ఆనాటి వేటగాళ్ళు ఆహారాన్ని పంచుకోక పోయి ఉన్నట్లయితే ఏమి జరిగి ఉండేదో ఊహించగలరా?
- వారిలో పేదవారు ఎందుకు లేరో తెలుపగలరా?
- వేటాడిన జంతువులకు ఆదిమానవులు, పండిన పంటకు నేటి మానవులు కృతజ్ఞతలు తెలపడంలో ఏమైనా పోలికలు వున్నాయా?

## ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు:

కొన్ని వేల సంవత్సరాలపాటు మానవులు వేట, సేకరణ ద్వారా ఆహారాన్ని సంపాదించుకొనే వారని తెలుసుకున్నాం. కేవలం 12,000 సంవత్సరాల నుంచి మాత్రమే మానవులు ఆహారాన్ని పంటలు పండించుట ద్వారా సంపాదించుకుంటున్నారు. వారి జీవన విధానాన్ని ఎందుకు మార్చుకున్నారో తెలుసుకుందాం.

దాదాపు 12,000 సంవత్సరాల క్రితం ప్రపంచ శీతోష్ణస్థితిలో గొప్ప మార్పులు సంభవించాయి. ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగింది. దీని వల్ల అటవీ ప్రాంతాలు కొన్ని గడ్డిభూములుగా మారిపోయాయి. ఈ గడ్డి భూములు పశువులకు, గొర్రెలకు, మేకలకు అవసరమైన గడ్డిని అందించాయి. మానవులకు కూడా తినడానికి వీటినుంచి తృణధాన్యాలు లభించేవి. క్రమంగా ఆదిమానవులు ఈ గడ్డిభూములను, వాటిపై ఆధారపడి వున్న జంతువులను పరిశీలించి వాటిపై ఆధిక్యతను సంపాదించుకున్నారు. దీని ఫలితంగా జంతువులను మచ్చిక చేసుకోవడం, మొక్కలను పెంచటం మొదలైంది. దీని వల్ల ఏం జరిగిందో తెలుసుకుందాం.

## పంటలు పండించటం, జంతువుల పోషణ

క్రమంగా ఆదిమానవులలోని పురుషులు, స్త్రీలు, పిల్లలు ఏ ప్రాంతాల్లో ఆహారానికి అనువైన మొక్కలు పెరుగుతున్నాయో, విత్తనాలనుంచి కొత్త మొక్కలు ఎలా మొలకెత్తుతున్నాయో పరిశీలన చేయడం మొదలు పెట్టారు. దీని కోసం వారు మొక్కలను పక్షులు, జంతువులనుంచి కాపాడే వారు. ఫలితంగా మొక్కలు పెరిగి పంటలు పండాయి. ఆహారంగా ఉపయోగపడే మొక్కలు పెరిగే ప్రాంతాలలో ప్రజలు స్థావరాలు ఏర్పరుచుకొని పంటలు పండించారు. ఇలా భూమిపై వివిధ ప్రాంతాలలో పంటలు పండించే వివిధ సమూహాలు రైతు సమూహాలుగా ఏర్పడ్డాయి.

వివిధ ప్రాంతాల్లోని ప్రజలు వరి, గోధుమ, జొన్న, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, దుంపలు, కూరగాయలను పండించటం నేర్చుకున్నారు. రకరకాల పంటలను, కూరగాయలను ఎలా పండించుకోవాలో ఒకరి నుంచి మరొకరు తెలుసుకోగలిగారు.

SCERT TELANGANA

ఈ క్రమంలో వారు తినగా మిగిలిన ఆహారాన్ని వారి నివాసాల దగ్గరకు వచ్చి గడ్డి తినే సాధు జంతువులకు పెట్టి వాటిని మచ్చిక చేసుకోవటం మొదలైంది. ఈ విధంగా పెంచుకొనే జంతువులకు క్రూరమృగాల నుంచి రక్షణ కల్పించేవారు. ఈ విధంగా జంతువులను మచ్చికచేసుకొని పెంచుకోవడంవల్ల వారికి మాంసం, జంతు చర్మం, పాలు మొదలైనవి లభ్యమయ్యేవి. వారు క్రమంగా ఎద్దులను, గాడిదలను వ్యవసాయానికి, సరుకులు మోయటానికి ఉపయోగించేవారు.

## మచ్చిక చేసుకోవడం

ఆదిమానవులు సాధారణంగా అధిక దిగుబడినిచ్చే, రోగాల బారిన పడకుండా ఉండే మొక్కలను, జంతువులను ఎంపిక చేసేవారు. మళ్లీ విత్తటానికి ఇటువంటి మొక్కల విత్తనాలనే సేకరించి ఉపయోగించేవారు, ఎంపిక చేసిన జంతువులతోనే పశోత్పత్తి గావించేవారు. ఈ విధంగా వారు పెంచుకునే మొక్కలు, జంతువులు, అడవి మొక్కలకు, జంతువులకు భిన్నంగా రూపొందాయి. ఎంచుకున్న విత్తనాల నుంచి దిగుబడి లభించేవరకు మొక్కలను సంరక్షించుకునేవారు. ఇదే క్రమంలో మచ్చిక చేసుకున్న జంతువులను వారికి ఉపయోగపడే రీతిలో పెంచుకొనేవారు. ఈ విధానాన్ని మచ్చిక చేసుకోవడం అంటారు.

ఈ విధంగా కొన్ని వందల సంవత్సరాలుగా ప్రజలు వారికి వివిధ రకాలుగా ఉపయోగపడే మొక్కలను, జంతువులను పెంచేవారు.

- వచ్చే సంవత్సరం పంటలు పండించడానికి ఈనాటి రైతులు కూడా ఆది మానవుల లాగ విత్తనాలను ఎంచుకుంటున్నారా?
- ప్రస్తుత రైతులు విత్తనాల కోసం ఎంపిక చేసిన పంటలను ఎలా సంరక్షించుకుంటున్నారో మీకు తెలుసా?
- ప్రజలు వారి పెంపుడు జంతువులకు ఎలా సంరక్షణ కల్పిస్తున్నారు?

కానీ ప్రజలందరూ మొక్కలను, జంతువులను పెంచేవారుకాదు. చాలామంది ఇంకా అడవుల్లో జంతువులను వేటాడి ఆహారాన్ని సమకూర్చుకునేవారు. వ్యవసాయం కూడా అందరూ ఒకే విధంగా చేసేవారు కాదు. మొదట అటవీ ప్రాంతాలలో పోడు వ్యవసాయంతో పాటు వేట, ఆహార సేకరణ కొనసాగించేవారు. (పోడు వ్యవసాయం గూర్చి 5వ పాఠంలో చదివారు)

నేలను దున్ని ఎరువులు ఉపయోగించటం ద్వారా సారవంతం చేయవచ్చని వారిలో కొందరు తెలుసుకున్నారు. దీనితో ప్రతి సంవత్సరం సారవంతమైన నేలల కోసం దూరప్రాంతాలకు వెళ్ళనవసరం లేదని తెలుసుకున్నారు. వారు వ్యవసాయంలో జంతువులను నేలను దున్నటానికి, పంటల రవాణాకు, ఎరువులకు, ఇతర అవసరాలకు ఉపయోగించేవారు. దీని వల్ల పశుపోషణతోపాటు వ్యవసాయం అమలులోకి వచ్చింది.

## స్థిర జీవనం

పంటలకు నీరు పెట్టడానికి, జంతువులు, పక్షుల నుంచి వాటిని కాపాడడానికి, కలుపు తీయడానికి పంటలు పండే ప్రదేశంలో ప్రజలు నివాసం ఏర్పరుచుకున్నారు. పంట కోసిన తరవాత దానినంతా ఒకే రోజు తినలేరు కాబట్టి నిల్వచేయడం మొదలుపెట్టారు. పండించిన ధాన్యాన్ని ఆరు నెలల నుంచి సంవత్సరం దాకా నిలువ వుండేలా చర్యలు తీసుకోవడం మొదలు పెట్టారు. ఒక చోట ఇల్లు కట్టుకొని స్థిరనివాసం ఏర్పరచుకుంటేనే ధాన్యాన్ని నిల్వ చేయడం సాధ్యమవుతుంది. ఈ పరిస్థితులు స్థిర జీవనానికి దారితీశాయి.



*చిత్రం 6.13: పురాతన కుండ – దీనిలో ఏమి నిల్వ వుంచుకొనేవారని భావిస్తున్నారు?*

SCERT TELANGANA

స్థిరజీవనం తప్పనిసరి కావడం వల్ల వారు రాతితో, కొయ్యతో లేదా మట్టితో లేదా ఎండుగడ్డితో ఇళ్లను నిర్మించుకోవడం మొదలైంది. పాలు, నీరు, ధాన్యం నిల్వ చేయుటానికి, వండటానికి పాత్రలు అవసరమయ్యాయి. ఇది వివిధ రకాల కుండల తయారీకి దారి తీసింది. పాత్రలపై అందమైన బొమ్మలను చిత్రించి అలంకరించేవారు. వంటకు పొయ్యి, ధాన్యం దంచేందుకు రోలు అవసరం అయ్యాయి. పురావస్తు శాస్త్రవేత్తల తవ్వకాలలో వారు ఉపయోగించిన రాతి పనిముట్లు, పాత్రలు, గుడిసెలు ఇతర పనిముట్ల అవశేషాలు లభ్యమయ్యాయి. వీటితో పాటు కొన్ని చోట్ల చాలా సంవత్సరాల క్రితం ఆదిమానవులు నిప్పుపై కాల్చిన ధాన్యం కూడా లభ్యమయ్యింది.



*చిత్రం 6.14: 12,000 సంవత్సరాల క్రితం నిల్వ చేసిన ఆహారాన్ని పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు.*

ఆనాటి రైతులు చెట్లను, కొమ్మలను నరకడానికి వీలుగా వుండే కొత్తరకం రాతి పనిముట్లను తయారు చేసుకున్నారు. వీటిని నవీన రాతి పరికరాలని పురావస్తు శాస్త్రవేత్తలు అంటారు.

ఆనాటి వ్యవసాయదారులు అనువైన రాతిని మరొక రాతిపై సాన పెట్టడం ద్వారా గొడ్డళ్లలాంటి పరికరాలను తయారు చేసుకున్నారు. ఇలా సాన పట్టిన గొడ్డళ్లకు కొయ్య పిడి బిగించేవారు. ఈ కొత్త పనిముట్లతో పంటలు పండించడం ద్వారా ఆదిమానవుల జీవనవిధానంలో మౌలికమైన మార్పులు వచ్చాయి.

ఈ కొత్త రాతి పనిముట్లతో వ్యవసాయం చేసిన కాలాన్ని 'నవీన శిలాయుగం' లేదా 'కొత్త రాతియుగం' అంటారు.



*చిత్రం 6.15: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాదులో లభ్యమైన చెక్కకు బిగించిన రాతి గొడ్డలి*



*చిత్రం 6.16: మహబూబ్‌నగర్ జిల్లా సేరుపల్లిలో లభ్యమైన నవీన శిలాయుగం నాటి రాతి పనిముట్లు*

**ఆధారం :** *తెలంగాణ రాష్ట్ర పురావస్తు మ్యూజియం, హైదరాబాదు*

- ఆదిమానవులు ధాన్యాన్ని ఏవిధంగా నిలువ చేసేవారు?
- పంటలు పండించే ప్రజలు అదే ప్రదేశంలోనే ఎందువల్ల స్థిరనివాసం ఏర్పరచుకున్నారు?
- ఆదిమానవులు నివసించిన గుడిసెలను ఊహించి చిత్రించండి. అవి ఇప్పుడు మీరు నివసించే గృహాలకు ఏవిధంగా భిన్నమైనవి?

SCERT TELANGANA

భారతదేశంలో ఆదిమానవుల ప్రారంభ వ్యవసాయ ఆనవాళ్ళు సుమారు తొమ్మిది వేల సంవత్సరాల క్రితమే బెలూచిస్తాన్‌లో బయటపడ్డాయి. సుమారు ఐదు వేల సంవత్సరాల క్రితం కాశ్మీర్‌లో, నాలుగు వేల లేదా ఐదు వేల సంవత్సరాల క్రితం బీహార్‌లో బయట–పడ్డాయి.

ఆదిమానవులు జంతువులను మచ్చిక చేసుకున్న ఆనవాళ్ళు దక్కన్ పీఠభూమిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల సరిహద్దుల్లో దొరికాయి. ఈ రాష్ట్రాలలోని అనేక ప్రదేశాలలో పెద్ద పరిమాణంలో బూడిద దిబ్బలు కనుగొన్నారు.

పురావస్తు శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం ఐదు వేల సంవత్సరాల క్రితం ఆదిమానవులు ఈ ప్రాంతంలో పశుపోషణ చేపట్టినట్లు తెలుస్తోంది. వారు కొన్ని ప్రత్యేక ప్రదేశాలలో పశువులను కంచెద్వారా నిలువరించి అనంతరం వాటి పేడను ఎండబెట్టి దిబ్బలను ఏర్పాటు చేశారు. తర్వాత ఈ దిబ్బలను పండుగ సందర్భాలలో కాల్చి బూడిద చేసేవారు. ఈ విధంగా ఆనాడు ఏర్పడిన బూడిద కుప్పలు ప్రస్తుతం మన రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం జిల్లాలలో బయటపడ్డాయి. ఈ బూడిద కుప్పలతోపాటు నవీన శిలాయుగానికి చెందిన రాతిగొడ్డలి, రాతి పారలు, కుండల అవశేషాలు మొదలైనవి కనుగొన్నారు. ఈ విధంగా ఆదిమానవులు పంటలు పండించడంతోపాటు స్థిరనివాసాల గ్రామ సముదాయాలను ఏర్పరచుకోవడానికి కొన్ని వేల సంవత్సరాలు పట్టింది.

### తెలంగాణలో నూతన శిలాయుగం

తెలంగాణలో నూతన రాతియుగం వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, జనగాం, సిద్ధిపేట, కరీంనగర్, జయశంకర్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, అదిలాబాద్ జిల్లాలలో ఎక్కువ సంఖ్యలో నూతన రాతియుగానికి చెందిన స్థావరాలు కనుగొనబడ్డాయి.

వరంగల్ జిల్లాలో పోలకొండలో జరిపిన తవ్వకాలలో కాల్చిన మట్టి, వీటితో పాటు అసంఖ్యాకంగా సూక్ష్మరాతి పరికరాలు, చేతితో చేసిన కుండలు, ధాన్యాన్ని నిలువ వుంచే పాత్రలు లభ్యమయ్యాయి. దీన్ని బట్టి మూడు వేల మూడు వందల సంవత్సరాల క్రితమే ఇక్కడ మానవులు నివసించినట్లు తెలుస్తుంది.

### కీలకపదాలు

| | | |
|---|---|---|
| వేట, ఆహార సేకరణ సమాజం | రాతి పనిముట్లు | సూక్ష్మ రాతి పరికరాలు |
| సంచార జీవులు | సమజీవనం | మచ్చిక చేసుకొనటం |
| పశుపోషకులు | స్థిరజీవనం | నవీన శిలాయుగం |
| పురావస్తు శాస్త్రవేత్త | పోడు వ్యవసాయం | |


SCERT TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. ఆదిమానవులు నూలు, ఉన్ని దుస్తులు ఎందుకు ధరించలేదు?
2. పండ్లు కోయటానికి ప్రస్తుతం మీరు ఎటువంటి పనిముట్లను ఉపయోగిస్తున్నారు? ఆ పనిముట్లు లేనట్లయితే ఏమి చేస్తారు?
3. ఆదిమానవులు వాడిన రాతి పనిముట్లను నవీన పనిముట్లతో పోల్చండి.
4. ఆదిమానవులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఎందుకు సంచరించేవారు? ప్రస్తుత మానవుల సంచారానికి, ఆదిమానవుల సంచార జీవితానికి మధ్యగల తేడాలు / పోలికలను తెలపండి.
5. కింద ఇచ్చిన రాతి చిత్రకళా స్థావరాలను తెలంగాణ పటంలో గుర్తించండి.

| | | |
|---|---|---|
| అ. ఆసిఫాబాద్ | ఆ. పాండవులగుట్ట | ఇ. కోకాపేట్ |
| ఈ. దుర్గం | ఉ. రేగొండ | ఊ.రామచంద్రాపురం |

6. నవీన శిలాయుగ వ్యవసాయదారులు, పశు పోషకులకు ప్రస్తుత ఆధునిక యుగ వ్యవసాయదారులు, పశుపోషకులకు మధ్య తేడాలను రాయండి.
7. ఆదిమానవులు మచ్చిక చేసుకున్న జంతువులు, వ్యవసాయ ఉత్పత్తుల జాబితాను తయారు చేసి వాటి గురించి కొన్ని వాక్యాలు రాయండి.
8. వంటకు పొయ్యి, రుబ్బురోలు లేనట్లయితే మనం తినే ఆహారంపై ఎటువంటి ప్రభావం కలుగుతుంది?
9. నేడు జరుగుతున్న పురావస్తు తవ్వకాల గురించి తెలుసుకోవడానికి పురావస్తు శాస్త్రవేత్తతో ముఖాముఖికై ఐదు ప్రశ్నలు తయారు చేయండి.
10. ఈ కింది చిత్రంలో అనేక అంశాలున్నాయి. వీటిలో వేట ఆధారిత సమాజానికి చెందని వాటిని గుర్తించండి. అలాగే వేట సమాజం, వ్యవసాయ సమాజం రెంటికి చెందిన అంశాలను గుర్తించండి. వాటికి సరియైన సంజ్ఞలను పెట్టి విభజించండి.




11. ఆది మానవులు జంతువులను మచ్చిక చేసుకోవడం ద్వారా వారి జీవితాలు సులభతరమైనవని ఎట్లు చెప్పగలవు?
12. పేజి నెం.47లోని 'సంచార జీవనం' అనే పేరాను చదివి, వ్యాఖ్యానించండి.

SCERT TELANGANA

### కృత్యం

ఇచ్చిన ఆధారాలతో కింది పదబంధాన్ని నింపండి.




**ఆధారాలు:**

**అడ్డం:**

1. ఆదిమానవులు పచ్చిమాంసాన్ని దీనితో కాల్చేవారు (2)
2. ఆదిమానవులు రవాణాకు ఈ జంతువును ఉపయోగించేవారు (3)
3. ఆదిమానవులు పండించిన పంటలలో ఒక ధాన్యం (2)
4. ఆదిమానవులు నేలను దున్ని సారవంతం చేయడానికి దీనిని ఉపయోగించేవారు (3)
5. మొట్టమొదట పంటలు పండించటం ద్వారా ఏర్పడిన జీవనం (5)

**నిలువు:**

1. ఆదిమానవుల మిగులు ఆహారానికి ఈ వసతి ఉండేది కాదు (3)
2. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దుల్లో పెద్ద పరిమాణంలో ఈ కుప్పలను కనుగొన్నారు (3)
3. అడవిలోని వీటిని ఆదిమానవులు కొలిచేవారు (4)
4. ఆదిమానవులు వీటితో చేసిన పనిముట్లను ఉపయోగించే వారు (3)
5. నిరంతరం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలిపోయే వారు (6)

### ప్రాజెక్టు

మీకు దగ్గరలో ఉన్న రాతి చిత్రకళాస్థావరాన్ని కనుగొని మీ తరగతి విద్యార్థులతో సందర్శించి, నివేదిక రాసి తరగతిగదిలో ప్రదర్శించండి.

SCERT TELANGANA

పాఠం

# 7 నేటి వ్యవసాయం

ఇప్పుడు వెంకటాపురం గ్రామంలో వేరుసెనగపంట కోతకు వచ్చింది. రైతులు వేరుసెనగ విత్తనాలను నవంబరు చివరి వారంలో విత్తి, ఫిబ్రవరిలో పంటను కోస్తారు. మేము వెంకటాపురం గ్రామానికి వెళుతూ ప్రధాన రహదారి మార్గం పక్కన రమ, లక్ష్మమ్మ, పద్మ అనే మహిళా కూలీలు పొలంలో చద్దన్నం తినడం గమనించాం. అక్కడికి వెళ్లి వాళ్ళ పనిని గురించి ఇష్టాగోష్ఠి జరిపాం.

## వెంకటాపురం - వేరుసెనగపంట పొలాల్లో వ్యవసాయ కూలీలు

“ఎర్రటి ఎండలో చాలా సమయం పొలంలో కూర్చొని వేరుశెనగ మొక్కలనుంచి కాయలను కోయడం అంత సులువైన పని కాదు. మా యజమాని పేరు రవి. మేము కోసిన వేరుసెనగ కాయల పరిమాణాన్నిబట్టి డబ్బులు చెల్లిస్తాడు. మేం చాలా వేగంగా పనిచేయాలి. లేకపోతే రోజంతా కష్టపడినా 100-150 రూపాయలు కూడా దక్కవు,” అని లక్ష్మమ్మ మాతో చెప్పింది.

“మీరందరూ ఈ రోజుల్లో తీరికలేకుండా ఉంటారా?” అని మేం అడిగాం.

“ఔను. కానీ ఇలాంటి పని, పొలాల్లో సంవత్సరంలో కొన్ని వారాలు మాత్రమే ఉంటుంది. మిగతా సమయాల్లో మేం ప్రభుత్వ పథకాల పనులకోసం ఎదురుచూస్తాం లేదా, పనిలేకుండా ఇంట్లోనే ఉండిపోతాం” అని పద్మ చెప్పింది.

“ప్రభుత్వ పథకాల ద్వారా కూడా సంవత్సరంలో కొన్ని వారాలు మాత్రమే పని దొరుకుతుందని”, రమ చెప్పింది.

చిత్రం 7.1: వేరుశనగ పంట తీయుట



“నిత్యావసరాలైన కూరగాయలు, బట్టలు, పిల్లల పుస్తకాలు వంటి వాటి ధరలు బాగా పెరుగుతున్నాయి. కానీ, మా కూలి రేట్లు మాత్రం పెరగవు” అని లక్ష్మమ్మ చెప్పింది.

సాధారణంగా మహిళా కూలీలు రోజుకు 100-130 రూపాయలు సంపాదించగా, పురుషులు రోజుకు 200-250 రూపాయలు సంపాదిస్తారు. అయితే ప్రభుత్వ పథకాలలో

SCERT TELANGANA

పురుషులు, స్త్రీలు ఇద్దరికీ సమానంగా రోజుకు 150 రూపాయల కూలి ఉంటుంది. వ్యవసాయేతర పనులైన ఇసుక లేదా ఇటుకలను ట్రాక్టర్‌లలోకి ఎత్తడం, దింపడంవంటి పనులలో, భవన నిర్మాణాలలో కూలి రేట్లు ఎక్కువ. రోజుకు 300 రూపాయల చొప్పున పురుషులకు, 180–200 రూపాయల చొప్పున స్త్రీలకు లభిస్తుంది. కాని ఇలాంటి పనులు చాలా తక్కువ.

*"వ్యవసాయేతర పనులను మేము ఎక్కడ నుండి పొందాలి. అకస్మాత్తుగా నిర్మాణపు పనులలో పనిచేయడం కష్టం. పనులకోసం మేము పట్టణాలకు, నగరాలకు వెళ్లవలసి వస్తుంది,"* అని పద్మ చెప్పింది.

*"మా పొరుగు గ్రామాల్లోని రైతులు కొందరు పువ్వులు, ద్రాక్ష వంటి పంటలు పండిస్తున్నారు. రోజూ వెళ్లేవారికి మాత్రమే అక్కడ పని దొరుకుతుంది. అకస్మాత్తుగా వెళ్ళి పూల తోటల్లో, ద్రాక్ష తోటల్లో ఎలా పని చేస్తాం? అక్కడ సంవత్సరంలో కొన్ని రోజులు మాత్రమే పని ఉంటుంది. చిన్న పిల్లలను తోటలలోకి అనుమతించరు. పిల్లలను వదిలి నేను ఎలా వెళ్తాను?"* అని లక్ష్మమ్మ జత కలిపింది.

*"ప్రత్యేక నైపుణ్యం అవసరంలేని ప్రభుత్వ పథకాల పనులను మేం చేస్తాం!"* అని రమ చెప్పింది.

రమ, పద్మ, లక్ష్మమ్మ వంటి పేదకూలీలు వాళ్ళ కుటుంబ పోషణకోసం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. బయటి పనులతోపాటు ఇంటి పనులైన వంట చేయడం, మంచినీరు తీసుకురావడం, వంట చెరుకు ఏరుకురావడం, పిల్లలను బడికి తయారు చేయడం వంటి పనుల్లో స్త్రీలు ఎక్కువ సమయం గడుపుతారు.

తెలంగాణలో సుమారుగా 2/5 వంతు గ్రామీణ కుటుంబాలు వ్యవసాయ కూలీలుగా ఉన్నాయి. కొద్ది మందికి మాత్రమే కొంత భూమి ఉంది. మిగతా వారికి అసలు భూమే లేదు. వ్యవసాయేతర పనుల ద్వారా ఎక్కువ ఆదాయం వచ్చినా అలాంటి పనులు గ్రామీణ ప్రాంతాలలో దొరకడం చాలా తక్కువ. అందువల్ల వెంకటాపురంలోని చాలా కుటుంబాలు నగరాలకు, పట్టణాలకు వలస వెళ్లాయి.

- వెంకటాపురం గ్రామంలో కూలీలు తమ కుటుంబ పోషణకు ఏయే రకమైన పనులు చేస్తున్నారు?
- సంవత్సర కాలంలో తమ కుటుంబాలకు అవసరమైన ఆదాయాన్ని కూలీలు ఎన్ని విధాలుగా పొందుతున్నారు?
- వివిధ సందర్భాలలో స్త్రీ, పురుషుల కూలి రేట్లలో తేడా గమనించండి. ఈ తేడాలు ఎందువల్ల ఉన్నాయో ఆలోచించండి.

## వెంకటాపురంలో చిన్న రైతులు

మేము వ్యవసాయ కూలీలతో మాట్లాడడం చూసి వారి యజమాని రవి మాతో మాట్లాడటానికి వచ్చాడు. తన పొలంలోని పంటను కోత కోయడానికి ఒక్కరు లేదా ఇద్దరు మగ వ్యవసాయ కూలీలను, చాలామంది ఆడ వ్యవసాయ కూలీలను రవి నియమిస్తాడు. సాధారణంగా మగ వారిని వేరుశెనగ మొక్కలు భూమినుండి పీకడానికి, కుప్పలు వేయడానికి, మోయడానికి నియమిస్తే, ఆడవారిని మొక్కల నుండి వేరుశెనగ కాయలను వేరుచేయడానికి ఉపయోగిస్తాడు.

*"నేను వేరుశెనగ కాయలను కోయడానికి కూలీలను పెట్టుకుంటాను. సాధారణంగా నేను ఇతర పనులకు మా కుటుంబ సభ్యులను లేదా ఇరుగుపొరుగు రైతుల సహాయాన్ని తీసుకుంటాను,"* అని రవి చెప్పాడు.

రవి కూతురు కూడా వేరుశెనగ మొక్కలను పెరుకుతుంది. రవి తన కూతురుని కళాశాలకు పంపి, ఫీజులు భరించే స్థితిలో లేడు. అందుకే ఆమె ప్రస్తుతం పొలంలో పనిచేస్తోంది.

రవికి బోరుబావి సదుపాయమున్న 4 ఎకరాల పొలం ఉంది. ఇంతకు ముందు గ్రామ చెరువునుండి రవి నీటిని పొందేవాడు. ప్రస్తుతం చెరువునీరు పొలాలకు చేరడం లేదు. 5 సంవత్సరాల క్రితం 75,000 రూపాయల అప్పు చేసి బోరుబావి తవ్వించాడు. రెండు మూడు సంవత్సరాలు అతడు సంవత్సరానికి రెండు పంటలు చొప్పున పండించాడు. గత సంవత్సరంనుంచి బోరుబావిలో సరిపడినంత నీరు లేకపోవడంవల్ల కేవలం ఒకే ఒక పంట పండించడానికి వీలు కలుగుతోంది.


SCERT TELANGANA

"విత్తనాలు, ఎరువులు కొనడానికి మా ఊరులోని బ్రోకర్ ద్వారా అప్పు తీసుకున్నాను. తిరిగి ఆ అప్పు చెల్లించడానికి వేరుశెనగ పంటను మార్కెట్ ధరకంటే తక్కువ ధరకే ఆయనకు అమ్మాలి. సాధారణంగా మార్కెట్ ధర ఎక్కువగా ఉంటుంది. వేరుశెనగ పంటను తనకు పంపించమని బ్రోకర్ ముందుగానే ఫోన్ చేశాడు," అని రవి చెప్పాడు.

"మీరు బ్యాంకుల్లో అప్పు ఎందుకు తీసుకోరు?" అని అడిగాం!

"బ్యాంకులు మాకు అప్పు ఇవ్వడానికి ఇష్టపడవు. ముఖ్యంగా మాకు అవసరమైనప్పుడు డబ్బులు యివ్వవు. చాలా సమయాలలో మేం మధ్యవర్తులమీద, వడ్డీ వ్యాపారులమీదా ఆధారపడతాం," అని రవి చెప్పాడు.

రవి వంటి రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనటానికి అప్పు అవసరం. విత్తనాలు నాణ్యమైనవి కాకపోయినా, ఎరువులు పంట పెరుగుదలకు దోహదం చేయకపోయినా, రసాయనిక మందులు సరిగా పనిచేయకపోయినా పంట దిగుబడి తగ్గుతుంది. పంటదిగుబడి తగ్గడంవల్ల రైతులు సకాలంలో రుణాలను తిరిగి చెల్లించలేరు. వాళ్లు



చిత్రం 7.2: ఎరువు చల్లుతున్న రైతు

చాలావరకు వడ్డీవ్యాపారులు, మధ్యవర్తులనుంచి అప్పులు తీసుకొని వాళ్లకి ముందుగా నిర్ణయించిన తక్కువ ధరలకే అమ్మవలసి వస్తుంది. దాంతో పండించిన పంటలకు సరైన ధర కూడా రాదు. తమ కుటుంబ పోషణకు వాళ్లు మళ్లీ అప్పులు చేస్తారు. క్రమంగా ఆ అప్పులు తీర్చలేని స్థితికి చేరుకుంటారు. కొన్ని సమయాలలో పంటలు పండక పోవడం కూడా బాధను కలిగిస్తాయి. ఈ మధ్యకాలంలో చిన్న రైతులకు కష్టాలు విపరీతంగా పెరిగాయి. చాలా మంది రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

## ఒప్పందపు వ్యవసాయం

కొంత మంది రైతులు తమ సమస్యలనుంచి బయట పడడానికి, ప్రత్యేక పంటలను పండించి సరఫరా చేయడానికి కొన్ని కంపెనీలతో ఒప్పందం చేసుకుంటారు. ఈ పద్ధతి విస్తృతం కానప్పటికీ తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో వరి, జొన్న, వేరుసెనగ, పత్తి, సోయాచిక్కుడు, ఆయిల్‌పామ్, కొబ్బరి, ఉసిరి, మిరప, దోసకాయ వంటి పంటలు పండించడానికి రైతులతో కంపెనీలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ఒప్పందపు వ్యవసాయంలో రైతులు పాటించాల్సిన ప్రత్యేక నిబంధనలను, పద్ధతులను కంపెనీలు నిర్ణయిస్తాయి. ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తాయి. కోతలు కోసిన తర్వాత ముందుగానే నిర్ణయించిన ధరలకు సరుకు కొనుగోలు చేసి పెట్టుబడులను తిరిగి తీసుకుంటాయి. వీటిని కంపెనీలు తమ ఉత్పత్తులలో (చిప్స్, టమాటా సాస్, మందులు వంటివి) ముడిపదార్థాలుగా వాడి, వాటిని ఇతర దేశాలలో అమ్ముతున్నాయి.

కంపెనీలు పెట్టుబడులు పెట్టడాన్ని, ముందుగా నిర్ణయించిన ధరలకు కొనడాన్ని చాలామంది రైతులు స్వాగతిస్తున్నారు. అయితే తక్కువ దిగుబడి వస్తే రైతే నష్టాన్ని భరించాల్సి ఉంటుంది. కంపెనీలు కోరుకున్నంత నాణ్యంగా పంటలు లేకపోతే సరుకును తీసుకోడానికి నిరాకరించి, రైతులను ఇబ్బందులకు గురిచేస్తాయి. ఈ క్రమంలో మంచి దిగుబడిని పొందడానికి రైతులు ఎరువులను, రసాయనిక

SCERT TELANGANA

మందులను, భూగర్భనీరును ఎక్కువ మోతాదులో వాడుతున్నారు. ఇది భవిష్యత్తులో భూగర్భజల వనరులు తగ్గడం, భూమి సారం తగ్గడం వంటి అనర్థాలకు దారి తీస్తుంది. రైతులు తమకున్న దాంట్లో మంచి భూములను ఒప్పంద వ్యవసాయానికి కేటాయించడం వల్ల వారి కుటుంబ స్థాయి ఆహారభద్రతకు ముప్పు ఏర్పడుతుంది.

- చిన్నరైతులు పంటకోత సమయాలలో కూలీలుగా మారుతున్నారు. ఎందువల్ల?
- వ్యవసాయం ద్వారా తమ కుటుంబ అవసరాలను చిన్నరైతులు తీర్చుకోగలు-గుతున్నారా?
- చిన్న రైతులు, కూలీలు ధాన్యరూపంలో కూలీ పొందటం కంటే నగదు రూపంలో పొందటానికి ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఎందువల్ల?

## వెంకటాపురంలో చిన్నరైతులు – కూలీలు

వేరుసెనగ కాయల మొక్కలతో నిండి ఉన్న ఒక ట్రాక్టరు ఒక పెంకుటింటి ముందు ఉంది. ఆ ఇంట్లో నివసిస్తున్న రాము అనే రైతుతో మేం మాట్లాడాం అతడు కూడా రవిలాగ మరొక చిన్న రైతు.

"*వ్యవసాయం గురించి మాట్లాడాలనుకుంటే పెద్ద రైతు దగ్గరకు వెళ్లండి,*" అని ఆయన చెప్పాడు.

"*మీకు ట్రాక్టర్ ఉంది కాబట్టి మీతో మాట్లాడితే చాలు,*" అని మేము చెప్పాం.

"*ఇది నాది కాదు. నేను ఈ గ్రామంలో విజయ్‌కుమార్ అనే పెద్ద రైతు దగ్గర పనిచేస్తున్నాను. అతడు మా పంట పొలాలకు నీరు అందిస్తాడు. డబ్బు అవసరమయినప్పుడు అతని దగ్గర అప్పులు తీసుకుంటాం,*" అని రాము అన్నాడు.

గ్రామచెరువు మీద ఆధారపడిన రెండెకరాల పొలం రాముకు ఉంది. చెరువులో ఉండే నీటిని పెద్ద రైతులు తమ పొలాలకు తరలించుకుంటారు. రాము పొలానికి నీరు సరిపోతుందా లేదా అని పట్టించుకోరు. నాలుగు సంవత్సరాల క్రితం విజయ్‌కుమార్ దగ్గర రాము అప్పు తీసుకొని ఒక బోరుబావి వేసుకున్నాడు. 500 అడుగుల లోతు తవ్వినా ఆ బోరుబావిలో నీళ్లు పడలేదు. బోరుబావి, నీరు, పొలం అంటూ కలలు కనడం రాము విరమించుకున్నాడు. అతడు ఇప్పుడు తన అప్పు తిరిగి చెల్లించాలి. కుటుంబ సభ్యుల సహాయంతో కేవలం ఖరీఫ్ కాలంలో మాత్రమే పంట వేస్తాడు. రవిలాగ రాముకూడా కోత సమయంలో కొంత మంది కూలీలను పెట్టుకొంటాడు.

చాలా కాలంనుంచి కుటుంబ అవసరాలకు సరిపడిన ఆదాయం పొలం నుంచి లభించడం లేదు. అది కేవలం సంవత్సరంలో 3 నెలలకు మాత్రమే సరిపోతుంది. అందుకే విజయ్‌కుమార్ పొలంలో అతడు పనులు చేస్తాడు. విజయ్‌కుమార్ అతని పొలాలకు నీరు అందిస్తాడు. దానికి బదులుగా రాము విజయ్‌కుమార్‌కున్న విశాలమైన వరి, చెరకు పొలాల్లో, ముఖ్యమైన పనులు చేస్తూ ఉంటాడు. రాముకు డ్రైవింగ్ కూడా వచ్చు. అతడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పొలాలు దున్నడం, వరి ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించడంవంటి పనులు చేస్తూ ఉంటాడు.

## తెలంగాణలో చిన్న రైతులు

మన రాష్ట్రంలో ప్రతి ఐదుగురు రైతులలో నలుగురు రాము, రవి వంటి చిన్న రైతులే. వారికి సొంతభూమి చాలా తక్కువ. నీటిపారుదల వసతులు ఏమాత్రం ఉండవు. వీళ్లకు అప్పు చాలా అవసరం. పెద్ద రైతులు, బ్యాంకులు, వడ్డీవ్యాపారులు లేదా దళారుల దగ్గర వీరు అప్పు తీసుకుంటారు. దాంతో తమ పంటలను తక్కువ ధరలకే అమ్మే విధంగా ఒత్తిడి ఉంటుంది. ఆర్థిక అవసరాలకు కూలీలుగా కూడా పొలాల్లో పనిచేయవలసి ఉంటుంది.

- సంవత్సరానికి 2 లేదా 3 పంటలు పండించడానికి రాముకు ఎందుకు సాధ్యం కావడం లేదు?

SCERT TELANGANA

- పెద్ద రైతులమీద చిన్న రైతులు ఎలా ఆధారపడతారు? రాము విషయంలో కొన్ని ఉదాహరణలివ్వండి.
- చిన్న రైతులు బ్యాంకులనుంచి తేలికగా అప్పులు పొందకపోవడానికి కారణాలు ఏమిటి?
- వాళ్ళ పరిస్థితులనుబట్టి రాముకూ రవిలకు మధ్య గల పోలికలను, తేడాలను గుర్తించండి.

## పెద్ద రైతుతో సంభాషణ

రాము తాను పనిచేసే విజయ్‌కుమార్ దగ్గరకు మమ్మల్ని తీసుకెళ్లాడు. విజయ్‌కుమార్ ఇంటికి పెద్ద ప్రహరీ గోడ ఉంది. ఖాళీ స్థలంలో వరికోత మిషన్, నూర్పిడి యంత్రం, ట్రాక్టర్ ఆగి ఉన్నాయి. కొంతమంది కూలీలు వేరుసెనగ మొక్కలను ట్రాక్టర్ నుంచి దించుతున్నారు. ఒక షెడ్‌లో 10–15 మంది స్త్రీలు వేరుశెనగ మొక్కలనుంచి కాయలను తెంపుతున్నారు. ఈ సంవత్సరం పంట దిగుబడి బాగుందని విజయ్‌కుమార్ మాతో చెప్పాడు.

"మీరు పంట అమ్మడానికి ఎప్పుడు వెళ్తున్నారు?" అని అడగగా "ఇప్పుడు కాదు. కొన్ని వారాలు పంట బాగా ఎండిన తర్వాత అమ్ముతాను," అని విజయ్‌కుమార్ చెప్పాడు

విజయ్‌కుమార్‌కి కాంక్రీటుతో వేసిన పెద్ద కళ్ళం ఉంది. పంటలు కోసిన తర్వాత కళ్లంలో ఎండబెట్టి తన గోదాంలో వరిధాన్యం నిల్వ ఉంచుతాడు. దీనితో పాటు ఎరువుల బస్తాలు, ఇతర వ్యవసాయ పనిముట్లు ఈ గోదాంలో భద్రపరుస్తాడు.

"పంట కోసిన వెంటనే సీజన్లో ధరలు తక్కువగా ఉంటాయి. వేరుశెనగ కాయలను బాగా ఎండబెట్టి కొన్ని నెలల తరువాత వాటిని అమ్ముతాను. సాధారణంగా వ్యాపారులు ఎండిన వేరుశెనగకు ఎక్కువ ధర చెల్లిస్తారు," అని విజయ్‌కుమార్ చెప్పాడు.

విజయ్‌కుమార్‌కు 3 బోరుబావులతో 25 ఎకరాల భూమి ఉంది. అతని వరిపొలం చెరువు పారుదల కిందనే ఉంది. అతడు 25 లక్షల అప్పు తెచ్చి, ఒక వరికోత యంత్రాన్ని, నూర్పిడి యంత్రాన్ని కొన్నాడు. ఆ యంత్రాలను ఇతర రైతులకు అద్దెకు పంపిస్తాడు. వెంకటాపురమే కాకుండా చుట్టు పక్కల గ్రామాల



*చిత్రం 7.3: విజయ్‌కుమార్ ఇల్లు*

SCERT TELANGANA

రైతులు చాలామంది ఆ యంత్రాలను ఉపయోగిస్తారు. ఆయన ఇంటికి దగ్గరగా ఉన్న వరిపొలాలను, చెరుకు పొలాలను మేం చూశాం. ఇలాంటి అదనపు ఆదాయంతో అతడు వ్యవసాయ యంత్రాలను కొన్నాడు. బోరుబావులు తవ్వించాడు. చిన్న రైతుల భూములను కౌలుకు తీసుకున్నాడు. విజయ్‌కుమార్ ఇరవైకి పైగా ముర్రా జాతి గేదెలతో పాల వ్యాపారం చేస్తున్నాడు. ఎరువుల దుకాణాన్ని కూడా నడుపుతున్నాడు. గ్రామంలో చిన్నరైతులకు, కూలీలకు అవసరాలకు అప్పులను యిచ్చి, వాళ్ళతో పొలంపనులు చేయించుకుంటాడు. విజయ్‌కుమార్‌కి సమీప పట్టణంలో ఒక ఇల్లు ఉంది. అక్కడ అతని భార్యా, పిల్లలూ ఉంటారు.

మా సంభాషణ వింటూ ఉన్న 75 సంవత్సరాల వయస్సుగల విజయ్‌కుమార్ తండ్రి మాతో మాటలు కలిపాడు.

*"ఈ రోజుల్లో వ్యవసాయం చేయడం అంతా వృథా. పాతకాలంలో మేం రసాయనిక ఎరువులను, మందులను తక్కువగా వాడేవాళ్లం. దిగుబడి తక్కువగా ఉన్నప్పటికి భూగర్భ జలవనరులు బాగా ఉండేవి. పంటలు పండలేదని మేము ఎప్పుడూ వినలేదు. ప్రస్తుతం రసాయనిక ఎరువులు, మందులు ఎక్కువగా వాడుతున్నాం. ట్రాక్టర్ ద్వారా పొలం దున్నడం, మా సొంత వరికోతకు మిషన్‌కూడా వాడుతున్నాం. అయినా పంటలు సరిగా పండడం లేదు. చాలామంది రైతులు పంట దిగుబడి సరిగా లేకపోవడంవల్ల నష్టపోతున్నారు"* అని తండ్రి అన్నాడు.


*చిత్రం 7.4: పత్తి చేను*

- విజయ్‌కుమార్ ఎక్కువ ధర వచ్చే వరకు ఎలా వేచి ఉన్నాడు? అదే చిన్న రైతులు తక్కువ ధరకే ఎందుకు అమ్ముతున్నారు?
- విజయ్‌కుమార్ దగ్గర ఉన్న వ్యవసాయ పనిముట్ల పట్టిక తయారు చేయండి. ఈ పనిముట్లు ఏ రకమైన రైతుల దగ్గర ఉంటాయి?
- విజయ్‌కుమార్‌కు ఉన్న ఆదాయ మార్గాలు ఏవి?
- ప్రస్తుత వ్యవసాయం కంటే పూర్వకాలం వ్యవసాయమే మంచిదనే విజయ్‌కుమార్ తండ్రి మాటలతో మీరు ఏకీభవిస్తారా? విభేదిస్తారా? కారణాలు రాయండి.

## తెలంగాణలో వ్యవసాయం

కాలం గడుస్తున్నకొద్దీ తెలంగాణ వ్యవసాయ రంగంలో మార్పులు వస్తున్నాయి. అయినప్పటికీ వరి ప్రధానమయిన పంటగా ఉంది. ఆహారపుపంటలైన రాగులు, జొన్న, మొక్కజొన్నల స్థానంలో వాణిజ్య పంటలైన పత్తి, చెరకు, వేరుసెనగ, పసుపు, మిరప వంటివి పండించడం ప్రారంభమైంది. ఈ పంటలన్నింటికి విత్తనాల కొనుగోలు, నీటి సరఫరా, మందులు, ఎరువులు వంటివాటికి పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరం. దీని కోసం రైతులు అప్పులు తీసుకుంటున్నారు.

కొన్ని దశాబ్దాల క్రితం రైతులు చెరువులు, కాలువల మీద ఆధారపడి నీటి వనరులను వాడుకునేవారు. ప్రస్తుతం తెలంగాణలో ఎక్కువ మంది రైతులు బోరుబావుల మీద ఆధారపడి ఉన్నారు. దీని కారణంగా భూగర్భ జలవనరులు పడిపోతున్నాయి. వర్షంమీద ఆధారపడే వారి శాతం పెరుగుతూ ఉంది.

SCERT TELANGANA

ఇవన్నీ చిన్నరైతులను పంటనష్టాలకు గురిచేస్తాయి. ఈ రుణాలను తిరిగి చెల్లించే స్థితిలో లేరు. చాలామంది రైతులు తమ భూములను అమ్ముకొని కూలీలుగా పెద్ద పట్టణాలకు వలసపోతున్నారు. ప్రస్తుతం ప్రతి ఐదుగురిలో నలుగురు చిన్నరైతులు ఇలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

ఒకవైపు పెద్ద రైతులు కొత్త పరికరాలు, పద్ధతుల ద్వారా లాభాలు పొందుతున్నారు. వాళ్ళు తమ పెట్టుబడులను మళ్ళించి పాడిపరిశ్రమ, కోళ్లఫారాలు, దుకాణాలు, పాఠశాలలు వడ్డీ వ్యాపారం కోసం ఉపయోగిస్తున్నారు.

కూలీలకు వ్యవసాయరంగంలో పని లభించకపోవడమే కాకుండా వాళ్ళ వేతనాలు కూడా పెరగడం లేదు. ప్రభుత్వ పథకాలు కొంత ఆదుకుంటున్నప్పటికి అవి సంవత్సరానికి చాలా రోజులు పని కల్పించడం లేదు. కూలీల కుటుంబాలు ఇతర మార్గాల కోసం ఎదురు చూస్తూ పక్క గ్రామాలకు, పట్టణాలకు వెళుతున్నాయి.

## కీలకపదాలు

| | | | |
|---|---|---|---|
| వలస | వ్యవసాయ కూలీలు | ఒప్పంద వ్యవసాయం | వాణిజ్యపంటలు |
| ఖరీఫ్ | చిన్నరైతులు | వడ్డీవ్యాపారులు | క్రిమిసంహారకాలు |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. వెంకటాపురం గ్రామంలో వలసల నివారణకు, రైతులకు సహాయం చేయడానికి ప్రభుత్వం ఏమి చేస్తుందని మీరు అనుకుంటున్నారు.

2. కింది పట్టికను పూరించండి.

| వ్యక్తి | సాధారణ కాలంలో కూలీ రేట్లు | పంటకాలంలో కూలీ రేట్లు | వ్యవసాయేతర పనులలో కూలీ రేట్లు | ప్రభుత్వ పథకాల్లో చెల్లించే కూలీ రేట్లు |
|---|---|---|---|---|
| మగ | | | | |
| ఆడ | | | | |

3. మీ గ్రామాలలో గల పెద్దరైతు పరిస్థితులను, వెంకటాపురంలోని పెద్దరైతు విజయ్‌కుమార్ పరిస్థితులతో పోల్చండి.

4. వెంకటాపురంలో బ్యాంకునుంచి అప్పు ఎవరు పొందారు? దేనికి పొందారు?

5. వడ్డీవ్యాపారులు, బ్యాంకులు రైతులకు రుణాలు ఎలా ఇస్తాయి? వడ్డీవ్యాపారుల దగ్గరనుంచి రుణం పొందడం లాభదాయకమని మీరు భావిస్తున్నారా? ఇతర సదుపాయాలు ఏమి ఉన్నాయని మీరు భావిస్తారు?

6. తెలంగాణలో రైతుల పరిస్థితులను మెరుగుపరచటానికి ఏం చేయాలి?

SCERT TELANGANA

7. కింది వివరాలతో వెంకటాపురంలోని ముగ్గురు రైతులను పోల్చండి.

| సంఖ్య | విషయం | రవి | రాము | విజయ్‌కుమార్ |
|---|---|---|---|---|
| 1. | భూమిపరిమాణం (ఎకరాలలో) | | | |
| 2. | నీటిపారుదల వసతులు | | | |
| 3. | వ్యవసాయపు పనిముట్లు | | | |
| 4. | ఎరువుల వినియోగం | | | |
| 5. | వేరుసెనగ అమ్మే విధానం | | | |
| 6. | ఇతర పనులు | | | |

8. చిన్న, సన్నకారు రైతుల సమస్యలను తెలుపుతూ ఇటీవల వార్తాపత్రికలలో వచ్చిన వార్తలను సేకరించండి. వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలను తీసుకుంది?

9. ఇటీవల కాలంలో రైతులు ఆహార ధాన్యాల ఉత్పత్తి నుండి వాణిజ్య పంటల ఉత్పత్తి వైపు మొగ్గుచూపుతున్నారు. దీని వలన ఎటువంటి సమస్యలు తలెత్తుతాయి?

10. మీ పాఠ్యపుస్తకం పేజీ నెం. 59లోని 'ఒప్పందపు వ్యవసాయం' అనే పాఠ్యభాగం చదవండి, వ్యాఖ్యానించండి.

11. అట్లాస్ సహాయంతో భారతదేశంలో వేరుసెనగ పండే ప్రాంతాలను గుర్తించండి.

## ప్రాజెక్టు

1. మీ టీచర్ సహాయంతో ఒక చిన్నరైతును, పెద్ద రైతును ఇంటర్వ్యూ చేయండి. వ్యవసాయ విధానాన్ని, సేద్యం చేసే భూమి పరిమాణాన్ని, సాగు పద్ధతులను, పంట ఎలా అమ్ముతారు, ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు వంటి అంశాలను పోలుస్తూ, పూర్తి సమాచారాన్ని తయారుచేయండి. ఈ విషయాలను వెంకటాపురం గ్రామంలోని విషయాలతో పోల్చండి.

2. మీ పాఠశాల నగరంలో ఉంటే మీ కాలనీలో ఉండేవారి వృత్తుల పట్టికను తయారుచేయండి. ఆ వృత్తులను స్వయం ఉపాధి, తాత్కాలిక ఉద్యోగులు, శాశ్వత ఉద్యోగులు అనే మూడు రకాలుగా వర్గీకరించండి. వీటిని గురించి మీ తరగతిలో వివరంగా చర్చించండి.

SCERT TELANGANA

పాఠం

# 8 వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం

మొదటి భాగం

ప్రతిరోజూ మనమందరం బియ్యం, పప్పులు, నూనె, కూరగాయలు, పండ్లు, పాలు, చక్కెర, టీ, కాఫీ మొదలైనవాటిని వినియోగిస్తాం. ఇందులో చాలా వస్తువులను రైతులు పండిస్తారు. కొన్ని ప్రాసెసింగ్ అయి వివిధ మార్గాల ద్వారా మనకు చేరతాయి. ప్రతి రోజు మనం ఉపయోగిస్తున్న వస్తువులతో కింద ఇచ్చిన పట్టికను నింపండి. వీటన్నింటిని మనం ఎక్కడి నుంచి పొందుతున్నామో రాయండి?

| సంఖ్య | రకం | వస్తువు | ఎక్కడనుంచి పొందుతారు |
|---|---|---|---|
| 1. | ఆహార పదార్థాలు | | |
| 2. | పప్పులు | | |
| 3. | నూనె | | |
| 4. | సుగంధద్రవ్యాలు | | |
| 5. | కూరగాయలు | | |
| 6. | పండ్లు | | |
| 7. | పంచదార | | |
| 8. | టీ, కాఫీ | | |

ప్రజలు వ్యవసాయ ఉత్పత్తులను వీధులలో అమ్మేవారినుండి, సంతలు, చిన్న దుకాణాల దగ్గరినుంచి పొందుతారు. ఈ మధ్యకాలంలో రైతులు కూడా రైతు బజారులలో పండ్లను, కూరగాయలను అమ్ముతున్నారు. ఈ పాఠ్యభాగంలో ఈ ప్రక్రియలు ఎలా జరుగుతాయో మనం తెలుసుకుందాం!

### వీధులలో కూరగాయల అమ్మకం

శ్రీపురం గ్రామంలో గౌరి నివసిస్తుంది. ఆమె ఇంటింటికీ తిరిగి కూరగాయలు అమ్ముతుంది. ఆమె సీజన్‌లో లభించే కూరగాయలను సమీప పట్టణంలో టోకు వర్తకుల దగ్గర కొనుగోలు చేసి, నెత్తిమీద బుట్టలో పెట్టుకొని వీధుల్లో తిరుగుతూ అమ్ముతుంది. ప్రతి ఇంటికీ వెళ్తూ, అక్కడ నివసించే వారికి కూరగాయలు కావాలా అని అడుగుతుంది. ఆ గ్రామంలో మరో ఇద్దరుముగ్గురు మహిళలు ఆమె లాగే కూరగాయలు అమ్ముతారు.

ప్రతి రోజూ ఆమె గ్రామంనుంచి ఉదయం 4 గంటలకు బయలుదేరి పట్నంలో టోకు వర్తకుల దగ్గర కూరగాయలు కొంటుంది. రాను, పోను బస్సు ప్రయాణానికి ఆమెకు 25 రూపాయల ఖర్చు అవుతుంది. ఆమె సాధారణంగా కూరగాయలను తన ఇంట్లో నిలవ ఉంచుకొని, బుట్టలో ఒకసారి నింపుకొని

SCERT TELANGANA




చిత్రం 8.1: కూరగాయల బుట్ట మోస్తున్న గౌరి

బయలుదేరుతుంది. ఒకసారి కూరగాయలు అమ్మిన తరవాత ఇంటికి వెళ్ళి బుట్టలో నింపుకొని మళ్లీ వీధుల్లో అమ్ముతుంది. మధ్యలో ఆమె ఇంట్లో వంట కూడా వండుకుంటుంది. పిల్లలను బడికి తయారు చేస్తుంది. ఇంతటి పనిభారం వల్ల ఆమె బాగా అలసిపోతుంది. తరచుగా అనారోగ్యానికి గురై కొన్ని రోజులపాటు ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటుంది.

ఆమె వినియోగదారులకు ఏ ధరకు అమ్ముతుంది? ఉదాహరణకు ఆమె 10 కిలోల టమోటాలు 100 రూపాయలకు కొని, 15 రూపాయలకు కిలో చొప్పున అమ్ముతుంది. కాని అన్నింటిని అదే ధరకు అమ్మలేదు. ఒక వేళ టమోటాలు బాగా పండిపోతే, ఆమె కిలో 10 రూపాయలకు లేదా 5 రూపాయలకు కూడా అమ్మవచ్చు. ఉదయం సమయంలో ఆమె కిలో 15 రూపాయలకు, సాయంత్రం సమయంలో కిలో 8 లేదా 9 రూపాయలకు అమ్మవచ్చు. మొత్తానికి ఆమె రోజుకి 100–150 రూపాయలు సంపాదిస్తుంది. ఈ డబ్బు ఆమె కుటుంబ అవసరాలను తీర్చలేదు.

- ఆమె తన ఆదాయాన్ని పెంచుకోడానికి కిలో టమాటాలను 20 రూపాయలకు అమ్ముతుందని మీరు అనుకుంటున్నారా?

గౌరి తనకు వచ్చిన ఆదాయాన్ని మరుసటి రోజుకు వస్తువులు కొనుగోలు చేయడానికి ఉంచుకుంటుంది. లేకపోతే, ఆమె వడ్డీవ్యాపారుల దగ్గరగానీ, స్వయం సహాయక సంఘాల నుంచి కానీ, టోకు వ్యాపారుని వద్దగానీ అప్పు తీసుకోవలసి ఉంటుంది. ఆమెకు అప్పు ఇవ్వడానికి వాళ్లు ఎప్పుడూ నిరాకరించరు. కాని డబ్బు ఇచ్చే నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. ఒకవేళ ఆమె వడ్డీవ్యాపారుని వద్ద లేదా టోకు వర్తకుని వద్ద 500 రూపాయలు తీసుకోవలసి వస్తే వాళ్ళు కేవలం 450 రూపాయలు ఇస్తారు. కాని ఆమె మరుసటి రోజే 500 రూపాయలు చెల్లించాలి. ఆమెకు మరో తీవ్రమైన సమస్య ఏమంటే ఒకవేళ ఆమె అనారోగ్యంగా ఉండి అదే రోజు కూరగాయలు అమ్మే స్థితిలో లేకపోతే అవి పూర్తిగా చెడిపోయి వాటికి తక్కువ ధర వస్తుంది.

మన రాష్ట్రంలో వేలాదిమంది సంచార వర్తకుల్లో గౌరి ఒకరు. పట్టణాల్లో చాలామంది వర్తకులు శాశ్వత షాపులను పురపాలక సంస్థ అనుమతితో లేదా ప్రైవేటు దుకాణదారుల ద్వారా అద్దెకు తీసుకొని నిర్వహిస్తుండగా, కొందరు సొంతషాపులలో వర్తకం నిర్వహిస్తున్నారు. కొందరు పట్టణ, పంచాయతి లేదా నగరపాలకులకు కొంత డబ్బు చెల్లించి వ్యాపారం చేసుకుంటున్నారు.

గౌరివంటి సంచార వర్తకులు అనేక జీవన సమస్యలను ఎదుర్కొంటూ అప్పులపాలవుతున్నారు. వాళ్ళు వడ్డీ వ్యాపారులనుంచి అప్పులు తీసుకొని వాళ్ళకు వడ్డీ, అసలు చెల్లించడానికి సంపాదనలో ఎక్కువ భాగాన్ని చెల్లిస్తున్నారు. సాధారణంగా బ్యాంకులు ఇలాంటి చిన్నవ్యాపారులకు అప్పులు ఇవ్వవు. రెండోది ఈ చిన్న వ్యాపారులకు కూరగాయలను నిలవచేసుకోడానికి రిఫ్రిజిరేటర్ వంటివి ఉండవు. అమ్మగా మిగిలిన కూరగాయలను సరిగా నిలవ చేయకపోవడం వల్ల తక్కువ ధరలకే అమ్మవలసి వస్తుంది. దీనికి భిన్నంగా పెద్ద వర్తకులకు శీతలీకరణపు సౌకర్యాలు లేదా గోడౌన్లు ఉంటాయి. వాళ్ళు తక్కువ వడ్డీరేట్లకు బ్యాంకుల దగ్గర రుణసౌకర్యాన్ని పొందుతున్నారు. అందువల్ల వీరు అధిక ఆదాయాన్ని పొందుతూ ధనవంతులవుతున్నారు. చిన్న వర్తకులు మాత్రం నిరుపేదలుగానే వుంటున్నారు.

SCERT TELANGANA

- అప్పు ఇవ్వడానికి వడ్డీ వ్యాపారి పెట్టే నిబంధనలు, విధానాలు ఏమిటి?
- శాశ్వత దుకాణాలు గల పెద్ద వ్యాపారస్తులకు మాత్రమే బ్యాంకులు ఎందుకు అప్పులు ఇస్తున్నాయి?
- గౌరివంటి సంచార వర్తకులకు ప్రభుత్వం ఏ మార్గాల ద్వారా సహాయం చేయవచ్చు?

### సంత

ఒక ప్రదేశంనుంచి మరొక ప్రదేశానికి మారే అంగళ్ళ గురించి మీకు తెలుసా? సంతలు అనేవి అలాంటివే. నిర్దేశిత ప్రాంతాలలో, నిర్దేశించిన రోజున వర్తకులు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి మారుతూ వస్తువులను అమ్ముతారు. సంతలలో అమ్మే వర్తకులు పట్టణాలలో లేదా నగరాలలో ఉండే టోకు దుకాణాల నుంచి కొనుగోలు చేసి, పెద్ద మొత్తంలో ప్రజలు గుమిగూడే సంత ప్రాంతాలకు చేరుస్తారు. మన దేశంలో ఈ విధంగా నడిచే సంతలు సుమారుగా 25,000 ఉన్నాయంటే మీరు నమ్ముతారా? అవి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కూడా పనిచేస్తాయి. తెలంగాణలోని ఒక సంత గురించి సవివరంగా తెలుసుకుందాం!

### చౌటుప్పల్‌లో ఆదివారం సంత

చౌటుప్పల్ యాదాద్రి జిల్లాలో ఒక గ్రామం. ఇక్కడ 200 పైగా వర్తకులు ఆదివారం కూరగాయలు, పండ్లు, వస్త్రాలు, మాంసం, చేపలు, ఎండుచేపలు, చేతితో తయారుచేసిన పనిముట్లు, రెడీమేడ్ చెప్పులు, సౌందర్య లేపనాలు మొదలైన అనేక వస్తువులను అమ్ముతారు. గేదెలు, మేకలు, గొర్రెల వ్యాపారం కూడా జరుగుతుంది. చుట్టుపక్కల ఉండే 40 గ్రామాల ప్రజలు వస్తువులను కొనడానికి చౌటుప్పల్ సంతకు వస్తారు.

చౌటుప్పల్ సంతలో పశువుల వ్యాపారానికి, కిరాణా వస్తువులకు, తినుబండారాలు వస్తువులను అమ్మడానికి ప్రత్యేక స్థలాలు ఉన్నాయి. ఈ మార్కెట్‌లో కూరగాయలు, బట్టలు వంటివి అమ్మే ప్రతి వర్తకునికీ ప్రత్యేకంగా సొంత స్థలం ఉంటుంది. అది వారికి నిర్దేశించిన స్థలం. పశువుల వ్యాపారానికి వాటిని నిలుపుకోవడానికి షెడ్లు కూడా ఉన్నాయి.

### ఇంద్ర-ఎండుమిర్చి వ్యాపారి

ఇంద్రకు 36 సంవత్సరాల వయస్సు. ఆమె చాలా సంవత్సరాల నుంచి ఎండు మిర్చి అమ్ముతోంది. ఆమె చౌటుప్పల్‌కు 50 కి.మీ. దూరంలోని కట్టంగూర్ గ్రామ





*చిత్రం 8.2: సంత*

SCERT TELANGANA

నివాసిని. ఈమె 10వ తరగతి వరకు చదువుకుంది. ఆమె కూతురు, కొడుకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఆమెకంటే ముందు ఆమె తండ్రి కూడా ఇదే వ్యాపారం చేసేవాడు. ఆమె తండ్రి దగ్గర వ్యాపారం నేర్చుకుంది. ఆమె భర్తకూడా ఇదే వ్యాపారం చేస్తున్నాడు. వారంలో ఆమె నాలుగు సంతలకు, మూడు పెద్ద గ్రామాలకు వెళ్లి ఎండుమిర్చి అమ్ముతుంది.

ఆమె కింది ప్రదేశాలలో సంతలకు వెళుతుంది.




ఇంద్ర ప్రతి రోజూ ఉదయాన్నే మేల్కొని ఇంటి పనులు అన్ని ముగించుకొని సంతగ్రామానికి ఎండుమిర్చి బస్తాలతో బయలుదేరుతుంది. ఆమె ఉదయం 10 గంటలకు అమ్మడం ప్రారంభించి సాయంత్రం 7 గంటలకు ముగిస్తుంది.

ఇంద్రతో పాటు కొంత మంది స్త్రీలు కలసి లారీ, ట్రాలీ, ఆటోను అద్దెకు తీసుకొని ఎండు మిర్చి బస్తాలను సంతలకు చేరుస్తారు. ఖమ్మంలోని టోకువర్తకులతో ఫోన్‌లో మాట్లాడి ఎండు మిర్చి కొంటుంది. టోకు వర్తకులు ప్రతి శనివారం గ్రామానికి వచ్చి డబ్బులు తీసుకొని వెళతారు.

అందరు వ్యాపారుల మాదిరిగానే ఇంద్ర ఎండుమిర్చి అమ్మడానికి నేలమీద కూర్చుంటుంది. ఇది చాలా కష్టంతో కూడిన పని. వారంలో ఆరు రోజులు ఆమె వేరువేరు గ్రామాలకు ప్రయాణం చేస్తుంది. ఒక రోజు మాత్రమే తన గ్రామంలో అంగడి పెడుతుంది. ఆ రోజే టోకు వర్తకులకు డబ్బు కూడా చెల్లిస్తుంది.

ఇంద్ర రోజుకు 200-300 రూపాయలు సంపాదిస్తుంది. అయితే దీనికి గ్యారంటీ ఏమీ లేదు. అది ఆమెకు జరిగే వ్యాపారం మీద ఆధారపడి ఉంటుంది. ఈమె ఫోన్ ఆర్డర్ ద్వారా ఎలాంటి పరిశీలనా లేకుండా ఎండుమిర్చి బస్తాలను తీసుకుంటుంది. అందువలన కొన్ని సమయాల్లో నాణ్యతలేని ఎండు మిర్చి కొనుగోలు చేయడం వల్ల నష్టపోతుంది.

వ్యాపారం కోసం ఇంద్ర తాను సభ్యురాలిగా ఉన్న స్వయంసహాయక బృందం నుంచి 30,000 రూపాయలు అప్పు తీసుకుంది. ఆమె ప్రతి నెలా 1200 రూపాయల చొప్పున అప్పును తిరిగి చెల్లిస్తుంది. వడ్డీవ్యాపారులకు ప్రతి 100 రూపాయలకు 3 రూపాయల వడ్డీ ఇచ్చే కంటే తక్కువ వడ్డీ ఉండే స్వయం సహాయ బృందం నుంచి అప్పు తీసుకోవడం మంచిదని ఆమె భావించింది. స్వయంసహాయక బృందంలో కేవలం నెలకు 100 రూపాయలకు 25 పైసల వడ్డీ మాత్రమే చెల్లిస్తుంది. ప్రభుత్వ పథకమైన "పావలా వడ్డీ" వల్ల ఇది సాధ్యమయింది.

ఒకవైపు వ్యవసాయ ఉత్పత్తులైన మిర్చితోపాటు మరొకవైపు పారిశ్రామిక ఉత్పత్తులైన బట్టలు, రెడీమేడ్ వస్తువులు, బిందెలు, పరికరాలు, ప్లాస్టిక్ వస్తువులు మొదలైన సరుకులను వర్తకులు ఈ సంతలలో అమ్ముతారు. వర్తకులందరూ గ్రామ పంచాయితీకి 10 రూపాయల చొప్పున పన్ను చెల్లిస్తారు. ప్రత్యేక స్థలంలో పశువులు, మేకలు, గొర్రెలు కూడా అమ్ముతారు.

SCERT TELANGANA

పశువులను సుదూర ప్రాంతాలనుంచే కాకుండా పరిసర గ్రామాలనుంచి కూడా తీసుకువస్తారు. చాలామంది రైతులు పశువులను అమ్మడానికి, కొనడానికి బ్రోకర్ల సహాయం తీసుకుంటారు. రైతుల మధ్య ఈ లావాదేవీలు జరిపినందుకు వీరు కొంత కమీషన్ తీసుకుంటారు.

సంతలలో సుమారుగా 3/4 వంతు మంది స్త్రీలు ఉంటారు. చాలామంది వర్తకులకు సంతలో అమ్మడం సాంప్రదాయిక వృత్తిగా ఉంది. అంటే వాళ్ల కుటుంబాలు తరతరాలనుంచి ఇదే వ్యాపారం చేస్తూ వస్తున్నాయి. సంతలలో కొన్ని ప్రదేశాలను ప్రత్యేక వ్యాపారంకోసం కేటాయిస్తారు. వేరే వర్తకులు అక్కడ అంగడి ఏర్పాటు చేసుకోకూడదు. చాలా మంది వర్తకులు సంతలను వారపు చక్రంగా నిర్వహిస్తారు. వారానికి ఒకసారి అదే ప్రదేశానికి వచ్చి అంగడి ఏర్పాటు చేసుకుంటారు. వాళ్ళ సౌకర్యాన్ని బట్టి ఏఏ సంతలకు వెళ్ళాలో నిర్ణయించుకుంటారు.

చిన్నవర్తకులు వ్యవసాయ ఉత్పత్తులైన పండ్లు, కూరగాయలు వంటి తొందరగా చెడిపోయే వస్తువులను అమ్ముతారు. వీళ్ళు కూడా గౌరి మాదిరిగానే అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. వాళ్ళ నివాసాలు సంతలకు దూరంగా ఉంటాయి. టోకు మార్కెట్ నుంచి కొనుగోలు చేసి సంతలలో అమ్ముతారు. వాళ్ళకు నిలవ చేసుకునే సదుపాయాలు ఉండవు. సంత వ్యాపారులు వాళ్ళ వస్తువులను ఇళ్లలోనే నిలవచేసుకుంటారు. ఒక వేళ వాళ్ళు సాయంత్రం వరకు అమ్మకపోయినా, పాడై పోయినా వాటిని తిరిగి తీసుకువెళ్ళడానికి మళ్ళీ రవాణా ఖర్చులు భరించాల్సి ఉంటుంది. కొన్ని సమయాలలో వాళ్ళు కొనుగోలు చేసిన ధరకంటే తక్కువ ధరకు అమ్మి నష్టాలను తగ్గించుకుంటారు.

మరొకవైపు, ఇంద్రలా రోజు వచ్చి అమ్మే వ్యాపారులతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా సంతలలో తమ ఉత్పత్తులను తామే అమ్ముకోవడానికి సంతలకు వస్తారు.

ఈ విధంగా సంతలు చాలామంది ప్రజల అవసరాలు తీరుస్తూ చాలా మంది చిన్న వర్తకులకు, కూలీలకు, రవాణాదారులకు జీవనాధారాన్ని కలిగించడంలో ముఖ్యపాత్ర వహిస్తాయి.

- శాశ్వత మార్కెట్‌లకు, సంతలకు తేడాలు ఏమిటి?
- శాశ్వత మార్కెట్ ఉన్నప్పటికీ మీకు సంత అవసరం ఉందా? ఎందుకు?
- సంతలలోని చిన్న వర్తకుల జీవితాలను ఏ విధంగా బాగుపరచాలని నీవు అనుకుంటున్నావు?

### తెలంగాణలో రైతుబజార్లు

వ్యవసాయ ఉత్పత్తులైన ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలు టోకు వర్తకులకు అమ్ముతారు. చిన్న వర్తకులు వీటిని కొనుగోలు చేసి వినియోగదారులకు అమ్ముతారు. అయితే ఉత్పత్తిదారులే నేరుగా తమ వస్తువులను వినియోగదారులకు అమ్మే మార్కెట్లు చాలా తక్కువ. రైతు బజారులు ఇలాంటి మార్కెట్లే.



*చిత్రం 8.3: రైతు బజారు*

SCERT TELANGANA

మేము రైతు బజారులో రామగోపాల్‌ను ఇంటర్వ్యూ చేశాం. ఆ వివరాలు సంక్షిప్తంగా ఇక్కడ ఇస్తున్నాం.

**మీరు ఈ బజార్‌కు ఎప్పటి నుంచి వస్తున్నారు?**

నేను 2003 సంవత్సరం నుంచి ఇక్కడకు వస్తున్నాను. మా ఇరుగుపొరుగువాళ్ళు 2000 సంవత్సరం నుంచి వస్తున్నారు.

**కేవలం మీలాంటి రైతులు మాత్రమే రైతుబజార్‌లో సరుకులు అమ్ముతారా?**

మొదట్లో ప్రభుత్వ ఉద్యోగులు మా గ్రామానికి వచ్చి బజారును నడిపారు. తరవాత మా పేరు, చిరునామా, ఉత్పత్తిచేసే పంట, భూమి వివరాలతో కూడిన గుర్తింపు కార్డు ఇచ్చారు. ఇలా గుర్తింపు కార్డు ఉన్న వ్యక్తి మాత్రమే రైతుబజారుకు వచ్చి తన ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. బజారులో ఉండే దుకాణానికి ఎవరు ముందుగా వస్తారో వారే ఆ దుకాణదారు. రైతు బజారులో రైతులకు మాత్రమే ప్రవేశం ఉన్నప్పటికీ ఒకరిద్దరు మిల్లర్‌లను, స్వయంసహాయకబృందం నుంచి ఇద్దరు మహిళలను అక్కడ నేను గమనించాను. వారికి సొంత షాపులు ఉన్నాయి. మిల్లర్‌లు మా దగ్గరినుంచి వడ్లు కొనుగోలు చేస్తారు. స్వయంసహాయక బృందాలవారు మా జిల్లాలో ఉత్పత్తి అయ్యే కూరగాయలను కొని అమ్ముతారు.

**మీ ఉత్పత్తులు అమ్మడానికి ఏమైనా అద్దె చెల్లిస్తారా?**

లేదు. మిల్లర్‌లు, స్వయంసహాయక బృందం వాళ్ళు మాత్రం నిబంధనల ప్రకారం అద్దె చెల్లిస్తారు.

**మీరు రైతుబజారుకు రావడం ఎలా జరిగింది?**

ఇంతకు ముందు ఉత్పత్తులను టోకు వ్యాపార మార్కెట్‌కు తీసుకుపోయేవాణ్ణి. నాకు అక్కడ టోకు వర్తకుడు నిర్ణయించిన ధరకే అమ్మవలసి ఉండేది. చాలాసార్లు నా కూరగాయలను చాలా తక్కువ ధరకే అమ్మాను. కనీసం నేను పెట్టిన ఖర్చు కూడా రాలేదు. రైతుబజార్‌లు నాలాంటి రైతులకు మంచి అవకాశమిస్తాయి. నాలాంటి రైతులు సుమారు 10-15 గ్రామాల నుంచి ఇక్కడకు వస్తున్నట్లు నాకు తెలుసు. కానీ ఇక్కడ మా కూరగాయలు నిలవ చేసేందుకు తగినంత స్థలం లేదు.

**మీ ఉత్పత్తులకు ధరలు ఎలా నిర్ణయిస్తారు?**

రైతు బజారులో ఉత్పత్తుల ధర నిర్ణయించడానికి కమిటీ ఉంటుంది. ఇందులో ముగ్గురు రైతులు, ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. టోకు వర్తకుని దగ్గర కొనే ధరల కంటే 25% ఎక్కువగాను, చిల్లర వర్తకులు అమ్మే ధరలకు 25% తక్కువగాను ధర నిర్ణయిస్తారు.

**రైతు బజారులో వినియోగదారులు తృప్తిగా ఉన్నారని మీరు భావిస్తున్నారా?**

ఔను. ఇక్కడ వాళ్ళు పండ్లు, కూరగాయలు మాత్రమే కాదు, చాలా ముఖ్యమైన బియ్యం, పప్పు, చింతపండు, ఎండుమిర్చి, వంటనూనెలు కూడా కొనుక్కుంటారు. నేను కూరగాయలు పండిస్తాను. నా వినియోగదారులు బేరమాడుతూ ఆత్రంగా నా ఉత్పత్తులను కొంటారు. ఆ సంతోషాన్ని నేను మాటల్లో చెప్పలేను. నేను కష్టపడి పండించిన వాటికి పూర్తి ధరను, వినియోగదారులు వారి డబ్బు విలువకు తగ్గట్లు వస్తువులు రైతు బజారులో పొందడం జరుగుతూ ఉంది. మేము చదువుకొని ఉంటే ఇంటర్నెట్ ద్వారా వివిధ మార్కెట్‌లలో ధరలు తెలుసుకుని ఎక్కువ ధరలు ఉండే మార్కెట్‌లకు వెళ్లేవాళ్లం.

**రైతుబజారులో మీరెప్పుడైనా సమస్యలు ఎదుర్కొన్నారా?**

కొన్నిసార్లు ఎదుర్కొన్నాను. నేను ఆలస్యంగా వస్తే, కూరగాయలు అమ్మడానికి సరియైన స్థలం దొరకదు. ఏదో మూలకు కూర్చోవాలి. మా వాహనాలను నిలపడానికి సరిపడినంత స్థలం ఉండదు. కొంతమంది బినామీ రైతులు కూరగాయలు అమ్మడానికి బజారుకు వస్తున్నారు. రైతుబజారుకు దూరంగా ఉన్న రైతులు ఈ లాభాలను పొందలేకపోతున్నారు.

SCERT TELANGANA

- రైతుబజారులో రైతులు మాత్రమే అమ్మకపు-దారులుగా ఉంటారా?
- రైతుబజారులో ఎవరు లబ్ధిదారులు? ఎందువల్ల?
- రైతు బజారులో రైతు పొందే లాభాలేమిటి?
- రైతుబజారులో ధరలు ఎలా నిర్ణయిస్తారు?




చిత్రం 8.4: రైతు బజారు ధరల పట్టిక

### కీలకపదాలు

టోకు వర్తకులు

చిల్లర వర్తకులు

మార్కెట్

సంత

రైతు బజార్

పావలా వడ్డీ

స్వయం సహాయక బృందాలు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. వ్యవసాయ ఉత్పత్తులను ఏ విధంగా అమ్ముతారు?
2. గౌరి, ఇంద్ర, రామగోపాల్‌ల మధ్యగల భేదాలను కింది అంశాలలో గుర్తించండి.

| | గౌరి | ఇంద్ర | రామగోపాల్ |
|---|---|---|---|
| వ్యాపారంచేయడానికి డబ్బు ఎలా పొందుతారు? | | | |
| వస్తువులను ఎక్కడ అమ్ముతున్నారు? | | | |
| ధరలు ఏ విధంగా నిర్ణయిస్తారు? | | | |

SCERT TELANGANA

3. చిల్లర వర్తకులు వ్యాపారం చేసేటప్పుడు ఎదుర్కొనే సమస్యలను రాయండి.
4. చిల్లర వర్తకులు వాళ్ళ ఆదాయాలను పెంచుకోడానికి గల మార్గాలేమిటి?
5. వడ్డీ వ్యాపారుల కంటే స్వయంసహాయక బృందం నుంచి అప్పు పొందడం ఎందువల్ల లాభదాయకం?
6. వడ్డీ వ్యాపారులకు, బ్యాంకులకు గల పోలికలు, భేదాలు ఏమిటి?
7. టోకు దుకాణాల్లో అమ్మడంకంటే రైతుబజారుల్లో అమ్మడం మంచిదని మీరు ఎందుకు అనుకుంటున్నారు?
8. పేజి నెం. 66లోని "గౌరీ వంటి సంచార వర్తకులు ...... మాత్రం నిరుపేదలుగానే వుంటున్నారు". పేరాను చదివి, వ్యాఖ్యానించండి.
9. మీ జిల్లా పటంలో, మీ జిల్లాలో సంతలు జరిగే ప్రదేశాలను ఉపాధ్యాయుని సహాయంతో గుర్తించండి.
10. రైతుబజారు అంటే ఏమిటి? దానిలో లాభాలు, పరిమితులు ఏమిటి?
11. చౌటుప్పల్ సంతలో వర్తకుల నుంచి మున్సిపాలిటీ/ గ్రామపంచాయతీ డబ్బు ఎందుకు వసూలు చేస్తుంది?

## ప్రాజెక్టు

1. మీ ప్రాంతంలో తిరిగే కూరగాయల వ్యాపారులను కలసి, వాళ్ల పనిని, జీవన విధానాన్ని, సమస్యలను తెలుసుకొని ఒక నివేదిక తయారుచేసి మీ తరగతిలో చర్చించండి.
2. మీ సమీపంలో గల సంతకు వెళ్లి అక్కడ జరిగే పనులను పరిశీలించండి. సంత చిత్రం వేసి మీ తరగతి గదిలో ప్రదర్శించండి.

SCERT TELANGANA

పాఠం

8

రెండో భాగం

# వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం

*గత పాఠంలో వివిధ ఉత్పత్తులను గ్రామాల్లో, పట్టణాలలో వినియోగదారుల దగ్గరకు చిన్న వర్తకులు ఎలా తీసుకువస్తారో చూశాం. చిల్లర వర్తకంలో కొన్ని అంశాలను చూశాం. ఈ పాఠ్యభాగంలో టోకు వర్తకంలో వరి అమ్మకానికి సంబంధించిన కొన్ని అంశాలను గురించి తెలుసుకుందాం. వరిధాన్యం రైతుల నుంచి పెద్ద మొత్తంలో బియ్యపుమరల యజమానులు, పెద్ద వర్తకులు కొనుగోలు చేస్తారు. ఇది ఎలా జరుగుతుందో చూద్దాం!*

## వ్యవసాయ మార్కెట్ యార్డ్

రైతుబజారు మాదిరిగానే ప్రభుత్వం నిర్వహించే వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కూడా రైతులు తమ వరి ధాన్యాన్ని అమ్మి, వెంటనే డబ్బును పొందుతారు.

చంద్రశేఖర్ అనే రైతు నల్లగొండ నివాసి. ఈ సంవత్సరం ఆయనకు పంట బాగా పండి 60 క్వింటాళ్ళ వరిధాన్యం ఉత్పత్తి అయింది. అతడు వడ్ల బస్తాలను ట్రాక్టర్‌లో నింపుకొని నల్లగొండ వ్యవసాయ మార్కెట్ యార్డు (A.M.Y)కు తీసుకువచ్చాడు. అతడు వరిధాన్యాన్ని దింపుకొని వేలం అమ్మకం వరసలో చేరాడు.

ఉదయం 10 గంటలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు వచ్చి, రైతుల ధాన్యపు బస్తాలపైన రైతుల పేర్లు, ధాన్యపు పరిమాణాన్ని తెలిపే చీటీలను ఉంచారు. ఉదయం 11 గంటలకు టోకు వర్తకులు, బియ్యపుమరల యజమానులు వచ్చి వడ్ల నాణ్యతను పరిశీలించారు. అప్పుడు కమిటీ సభ్యులు మొదటి రైతు వరికుప్ప వద్ద పాట ప్రారంభించారు. వరికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (M.S.P) క్వింటాలుకు 1080 రూపాయలు. కమిటీ సభ్యులు ఆ ధర నుంచి పాట ప్రారంభించారు.

## కనీస మద్దతు ధర

ప్రభుత్వం ప్రతి సంవత్సరం వరి, గోధుమ, వేరుశెనగ మొదలైన పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటిస్తుంది. ఒకవేళ వర్తకులెవరూ ఆ ధరకు కొనుగోలు చేయడానికి సిద్ధంగా లేనప్పుడు ప్రభుత్వ సంస్థలు, భారత ఆహార సంస్థ (F.C.I) వంటి సంస్థలు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు రైతులదగ్గరి నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తాయి. రైతుల పెట్టుబడులను దృష్టిలో ఉంచుకొని వాళ్ళకి నష్టం కలగకుండా మద్దతు ధరలను ప్రభుత్వం నిర్ణయిస్తుంది. కనీసపు మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు వర్తకులు కొనుగోలు చేస్తే అమ్మే స్వేచ్ఛ రైతుకు ఉంటుంది.

వేలంపాట సమయంలో కొనుగోలుదారులు వరి ధాన్యాన్ని ఏ ధరకు కొనడానికి సిద్ధంగా ఉన్నారో తెలుపుతుంటారు. వర్తకులు తమ ధర పలికిన తర్వాత వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు ఒకటవసారి, రెండవసారి, మూడవసారి అని మూడుసార్లు పలుకుతారు. మూడు అని పలకక ముందు ఎవరైనా ధరను పెంచవచ్చు. మూడు అని పలికితే ఆ రాశికి వేలంపాట ముగిసినట్లు. చివరిగా పలికిన ధర ఆ రైతుకు లభిస్తుంది. పాట ముగిసిన తర్వాత మళ్ళీ పాడే అవకాశం ఉండదు. ఇతర రాశులలో కూడా ఇలాగే కొనసాగుతుంది.

SCERT TELANGANA

చాలామంది వర్తకులు, బియ్యం మరల ప్రతి నిధులు, చంద్రశేఖర్ వరి రాశి చుట్టూ గుమి గూడారు. అతని వడ్లు బాగా ఎండాయి. వాటిలో కొద్దిగా తాలు ఉంది. పాట ప్రారంభమైన తర్వాత వర్తకులు, బియ్యంమరల ప్రతి నిధులు వడ్ల నాణ్యతను బట్టి రేటు పెంచుతారు. ఆ రోజు చంద్రశేఖర్ క్వింటాలుకు 1150 రూపాయలు పెద్ద రైస్ మిల్లు ఏజెంట్ ద్వారా పొందాడు. చాలామంది ఇతర రైతులు వరి ధాన్యానికి క్వింటాలుకు 1100 రూపాయలు పొందారు.



*చిత్రం 8.5: వ్యవసాయ మార్కెట్ యార్డ్*

వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు వరి రాశులకు వివిధ వర్తకులు పాడిన పాటలను నమోదు చేసుకున్నారు. తిరిగి కార్యాలయానికి వెళ్ళి, పాట పాడిన వర్తకుల పేర్లు, చీటీనంబర్లు నమోదు చేసుకొని, అత్యధిక ధర పలికిన వర్తకుని పేరు, పాడిన ధర చంద్రశేఖర్‌కు తెలియజేశారు. అతడు ఆ ధరకు అమ్మడానికి అంగీకరించాడు. కమిటీ సభ్యులు క్వింటాలు ధరను, మొత్తం రూపాయలను నమోదుచేసి చీటిని ఆయనకు ఇచ్చారు. ఒకవేళ ఆ ధరకు అమ్మడానికి అతడు అంగీకరించకపోతే, అతడు మరుసటి రోజుకు లేదా ఒకవారం వరకు వేచి ఉండవచ్చు.

వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు చేసినందుకుగాను, వర్తకులు కొంత రుసుం చెల్లించాలి. ధాన్యం కొనుగోలు చేసినప్పుడు ఆ మొత్తానికి నూటికి 1 రూపాయి చొప్పున కమిటీకి కమిషన్‌గా చెల్లించవలసి ఉంటుంది. రైతులు మాత్రం ఏమీ చెల్లించవలసిన అవసరం లేదు. కాని నిజానికి రైతులు కూలి ఖర్చు, దింపుడు ఛార్జీలు, పరిశుభ్రత నిర్వహణకు ప్రతి 100 రూపాయలకు 3.50 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని రైతులకు డబ్బు చెల్లించే వర్తకుల నుంచి మినహాయించుకుని వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెల్లిస్తారు.

- ఈ పద్ధతి మంచిదని మీరు భావిస్తున్నారా?
- ఈ పద్ధతి వలన రైతులు ఏ విధంగా లాభం పొందుతున్నారు?

వ్యవసాయ మార్కెట్‌లో రైతులు అమ్మదలచినప్పుడు రవాణా ఖర్చులు, ఇతర ఖర్చుల రూపంలో క్వింటాలుకు పది రూపాయలు అవుతాయి. ఇది తమ గ్రామంలో అమ్మేదానికి అయ్యే ఖర్చుకంటే ఎక్కువ.

బియ్యంమర ప్రతినిధి చంద్రశేఖర్ దగ్గరకు వచ్చి చీటీలో ఉన్నదాన్నిబట్టి వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఛార్జీలను మినహాయించి మిగతా మొత్తం చెల్లించాడు.

SCERT TELANGANA

- చంద్రశేఖర్‌కు అతడు ఇచ్చిన మొత్తాన్ని లెక్కవేసి చెప్పగలరా?

మొత్తం వడ్లు =............. క్వింటాళ్ళు

క్వింటాలు ధర =................... రూపాయలు

మొత్తం ................... × ..............

=........................... రూపాయలు


ఎత్తడం, దింపడం (లోడింగ్), పరిశుభ్రత నిర్వహణకు =

రూ|| 3.50 × ......................

చంద్రశేఖర్‌కు చెల్లించిన మొత్తం =

........ - ..........= .........

- వ్యవసాయ ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అమ్మడంవల్ల లాభాలు, నష్టాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?


**వ్యవసాయ మార్కెట్ కమిటి, చౌటుప్పల్**

**జిల్లా. యాదాద్రి**

**మార్కెట్ అనుమతి పత్రము**

నెం. 3295 తేది.........................

1. రైతు పేరుశ్రీ.........................
2. గ్రామము.........................మండలం.........................
3. పట్టాదారు పాస్‌పుస్తకం నెం.........................విస్తీర్ణం.........................
4. మార్కెట్ కు తీసుకురాదలచిన " ధాన్యము " యొక్క పరిమాణము (బస్తాలు).........................
5. మార్కెట్ కు తీసుకురావలసిన తేది.........................

కార్యదర్శి

**సూచనలు :**

1. అనుమతి పత్రము పొందుటకు పట్టాదారు పాసు పుస్తకము లేక సంబంధిత మండల రెవిన్యూ అధికారిచే ధృవీకరణ పత్రం కార్యదర్శి వద్ద దాఖలు చేయవలెను.
2. రైతులు మార్కెట్‌కు ధాన్యము తీసుకొని వచ్చినప్పుడు వారి వెంట తప్పనిసరిగా ఈ పత్రము తీసుకొని రావలెను.
3. మధ్య దళారీలు రైతుల పేరుతో మార్కెట్ కు ధాన్యమును తెచ్చిన యెడల వారి యొక్క ధాన్యమును ప్రభుత్వము స్వాధీన పర్చుకొని వారిపై చట్టరీత్యా తగు చర్యలు చేపట్టబడును.
4. రైతులు వారు తెచ్చిన ధాన్యమును అమ్మిన తరువాత తక్ పట్టీ మరియు అనుమతి పత్రము చూపి వారి పట్టాదారు పాసు పుస్తకమును వాపసు పొందగలరు.
5. అనుమతించిన తేదికి ముందుగాని తరువాత గాని వచ్చిన యెడల అట్టి ధాన్యము మార్కెట్ లోనికి అనుమతించబడదు.
6. రైతులు వారి ధాన్యమును కళ్ళముల వద్దనే శుభ్రపరిచి మార్కెట్ కు తీసుకొని వచ్చినచో మంచి ధర లభించును.

*చిత్రం 8.6: మార్కెట్ కమిటీ అనుమతి పత్రం నమూనా*

చంద్రశేఖర్‌వంటి రైతులకు మిగులు ధాన్యం ఉండటం వలన వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మడానికి ఇష్టపడతారు. గ్రామాల్లో మాదిరిగా ఇక్కడ ఛార్జీల చెల్లింపులలో లేదా ధరల చెల్లింపుల్లోనూ ఎటువంటి ఆలస్యము జరుగదు. అమ్మకం పూర్తిగా బహిరంగ వేలంలో ఉంటుంది. కాబట్టి రైతులు మంచి ధర పొందే అవకాశం ఉంటుంది. అవినీతిపరులయిన అధికారులున్న మార్కెట్‌లో వీళ్ళు వర్తకులతో చేతులు కలిపితే రైతులకు తక్కువ ధర వచ్చే అవకాశం ఉంది. కాని, ఇది అన్ని ప్రదేశాలలో జరగదు.

మన రాష్ట్రంలో సుమారు 100 వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లు ఉన్నాయి. 1/4 వంతు వ్యవసాయ ఉత్పత్తులను వీటిలో అమ్ముతారు. మిగిలిన 3/4 ఉత్పత్తుల అమ్మకంలో ఏమి జరుగుతోంది. వాటిని ఎక్కడ అమ్ముతున్నారు? ఆ రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు ఎందుకు రావడం లేదు? వాటి గురించి తెలుసుకుందాం!

## బియ్యం మర యజమానికి (రైస్‌మిల్లర్‌కు) అమ్మకం

అది వరికోత కాలం. వెంకటాపురం గ్రామం వాడయిన మల్లయ్య బియ్యం మర యజమాని అయిన చందులాల్‌గారి గుమాస్తాకోసం వేచి ఉన్నాడు. మల్లయ్య తనకు ఉన్న ఒక ఎకరా నీటిపారుదలగల భూమిలో 14 క్వింటాళ్ళ వడ్లను పండించాడు. అతని దగ్గర సరిపడే పెట్టుబడి లేకపోవడంవల్ల తక్కువ దిగుబడి వచ్చింది. సరైన ఎరువులను, పురుగుల మందులను వాడలేకపోయాడు.

వ్యాపారి చందూలాల్ పంపించిన గుమాస్తా ట్రాక్టర్‌తో వచ్చి వడ్లలో తాలు, తేమశాతం వంటివి పరిశీలించాడు. వడ్ల బస్తాలను ట్రాక్టర్‌లో నింపుకొని, ఇతర రైతుల దగ్గర కొనుగోలు చేసి గుమాస్తా వెళ్ళిపోయాడు.

బియ్యంమరలో మల్లయ్య వడ్లబస్తాలను తూకం వేశారు. మొత్తం 14 క్వింటాళ్ళు. చేతినిండా ధాన్యాన్ని తీసుకొని చందూలాల్‌కు గుమాస్తా చూపించాడు. ధాన్యం ఎండిన పరిస్థితి, తాలును బట్టి చందూలాల్

SCERT TELANGANA

క్వింటాలు వడ్లకు 950 రూపాయలుగా ధర నిర్ణయించాడు. ఇది వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ధర కంటే చాలా తక్కువ. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో క్వింటాలుకు సుమారు 1100 రూపాయలు ఉంది. మల్లయ్యకు తక్షణమే డబ్బు అవసరం ఉంది. తక్షణమే చెల్లించాలంటే చందూలాల్ 100కి 1.50 రూపాయలు తక్కువ చెల్లిస్తాడు. (క్వింటాలుకు రూ.950 కాబట్టి ఇది 14.25 రూపాయలు అవుతుంది.) నల్లగొండలో ప్రతి రైస్ మిల్లరు, వరి వర్తకుడు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు.

**మల్లయ్య వడ్లకు వచ్చే ఆదాయాన్ని లెక్కిద్దాం.**

వడ్ల బరువు = 14 క్వింటాళ్ళు

రైస్‌మిల్లర్ నిర్ణయించిన ధర క్వింటాలుకు = 950 రూపాయలు

14 క్వింటాళ్ళకు = 950 × 14 = 13,300 రూపాయలు

తక్షణమే చెల్లిస్తే మినహాయింపు = 14.25 × 14 = 200 రూపాయలు (199.50ని రూపాయకి సమం చేస్తే)

మొత్తం చెల్లించవలసింది = 13,300 – 200 = 13,100 రూపాయలు

(ఒకవేళ మల్లయ్య 15 రోజుల వరకు వేచి ఉంటే తగ్గింపు ఉండదు.)

- మల్లయ్య తక్కువ ధరకే వడ్లను చందూలాల్‌కు ఎందుకు అమ్ముతున్నాడో ఊహించగలరా? తరవాత భాగం చదవక ముందే కారణాలను మీ తరగతి గదిలో చర్చించండి.

నాలుగు నెలల క్రితం మల్లయ్య ఎరువులు, రసాయనిక మందులు కొనుగోలు చేయడానికి 5000 రూపాయలు చందూలాల్ దగ్గరి నుంచి అప్పు తీసుకున్నాడు. చాలామంది చిన్న రైతులు చందులాల్ నుంచి ఇదే నిబంధనల ప్రకారం అప్పు తీసుకుంటున్నారు. అందుకే అతడు నిర్ణయించిన ధరకే, అతడికి సరుకు అమ్మాలన్న ఒత్తిడి రైతులపైన ఉంటుంది. మల్లయ్యకు చెల్లించే మొత్తంలోనుంచి చందులాల్ తాను ఇచ్చిన అప్పు, వడ్డీ మినహాయించు కుంటాడు. మల్లయ్య చివరకు ఎంత పొందుతాడో చూద్దాం!

మల్లయ్య పొందిన అప్పు = 5,000 రూపాయలు

4 నెలలకు వడ్డీ =400 రూపాయలు

మొత్తం తగ్గింపులు = 5,400 రూపాయలు

వడ్లకు వచ్చిన మొత్తం = 13,100 రూపాయలు

చెల్లించిన మొత్తం 13,100 – 5,400 = 7,700 రూపాయలు



*చిత్రం 8.7: వరిధాన్యాన్ని రైస్‌మిల్లుకు వాహనాలలో తరలించడం*

SCERT TELANGANA

మన రాష్ట్రంలో మల్లయ్య వంటి రైతులు బియ్యం మిల యజమానుల దగ్గరినుంచి, వడ్డీ వ్యాపారులనుంచి, ధనిక భూస్వాముల దగ్గరినుంచి అప్పు తీసుకుంటారు. పంట ఉత్పత్తి తర్వాత తక్కువ ధరలకు వారికే అమ్మే విధంగా ఒత్తిడి చేస్తారు. తరచుగా తూకాలలోను, వరి ధాన్యం ధరలలోను మోసాలు జరుగుతుంటాయి. రైస్‌మిల్ యజమానులు రైతులకు అప్పు ఇవ్వడం వల్ల ఖచ్చితంగా ముడి సరకును పొందటమే కాకుండా ధరను కూడా వారే నిర్ణయిస్తారు.

- వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మల్లయ్య వడ్లను అమ్మినట్లయితే ఎంత వచ్చేది?
- మిల్లర్‌కు అమ్మడంవల్ల అతడు ఎంత డబ్బు నష్టపోయాడు?
- అతడు మిల్లర్ దగ్గర అప్పు తీసుకోకుండా బ్యాంకులో తీసుకొంటే తేడా ఏమి ఉండేది?
- ప్రభుత్వ బ్యాంకు ద్వారా మల్లయ్య అప్పు పొంది ఉంటే ఎంత ఆదాయం ఆర్జించి ఉండేవాడు?

వెంకటాపురంలో పెద్ద రైతులు, భూస్వాములు చిన్న రైతులకు అప్పులిచ్చి, వాళ్ళ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. వాళ్ళు తమ ధాన్యాన్ని, ఇతర రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మార్కెట్‌లో లేదా పట్టణాలలో టోకు వర్తకులకు లేదా రైస్‌మిల్లర్‌లకు అమ్ముతారు. భూస్వాములకు రైతులు అనేక విధాలుగా అప్పు ఉంటారు. అప్పు ద్వారా విత్తనాలు, ట్రాక్టర్‌లు, పొలాలకు నీటి సరఫరాను కూడా పొందుతారు. ఆవిధంగా భూస్వాములు చిన్నరైతులను తమకు అనుకూలంగా తిప్పుకొని, తాము నిర్ణయించిన ధరలకే అమ్మడానికి రైతులతో ఒప్పందం చేసుకుంటారు. ఆవిధంగా రైతులకు అప్పులిచ్చేవాళ్ళు పంటలను తనఖాగా భావించి అప్పు ఇస్తూ, పంటల తర్వాత తిరిగి రాబట్టుకుంటారు. ఏది ఏమైనప్పటికీ చిన్నరైతులు తమ ఉత్పత్తులను ఎక్కువ ధరలకు అమ్మే అవకాశం ఉన్నా అమ్మలేరు. తక్కువ ధరలకే అమ్ముకుంటారు.

- వెంకటాపురం గ్రామ రైతుల దగ్గరి నుంచి భూస్వాములు, రైస్‌మిల్లర్‌లు వరిధాన్యాన్ని పొందే విధానాలలోని పోలికలను, భేదాలను తెల్పండి.

## మధ్యవర్తుల ద్వారా అమ్మకం

*వెంకటాపురంలో నివసిస్తున్న మరో మహిళా రైతు శాంతి. భర్త చనిపోయిన తర్వాత ఆమె వ్యవసాయం చేయడం ప్రారంభించింది. ఆమె స్వయంసహాయక బృందంలో సభ్యురాలిగా ఉండి, వ్యవసాయ నిమిత్తం 20,000 రూపాయలు అప్పు తీసుకుంది. ఆమెకు ఉన్న 1.5 ఎకరాల పొలంలో ఈ సంవత్సరం 14 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. ఆమె 7 క్వింటాళ్ళు తూకం వేయించి అమ్మడానికి సిద్ధంగా ఉంచింది. మిగతావాటిని కుటుంబ అవసరాలకు ఉంచుకుంది.*

మరుసటిరోజు నల్లగొండలోని పెద్ద రైస్‌మిల్ బ్రోకర్ వెంకటాపురం గ్రామానికి వచ్చి, రైతులను కలిసి వరిధాన్యాన్ని తనకు అమ్మాలని చెప్పాడు. శాంతి వరి ధాన్యాన్నికూడా పరిశీలించాడు. ఆమె బేరమాడి క్వింటాలుకి 1000 రూపాయల ధర నిర్ణయించుకుంది. ఆమె తూకం వేసినప్పుడు 7 క్వింటాళ్ళు ఉండగా బ్రోకర్ తూకం వేసినప్పుడు 6.5 క్వింటాళ్ళు మాత్రమే వచ్చింది. శాంతి మళ్లీ తూకం వేయించాలని పట్టుబట్టింది. స్వయం సహాయకబృందం సమక్షంలో తూకం వేయించగా 7 క్వింటాళ్ళు వచ్చాయి. బ్రోకర్ వరి ధాన్యాన్ని తీసుకొని 15 రోజులలో డబ్బులిస్తానని చెప్పాడు. అతడు రెండు వారాల తర్వాత వచ్చి 6825 రూపాయలు చెల్లించాడు. అతడు బ్రోకర్ ఛార్జీలకు గాను క్వింటాలుకు 25 రూపాయలు తీసుకున్నాడు.

*మేము శాంతిని కలిసి “మీరు ఏ వర్తకుని దగ్గరా అప్పు తీసుకోలేదు. మీరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎందుకు అమ్మడం లేదు?” అని అడిగాం.*

SCERT TELANGANA

"నల్లగొండ వెళ్ళడానికి ట్రాక్టర్ కిరాయి, ధాన్యాన్ని ట్రాక్టర్‌లో వేయడానికి, దించడానికి డబ్బు చెల్లించాలి. రవాణా ఖర్చులకు అదనపు రేటు రాదు. పొలంలో పని ఉంటుంది. కాబట్టి నేను, నా కొడుకు సరుకు అమ్మడానికి 1, 2 రోజులు గడపలేం. మేం అమ్మేది చాలా తక్కువ. పెద్ద మొత్తంలో అమ్మే రైతులు మాత్రమే నల్లగొండ వెళతారు," అని శాంతి చెప్పింది.

"చాలామంది రైతులు మార్కెట్ యార్డ్‌లో 1100 – 1150 రూపాయలు వరకు అమ్ముకుంటున్నారు. ఎక్కువ ధర చెల్లించమని రైస్‌మిల్లర్‌లని మీరు ఎందుకు అడగరు?" అని మేము అడిగాం.

"ఈ మధ్యవర్తులు ఎక్కువ ధరలు చెల్లించరు. ఈ రవాణా కష్టాలను భరించలేక ఇంటిదగ్గరే అమ్ముకుంటాం," అని శాంతి చెప్పింది.

రైతులకు పట్టణాలలో ఉండే పెద్ద రైస్‌మిల్లర్‌లకు లేదా టోకు వరి వర్తకులకు మధ్యవర్తులుగా బ్రోకర్‌లు పనిచేస్తారు. వారు శాంతిలాంటి చిన్న రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేస్తారు. వాళ్ళకు శాశ్వతమయిన షాపు, గోడౌను వంటివి ఉండవు. సీజన్‌లో రైతులను కలసి బేరమాడి వరిధాన్యాన్ని కొంటారు. ధాన్యాన్ని కొనుగోలుచేసిన తరువాత డబ్బులు పంపించిన టోకు వర్తకునికి లేదా రైస్ మిల్లర్‌కు సమాచారం అందిస్తారు. రైతులదగ్గరినుంచి, మిల్లర్ నుంచి కూడా మధ్యవర్తులు కమీషన్ తీసుకుంటారు. కొంతమంది రైతులు వడ్డీవ్యాపారుల మాదిరిగా పని చేస్తారు. మనం ఇదివరకే చెప్పుకొన్న చందూలాల్ మాదిరిగా ఇలాంటి సందర్భాల్లో వాళ్ళు ఇచ్చిన అప్పు, వడ్డీతో తిరిగి తీసుకుంటారు.

- మల్లయ్య క్వింటాలుకు 935 రూపాయలు పొందగా, శాంతి 975 రూపాయలు పొందగలిగింది. ఇక్కడ ఏమైనా తేడా ఉందా? ఎందుకు?

## తెలంగాణలో వడ్ల వ్యాపారం

తెలంగాణలో అత్యధికంగా వరి ఉత్పత్తి అవుతోంది. రైతులు కొంతభాగం కుటుంబ అవసరాలకు ఉంచుకొని, మిగతా మొత్తాన్ని మార్కెట్‌లో అమ్ముతారు. చాలా తక్కువ మొత్తంలో శాంతివంటి చిన్న రైతులు తమ వినియోగానికి ఎక్కువగా ఉపయోగిస్తారు. పెద్ద రైతులు వారి ఉత్పత్తులలో ఎక్కువ భాగాన్ని మార్కెట్‌లో అమ్ముతారు.

మన రాష్ట్రంలో రైతులు తమ పంట ఉత్పత్తులలో మూడొంతులను తమ గ్రామాలలో అమ్ముతుండగా ఒక వంతు వ్యవసాయ మార్కెట్‌యార్డులో అమ్ముతున్నారు. పెద్ద రైతులకు సొంత ట్రాక్టర్ ఉండడంవల్ల వాళ్ళకు రవాణా ఖర్చులు తగ్గుతాయి.

గ్రామీణ ప్రాంతాలలో వివిధ రకాలైన వర్తకులు – భూస్వాములు, బ్రోకర్‌లు, చిన్న మిల్లర్‌లు సరుకు కొనుగోలు చేస్తారు. చాలా సందర్భాలలో వర్తకుల దగ్గర అప్పు తీసుకొని మల్లయ్య, చంద్రశేఖర్ వంటి రైతులు ఆ వర్తకులకే అమ్ముతున్నారు.

## రుణగ్రస్తత, వడ్ల అమ్మకం

చిన్న, మధ్య రైతులు తమ వ్యవసాయ పనుల నిర్వహణకు ముఖ్యంగా విత్తనాలు, మందులు, ఎరువులు, నీటిపారుదల వసతులకు తప్పనిసరిగా అప్పు చేయవలసి వస్తుంది. వాళ్ళకు బ్యాంకులలో అప్పు పొందడం కష్టంగా మారి వడ్డీ వ్యాపారులు, వర్తకులు, మిల్లర్ మొదలైన వాళ్ళ దగ్గర అప్పు చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒకసారి వారి దగ్గరినుంచి అప్పు తీసుకుంటే ధాన్యాన్ని కూడా వాళ్లకు వాళ్లు నిర్ణయించిన ధరలకే అమ్మాలి. వరి వర్తకులు తక్కువ ధరలు నిర్ణయించడమే కాకుండా తప్పుడు తూకాలు, ఇతర మార్గాల ద్వారా రైతులను దోచుకుంటున్నారు. వివిధ రకాలుగా కమీషన్ ఛార్జీలు కూడా వసూలు చేస్తారు. వీరిలో చాలా మంది రైతులుకు

SCERT TELANGANA

అమ్మిన సరుకుల డబ్బులు చెల్లింపులలో ఆలస్యం జరుగుతుంది. వర్తకులు, భూస్వాములు రైతుల అవసరాలకు రుణాన్ని ఇవ్వడం వలన వరిధాన్యాన్ని రైతులు వాళ్లకే అమ్మవలసి వస్తుంది.

- రైతులందరికి వారి ఉత్పత్తులకు న్యాయమైన ధర వచ్చే వివిధ పద్ధతులను గురించి ఆలోచించండి. వీటివల్ల కలిగే లాభనష్టాలను మీ తరగతి గదిలో చర్చించండి.

**కీలకపదాలు**

వ్యవసాయ మార్కెట్ యార్డు

కనీస మద్దతు ధర

భారత ఆహార సంస్థ

వర్తకులు

కమిషన్ ఏజెంట్లు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. వెంకటాపురంలో గల వివిధ వర్తకుల పట్టికను, వారు వరి ధాన్యానికి క్వింటాలుకు నిర్ణయించిన ధరలను పట్టికలో నమోదు చేయండి.
2. మీరు గ్రామంలో నివసిస్తున్నట్లయితే వరి ధాన్యాన్ని ఎవరు కొనుగోలు చేస్తారు, ధరలు ఎలా నిర్ణయిస్తారు, వర్తకులూ, భూస్వాములూ చెల్లించే ధరల వివరాలను సేకరించండి.
3. కిరాణా దుకాణానికి వెళ్లి క్వింటాలు బియ్యం ధరను తెలుసుకొని రైతులు క్వింటాలు వడ్లకు పొందే ధరతో పోల్చి చూడండి. (1 క్వింటాలు = 100 కిలో గ్రాములని గుర్తుంచుకోండి.)
4. వరిధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర నిర్ణయించాల్సిన అవసరముందని మీరు భావిస్తున్నారా?
5. స్వయంసహాయక బృందం ద్వారా రైతులు ఏవిధంగా లాభం పొందుతారని మీరు భావిస్తున్నారు?
6. పేజి నెం. 78, 79లోని 'రుణగ్రస్తత, వడ్ల అమ్మకం' అంశాన్ని చదివి, వ్యాఖ్యానించండి.
7. మీ గ్రామానికి సమీపంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ లేదని ఊహించుకొండి. ఇలాంటి పరిస్థితిలో రైతులు ఎదుర్కొనే సవాళ్ళు ఏమిటో రాయండి?

### ప్రాజెక్టు

1. కొంతమంది విద్యార్థులను సమీప వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు తీసుకువెళ్లి, అక్కడి సంఘటనలను, అంశాలను వర్తకుల వేలంపాట వంటివాటిని చూపించి, వాళ్లు చూసినవాటిని అనుకరిస్తూ పాత్రాభినయం చేయించడం.
2. తెలంగాణలో చిన్న రైతుల దుస్థితిపై చిన్న నాటికను తయారు చేయడం.

SCERT TELANGANA

పాఠం 9

# తెగలు - సామాజిక నిర్ణయాధికారం

*ఒక ప్రాంతంలో సామూహికంగా కలిసిమెలసి నివసించే ప్రజలు తమ ఉమ్మడి సమస్యలను ఎలా ఎదుర్కొంటారు? వాళ్ళ మధ్య ఏర్పడిన వివాదాలను ఎలా పరిష్కరించుకుంటారు? వాటిలో నాయకుల పాత్ర ఏమిటి? వీటినుంచి వాళ్ళు పొందే ప్రతిఫలం ఏమిటి? ఇటువంటి కొన్ని సమస్యలను మనం చదువబోతున్నాం. ఈ పాఠంలో ఒకే తెగకు చెందిన ప్రజలు కలసి మెలసి జీవిస్తూ నిర్ణయాలు ఏవిధంగా తీసుకొంటారో చదువబోతున్నాం.*

## ప్రజలందరూ సమానంగా ఉన్న గిరిజన సమాజాలు

అడవులలో నివసించే వివిధ రకాల సమాజాలను తెగలుగా పిలుస్తారు. తెలంగాణలో చెంచులు, కొండరెడ్లు, గోండ్లు, కోయలు, సవరలు మొదలయిన గిరిజన సమాజాలున్నాయి. మన దేశంలోని చాలా రాష్ట్రాలలో ఉండే తెగలు ప్రధానంగా అడవులలో జీవనం కొనసాగిస్తున్నారు. వాళ్ళందరికీ విభిన్న జీవన విధానాలు, భాషలు, సంస్కృతులు ఉన్నాయి. వాళ్ళ మధ్య కొన్ని తేడాలున్నప్పటికీ వాళ్ళందరిని గిరిజనులు అని ఎందుకంటున్నారు? వాళ్ళ మధ్య ఒకేరకమైన కొన్ని లక్షణాలు ఉండడం దానికి కారణం. అవి ఏమంటే:

1. ఒక తెగలోని సభ్యులందరూ తామంతా ఒకే మూలపురుషుని నుండి వచ్చిన వాళ్ళమని భావిస్తారు. అందువల్ల తెగలోని సభ్యులందరు ఒకరినొకరు బంధువుగా తలుస్తారు.
2. సహజ వనరులైన అడవి, భూమి, నీరు, పచ్చిక బయళ్ళు వంటివాటిని ఆ తెగకు ఉమ్మడి ఆస్తిగా భావిస్తారు. అంతేగాని ఒక వ్యక్తికో, కుటుంబానికో చెందినవిగా తలచరు. ఈ వనరులన్నింటినీ తెగ నిర్ణయాలకనుగుణంగా వాడుకోవచ్చు.
3. ధనిక, పేద తారతమ్యాలు వీళ్ళలో కనపడవు. ప్రతి ఒక్కరికి తెగ సమిష్టి ఆదాయంలో వాటా ఉంటుంది. ఉదాహరణకు తెగ భూమి మొత్తాన్ని అన్ని కుటుంబాలకూ, కుటుంబంలోని సభ్యుల సంఖ్యనుబట్టి పంచుతారు. కొన్ని సందర్భాల్లో, కొన్ని సంవత్సరాల తర్వాత తిరిగి కుటుంబాలకు భూమిని పంచుతారు, లేదా విభజిస్తారు. మరికొన్ని సందర్భాలలో గిరిజన సమూహ సభ్యులందరూ సాగుచేసి పంట పండిస్తారు. పండిన పంటను అందరూ సమష్టిగా పంచుకుంటారు. గిరిజనతెగ సమష్టి భూమిని ఎవ్వరూ అమ్మడానికి వీలు లేదు. కారణం ఆ భూమి మొత్తం తెగది. ఎవరూ కూడా తాము సాగు చేయగలిగిన దాని కంటే ఎక్కువ భూమిని తమ ఆధీనంలో ఉంచుకోగూడదు.
4. తెగలోని వాళ్ళు అందరూ అన్ని పనులూ చేస్తారు. వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ, పశువులను మేపడం, దుస్తుల తయారీ, బుట్టల

SCERT TELANGANA

తయారీ, పనిముట్లు, ఇల్లు కట్టడం లాంటివి. ఏ పనికీ ప్రత్యేకమైన మనుషులు ఉండరు.

5. కుటుంబంలోని ప్రతి పనినీ చిన్నా, పెద్దా తేడా లేకుండా పురుషులు, స్త్రీలు, పిల్లలు కలిసి చేస్తారు. అయితే పురుషులకు నిర్ణయాధికారం ఎక్కువగా ఉండటం సామాన్యంగా కనిపిస్తుంది.


6. అడవి దేవతలను, తమ మూల పురుషులను సంతృప్తిపరచటానికి వీలుగా జరిపే సామూహిక ఉత్సవాలకు, పండుగలకు గిరిజన సమూహంలో ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అంతేగాక వివిధ విశ్వాసాలు, ఆచారాలు, పాటలు, నృత్యాలు, చిత్రకళలు వంటివి వాళ్ళ సమూహాలలో సామాన్యంగా కనిపిస్తాయి.

- గిరిజనులలో కనిపించే ప్రధానమైన వృత్తుల గురించి రాయండి.
- గిరిజన తెగలలోని సభ్యులందరూ సమానమే అని ఎలా చెప్పగలరు?


ఒక తెగ ఒక పెద్ద ప్రాంతంలో కొన్ని గ్రామాలుగా లేదా ఆవాస ప్రాంతాలుగా వుండవచ్చు.

తెగ మొత్తానికి సంబంధించిన విషయాలమీద ఎలా నిర్ణయాలు తీసుకుంటారు? తగాదాలు ఎలా పరిష్కరించుకుంటారు? ఆదిలాబాద్ జిల్లాలోని గోండ్లు ఎలా తగాదాలను పరిష్కరించుకుంటారో మీరు గమనించండి. దీనికోసం తెలంగాణలోని గోండుల గురించి ఫ్యూరర్ హైమన్‌డార్ఫ్ రాసిన పుస్తకంలోని సంక్షిప్త సారాంశాన్ని మీకు అందిస్తున్నాం.

ఆంత్రోపాలజిస్టులు (మానవ విజ్ఞాన శాస్త్రవేత్తలు) గిరిజన ప్రజలను గురించి అధ్యయనం చేశారు. వారు గిరిజనులతో పాటు నివసిస్తూ వాళ్ళ సంస్కృతి, జీవన విధానం, విశ్వాసాలు, నిర్ణయాలు మొదలైన వాటిని నమోదు చేస్తారు. అటువంటివారిలో ప్రముఖమైన పరిశోధకుడు ఫ్యూరర్ హైమన్‌డార్ఫ్. ఇతను 1940లో తెలంగాణకు వచ్చి చెంచులు, కొండరెడ్లు, గోండ్ల గురించి అధ్యయనంచేసి వాళ్ళను గురించి పుస్తకాలు రాశాడు. ఇంకా అతడు భారతదేశంలోని వివిధ గిరిజన తెగలను, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజనులను గురించి అధ్యయనం చేశాడు.



*9.1: ఫ్యూరర్ హైమన్‌డార్ఫ్*



*చిత్రం 9.2: గోండులతో హైమన్‌డార్ఫ్*

CERT TELANGANA

## గోండు పంచ్ (పంచాయితీ), పట్లా (గ్రామపెద్ద)

గ్రామపెద్ద తన అధికారాన్ని పంచ్ (పంచాయతీ) లేదా పురుషుడు యజమానిగా ఉండేవారితో ఏర్పడిన మండలి నుండి పొందుతాడు. గ్రామానికి సంబంధించిన అంశాలమీద గాని, గ్రామపెద్దను నిర్ణయించడంలోగాని గ్రామసభ (మండలి) నిర్ణయమే కీలకం. ఈ గ్రామపంచాయితీ పూర్తిగా గోండు సమాజ ప్రతిరూపంగా ఉంటుంది.

పంచాయితీ సమావేశాలు క్రమబద్ధంగా జరగవు. కాని ఎప్పుడు అవసరమైతే అప్పుడు జరుగుతాయి. ఏవైనా ముఖ్యమైన అంశాలు చర్చించేటప్పుడు, అందరు మగవారూ హాజరవుతారు. యువకులు, మహిళలు అది జరిగే విధానాన్ని పరిశీలిస్తారు. ఆడవాళ్ళకి ఈ మండలిలో మాట్లాడే అవకాశం లేదు గాని వాళ్ళ సమస్యలను విన్నవించే అవకాశం ఉంది.

ప్రధాన పండగల తేదీలు నిర్ణయించడం, వివాహం, విడాకులు, తగాదాల పరిష్కారాలు, కర్మకాండ, విధి విధానాలను నిర్ణయించడానికి సంబంధించిన అంశాలను పంచాయితీ నిర్వహిస్తుంది. దోషిగా నిర్ణయించిన వారికి జరిమానా విధిస్తుంది. గ్రామాన్ని వదిలి వెళ్ళమని ఆదేశిస్తుంది లేదా ఇతరులు ఆ దోషితో సంబంధాలు జరపకుండా నిరోధిస్తుంది.

గ్రామాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు అన్ని పంచ్‌లు (పంచాయితీలు) సంయుక్త సమావేశం నిర్వహిస్తాయి.

ఏదైనా వివాదం పంచాయితీ ముందుకు వచ్చినప్పుడు పంచ్ ముఖ్య ఉద్దేశం వివాదాలకు సంబంధించిన వాస్తవ విషయాలను తెలుసుకోవటం. రెండువర్గాలు తమ తమ అభిప్రాయాలనూ, వాదనలనూ తెలియజేయవచ్చు. తరవాత గ్రామ పెద్దలు వాళ్ళను ప్రశ్నించి ఒక నిర్ధారణకు వస్తారు. సాక్షులను కూడా విచారిస్తారు. సాక్ష్యాలను పరిశీలిస్తారు. ఇవన్నీ పూర్తి అయిన తరవాత చర్చలు జరిపి గతంలో ఇటువంటి సందర్భంలో ఇచ్చిన తీర్పులను పరిశీలించి పంచాయితీ (పంచ్) తీర్పు ఇస్తుంది. తరతరాలుగా తెగలో వస్తున్న కట్టుబాట్లకు అనుగుణంగా తీర్పులన్నీ ఉంటాయి. తీర్పుమీద తెగలోని వృద్ధులు చర్చలు జరుపుతారు. చివరిగా ఒక పరిష్కారానికి వస్తారు. వివాదానికి సంబంధించి పూర్వాపరాలను పరిశీలించిన తరవాత పంచాయితీ పెద్ద పరిష్కారాన్ని సూచిస్తాడు. అయితే ఇది తుది నిర్ణయం కాదు. తరవాత బాధితుడు కోరితే తీర్పులో మార్పులు కూడా చేస్తారు. ఆ తరవాతే చివరి నిర్ణయాన్ని ప్రకటిస్తారు.

- గోండ్ల పంచాయితీలో సభ్యులుగా ఉండడానికి వీలు లేనివాళ్ళు ఎవరు?
- పంచాయితీలో అన్ని కుటుంబాలకూ ప్రాతినిధ్యం, ప్రాధాన్యం ఉండటాన్ని గురించి మీరు ఏమి అనుకుంటున్నారు?
- ఒక సమస్య పరిష్కరించటంలో పంచాయితీ (పంచ్) ఎటువంటి విషయాలను పరిగణనలోకి తీసుకుంటుంది?

గోండ్ల తీర్పు ఏవిధంగా ఇస్తారో తెలుసుకోవటానికి ఒక ఆసక్తికరమైన ఉదాహరణను చూడండి.



*చిత్రం 9.3: గోండుల పంచాయితీ సన్నివేశం*

SCERT TELANGANA

"ఒకరోజున ఒక అమ్మాయి ఒక వ్యక్తిమీద పంచ్ ముందు ఫిర్యాదు చేసింది. ఆ వ్యక్తి ఆమెను అల్లరి పెట్టడానికి ప్రయత్నించగా ఆమె అతనిని చెంపదెబ్బ కొట్టింది. అతడు ఆమెను నెట్టేశాడు. ఆమె పడిపోయింది కాని అక్కడి నుంచి తప్పించుకుంది. పంచాయితీ ముందు ఆ వ్యక్తి తన తప్పును ఒప్పుకున్నాడు. దోషికి ఏ శిక్ష విధించాలని ఆమెను పంచ్ (పంచాయితీ) అడిగింది. సమాధానంగా ఆమె అత్యంత అవమానకరమైన శిక్షను అతనికి విధించమని కోరింది. అంతేకాకుండా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది తనకు కలిగించనని రాతపూర్వకంగా ఇవ్వాలని కోరింది. సభ మధ్యలో ఆమె ముందు మోకాళ్లమీద నిలబడి ఆమెను క్షమాపణలు కోరమని పంచాయితి ఆదేశించింది.

- పంచాయితీ విధించిన శిక్షపట్ల ఆ అమ్మాయి సంతృప్తి చెందిందా?
- పంచ్ ఆమెను ఎందుకు శాంతపరిచిందని మీరు అనుకుంటున్నారు?

## పట్లా (గ్రామపెద్ద)

ప్రతి గ్రామానికీ పెద్దగా 'పట్లా' (గ్రామపెద్ద) వ్యవహరిస్తాడు. ఈ పదవి వారసత్వంగా వస్తుంది (తల్లిదండ్రులనుంచి లభించే ఆస్తులు, ఇంటిపేరును పొందే కుమారులను, కుమార్తెలను వారసులు అంటారు). ఇతడు పంచాయితీకి జవాబుదారే కాకుండా చాలా విషయాలలో ప్రభావవంతుడైన నాయకుడుగా వ్యవహరిస్తాడు. పంచాయితీ ఎప్పుడో ఒకసారి సమావేశమైతే, గ్రామ పెద్ద ప్రతిరోజూ విధులు నిర్వహించవలసి వస్తుంది. గ్రామపెద్ద సాధారణంగా గ్రామం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించిన కుటుంబపు వ్యక్తి అయి ఉంటాడు. గ్రామాన్ని సమైక్యంగా ఉంచడానికి బయట వ్యక్తులతోను, ప్రభుత్వ సంస్థలతోను సంధానకర్తగా ఉంటాడు. పండుగలలో, గ్రామానికి సంబంధించిన సామాజిక కార్యక్రమాలలో సమన్వయకర్తగా వ్యవహరిస్తాడు. గ్రామానికి వచ్చిన అతిథులకు ఆతిథ్యమిస్తాడు. ప్రతిఫలంగా గ్రామస్తులందరూ ఇతని పొలంలో సంవత్సరంలో ఒకరోజు పనిచేస్తారు. దీనివల్ల అతని కుటుంబం సాగు చేయగలిగిన భూమికంటే ఎక్కువ సాగుచేసి, అతిథులకు మర్యాదలు చేయగలుగుతుంది.

తెగవాళ్ళ అభిప్రాయాలకు విరుద్ధంగా గ్రామపెద్ద గర్వంతో ప్రవర్తిస్తే అతన్ని తొలగించి అతని స్థానంలో మరొకరిని నియమిస్తారు లేదా గ్రామంలోని కుటుంబాలు ఈ గ్రామాన్ని వదిలి కొత్త ప్రాంతంలో ఆవాసాలు ఏర్పాటుచేసుకోడానికి వీలు ఉంది.

- ఎవరు గ్రామపెద్ద అవుతారు?
- పంచాయితీకి, గ్రామపెద్దకు ఉన్న సంబంధమేమిటి?
- గ్రామంలో గ్రామపెద్దకు గల విశేషమైన ప్రాధాన్యత ఏమిటి?
- గ్రామపెద్దను ఎప్పుడు తొలగిస్తారు?

- ఈ పద్ధతి ముఖ్యాంశాలను, అందులోని లోపాలను గురించి చర్చించండి.
- గోండు పంచాయితీని వివరంగా చదివి ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. ఇతర కులాలకు చెందిన వ్యక్తిని గోండు పంచాయితీలో సభ్యుడిగా అంగీకరిస్తారా?
2. హైమన్‌డార్ఫ్ అభిప్రాయంలో పేరుగాంచిన ఒక గ్రామపెద్ద, అంతగా పేరుగాంచని గ్రామ పెద్ద కన్నా ఎక్కువ భూములను సాగుచేస్తాడు. ఆ విధంగా ఎందుకు జరుగుతుందో వివరించండి.

గిరిజన సంప్రదాయాలను ఆయా సమాజాలలోని వయోజనులందరూ తెలుసుకొంటారు. గిరిజన సమాజ వ్యవహారాలలో ప్రతి కుటుంబమూ సమర్థంగా పాలుపంచుకుంటుంది. కొన్ని సందర్భాలలో గ్రామ

SCERT TELANGANA

పెద్దకంటె ఎక్కువ ప్రాముఖ్యం సమాజానికి ఉంది. గ్రామపెద్ద ఎవరికి అనుకూలంగాను, వ్యతిరేకంగాను ఉండకుండా అందరి అభిమానాన్నీ పొందవలసి ఉంటుంది. వాళ్ళ అభిప్రాయాలకు విరుద్ధంగా పట్లా ప్రవర్తించకూడదు. అలాగే అతడు తెగకు చేస్తున్న సేవలకు ప్రతిఫలంగా అతనికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు ఉంటాయి. అతని పొలంలో ఉచితంగా తెగవారు పనిచేస్తారు. తెగలోని అందరికంటే ధనవంతుడిగా ఉండి తెగ సంక్షేమం కోసం ఆ సంపదను ఖర్చు చేస్తాడు. దాదాపు చాలా గిరిజన తెగలలో ఇటువంటి ఏర్పాట్లు ఉంటాయి.

తెలుగువారు, మరాఠావారు ఆ ప్రాంతాలకు వలస రావడం, పంచాయతిరాజ్ వ్యవస్థ ప్రారంభం కావడంతో 1940, 1950ల నుంచి గోండుల ఆచారాలలో, వ్యవస్థలలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని హైమన్‌డార్ఫ్ వివరించారు. చాలామంది ప్రజలు తమ వివాదాల పరిష్కారానికి పోలీసు స్టేషన్లకు, కోర్టులకు వెళుతున్నారు. అంతేగాక స్థానిక ఎన్నికలలో సర్పంచ్‌ని ఎన్నుకొంటున్నందున గ్రామపెద్ద తన స్థానాన్ని కోల్పోయాడు.

**కీలకపదాలు**

వారసత్వం

మానవవిజ్ఞాన శాస్త్రవేత్త

సామూహిక ఉత్సవాలు

సమిష్టి వనరులు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. పంచ్, పట్లా కేవలం గిరిజన తెగలలోనే సాధ్యపడుతుందని ఎందుకు అనుకుంటున్నారు? సమాజంలో నివసించే అన్ని వర్గాలు సమానం అన్న భావన లేకపోతే ఏమవుతుంది?
2. మీరు నివసించే ప్రాంతంలో పైన పేర్కొన్నమాదిరి పంచాయితీ ఉందా? మీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దల తోటి అటువంటి పంచాయితీ పనిగురించి చర్చించండి.
3. పోలీసు, న్యాయవ్యవస్థల ప్రమేయం లేకుండా గోండు పంచాయితీలో తీర్పు చెప్పేవారు. దీనిని మీరు సమర్థిస్తారా?
4. పంచాయితీ తీర్పులో న్యాయం జరగలేదని గిరిజనులు భావిస్తే వారికి గల ప్రత్యామ్నాయాలు ఏమిటి?
5. తెలంగాణ పటంలో గిరిజనులు అధికంగా నివసించే కింది జిల్లాలను గుర్తించండి.

   అ. ఖమ్మం     ఆ. ఆదిలాబాదు     ఇ. మహబూబ్‌నగర్
6. పేజి నెం.83లోని 'గ్రామపెద్ద' పేరాను చదివి, వ్యాఖ్యానించండి.

SCERT TELANGANA

పాఠం 10

# సామ్రాజ్యాలు, గణతంత్రాల ఆవిర్భావం

*క్రిందటి పాఠంలో మనం గిరిజన సమాజాల నిర్వహణావిధానం గురించి అధ్యయనం చేశాం. పెద్ద సామ్రాజ్యాలను పరిపాలించిన రాజులను, చక్రవర్తులను గురించి మీరు వినే ఉంటారు. వాళ్ళు తొలినాళ్ళలో ఏ విధంగా సామ్రాజ్యాలను, గణతంత్రాలను ఏర్పాటు చేయగలిగారో తెలుసుకుందాం.*

SCERT TELANGANA

### గంగానది లోయలో జనపదాల నుంచి మహా జనపదాల వరకు...

- భారతదేశ పటంలో గంగ, యమున నదులు ప్రవహించే ప్రాంతంలో ఉన్న మైదాన ప్రాంతాలను గుర్తించండి. ఆధునిక పట్టణాలైన ఢిల్లీ, అలహాబాద్, వారణాసి, లక్నో, కాన్పూర్, పాట్నాలను గుర్తించండి. ఈ ప్రాంతాలు పెనమకూరు, డోకూరు, పెనుగోలు గ్రామాలను పోలి ఉన్నాయా? కారణాలు చెప్పండి.

ఉత్తర భారతదేశ విశాల మైదానాన్ని గంగా, సింధూ మైదానం అని పిలుస్తారు. హిమాలయాలకు, ద్వీపకల్ప పీఠభూమికి మధ్య గంగా యమునలు ప్రవహిస్తాయి. గంగాలోయ మైదానం అధిక వర్షపాతం, హిమాలయాలనుంచి ప్రవహించే అతిపెద్ద నదులు తెచ్చే ఒండ్రుతో సారవంతంగా ఉంటుంది. ఆ నదులలో నీళ్లు సంవత్సరం పొడవునా ప్రవహిస్తాయి.


మొదట్లో వివిధ తెగలు ఈ మైదానంలోని అనుకూల ప్రాంతాలలో వ్యవసాయంచేస్తూ స్థిరపడ్డాయి. వీరిని సంస్కృతంలో 'జన' అనీ, వారు స్థిరపడిన ప్రాంతాన్ని 'జనపదం' అనీ పిలుస్తారు.

ప్రజలు 4000 సంవత్సరాల క్రితం ఈ నదుల వెంట స్థిరపడటం మొదలు పెట్టారు. రాతి, రాగి, కంచు మరియు ఇనుప పనిముట్లతో క్రమంగా అడవులను నరికి, భూములను దున్ని వరి, ఇతర పంటల సాగుచేసేవారు. ఈ విధంగా ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద గ్రామాలు, పట్టణాలు ఏర్పడి వివిధ తెగల ప్రజలు నివసించసాగారు. ఇటువంటి పెద్ద గ్రామాలను లేదా పట్టణాలను 'మహాజనపదాలు' లేదా పెద్ద 'జనపదాలు' అని పిలిచేవారు.

- గంగా, సింధు మైదానంలో మొదట్లో స్థిరపడ్డ తెగల పేర్లను మీ ఉపాధ్యాయుల సహాయంతో తెలుసుకోండి.
- జనపదం అంటే అర్థం ఏమిటి? మహాజనపదాలకు, వీటికి తేడా ఏమిటి?

### మహాజనపదాల గురించి ఏవిధంగా తెలుసుకోగలం?

ఇక్కడి గ్రామాలు, పట్టణాల గురించి రెండు రకాల ఆధారాల ద్వారా తెలుసుకోవచ్చు: ఒకటి ఇక్కడ జరిగిన పురావస్తు తవ్వకాల ద్వారా, మరొకటి ఆ కాలంలో రాసిన పుస్తకాల ద్వారా. గంగాలోయలో వందలాది ప్రాంతాలలో పురాతత్వ శాస్త్రవేత్తలు తవ్వకాలు జరిపారు. తద్వారా లభించిన ఆధారాల ద్వారా ఆనాటి ప్రజల జీవన విధానాన్ని తెలుసుకోటానికి




*పటం 1: మహాజనపదాలు*

- పైన ఇచ్చిన భారతదేశ పటాన్ని చూడండి. కొన్ని మహాజనపదాలలోని విశాల ప్రాంతాలను గురించి, మహాజనపదానికి సంబంధించిన పెద్ద పట్టణం పేరును గురించి, దాని గుండా ప్రవహించే నదిని కూడా తెలుసుకోవచ్చు.

- గంగాలోయలో వెలసిన మహాజనపదాలకు వాటి పట్టణాలకూ సంబంధించిన పట్టికను తయారుచేయండి.

| మహాజనపదం | నగరం |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |

SCERT TELANGANA

ప్రయత్నించారు. ఆ కాలం నాటి పుస్తకాలను ఎక్కువగా వేదాలను అనుసరించేవారు, బౌద్ధ, జైన భిక్షువులు సంకలనం చేశారు. అవి మతానికి సంబంధించిన పుస్తకాలు అయినప్పటికీ, ఆనాటి గ్రామాలు, పట్టణాల గురించే కాక పాలకులు, రాజుల గురించి కూడా తెలియజేస్తాయి. కొన్ని పుస్తకాలను గ్రీసువంటి దూరప్రాంతవాసులు కూడా రాశారు. వివిధ ఆధారాలనుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఆనాటి సంగతులు తెలుసుకుందాం.

మహాజనపదాల కాలంనాటి కొన్ని ముఖ్యమైన పురాతత్వ ప్రాంతాలు: ఢిల్లీ, అత్రంజిఖేర, కౌశంబి (అలహాబాద్‌కు దగ్గరలో), పాట్నా, అయోధ్య, రాజ్‌గిర్ మొదలైనవి.

ఈ కాలంలో రాసిన కొన్ని ముఖ్యమైన పుస్తకాలు: ఉపనిషత్తులు, ధర్మసూత్రాలు, దిగానికాయ, మజ్జిమనికాయ, హెరిడోటస్ చరిత్ర, స్ట్రాబో రచనలు మొదలైనవి.

- రెండు వేల సంవత్సరాల తరవాత మనం నివసించిన గ్రామాలను, పట్టణాలను పురావస్తు శాస్త్రవేత్తలు తవ్వితే వాళ్లు మన గ్రామాలలో, పట్టణాలలో ఏం గమనిస్తారు?
- ఒక ప్రాంతం గ్రామం/పట్టణం అని వాళ్ళు ఎలా నిర్ధారిస్తారు?
- ఒక పుస్తకంలో ఫలానా పట్టణం బంగారం, వెండితో నిర్మితమైనదని, వేలాది ప్రజలు పెద్ద విశాలమైన భవనాల్లో ఉండేవారని రాసి ఉంటే అది కల్పితమో, వాస్తవమో మీరు ఎలా నిర్ధారిస్తారు?

## మహాజనపదాల కాలంనాటి గ్రామాలు

ఆనాటి పుస్తకాలను చదివితే వ్యవసాయంచేసే భూ యజమానులను గృహపతి లేదా గహపతి అనేవారని తెలుస్తుంది. వారు కుటుంబ సభ్యులతోపాటు వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసేవారు. వాళ్లు 'దాస' (లొంగిపోయి సేవకులుగా పనిచేసినవారు)లను కూడా పనికి ఉపయోగించేవారు అంతేకాకుండా 'భృతక' (జీతం తీసుకొని పనిచేసేవారు) అనే పనివాళ్ళకు కూలి ఇచ్చి పొలంలో, ఇంటిలో పనిచేయించుకునే వారు. కొంత మంది ధనవంతులైన గహపతులకు ఎక్కువభూమి, బానిసలు ఉండేవారు. సాధారణంగా అత్యధిక భూమి ఉన్న వ్యక్తి గ్రామపెద్ద అవుతాడు. గోండుల 'పట్లా' లాగా ఆ గ్రామానికి అతడు నాయకుడే కాక, రాజుతరఫున ఇతర గ్రామస్తులనుంచి పన్నులు వసూలుచేసేవాడు. అంతేగాక కొన్ని సమయాలలో న్యాయమూర్తిగా, పోలీసు అధికారిగా వ్యవహరిస్తూ గ్రామంలో శాంతిభద్రతలను కాపాడేవాడు.

చాలా గ్రామాలలో నైపుణ్యం గల వృత్తి పనివాళ్ళు ఉండేవారు. కమ్మర్లు వ్యవసాయానికి పనికి వచ్చే పనిముట్లు (నాగటికర్రులు, గొడ్డళ్ళు, బాణాలు మొదలైనవి)ను, వంటకు ఉపయోగపడే కుండలు, ధాన్యం నిలవ ఉంచే పాత్రలను కుమ్మరి, బండ్లు, నాగళ్లు, ఇతర గృహ సామగ్రిని వడ్రంగులు, దుస్తులను నేత పనివారు తయారుచేసేవారు. ఉత్పత్తులకు బదులుగా గృహపతులు వారికి ధాన్యం ఇచ్చి ఉండవచ్చు. ఈ ఉత్పత్తులు వ్యవసాయానికి అత్యవసరం. వాటిని సొంతంగా తయారు చేసుకోటానికి గృహపతులకు నైపుణ్యం, సమయం ఉండవు.


- గోండు వంటి తెగల గ్రామాలకు, మహాజనపదాల నాటి గ్రామాలకు పోలికలు తేడాలు ఏమిటి?
- గృహపతికి, గ్రామాలలోని వృత్తిపనివారికి మధ్య సంబంధం ఏమిటి?

## మహాజనపదాలలోని నగరాలు

మీరు ముందు పేజీలో తయారుచేసిన పట్టికలోని నగరాలను చూడండి. అక్కడ ఎటువంటి ప్రజలు నివసిస్తారు? పట్టణాలలో తమ జీవనానికి

SCERT TELANGANA

ఇతరులకోసం కష్టపడి పనిచేసే శ్రామిక పేదలు ఎక్కువగా ఉంటారు. వారిలో కొంతమంది బానిస సేవకులు, మిగతావారు వస్తువులు తయారుచేసి అమ్మే వృత్తిపనివారు. ఈ వృత్తిపనివారు ఏం తయారు చేసేవారు? అన్ని ప్రముఖ నగరాలలో ఎంతో గిరాకీ ఉండే అందమైన కుండలను తయారుచేసే వారు. చక్కని వస్త్రాలను నేసి మహాజనపదాలలోని ధనవంతులకు అమ్మేవారు. వాళ్ళు బంగారు, వెండి ఆభరణాలను కూడా తయారుచేసేవారు. ఇనుము, రాగి, ఇత్తడి వంటి లోహాలతో పాత్రలు, పరికరాలు తయారుచేసేవారు. వారు చెక్కతో బళ్ళను, గృహోపకరణాలను తయారుచేసేవారు. సైనికులు, గణకులు, తాపీ పనివారు, గుర్రాల శిక్షకులు, ఊడ్చేవారు, నీటిని తెచ్చేవారు, చెక్కతోను, ఏనుగు దంతంతోను బొమ్మలు తయారుచేసే అనేక రకాల పనివాళ్లు ఉండేవారు. వీళ్లు తయారుచేసిన వస్తువులలో(కుండలు, ఇటుకలు, ఇనుప మరియు రాగి వస్తువులు) కొన్నిమాత్రమే తవ్వకాలలో బయటపడ్డాయి. పుస్తకాల ద్వారా వాళ్ళ గురించి మరింత తెలుసుకోవచ్చు.



*చిత్రం 10.1: మహాజనపదం కాలానికి ముందు నుంచే కంచాలు, కప్పులు వంటి పింగాణి వస్తువులకు అందంగా రంగులు అద్దేవారు. అటువంటి కప్పును మీరు ఇక్కడ చూడవచ్చు.*

వృత్తిపనివారు ఉత్పత్తి చేసిన వస్తువులను కొని గృహపతులకు వాటిని ఎక్కువ లాభానికి అమ్మే వ్యాపారస్తులు కూడా ఉండేవారు. అంతేగాక వివిధ దేశాలలో ప్రత్యేకంగా లభించే వస్తువులను తీసుకువచ్చి ఆయా మహాజనపదాలలో అమ్మేవారు. వాళ్ళు వ్యాపార నిమిత్తం పరివారంతోపాటు ఎద్దులబళ్ళు, గాడిదలు, ఒంటెలతో వారాలు, నెలలపాటు నదులు, మైదానాలు, కొండలు, మహా ఎడారుల్లో సైతం ప్రయాణించేవారు. వాళ్ళకు వచ్చిన అపార లాభాలతో పెద్ద భవంతులలో డజన్లమంది సేవకులతో, బానిసలతో పని చేయించుకుంటూ విలాసవంతమైన జీవనం సాగించేవారు.


- నగరాలలోని ప్రజలకు ధాన్యం, పాలు, మాంసం, మొదలైనవి అవసరం. నగరంలో వ్యవసాయం లేకుండా అంతమంది ప్రజలు వాటిని ఎలా పొందగలిగేవారు?

## రాజ్యం, సైన్యం, పన్నులు

చాలా మహాజనపదాలను రాజులు పరిపాలించేవారు. ప్రజలు వారి ఆజ్ఞలను పాటించేటట్లు చేయటానికి, ఇతర రాజులు వారి రాజ్యంపై దండెత్తకుండా ఉండటానికి నాటి రాజులకు సొంత సైన్యం ఉండేది. వారు రాజధాని నగరాలలో నివసిస్తూ, చెక్క, రాళ్లు, ఇటుకలు, మట్టితో చుట్టూ పటిష్టమైన కోట గోడలు నిర్మించేవారు. 10.2 చిత్రాన్ని చూడండి వీటంతటికీ చాలా ఖర్చు అయ్యేది. సైనికులకు, వారి కుటుంబాలకు ఆధారం చూపించాలి. ఇటుకలు చేసేవారికి, భవనాలు కట్టే వేలమంది స్త్రీ, పురుషులకు కూలీ ఇవ్వాలి.

- వీటంతటికీ అవసరమైన ధనాన్ని రాజులు ఎలా పొందేవారు?

SCERT TELANGANA




చిత్రం 10.2: కౌశంబి పట్టణ కోట గోడ

తెగలోని గ్రామపెద్దలకు లేదా ముఖ్యులకు, మహాజనపదాలలోని రాజులకు చాలా తేడా ఉంటుంది. ప్రజల నుంచి రాజులు పన్నులు వసూలు చేస్తారు. గృహపతులు, వృత్తి పనివారు, వ్యాపారస్తుల నుంచి పన్నులు వసూలు చేయటానికి అధికారులు ఉంటారు. పన్ను చెల్లించడానికి ఎవరైనా నిరాకరిస్తే వారిని సైనికులు శిక్షిస్తారు. ఈ అధికారులు, సైనికులు, ఉద్యోగులు రాజు గారి ఆజ్ఞలకు లోబడి ఉంటారు. ప్రజలు తన ఆజ్ఞలు పాటించేలా చూడటానికి కూడా రాజుకు వీళ్లు ఉపయోగపడేవారు.

- మహాజనపదాలలోని రాజులకు సైన్యం అవసరం ఏమిటి?
- గోండు పట్లా, మహాజనపదాలలో రాజుకు ఆదాయ వ్యయాల్లో తేడా ఏమిటి?

గోండుల గ్రామపెద్ద 'పట్లా' కూడా అప్పుడప్పుడు బయటి దాడులనుంచి తమ గ్రామాన్ని రక్షించవలసి వచ్చేది. అటువంటి సమయంలో గ్రామస్థులందరూ కలిసికట్టుగా పోరాటం చేసేవారు. గ్రామస్థులు ఒక రోజు గ్రామపెద్ద పొలాల్లో వేతనం లేకుండా పనిచేయటం ద్వారా వచ్చే అదనపు ఆదాయంతో అతిథులకు అయ్యే ఖర్చు, పండగలకు అయ్యే ఖర్చును 'పట్లా' భరించేవాడని చూశాం. అయితే తెగ పెద్దను గొప్పవాడిగా, ధనవంతుడిగా చేసేటంత ఆదాయం ఉండేదికాదు. అందరి ప్రయోజనం ఉందని భావించినప్పుడు మాత్రమే తెగలోని సాధారణ ప్రజలు తెగపెద్దతో సహకరిస్తారు. అతని ఆజ్ఞలను పాటిస్తారు.

10.3లోని చిత్రం సుమారు 2000 సంవత్సరాల కాలంనాటి సాంచిస్థూపానికి చెందినది. ఈ చిత్రంలో రాజును ఎలా గుర్తిస్తావు?



చిత్రం 10.3: రాజు పట్టణ కోటనుండి బయటకు వస్తున్న దృశ్యం

SCERT TELANGANA

సిరి సంపదలతో, గొప్పగా ఉండాలని చాలా మంది రాజులు కోరుకునేవారు. దీనికి రెండు మార్గాలున్నాయి. మొదటిది వారి రాజ్యంలోని ప్రజలపై పన్నులను పెంచటం, రెండవది పొరుగు రాజ్యాలను జయించటం. వ్యవసాయం చేసే గృహపతులనుంచి రాజులు పన్నులు వసూలు చేసేవారు. వారు తమ పంటను ఆరు భాగాలుగా చేసి ఒక భాగాన్ని రాజుకు ఇచ్చేవారు. దీనిని 'భాగ' అని పిలిచేవారు. ప్రతి నెల ఒక రోజు ఉచితంగా పనిచేయటం ద్వారా వృత్తిపనివారు రాజుకు పన్నులు చెల్లించేవారు. పశువులు, గొర్రెల మందలు కాసేవారు కూడా జంతువులను లేదా జంతు ఉత్పత్తులను పన్నుగా రాజుకు చెల్లించేవారు. వ్యాపారస్థులు కూడా వాళ్ళు అమ్మిన వస్తువులపై పన్ను చెల్లించేవారు. వేటాడేవారు, సేకరణ చేసేవారు కూడా అటవీ ఉత్పత్తులైన తోళ్లు, కలప వంటివి ఇచ్చేవారు. ఈ రకంగా రాజుకు పన్నుల రూపంలో వివిధ రకాల వస్తువులు లభించేవి. ఈ కాలంలోనే నాణేలను ఉపయోగించటం ప్రారంభమయింది. కొన్ని రకాల పన్నులు నాణేల రూపంలో చెల్లించేవారు.

- ప్రతి ఒక్కరూ తాము కష్టపడి సంపాదించినదానిలో కొంత పన్నుగా చెల్లించాల్సివస్తే అది వాళ్ళ జీవితాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుంది?
- వాళ్లు పన్నులు చెల్లించటానికి ఎందుకు అంగీకరించి ఉంటారు? కొత్త ఏర్పాట్లవల్ల వాళ్లు ఏ రకంగా ప్రయోజనం పొంది ఉంటారు?
- 'భాగ' అంటే ఏమిటి? రైతుల ఉత్పత్తి నుంచి ఇప్పటి ప్రభుత్వం కూడా ఇలా తీసుకుంటుందా?

రైతులు మెరుగైన సాగునీటి వసతులను, మెరుగైన వ్యవసాయ విధానాలను అనుసరించి అధిక ఉత్పత్తి సాధించటానికి రాజులు ప్రోత్సహించేవారని చరిత్రకారుల అభిప్రాయం. తద్వారా రాజులకు పన్ను రూపంలో ఎక్కువ లభిస్తుంది. అదే విధంగా వ్యాపారస్తులను సుదూర ప్రాంతాల వారితో వ్యాపారం చేయమని ప్రోత్సహించి వారి నుండి తమ తరఫున పన్నులు వసూలు చేయాలని గ్రామపెద్దని రాజులు కోరేవారు. గ్రామపెద్ద అధికారం, సంపద పెరుగుదలకు ఇది సహాయపడింది.

పాలకులు నిరంతరం రాజ్యవిస్తరణకు యుద్ధాలు చేసేవారు. ఈ యుద్ధాలలో పాల్గొనే సైన్యానికి జీతాలు ఇచ్చేవారు. ఓడిన వాళ్ళ పంటలను నాశనం చేసేవారు. గ్రామదహనాలకు, లూటీలకు పాల్పడేవారు. ఓడిపోయిన రాజ్యాల ప్రజలను బానిసలుగా చేసి గృహపతులకు, వ్యాపారులకు, అధికారులకు అమ్మేవారు.

- యుద్ధం కారణంగా నష్టపోయి రాజుకు పన్నులు చెల్లించాల్సి ఉన్న గ్రామాన్ని గురించి ఒక కథ రాయండి. ఈ కథ రాసేటప్పుడు ఆనాటి గ్రామాల గురించి మీకు తెలిసినదంతా దృష్టిలో పెట్టుకోండి.
- వృత్తి ఉత్పత్తులను, వ్యాపారాన్ని వృద్ధి చెయ్యటానికి మహాజనపదాల రాజులు ఎందుకు ఆసక్తి చూపించేవారు?
- రాజులు విధించే పన్నులవల్ల గ్రామపెద్దలు ఏ విధంగా లాభపడేవారు?

## మగధ ఒక బలమైన రాజ్యం

మీరు పైన తయారుచేసిన పట్టికలో మగధ ఉందా? ఇది గంగానదికి రెండువైపులా విస్తరించి ఉందని మీరు గమనించి ఉంటారు. నదులు భూములను సారవంతం చేస్తాయి. గృహపతులు తమ భూములను సులభంగా సాగుచేసుకొనేవారు. నదులమీద సరుకు రవాణా చేసేవారు, సైనికులను తరలించేవారు. మగధలోని కొంత ప్రాంతంలో అడవులున్నాయి. ఈ అడవుల నుంచి ఏనుగులను పట్టుకొని యుద్ధాలలో పోరాడటానికి వాటికి శిక్షణ ఇచ్చేవారు. అడవులనుంచి లభించే కలపతో కోటలు, రాజభవనాలను, రథాలను నిర్మించటానికి ఉపయోగి-

SCERT TELANGANA



చిత్రం 10.4: సాంచీ చిత్రఫలకంలో యుద్ధ దృశ్యం

ంచేవారు. మగధ రాజ్యంలోని దక్షిణ ప్రాంతంలో ఇనుప ఖనిజ నిక్షేపాలు ఉండేవి. వాటిని ఉపయోగించి ఆయుధాలు మొదలైనవి తయారు చేసేవారు.

వీటన్నింటి కారణంగా మగధరాజ్యం బలమైన రాజ్యంగా ఎదిగింది. మొదటి రాజులైన బింబిసారుడు అతని కుమారుడు అజాతశత్రువు మగధను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దారు. మహాపద్మనందుడు మరొక బలమైన రాజు. ఈ రాజులందరూ తమ సైన్యంతో ఇతర రాజ్యాలను జయించారు. దాని ఫలితంగా మహాపద్మనందుని కాలంలో రాజ్యం వాయువ్యం నుంచి ఒడిశా వరకు విస్తరించింది. మగధ మాదిరిగా అన్ని మహాజనపదాలు రాజుల పాలనలో లేవన్న సంగతి గుర్తుంచుకోవాలి. కొంత మంది రాజులు గోండు పెద్దల మాదిరిగా సాధారణ ప్రజలమీద ఆధారపడి తమ రాజ్య సంక్షేమంకోసం సాంప్రదాయాలను పాటించేవారు, పండగలు నిర్వహించేవారు.

- అక్కడ సహజ సంపదను ఉపయోగించి మగధ రాజులు బలమైన మగధ రాజ్యాన్ని ఎలా నిర్మించారు? సహజవనరులన్ని ఎలా ఉపయోగించుకున్నదీ రెండు వాక్యాల్లో రాయండి.

### వజ్జి: ఒక గణరాజ్యం


మగధ రాజ్యానికి ఉత్తరంగా గణతంత్ర ప్రభుత్వాన్ని కలిగిన వజ్జి మహాజనపదం ఉండేది. రాజ్యంలో ఒకే పరిపాలకుడు కాక, ఒక పరిపాలకుల బృందం ఉండేది. కొన్ని సందర్భాలలో వేలమంది కలిసి పాలన చేసేవారు. ప్రతి ఒక్కరూ తమను 'రాజ' అని పిలుచుకునేవారు. వాళ్లు సంప్రదాయాలను పాటిస్తూ అందరూ సమావేశమై అందరికీ సంబంధించిన అంశాలపై, వాదోపవాదాల తరవాత నిర్ణయాలు తీసుకునేవారు. మహిళలకు, బానిసలకు, సేవకులకు ఈ సమావేశాలలో పాల్గొనే అవకాశం ఉండేది కాదు.

బుద్ధుడు, మహావీరుడు గణాలకు చెందినవారు. ప్రఖ్యాత బోధకులయిన వీరిని అన్ని మహాజనపదాలూ గౌరవించేవి. ఈ గణరాజ్యాలను జయించటానికి రాజులు ఎంతగా ప్రయత్నించినా 1500 సంవత్సరాల పాటు అవి మనగలిగాయి.

**కీలకపదాలు**

రాజ్యం
గణతంత్రం
జనపదం
మహాజనపదం
దాసులు
భర్తుక
గృహపతి

SCERT TELANGANA



చిత్రం 10.5: సాంచీ గణ సమావేశం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. గణ అంటే ఏమిటి? రాజులు పాలించిన రాజ్యాలకు, వీటికి తేడాలు ఏమిటి?
2. గోండ్ 'పంచ్' (పంచాయితీ)లకు, గణాలకు మధ్య పోలికలు, తేడాలు రాయండి.
3. నాటి మహాజనపదాల కాలంలో గ్రామ నిర్వహణకు, నేటి గ్రామాల నిర్వహణకు మధ్యగల తేడాలను తెలపండి.
4. ప్రస్తుతం ప్రభుత్వం వృత్తిపనివారి మీద ఏవిధంగా పన్నులు విధిస్తోంది? మహాజనపదాలలోని పన్నుల విధానం, ఇదీ ఒకటేనా?
5. పేజి నెం.87లోని ఐదవ పేరా (చాలా గ్రామాలలో....) చదివి, వ్యాఖ్యానించండి.
6. భారతదేశ పటంలో 16 జనపదాలను గుర్తించండి. (పేజి నెం. 86లోని పటం–1 ఆధారంగా)



SCERT TELANGANA

పాఠం

11

# మొదటి సామ్రాజ్యాలు

*మహాపద్మనందుని తరవాత కొన్ని సంవత్సరాలకు యువకుడైన మౌర్య చంద్రగుప్తుడు మగధకు రాజు అయ్యాడు. అతనే మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు (ఒక కుటుంబ వ్యక్తులు వారసత్వంగా రాజులైతే దాన్ని వంశపాలన అంటారు). చంద్రగుప్తుని కొడుకు బిందుసారుడు, మనవడు అశోకుడు మగధ సామ్రాజ్యాన్ని విస్తరించి, భారత ఉపఖండంలో చాలా భాగాన్ని పరిపాలించారు. భారతదేశ పటం 1 లో మౌర్య సామ్రాజ్య విస్తరణను చూడండి. ఇది నేటి ఆఫ్ఘనిస్తాన్ నుంచి దక్షిణాన కర్ణాటక వరకు, తూర్పున బెంగాల్ వరకు విస్తరించి ఉంది.*

## మౌర్యసామ్రాజ్యం

పెద్ద రాజ్యాలను సామ్రాజ్యాలు అంటారు. వాటి రాజులను చక్రవర్తులు అంటారు. భారత ఉపఖండంలోని తొలి చక్రవర్తుల్లో చంద్రగుప్త మౌర్యుడిని ఒకరిగా పేర్కొంటారు. ప్రారంభంలో మగధ దాని చుట్టుపక్కల ప్రాంతాలకే పరిమితమై ఉండేది. కాని, కొంత కాలానికి అది ఆనాటి అన్ని మహాజనపదాలనూ కలుపుకొని విస్తరించింది. ఆ సామ్రాజ్యంలో హిందూకుష్ పర్వతాలు, భారతదేశపు అతి పెద్ద ఎడారి (థార్), గుజరాత్, గంగా-సింధునదీ లోయలు, మాళ్వా పీఠభూమి, అతి విస్తారమైన మధ్యభారతదేశపు అడవులు, కృష్ణా, తుంగభద్ర లోయ, గోదావరిలోయ ఉన్నాయి. ఈ సువిశాలమైన సామ్రాజ్యాన్ని, అక్కడ జీవించిన వివిధరకాల ప్రజలను ఊహించుకోండి. వీటిలో గంగాలోయ, కృష్ణానది లోయ, మాళ్వా, గుజరాత్, పంజాబ్ ప్రాంతాలు చాలా సారవంతమైన అధిక జనసాంద్రత గల గ్రామాలతో ఉండేవి. వ్యాపారానికి, చేతివృత్తులకు ఇతర ప్రాంతాలు ప్రసిద్ధి పొందాయి. వీటినుంచి పెద్ద నగరాలను, ఓడరేవులను, ఇతర దేశాలను కలుపుతూ ముఖ్యమైన వ్యాపారమార్గాలు ఉండేవి. కొన్ని ప్రాంతాలు విలువైన బంగారం, రత్నాల గనులకు ప్రసిద్ధి చెందాయి.

- మనం మౌర్యసామ్రాజ్యాన్ని గురించి ఏయే ఆధారాల ద్వారా అధ్యయనం చేయగలం?
- మౌర్యసామ్రాజ్యంలోని వ్యాపారమార్గాలను గుర్తించండి. వ్యాపార మార్గాలు చక్రవర్తులకు ఏవిధంగా ముఖ్యమైనవి?
- మహాజనపదాలకు, సామ్రాజ్యాలకు గల తేడాలు ఏమిటి?

మౌర్యచక్రవర్తులు వివిధ ప్రాంతాలనుంచి, ప్రజల నుంచి వనరులు, పన్నులు పొందేవారు. ఇంతటి విశాల సామ్రాజ్యాలను చక్రవర్తులు ఎలా పరిపాలించారు? ఉదాహరణకు కృష్ణానది ప్రాంతంలోని గ్రామాల ప్రజలు పన్నులు చెల్లించటానికి నిరాకరిస్తే, పాట్నాలో కూర్చొన్న చక్రవర్తికి ఆ విషయం ఎలా తెలుస్తుంది? వారిని శిక్షించమని సైన్యానికి ఆజ్ఞలు ఎలా జారీచేస్తారు? సైన్యం కృష్ణా ప్రాంతానికి వెళ్లి ఆ గ్రామాలను ఎలా గుర్తిస్తారు? పన్ను కట్టనివాళ్లని ఎలా శిక్షిస్తారు? దీనికంతా ఎంత సమయం పడుతుంది?


SCERT TELANGANA

## ఎలా తెలుసుకుంటాం?

ఈ సామ్రాజ్యాన్ని గురించి తెలుసుకోవాలంటే అప్పటి కాలాన్ని గురించి రాసిన చాలా పుస్తకాలు మనకు ఉపయోగపడతాయి. చంద్రగుప్తుడి మంత్రి అయిన కౌటిల్యుడు రాసిన 'అర్థశాస్త్రం' అన్న పుస్తకం చాలా ముఖ్యమైనది. చంద్రగుప్తుని ఆస్థానంలో గల గ్రీకు రాయబారి మెగస్తనీస్ రాసిన 'ఇండికా' మరొక ముఖ్యమైన పుస్తకం. అంతేగాక అశోకుని కాలంలో వివిధ ప్రాంతాలలో వేయించిన శాసనాల ద్వారా మనకు ఆనాటి సంగతులు తెలుస్తాయి.

## అర్థశాస్త్రం

చంద్రగుప్తుని మంత్రి అయిన చాణక్యుడు (కౌటిల్యుడు) 'అర్థశాస్త్రం' అనే పుస్తకంలో రాజు రాజ్యాలను ఎలా జయించాలో, వాటిని ఎలా పరిపాలించాలో తెలియజేశాడు. అంతేగాక రాజ్యాన్ని కుట్రలు, కుతంత్రాల నుంచి ఎలా కాపాడుకోవాలో, వివిధ వృత్తుల వారి నుంచి పన్నులు ఎలా వసూలు చేయాలో, భారత ఉపఖండంలో లభించే వివిధ వనరులు ఏమిటో వివరించాడు.




*పటం 1: మౌర్యసామ్రాజ్యంలోని ముఖ్యమైన నగరాలను, ప్రాంతాలను చూపే పటం*

SCERT TELANGANA

సామ్రాజ్యంలో వివిధ ప్రాంతాలను వివిధ రకాలుగా మౌర్యులు పరిపాలించేవారు. పాటలీపుత్రం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం అంతా చక్రవర్తి ప్రత్యక్ష నియంత్రణలో ఉండేది. ప్రజల దగ్గర నుంచి పన్నులు వసూలు చేయటానికి, రాజాజ్ఞలను పాటించనివారిని శిక్షించటానికి అధికారులను నియమించేవారు. రాజ్యంలో జరిగే విషయాలను, అధికారులు ఎలా పనిచేస్తున్నారు అనే సమాచారాన్ని వేగులు రాజుకు అందించేవారు. చక్రవర్తి సందేశాలను అధికారులకు దూతలు చేరవేసేవారు. మంత్రులు, రాజకుటుంబ సభ్యుల సహకారంతో అధికారుల పనితీరును చక్రవర్తి పర్యవేక్షించేవాడు.

- చక్రవర్తి తన ప్రత్యక్ష నియంత్రణలో ఉన్న ప్రాంతాలను అదుపు చేయటానికి ఎటువంటి విధానాలను ఉపయోగించేవాడు?
- సామ్రాజ్యంలో చక్రవర్తికి వేగుల అవసరం ఏమిటి?

ఇతర ప్రాంతాలను, ప్రదేశాలను, తక్షశిల, ఉజ్జయిని, సువర్ణగిరి వంటి ప్రాదేశిక రాజధానుల నుంచి పరిపాలించేవారు. వీటిని పరిపాలించడానికి రాజకుమారులను పంపేవారు. వారిని పాలకులు (గవర్నర్లు) అని పిలిచేవారు. ఆ ప్రదేశాలకు సంబంధించిన విషయాల్లో అన్ని రకాల నిర్ణయాలు తీసుకునే అధికారం వారికి ఉండేది. అంతేకాకుండా వారికి సొంత సైన్యం, అధికారులు ఉండేవారు. వారికి కూడా చక్రవర్తి తన సూచనలను దూతల ద్వారా పంపేవాడు. ఆ ప్రదేశంలో ఆచారాలు, నియమాలు తెలిసిన ముఖ్యమైన కుటుంబాలనుంచి కూడా పాలకులు సహాయం పొందేవారు.

ఈ ప్రాదేశిక పట్టణ ప్రదేశాల మధ్యన ఎక్కువ గ్రామాలుగానీ, పట్టణాలుగానీ లేని విశాలమైన అడవులు ఉండేవి. వ్యాపారస్థులు, సైన్యం, దూతలు ప్రయాణంచేసే ముఖ్యమైన రహదారులు ఈ ప్రాంతాలలో ఉండేవి. వీటిని నిర్వహించడానికి మౌర్యులు ప్రత్యేకమయిన ఏర్పాట్లు చేశారు. వీరు ఈ రహదారులగుండా బంగారు గనులు గల సువర్ణగిరి, విదేశీ వస్తువులు దొరికే తక్షశిల ప్రాంతాలకు చేరుకునేవారు. ఈ అటవీ ప్రాంతాలనుంచి బంగారం, విలువైన రాళ్లు, అడవి జంతువుల చర్మాల రూపంలో పన్నులు, బహుమానాలు పొందేవారు. బహుశా ఈ ప్రాంతంలోని ఆటవిక తెగల జీవితాలతో అంతగా జోక్యం చేసుకునేవారు కాదేమో!

- మౌర్యచక్రవర్తులు వివిధ ప్రాంతాలనుంచి వివిధ వనరులను సేకరించాల్సిన అవసరం ఏమిటి?
- రైతులు, చేతివృత్తులవారు, వ్యాపారస్తులు, అటవీ వాసులు, పశువుల కాపరులు తాము చెల్లించిన పన్నులకు బదులుగా ఏమి పొంది ఉంటారని మీరు భావిస్తున్నారు?
- తక్షశిల, సువర్ణగిరి వంటి నగరాలు మౌర్యులకు ఏవిధంగా ముఖ్యమైనవి?
- మౌర్యులు చక్రవర్తి పర్యవేక్షణలో ఉన్న పాటలీపుత్రం చుట్టూ ఉన్న ప్రాంతాలను, ప్రాదేశిక ప్రాంతాలను, అటవీ ప్రాంతాలను వేరువేరుగా పరిపాలించటానికి కారణాలు ఏమిటి? ఈ మూడు ప్రాంతాలకూ ఒకే విధంగా చట్టాలు, నియమాలు తయారుచేసి ఉంటారని మీరు భావిస్తున్నారా?

## అశోకుడు – విశిష్ట పాలకుడు

మౌర్యులలో ప్రసిద్ధిచెందిన పాలకుడు అశోకుడు. శాసనాలద్వారా వర్తమానాన్ని ప్రజలకు చేరవేసిన మొట్టమొదటి రాజు అతను. అశోకుని శాసనాలు చాలావరకు ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి.

## అశోకుడు – కళింగ యుద్ధం

కళింగ అనేది తీర రాష్ట్రమైన నేటి ఒడిశా పాతపేరు (పటం 1 చూడండి). కళింగను జయించటానికి అశోకుడు యుద్ధం చేశాడు. యుద్ధంలో జరిగిన హింస, రక్తపాతం చూసి అతడు దు:ఖించాడు. దాంతో

SCERT TELANGANA

ఇక ముందు యుద్ధం చేయనని ప్రకటించాడు. ప్రపంచ చరిత్రలో యుద్ధంలో విజయాన్ని పొంది, యుద్ధాలకు స్వస్తి పలికిన ఒకే ఒక రాజు అశోకుడు.

**కళింగ యుద్ధాన్ని తెలిపే అశోకుని శాసనం**

ఈ శాసనంలో అశోకుడు ఇలా ప్రకటించాడు:

చక్రవర్తి అయిన 8 సంవత్సరాలకు నేను కళింగను జయించాను. ఈ యుద్ధంలో లక్షా ఏభైవేలమంది బందీలయ్యారు. లక్షకు పైగా సైనికులు చనిపోయారు.

**ఇది నాలో దు:ఖాన్ని నింపింది. ఎందుకని?**

ఒక స్వతంత్ర ప్రాంతం జయించబడినపుడు లక్షలాదిమంది చనిపోతారు. చాలా మంది యుద్ధ ఖైదీలుగా బంధింపబడతారు. బ్రాహ్మణులు, సన్యాసులు మృత్యువాత పడతారు. బంధువులు, స్నేహితులు, బానిసలు, సేవకులతో దయగా ఉండేవారు కూడా చనిపోతారు. లేదా వారికి ప్రియమైన వాళ్లను కోల్పోతారు.

అందుకే నేను దుఃఖిస్తున్నాను. ఈనాటి నుంచి ధర్మాన్ని పాటించాలని నిర్ణయించుకున్నాను. దాని గురించి ప్రచారం చేస్తాను. బలం ద్వారా గెలవడం కంటే ధమ్మ (ధర్మం) ద్వారా గెలవడం మేలని నేను నమ్ముతున్నాను.

భవిష్యత్తులో నా కొడుకులు, మనమళ్లు నా తర్వాత యుద్ధాన్ని గురించి ఆలోచించకుండా ఉండేందుకు, దానికి బదులు ధమ్మ ప్రచారం ఎలా చెయ్యాలని ఆలోచించడం కోసం ఈ సందేశాన్ని రాతిమీద చెక్కిస్తున్నాను. వాళ్లు కూడా యుద్ధానికి బదులు ధమ్మ ప్రచారం చెయ్యాలి (ధమ్మ అనే ప్రాకృత పదానికి సంస్కృతంలో సమాన పదం – ధర్మం).

- యుద్ధంపట్ల అశోకుని దృక్పథాన్ని కళింగ యుద్ధం ఎలా ప్రభావితం చేసింది?
- కళింగ యుద్ధంపట్ల తన భావాలను అతడు రాతిమీద ఎందుకు చెక్కించాడు?

- అన్ని యుద్ధాలూ ఆపేసిన తర్వాత అశోకుని ప్రభావం ఉప ఖండంలోని ప్రజలపై ఎలా ఉంటుంది?

## అశోక ధర్మం అంటే ఏమిటి?

అశోకుని ధర్మంలో దేవతలకు పూజలు, బలులు ఇవ్వడం అనేవి లేవు. తండ్రి తన పిల్లలకు నేర్పినట్లే, అతడు తన ప్రజలకు బోధించాలనుకున్నాడు. అశోకుడు బుద్ధుని బోధనల ద్వారా ప్రభావితుడయ్యాడు. అనేక సమస్యలు అతన్ని వేధించాయి. సామ్రాజ్యంలోని ప్రజలు అనేక మతాలను పాటించేవారు. కొన్ని సందర్భాలలో వారిమధ్య గొడవలు కూడా జరిగేవి. కొందరు జంతువులను బలి ఇచ్చేవారు. బానిసలను, సేవకులను వేధించేవారు. దీనికి తోడు కుటుంబాలలో ఇరుగుపొరుగువారితో కూడా గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ సమస్యలను పరిష్కరించటం తన విధి అనుకున్నాడు అశోకుడు. దీనికోసం అతడు 'ధమ్మమహామాత్రులు' అనే అధికారులను నియమించాడు. వారు రాజ్యంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు ధర్మప్రచారం చేసేవారు. ఇంతేగాక, అశోకుడు తన సందేశాలను శాసనాల రూపంలో రాళ్లపైన, స్తంభాలపైన చెక్కించాడు. చదువురానివారికి వాటిపైనున్న సందేశాలను చదివి వినిపించాలని అధికారులను ఆదేశించాడు.



*11. 1:* అశోకచక్రవర్తి

కర్ణాటకలోని కనగనహళ్లిలో ఉన్న అశోకచక్రవర్తి ప్రతి రూపం (Replica)

SCERT TELANGANA

అశోకుడు తన ధర్మాన్ని సుదూర ప్రదేశాలైన సిరియా, ఈజిప్టు, గ్రీస్, శ్రీలంకలకు వ్యాప్తి చేయటానికి రాయబారులను పంపించాడు.

అతడు రోడ్లను నిర్మించాడు. బావులను తవ్వించాడు. సత్రాలను కట్టించాడు. మనుషులకే కాక జంతువులకు కూడా వైద్యసదుపాయాలను ఏర్పాటు చేశాడు.

### ప్రజలకు అశోకుడు ఇచ్చిన సందేశం

"జబ్బుపడినప్పుడు, పెళ్లిళ్ల జరిపేటప్పుడు, పిల్లలు పుట్టినప్పుడు, ప్రయాణం మీద బయలుదేరేటప్పుడు ప్రజలు అనేక ఆచారాలను పాటిస్తారు. ఈ ఆచారాల వల్ల ప్రయోజనం లేదు. వాటికి బదులు ప్రజలు ఇతర పద్ధతులు పాటిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. అవి ఏమిటి?"

"అవి: బానిసలు, సేవకులతో సౌమ్యంగా వ్యవహరించడం, పెద్దలను గౌరవించడం, అన్ని జీవుల పట్ల దయతో ఉండటం, బ్రాహ్మణులకు, సన్యాసులకు కానుకలు ఇవ్వడం."

"తమ మతాన్ని పొగడటం, ఇతరుల మతాన్ని విమర్శించడం రెండూ తప్పే. ప్రతి ఒక్కరూ ఇతరుల మతాన్ని గౌరవించాలి."

"తమ మతాన్ని పొగిడి, ఇతరుల మతాన్ని విమర్శించేవారు తమ మతానికి తీవ్రహాని చేస్తున్నారు."

"అందుకే ఇతర మతాల ముఖ్యమైన అంశాలను తెలుసుకుని వాటిని గౌరవించడం నేర్చుకోవాలి."

- ధర్మాన్ని ప్రచారం చేయడం ద్వారా ఏయే సమస్యలను పరిష్కరించాలని అశోకుడు కోరుకున్నాడు?
- ప్రజలు బానిసలను, సేవకులను తక్కువగా చూడడానికి కారణాలను చెప్పండి. చక్రవర్తి శాసనం ద్వారా వారి పరిస్థితి ఏమైనా మెరుగయిందా? మీ సమాధానానికి కారణాలు చెప్పండి.
- సామాన్య ప్రజల మధ్య అశోకుడు ధమ్మాన్ని ప్రచారం చేయడానికి ఏమి చేశాడు?
- ఆచారాల స్థానంలో అశోకుడు దేన్ని ప్రోత్సహించాడు?
- సిరియా, ఈజిప్టు, శ్రీలంక దేశాలను పటంలో గుర్తించండి. పాట్నా నుంచి ఈ దేశాలకు మార్గాలను కనుక్కోండి.

## దక్కనులోని రాజ్యాలు – సామ్రాజ్యాలు

మౌర్యులు దక్కన్ జయించిననాటికి (గోదావరి నది నుంచి కృష్ణ, తుంగభద్రా నదీలోయల వరకు) చాలా ప్రాంతాలలో గ్రామాలు, చిన్న పట్టణాలు ఉండేవి. వాటిలో ఆనాటికే ఇనుముతో తయారుచేసిన వస్తువులను, ఇతర వస్తువులను అమ్మేవారు. కొన్ని ప్రాంతాలలో బంగారు గనుల నుంచి బంగారం తీసి ఆభరణాలు తయారు చేసేవారు. మిగతా ప్రాంతాలు చాలా వరకు అడవులుగా ఉండేవి. వాటిలో వేట, ఆహారసేకరణదారులు, పశుపాలకులు చిన్న చిన్న ఆవాస ప్రాంతాల్లో నివసిస్తూ ఉండేవారు.

బహుశ పుట్టుక, వివాహం వంటివాటితో దగ్గర బంధుత్వం కలిగిన ప్రజల సమూహాలు, ఈ ప్రాంతాలలో ఉండేవి. ఇలా సంబంధాలున్న సమూహాలను తెగ అంటారు. ఈ బృందాలలో ముఖ్యమైనవారు బలమైన నాయకులుగా వాటికి నాయకత్వం వహించేవారు. క్రమేపి వాళ్లు సంపదను కూడగట్టుకుని, బలవంతులై తెగ ప్రాంతాన్ని పాలించేవారు.

- అనేక నగరాలకు బలమైన కోటలు ఉండేవి. నగరాలు ఎదుర్కొన్న విపరీత పరిస్థితులు ఏమిటి? కోటల అవసరం ఏమిటి?
- గంగా–సింధులోయ, కృష్ణా–తుంగభద్ర లోయల

SCERT TELANGANA

మధ్య ఉన్న ఏ పోలికలు అక్కడ గ్రామాల, నగరాల అభివృద్ధికి దారితీశాయి.

మౌర్యసామ్రాజ్యం పతనం చెందిన తరవాత తెగల నాయకులు చిన్న రాజులుగా అవతరించారు. వారిలో శాతవాహనులు నర్మదానది నుంచి కృష్ణా, గోదావరి డెల్టా వరకు విస్తరించి ఉన్న విశాల సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శాతవాహనులలో గౌతమీపుత్ర శాతకర్ణి, వశిష్ఠీపుత్ర పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి గొప్ప రాజులు. 2000 సంవత్సరాల క్రితం 200 సంవత్సరాలపాటు వారి పాలన సాగింది. కొంతమంది రాజులు కృష్ణానది తీరానగల అమరావతి దగ్గర ఉన్న ధాన్యకటకాన్ని రాజధానిగా చేసుకుని పాలించేవారు. గ్రామపెద్దలను, చిన్నరాజులను వారి ఆధీనంలో తెచ్చుకున్నప్పటికీ, వారి పరిపాలనలో శాతవాహనులు జోక్యం చేసుకునేవారు కాదు.


చాలా మంది గృహపతులు, వారి కుటుంబంలోని మహిళలు, వ్యాపారస్థులు అమరావతి, భట్టిప్రోలు, వడ్లమాను మొదలైన చోట్ల బౌద్ధ ఆరామాలు, స్తూపాలు నిర్మించటానికి సహకరించారు. శాతవాహనరాజులు బ్రాహ్మణులకు బౌద్ధ సన్యాసులకు చాలా భూములను దానంగా ఇచ్చారు. వీటికి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ కాలంలో దూర ప్రాంతాలైన బెంగాల్‌తోను, రోమ్‌తోను వ్యాపారం ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. రోమన్ నాణాలతో పాటు, రోమన్ శైలిలో చేసిన కుండలు ఇక్కడ దొరికాయి. వ్యాపారులు సముద్రాల మీదుగా సరుకు రవాణా చేసేవారు. కృష్ణానది మీద పడవల్లో అమరావతి వంటి సుదూర పట్టణాలకు సరుకు రవాణా జరిగేది.



*చిత్రం 11.2: నాణాలపై చిత్రించిన గౌతమీపుత్ర శాతకర్ణి*

**శాతవాహనుల కాలంలో కోటిలింగాల**

కోటిలింగాల, తెలంగాణాలోని జగిత్యాల జిల్లాలో గోదావరినది, పెద్దవాగు కలిసేచోట శ్రీపాద ఎల్లంపల్లి



*చిత్రం 11.3: కోటిలింగాల నాణేలు*

ప్రాజెక్టుకు ఎగువనఉంది. ఇది ప్రాచీన భారతదేశంలోని 16 మహా జనపదాలలో ఒకటైన 'అస్మక' జనపదానికి రాజధాని నగరంగా ఉండేది. శాతవాహన వంశస్థులకు కోటిలింగాల తొలి రాజధాని. అక్కడ జరిగిన త్రవ్వకాలలో శాతవాహనుల ముందు కాలానికి చెందిన, శాతవాహనుల, ఇక్ష్వాకుల కాలానికి చెందిన వెండినాణేలు, విలువైన మట్టిపాత్రలు, పింగాణీ పాత్రలు, పెద్ద మొత్తంలో బయల్పడినవి. బట్టి ఇటుకలతో చుట్టు గోడ నిర్మించిన గుండ్రని బావి కూడా బయల్పడింది. శాతవాహన వంశస్థాపకుడైన శ్రీముఖుడు, ఆ తర్వాత పాలకులైన కన్హా, శాతకర్ణి కాలానికి చెందిన ఎన్నో నాణేలు బయల్పడినవి. కోటిలింగాలలో అనేక ద్వారములుగల మట్టికోట, నాలుగువైపుల బురుజులు కన్పిస్తాయి.



*చిత్రం 11.4: కోటిలింగాల కుండ పెంకులు*

SCERT TELANGANA

అంతేకాకుండా రాష్ట్రంలోని ఫణిగిరి, నేలకొండపల్లి, కొండాపూర్, దూలికట్ట, పెద్దబంకూర్, కీసరగుట్టలలో బౌద్ధస్థావాలు, విహారాలు, చైత్యాలు బయట పడినాయి.

- మీరు కూడా ఇల్లు కట్టడానికి కాల్చిన ఇటుకలను వాడుతారా? మురికి నీరు పోవడానికి మురుగు నీటి సంపులు అంతర్భూభాగ పైపులు కూడా ఉన్నాయా?
- మీరు ఏదైనా కమ్మరి కొలిమిని చూశారా? దాని గురించి తరగతిలో వర్ణించండి.
- మీరు వర్తకునిగా ఊహించుకొండి. పెద్దబంకూరు నుండి రోముకు ఉత్పత్తులను ఎవరు తీసుకెళ్తున్నారు. దీన్ని ఆధారం చేసుకొని ఒక కథ రాయండి.

**కొంతమంది నాయకులు చిన్నరాజులుగా ఎలా ఎదిగారు?**

**కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో మ్యాకదోని గ్రామంలో లభించిన శిలాశాసనం.**

- శాతవాహనుల కాలంనాటి శిలాశాసనంగా భావిస్తున్న దీన్ని చదవండి.

"'శాతవాహనుల రాజు శ్రీపులోమావి 8వ సంవత్సరం పాలనలో అతడి మహాసేనాపతి స్కందనాగ జనపదంలోని శాతవాహన జిల్లాలో, కుమారదత్త అధిపతిగా ఉన్న వేపుర గ్రామంలో కాంత తెగకి చెందిన సమ్వ అనే గహపతి ఈ చెరువును తవ్వించాడు."

1. వేపుర గ్రామంలో ఏ తెగ నివసించేది?
2. దాని అధిపతి ఎవరు?
3. వేపుర గ్రామం ఉన్న జనపదానికి ఎవరు నాయకత్వం వహిస్తున్నారు?
4. గహపతి సమ్వ చెరువు ఎందుకు తవ్వించి ఉంటాడు?



*చిత్రం 11.5: నాణెంపై చిత్రించిన వశిష్ఠీపుత్ర శ్రీపులోమావి*

శాతవాహనుల సామ్రాజ్యం అంతమైన కొంతకాలం తరవాత ఇక్ష్వాకులు రాజరిక బిరుదులను పొంది రాజులయ్యారు. కృష్ణానదీతీరంలోని నాగార్జున కొండకు దగ్గరలోని విజయపురిని రాజధానిగా చేసుకుని వారు ఇక్ష్వాకు సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. ఈ వంశంలోని ముఖ్యమైన రాజులు క్షాంతమూలుడు, వీరపురుషదత్తుడు. ఈ రాజులు ఇతర తెగలవారిని వివాహాలు చేసుకోడం ద్వారా వివిధ తెగల పెద్దలను, చిన్న రాజులను కలిపే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అశ్వమేధం, వాజపేయ వంటి యాగాలను చేసి, బ్రాహ్మణులకు విరివిగా దానధర్మాలు చేసి తమ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నం చేసేవారు. రామాయణంలోని రాముని వంశానికి చెందినవారమని చెప్పుకున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఇక్ష్వాకు కుటుంబాలలోని మహిళలు బౌద్ధగురువులను ఆరాధిస్తూ బౌద్ధారామాలు, స్తూపాల నిర్మాణానికి (నాగార్జునకొండ) అధిక మొత్తంలో విరాళాలు ఇచ్చేవారు. వీరు నాగార్జునకొండలో అతి పెద్ద ఆరామం, స్థూపం నిర్మించారు.

## భారత ఉపఖండంలోని కొన్ని ముఖ్యమైన సామ్రాజ్యాలు

### కుషానులు

రెండువేల సంవత్సరాలకు పూర్వమే కుషానులు చైనా నుండి వలస వచ్చి క్రమక్రమంగా ఆఫ్ఘనిస్తాన్ కేంద్రంగా తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు. కుషాను రాజులలో ప్రఖ్యాతిగాంచిన రాజు కనిష్కుడు. డెబ్బది ఎనిమిది (CE 78)లో సింహాసనాన్ని అధిష్టించాడు. ప్రస్తుత పాకిస్తాన్ నుండి భారతదేశంలోని మధుర, అలహాబాదు వరకు ఉన్న విశాల భూ భాగాన్ని

SCERT TELANGANA

పరిపాలించాడు. అఫ్ఘనిస్తాన్‌లోని అతిపెద్ద ప్రాంతాలనే కాక, ఆక్సస్ నది పరివాహక ప్రాంతం వరకు కుషానులు పరిపాలించారు. భారతదేశం, చైనా, ఇరాన్, రోమ్‌లను కలిపే అతిపెద్ద వ్యాపార మార్గాలకు చాలా సమర్థవంతంగా నిర్వహించారు. పై దేశాల మధ్య వ్యాపారం గొప్పగా వ్యాప్తి చెందిన యుగంగా వీరి కాలాన్ని పరిగణిస్తారు. అంతేగాక మతబోధకులు, శాస్త్రవేత్తలు, కళాకారుల రాకపోకలు జరిగాయి. ఒకరి ఉత్పత్తులు మరొకరు కొనుక్కొవడమే కాకుండా, ఆయా దేశాల ప్రజలు ఒకరినొకరు తెలుసుకొనుటకు, వారి వారి ఆచారాలు, మతం, తాత్విక ఆలోచనలు, వారి కళలు, వాస్తు శిల్ప రీతులు తెలుసుకొనుటకు వీటి ద్వారా అవకాశం కలిగింది. దీని ఫలితంగా భారతదేశంలోని పట్టణ కేంద్రాలన్నింటిలో వ్యాపారం విస్తరించి, తద్వారా బంగారం ప్రవహించింది. అతిపెద్ద సంఖ్యలో బంగారు నాణెలు లభించడమే ఇందుకు నిదర్శనం.

### శకయుగం

CE78లో కనిష్కుడు చక్రవర్తిగా పట్టాభిషేకం చేసుకొని, అధికారంలోకి వచ్చిన సంవత్సరం నుండి శక సంవత్సర ప్రారంభం అయింది. దీన్నే శకయుగం లేదా శకాబ్ద అంటారు. చాలా మంది దక్షిణ భారత ప్రజలు ఈ యుగాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది సాధారణ యుగం (CE)కు 78 సంవత్సరాల తర్వాత ఉంటుంది.

## గుప్త సామ్రాజ్యం

గుప్త సామ్రాజ్య రాజులు నేటి బీహారులో ఒక చిన్న రాజ్యాన్ని పరిపాలించడం ద్వారా వారి పాలనను ప్రారంభించారు. మూడు తరాలలో ఉత్తర భారతదేశంలో గుజరాత్ నుండి బెంగాల్ వరకు, ఢిల్లీ నుండి నేటి మధ్యప్రదేశ్ వరకు పూర్తి ఆధిపత్యాన్ని వహించారు. మొదటి చంద్ర గుప్తుడు, సముద్ర గుప్తుడు, రెండవ చంద్ర గుప్తుడు, కుమార గుప్తుడు, స్కంధ గుప్తుడు ఈ సామ్రాజ్యానికి చెందిన కొంతమంది ప్రసిద్ధి చెందినరాజులు. భారత రాజకీయ వ్యవస్థలో రెండు కొత్త విధానాలను ప్రవేశపెట్టిన వారుగా ప్రసిద్ధి గాంచారు. అందులో ఒకటి, వారు ఏదైనా రాజ్యాన్ని జయిస్తే, అక్కడ ఓడిన రాజునే తిరిగి కొనసాగిస్తూ, గుప్తుల ఆజ్ఞలు పాటిస్తూ, వారికి సామంతులుగా ఉండేలా చూసేవారు. ఈ విధంగా ప్రత్యేకంగా భారత దేశంలో పాత రాజవంశాలే యుద్ధాలలో ఓడినా కూడా చాలా ప్రాంతాలను పరిపాలించాయి. అయినప్పటికి గుప్తరాజులు ఉత్తరభారత దేశంలోని చాలా ప్రాంతాలను తిరిగి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. రెండవది, కొంతమంది గుప్తరాజులు, వారి సామంత రాజులు వారితో స్నేహంగా ఉన్న వారికి, బ్రహ్మణులకు పూర్తి పరిపాలన అధికారాలతో గ్రామాలను ఇచ్చేవారు. ఇటువంటి గ్రామాలు రాజుకు ఎటువంటి పన్నులు చెల్లించే అవసరం లేదు, ప్రాదేశిక అధికారుల ఆజ్ఞలు కూడా పాటించనవసరం లేదు. అంతేగాక కనీసం వారు ఈ గ్రామాలలోకి వచ్చేది కూడా లేదు. బ్రహ్మణులు ఈ గ్రామాలలో ఉంటూ, యజ్ఞాలు చేస్తూ, వేదాలను యువ బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు, పురాణ ఇతిహాసాలను ప్రజలందరికీ బోధించేవారు.

### మెహ్రౌలి ఇనుప స్తంభం

ఢిల్లీలో కుతుబ్‌మినార్ ప్రాంగణంలో వున్న ప్రఖ్యాతి చెందిన మెహ్రౌలి ఇనుపస్తంభాన్ని రెండవ చంద్రగుప్తుడు ఏర్పాటు చేశాడు. గత పదిహేడు వందల సంవత్సరాలుగా బయట గాలిలో నిలువబడి వున్నప్పటికి అది తుప్పు పట్టక పోవడం చేత ఇది అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నది.



*చిత్రం 11.6: మెహ్రౌలి ఇనుప స్తంభం*




SCERT TELANGANA

- క్రింది పటాన్ని పరిశీలించి తెలంగాణ గుప్త సామ్రాజ్యంలో భాగంగా ఉండినదా?
- గుప్త పాలకులు దక్షిణ భారతదేశ రాజులను ఓడించిన తరువాత కూడా ఓడిన రాజులనే పరిపాలకులుగా ఉంచడానికి ఎందుకు అనుమతించి ఉంటారు?
- గ్రామాలను బ్రాహ్మణులకు ఇవ్వడం ద్వారా గుప్త రాజులకు ఏ విధంగా మేలు జరిగిందని అనుకుంటున్నావు?

గుప్తరాజులు కూడా వైదిక మతాచారాలైన అశ్వమేధయాగం లాంటి వాటిని ప్రముఖంగా పోషించారు. ఇదే కాక పౌరాణిక సాంప్రదాయాలను పాటిస్తూ, ప్రత్యేకించి వైష్ణవ మరియు శైవ మతాలను పోషిస్తూ విష్ణువు, శివ, దుర్గామాతల అవతారాలకు సంబంధించిన దేవాలయాలను నిర్మించి, వాటిలో నిత్య పూజలు జరిగేటట్లు చూశారు. గుప్తుల ఈ మతాచారాల పోషణ యజ్ఞక్రతువులను శివ, విష్ణు, దుర్గామాతల అవతారాలైన స్థానిక దేవతలను పూజించే విధానంను, దేవాలయాలకు వెళ్ళిపూజలు నిర్వహించే విధానము, బ్రాహ్మణులకు మాణ్యాలు ఇవ్వడాన్ని బలపరిచింది. ఇదేకాక గుప్తులు జైన ఆరామాలు, సాంచి స్థూపం వంటి బౌద్ధ స్థూపాలకు కూడా నిధులను కేటాయించి వాటిని పోషించారు.

**పటం 2: గుప్త సామ్రాజ్యము సా.శ. 320-550**




SCERT TELANGANA

గుప్తరాజులు వారికాలంలో అనేక అందమైన దేవాలయాలను నిర్మించారు. మధ్యప్రదేశ్‌లోని దియోగర్, ఉదయగిరి, ఉత్తర ప్రదేశ్‌లోని బిటర్‌గాం, ఎరాన్‌లలో నేటికి మనం గుప్తులు నిర్మించిన దేవాలయాలను చూడగలం. భారతదేశంలోనే అతి అందమైన రాతి శిల్పాలను కొన్ని ఇవి కలిగి ఉన్నాయి. గుప్తుల కాలంలోని దేవాలయాలు చాలా వరకు విష్ణు, శివునికి చెందినవైనప్పటికి, బౌద్ధ శిల్పానికి చెందిన సారనాథ్ కూడా ప్రఖ్యాతి గాంచింది.

- గుప్త రాజులు వైదిక కర్మలు, దేవాలయాలలో పూజలతో పాటు భౌద్ధ, జైన ఆరామాలకు ఎందుకు సహాయం అందించారు?

**కీలకపదాలు**

| | |
|---|---|
| సామ్రాజ్యం | యజ్ఞాలు |
| ఆరామాలు | ధర్మ మహా మాత్రులు |
| ఉపఖండం | వేగులు |
| అర్థశాస్త్రం | ధమ్మ |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. వివిధ తెగల పెద్దల ఆమోదంకోసం ఇక్ష్వాకులు ఏమి చేసేవారు?
2. అశోకుడు విశిష్ట పాలకుడని ఎందుకు అనుకుంటున్నారు?
3. 2000 సంవత్సరాల క్రితం దక్కనులో రాజ్యాల అవతరణకు దారితీసిన పరిస్థితులేమిటి?
4. పటం 1లో మూడు నదులను, రెండు ప్రాదేశిక రాజధానులను గుర్తించండి?
5. అశోకుడు కళింగ యుద్ధం తరవాత ఇకముందు యుద్ధం చేయకూడదని నిర్ణయించుకున్నాడు. ఇలాంటి నిర్ణయాలు ప్రపంచ శాంతికి దోహదపడతాయని నీవు భావిస్తున్నావా? ఎలా?
6. ప్రపంచ పటంలో ఈ కింది దేశాలను గుర్తించండి.

   అ. సిరియా　　ఆ. ఈజిప్ట్　　ఇ. గ్రీసు

   ఈ. శ్రీలంక　　ఉ. భారతదేశం
7. అశోకుని కాలంలో వారసత్వ పాలన ఉండేది. ప్రస్తుత పాలన ఆనాటి పాలనకు ఏవిధంగా భిన్నమైనది?
8. పేజి నెం. 97లోని ప్రజలకు 'అశోకుడు ఇచ్చిన సందేశం' చదివి, వ్యాఖ్యానించండి.
9. గుప్తుల కాలంనాటి సాంఘిక విధానాల గురించి చర్చించండి.

### ప్రాజెక్టు

మీ ప్రాంతంలో ఏదైనా పాత శాసనం ఉంటే దాన్ని గురించి మరిన్ని వివరాలు తెలుసుకోండి.

SCERT TELANGANA

# పాఠం 12

# ప్రజాస్వామ్య ప్రభుత్వం

వార్తా పత్రికల్లో వచ్చిన కింది పతాకశీర్షికలను చూడండి. ప్రభుత్వం చేస్తున్న వివిధ కార్యకలాపాలను మీరు గమనించగలరు. వీటిలో అధికభాగం దేశంలో ప్రభుత్వ నిర్వహణాతీరుకు సంబంధించినవి.

15000 గ్రామాలు కరువు ప్రాంతాలుగా గుర్తింపు

అవ్యవస్థీకృత రంగంలోని పనివారి హక్కులకు ప్రభుత్వ రక్షణ

వరదలను అరికట్టటానికి విస్తృతమైన ప్రణాళిక : ప్రభుత్వం

బొగ్గు, విద్యుత్ రంగాలను పునర్వ్యవస్థీకరిస్తున్న ప్రభుత్వం

ఉల్లిగడ్డలకు ధర నిర్ణయించిన ప్రభుత్వం. మార్కెట్‌లో ఉల్లిగడ్డల కొరత లేదు

సుప్రీంకోర్టులో మరో ఐదుగురు న్యాయమూర్తులు : ప్రభుత్వం

SCERT TELANGANA

## ప్రభుత్వం ఏం చేస్తుంది?

ఈ రోజుల్లో నిర్ణయాలు తీసుకోటానికి వాటిని అమలు చేయటానికి ప్రతి దేశానికి ఒక ప్రభుత్వం అవసరం. రోడ్లు వేయడానికి, పాఠశాల భవనాలు నిర్మించడానికి, బాగా పెరిగిన ఉల్లి ధరలు తగ్గించడానికి, సరిపడా విద్యుత్ సరఫరా చేయడానికి నిర్ణయాలు తీసుకుంటుంది. అంతేకాకుండా ప్రభుత్వం ఎన్నో సామాజిక అంశాలపైన నిర్ణయాలు తీసుకుంటుంది.

ఉదాహరణకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా పేదలకు అండగా ఉంటుంది. అలాగే తపాల సర్వీసులు నిర్వహించడం, రైల్వే వ్యవస్థ నిర్వహణ వంటి పనులను కూడా ప్రభుత్వం చూస్తుంది.

అంతేకాకుండా దేశ సరిహద్దులను కాపాడుతూ, ఇతర దేశాలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని ఉండటానికి ప్రయత్నిస్తుంది. దేశప్రజలందరికి సరైన ఆహారం అందేటట్లు చూడడమేగాక, వారి ఆరోగ్యం పట్ల బాధ్యత వహిస్తుంది. ఎప్పుడైనా ప్రకృతి విపత్తులు (ఉదా: సునామి, భూకంపాలు) వచ్చినపుడు ముఖ్యంగా ప్రభుత్వం ప్రజలకవసరమైన సహాయం అందిస్తుంది. ప్రజల వివాదాలను న్యాయ స్థానాలు పరిష్కరిస్తాయి. ఈ న్యాయ స్థానాలు ప్రభుత్వంలో భాగమే. ఇవన్నీ ప్రభుత్వం ఎలా నిర్వహిస్తుంది? ఈ పనులు అన్నీ ఎందుకు చేస్తుంది అని మీరు అనుకుంటున్నారా? ఎందుకంటే సమాజంలో కలిసి

నివసిస్తున్నప్పుడు అందరి కోసం నిర్ణయాలు తీసుకోటానికి ఒక వ్యవస్థ ఎంతైనా అవసరం. ఆ వ్యవస్థ కొన్ని నియమాల ద్వారా, నిబంధనల ద్వారా సమాజం సక్రమంగా అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుంది. ఆ వ్యవస్థే ప్రభుత్వం. ఇందుకుగాను అందరికీ వర్తించే విధంగా కొన్ని నిబంధనలు రూపొందించుకొనవలసి ఉంటుంది. ఉదాహరణకు వనరుల నియంత్రణద్వారా, సరిహద్దులను పరిరక్షించటం ద్వారా ప్రజలకు భద్రత భావాన్ని కల్పించడానికి ప్రజల తరపున నాయకత్వం వహించి ప్రభుత్వం ఈ పనులను చేస్తుంది. తన పరిధిలో జీవిస్తున్న ప్రజల కోసం నిర్ణయాలుచేసి, అమలు చేస్తుంది.


- మీరు చదువుతున్న పాఠశాలను ఎవరు నిర్వహిస్తున్నారు?
- ప్రభుత్వం చేస్తున్న కొన్ని పనులను రాయండి.

## వివిధ రకాల ప్రభుత్వాలు

మనం 9వ పాఠంలో గిరిజన సమాజం ఏవిధంగా పనిచేస్తుందో చదివాం. అక్కడ పురుషులు ఒక చోట సమావేశమయిన తరువాత ఏవిధంగా నిర్ణయాలు తీసుకుంటారో, గిరిజనులలో పెద్ద ఏవిధంగా ఆ నిర్ణయాలను అమలు చేస్తాడో, ఆ విధంగా చేయటంలో కొందరు ఆయనకు ఏవిధంగా సహాయపడతారో తెలుసుకున్నాం. సమాజం చిన్నగా



చిత్రం 12.1: కాచిగూడ రైల్వేస్టేషన్




చిత్రం 12.2: తపాలా కార్యాలయం



చిత్రం 12.3: సర్వోన్నత న్యాయస్థానం

*ప్రభుత్వంలో భాగంగా నడిచే కొన్ని సంస్థలకు ఇవి ఉదాహరణలు.*

ఉన్నప్పుడు అటువంటి వ్యవస్థ సరిగా పనిచేస్తుంది. కాని ఇప్పటి సమాజంలో ఇలా సాధ్యమా? జనాభా వేలల్లో లేదా లక్షల్లో ఉన్నప్పుడు అందరూ ఒక చోట సమావేశమై నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమా? కాదు కదా!

వాళ్ళు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటారు? గిరిజన సమాజంలాగ ప్రజలంతా ఒకే సమూహానికి, ఒకే సంస్కృతి (మతం, కులం, భాష)కి చెందినవారైతే అందరికీ ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి తయారుచేయడానికి సాధ్యమవుతుంది.

కానీ ఇప్పటి సమాజంలో విభిన్న సంస్కృతుల ప్రజలకు ఇది పనిచేయదు. గిరిజన సమాజాలలో ప్రజల ఆకాంక్షలు, జీవన విధానం ఒకేలా ఉంటాయి. వారిలో ధనవంతులు, బీదవారు అనే భేదం ఉండదు.

SCERT TELANGANA

కాని రైతులు, వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, భూమిలేని కూలీలు మొదలయిన వారు నివసిస్తున్న బహుముఖ సమాజంలో అందరూ ఆమోదించే విధంగా ఒక సామాన్య పరిష్కారంగానీ, ప్రవర్తనా నియమావళి గానీ రూపొందించడం సాధ్యం కాదు.



చిత్రం 12.4: శాలివాహన చక్రవర్తి

ఇంతకుముందు చరిత్రలో చక్రవర్తులు, రాజులు, రాణులు వారు అనుకున్నదే చట్టం, వారు చెప్పిందే న్యాయం కావటం మనం చూశాం. ప్రజలపై పన్ను విధించడంలో వారు చెప్పిందే తుది నిర్ణయం. ఎవరైనా రాజుల నిర్ణయానికి వ్యతిరేకంగా పోయినా, ధిక్కరించినా వాళ్ళకు రాజులు కఠిన శిక్షలు విధించేవారు. ఎక్కువ మంది రాజులు రాజ్యపరిపాలన కంటే రాజ్యాన్ని విస్తరించటంపైనే ఎక్కువ సమయాన్ని వెచ్చించేవారు. ఇటువంటి ప్రభుత్వాన్ని రాజరికం అంటారు. రాజు లేక రాణి కొన్ని సమయాలలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఇతరులను సంప్రదించేవారు. కాని తుది నిర్ణయం



చిత్రం 12.5: శాసనసభ

మాత్రం రాజుదే. రాజులు తాము తీసుకున్న నిర్ణయాలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు.

- గిరిజన ప్రజాస్వామ్య వ్యవస్థను రాజరిక వ్యవస్థతో పోల్చండి.

1. ఈ రెండింటిలో ప్రజల అభిప్రాయానికి విలువనిచ్చేది ఏది?
2. పెద్ద సమాజం లేదా విభిన్న వ్యక్తులున్న సమాజంలో ఏ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది?
3. ఏ ప్రభుత్వ వ్యవస్థలో పాలకులు క్రూరులుగా మారి ప్రజలపట్ల అధర్మంగా ప్రవర్తించే అవకాశం ఉంది?

- పెద్ద సంక్లిష్ట సమాజానికి ఏ ప్రభుత్వం ఉంటే బాగుంటుందని భావిస్తున్నారు? అది ప్రజలను అన్యాయానికి, అణచివేతకు గురికాకుండా పాలించేదై ఉండాలి.
- యుద్ధాలు రాజరిక వ్యవస్థలో ఎక్కువగా ఉండేవా? గిరిజన సమాజంలో ఎక్కువగా ఉండేవా? కారణాలు తెలపండి.

SCERT TELANGANA


## ప్రజాస్వామ్య ప్రభుత్వాలు

విభిన్న ప్రజల విభిన్న అభిప్రాయాలను ఇముడ్చుకుంటూ సమాజంలో అన్యాయం, అణచివేతకు పాల్పడే శక్తులను నియంత్రించగలిగే ప్రభుత్వమే ప్రజాస్వామ్య ప్రభుత్వం. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు రాచరికానికి వ్యతిరేకంగా జరిగిన ఫలితంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థ ఏర్పడింది.

భారతదేశం ప్రజాస్వామ్య దేశం. విభిన్న మతాలు, భావాలు, విభిన్న సంస్కృతులు, ఆకాంక్షలు గల సమాజంలో ప్రజలందరి అవసరానికి అనుగుణంగా ప్రభుత్వం పనిచేయవలసి ఉంటుంది.

భారతదేశంలో కోట్లాది ప్రజలు నివసిస్తూ ఉన్నారు. పౌరులందరూ నిర్ణయాలు తీసుకోవడంలో పాలుపంచుకుంటే అసంఖ్యాకమైన అభిప్రాయాలు వెలువడతాయి. ఇది నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యానికి కారణమవుతుంది. అంతేకాకుండా అందరు పౌరులు ప్రభుత్వ కార్యక్రమాల మీద సమయం, డబ్బు, శక్తి వెచ్చించే అవకాశాలు తక్కువ. ఇటువంటి పరిస్థితులలో సమస్యల పరిష్కారం ఎలా జరుగుతుంది?

ప్రజాస్వామ్యానికి అమెరికాకు చెందిన అబ్రహాం లింకన్ ఇచ్చిన నిర్వచనం "ప్రజలయొక్క ప్రజలచేత, ప్రజల కోసం నడిచే ప్రభుత్వం." ఈ నిర్వచనాన్ని గురించి ఆలోచించండి. మీరు దానితో ఏకీభవిస్తారా? ఎందుకు? చర్చించండి.



*12.6: అబ్రహాం లింకన్*


ఇందుకుగాను మనకు రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం. రెండోది మెజారిటీ పరిపాలన. ఈ రెండింటి భావాన్నీ మొదట తెలుసుకుందాం.

ఈ రోజుల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాలన్నీ ప్రాతినిధ్య ప్రభుత్వాలే. ఈ విధానంలో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎన్నుకుంటారు. ఉదాహరణకు ఒక గ్రామంలో 2000 నుంచి 5000 వరకు జనాభా ఉంటే ఆ గ్రామాన్ని వార్డులుగా విభజిస్తారు. ఒక్కొక్క వార్డుకు వంద నుంచి రెండు వందల ఓటర్లు ఉంటారు. ప్రతి వార్డు నుంచి ఒక ప్రతినిధిని (వార్డు సభ్యుడు) ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలలో గ్రామంలోని వయోజనులు అంటే 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు అయిన ప్రతివ్యక్తి, పేద, ధనిక, స్త్రీ, పురుష, మత, భాష, నిరక్షరాస్యులు, విద్యాధికులు అనే భేదాలు లేకుండా ఓటు వేస్తారు. అందరికంటే ఎక్కువ ఓట్లు వచ్చిన వారిని ప్రతినిధులుగా పిలుస్తారు. ఎన్నికైన ప్రతినిధులు సమావేశాల ద్వారా ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకుంటారు.




*చిత్రం 12.7: గ్రామప్రాంతంలో ఓటింగ్ ప్రక్రియ: రెండవ ఓటు వేయకుండా ఉండటానికి చేతివేలిపై చెరిగిపోని సిరా గుర్తును వేస్తారు*

SCERT TELANGANA




చిత్రం 12.8: ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం


ఎన్నికల ముందు ప్రజలు ఆలోచించి, చర్చించి ఏ ఏ అంశాల ఆధారంగా ప్రభుత్వం నడుచుకోవాలో నిర్ణయించుకొని ఓటెయ్యాలి. ఎన్నికల ముందు వివిధ అభ్యర్థులు లేదా పార్టీలు తాము ఎన్నికైతే చేపట్టబోయే కార్యక్రమాల జాబితాను (Manifesto) ఓటర్ల ముందు ఉంచుతారు. ఎవరిని తమ ప్రతినిధిగా ఎన్నుకోవాలో నిర్ణయించుకోడానికి ఓటర్లకు ఇది ఉపయోగపడుతుంది. ఎన్నికైన ప్రతినిధులు తాము చేసిన వాగ్దానాలు, హామీలకు కట్టుబడి ఉండి ప్రజల మనోభావాలను, సమస్యలను ఎప్పటికప్పుడు గమనించవలసి ఉంటుంది. ఈ ప్రతినిధులు ఒక నిర్ణీత కాలానికి (సాధారణంగా 5 సంవత్సరాలు) ప్రతినిధిగా ఉంటారు. భారతదేశంలో 5 సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకొంటారు.

- పోటీ చేస్తున్న అభ్యర్థుల అభిప్రాయాలను ప్రజలు తెలుసుకోటం ఎందుకు అవసరం?

- శాశ్వత ప్రాతిపదికన సభ్యులు ఎన్నికయితే ఏమి జరుగుతుంది?
- ప్రజల ఆలోచనలకు, అవసరాలకు వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు పనిచేస్తారని మీరనుకుంటున్నారా?

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో సాధారణ మెజారిటీ (Simple majority) ద్వారా కూడ ప్రతినిధులు ఎన్నికవుతారు. ఒక్కోసారి ఒక్క ఓటు ఎక్కువ రావడంవల్ల కూడ ఎన్నిక జరగవచ్చు. అటువంటప్పుడు వేరే అభ్యర్థికి ఓటు వేసినవారు కూడా ఈ నిర్ణయాన్ని ఒప్పుకోవలసిందే! ఆ విధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా నిర్ణయాలు తీసుకునేటప్పుడు మెజారిటీ విధానాన్ని అమలు పరుస్తారు.

ఉదాహరణకు: ఒక గ్రామ పంచాయతిలో 20 మంది వార్డు సభ్యులు ఉంటే 11 మంది ఒక ప్రతిపాదనను సమర్థిస్తే అది ఆమోదం పొందుతుంది. మిగతా 9 మంది అభిప్రాయాలకు విలువ ఉండదు. అలా ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మెజారిటి నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తాయి.




చిత్రం 12.9: అధిక ధరలకు వ్యతిరేకంగా ప్రదర్శన

SCERT TELANGANA

మరి మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి ఉండడంవల్ల మైనారిటీ నిర్ణయాలు అణగదొక్కినట్లవుతుందా? ఇది సమంజసమేనా?

- పైన పేర్కొన్నది నిజమని భావిస్తున్నారా? కొన్ని ఉదాహరణల ద్వారా చర్చించండి.
- మీ తరగతిలో బాల పరిషత్తు ఏర్పాటు చేయండి. తరగతిలో ఎలా ఉండాలి అని కొన్ని నియమాలు ఏర్పాటు చేసుకోండి. తరవాత బాల పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించండి. నిర్ణయాలు తీసుకునేటపుడు ప్రతి విద్యార్థి పాల్గొనేటట్లు చూడండి. ప్రతి విద్యార్థి స్వంతంగా తరగతి నివేదికను తయారుచేసేటట్లు చూడండి.

## ఎన్నికైన ప్రజాప్రతినిధులమీద నియంత్రణ

ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎవరిమీదా పెత్తనం చెలాయించకుండా ఉండడానికి మనం ఏంచేయాలి?

ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులమీద నియంత్రణ చేయడానికి రాజ్యాంగచట్టంలో కొన్ని నిబంధనలను పొందుపరిచారు. వారు ఆ నిబంధనలకు వ్యతిరేకంగా పోయినప్పుడు న్యాయస్థానాలు రాజ్యాంగ ప్రకారం వారిని అనర్హులుగా ప్రకటించే అవకాశముంది. అలాగే ప్రజలు ఎవరైనా, ఎప్పుడైనా ప్రజాప్రతినిధుల పనులను విమర్శించవచ్చు. ఈ ప్రక్రియ సమావేశాల ద్వారా కాని, టెలివిజన్ ద్వారా కాని, వార్తా పత్రికల ద్వారా కాని తెలియజేయవచ్చు.

## సమానత్వం – ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యంలో పురుషులు, స్త్రీలు, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, యువకులు, వృద్ధులు, ధనవంతులు, పేదవారు, అధికారులు ప్రతి ఒక్కరూ కొంచెం సమయం వెచ్చించి ప్రజావసరాలను అర్థంచేసుకోవాలి. ప్రభుత్వం చేస్తున్న ప్రతిపనిపట్లా వాళ్ళకు అవగాహన ఉండాలి. సరైన నిర్ణయాలు తీసుకోడంలో సహకరించాలి. ఓటు వేసేటప్పుడు నిర్భయంగా, ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వెయ్యాలి. దురదృష్టవశాత్తు అన్ని సమయాలలో ఇలా జరగడం లేదు. ప్రజలకు ప్రజాస్వామ్య విలువలపట్ల అవగాహన లేకపోవడానికి నిరక్షరాస్యత కూడా ఒక కారణమే. వివిధ విభాగాలలో జరిగే విషయాలను తెలుసుకోవడానికి చాలా మంది ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా ఉపయోగించుకోవడం లేదు. ముఖ్యంగా స్త్రీలు, పేదవారు సరియైన అవగాహన లేక ప్రజాస్వామ్యంపట్ల, ప్రజావసరాలపట్ల సరిగా స్పందించడం లేదని చెప్పవచ్చు. వారు వారి వారి పనులలో ఎక్కువ సమయం వెచ్చించడం కూడా ఇందుకు ఒక కారణమని చెప్పవచ్చు. చాలా సందర్భాలలో వీళ్ళను ఎన్నికల సమయంలో చిన్న చిన్న ప్రలోభాలకు గురిచేసి ధనవంతులు ఎన్నికలలో గెలిచే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో కులం, మతం కూడా ఎన్నికల సమయంలో ప్రజలమీద ఎక్కువ ప్రభావం చూపుతోంది. అప్పుడు ప్రజలు తమ ఇష్టాలకు వ్యతిరేకంగా ఓటు వేసే అవకాశాలు ఎక్కువ. ఈ కారణాల వల్ల ప్రజలు ప్రజాస్వామ్య విలువలను పక్కనబెట్టి, ఇతర కారణాలవల్ల అభ్యర్థులను ఎన్నుకొంటున్నారు.


- మీ తల్లిదండ్రులను అడిగి ఎన్నికల ప్రక్రియలో గల సమస్యలను తెలుసుకోండి. ఈ సమస్యల పరిష్కారానికి మీ తరగతి గదిలో చర్చించండి. ఒక సమాచార జాబితా తయారుచేయండి. అసమానతలు అంటే మీరు ఏమి అర్థం చేసుకున్నారు? ఉదాహరణలతో వివరించండి.

SCERT TELANGANA

**పటం – భారతదేశ రాజధాని**





*పటం 1: జాతీయ స్థాయి పరిపాలన*




*పటం 2: రాష్ట్ర స్థాయి పరిపాలన*

# పటం - తెలంగాణ జిల్లాలు




*పటం 3: జిల్లా స్థాయి పరిపాలన*

- సరైన అభ్యర్థిని ఎన్నుకోడంలో ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్య అడ్డంకులు ఏమిటి?

## వివిధ స్థాయిలలో ప్రభుత్వం

ప్రభుత్వం వివిధ స్థాయిలలో పనిచేస్తుంది. స్థానికంగాను, రాష్ట్రస్థాయిలోను, జాతీయ స్థాయిలోను పనిచేస్తుంది. స్థానికంగా అంటే మనం ఉన్న ప్రాంతంలో మనకోసం పనిచేసేది. రాష్ట్రస్థాయిలో అంటే రాష్ట్రానికి మొత్తంగా పనిచేసేదాన్ని రాష్ట్ర ప్రభుత్వం అంటారు. ఉదా: తెలంగాణ, అసోం. జాతీయస్థాయిలో ఉన్న ప్రభుత్వం దేశం మొత్తానికి బాధ్యత వహిస్తుంది. మీరు పై తరగతిలోకి వెళ్లినప్పుడు రాష్ట్రస్థాయి ప్రభుత్వం గురించి, జాతీయస్థాయి ప్రభుత్వం గురించి తెలుసుకుంటారు.

మీ తరగతిలోవాళ్ళను మూడు, నాలుగు జట్లుగా ఏర్పరచండి. కింద ఇచ్చినవాటిలో ఏ విషయం మీదనైనా పాత్రాభినయం చేయించండి:

- ఒక ఎన్నికల సమావేశం, అభ్యర్థులతో చర్చ.
- ప్రజలు సరైన సమాచారం లేకుండా ఓటింగ్‌మీద తీసుకొన్న నిర్ణయం.
- ప్రజాస్వామ్యానికీ, రాజరికానికీ మధ్య భేదాలు.
- ఓటు వేసేటపుడు గ్రామప్రజల మీద ధనవంతులూ, బలవంతులూ చూపే ప్రభావం.

SCERT TELANGANA

## కీలకపదాలు

ప్రజాస్వామ్యం | రాజరికం | రాజ్యాంగం | ఎన్నికలు
నిర్ణయం తీసుకోవడం | ప్రతినిధి

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. గోండు జాతిలో ఉన్న ప్రభుత్వానికీ, ఆధునిక ప్రజాస్వామ్యానికీ మధ్య గల పోలికలూ, భేదాలనూ చర్చించండి.
2. మైనారిటీ అభిప్రాయానికి విలువనిస్తూ నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమా? కొన్ని ఉదాహరణలతో చర్చించండి.
3. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల నడిపిస్తే ఎలా ఉంటుంది? పాఠశాల నడపటానికి అందరూ భాగస్వాములు కావాలని మీరు అనుకుంటున్నారా, లేక ప్రతినిధులను ఎన్నుకొని వారితో నడపాలని కోరుకుంటున్నారా? కారణాలు తెలపండి.
4. మీ ఇంట్లో నిర్ణయాలు ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయా? ప్రతి ఒక్కరూ వాళ్ళ అభిప్రాయాలు చెబుతున్నారా?
5. గోపాల్ తండ్రి ఒక దుకాణం ప్రారంభించడానికి కుటుంబ సభ్యుల అభిప్రాయాలు అడిగాడు. వాళ్ళు తలో అభిప్రాయాన్ని తెలిపారు. అయినా గోపాల్ దుకాణాన్ని ప్రారంభించాడు. ఆయన ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాడా?
6. మేరీతల్లి తన పిల్లలను ఆదివారం నాడు ఎక్కడికి వెళ్దాం అని అడిగింది. ఇద్దరు పిల్లలు సినిమాకు వెళ్దామని, ముగ్గురు పార్క్‌కు వెళ్దామని అన్నారు. మీరు మేరీ తల్లి స్థానంలో ఉంటే ఏ నిర్ణయం తీసుకుంటారు? కారణాలు తెలపండి.
7. ప్రభుత్వ స్థాయిని బట్టి వర్గీకరించండి: (కేంద్ర, రాష్ట్ర, స్థానిక) ఎం.పి., ఎమ్మెల్యే, సర్పంచ్, మేయర్, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి.
8. మీ ప్రాంత ఎమ్మెల్యే, ఎం.పి., ముఖ్యమంత్రుల చిత్రాలను దినపత్రికల నుండి సేకరించండి.
9. పేజి నెం. 109లోని భారతదేశ పటాన్ని చూసి, భారతదేశం అవుట్‌లైన్ మ్యాప్ గీయండి.

## ప్రాజెక్టు

1. వారం రోజుల వార్తాపత్రికలను చూడండి. ప్రభుత్వం చేస్తున్న కార్యకలాపాల గురించి కొన్ని వార్తలను సేకరించండి. వాటిని చార్ట్‌కు గాని, నోట్ పుస్తకంలో కాని అంటించండి. ఈ వార్తలలో ప్రభుత్వం ఏం చేస్తుందో గమనించి ఒక పట్టిక తయారు చేయండి. వీటి గురించి మీ తరగతి గదిలోను, బయట చర్చించి ప్రభుత్వం చేస్తున్న పనుల గురించి తెలుసుకోండి.
2. మీ గ్రామంలోని ఓటు హక్కు కలిగిన ఎవరైన 10 మంది వ్యక్తులను కలిసి, వారు ఎన్నికలలో అభ్యర్థులను ఎన్నుకొనేటప్పుడు ఏ ఏ అంశాలను పరిగణలోనికి తీసుకుంటారో వివరాలు సేకరించి, నివేదిక తయారు చేసి, తరగతి గదిలో చర్చించండి.

SCERT TELANGANA

పాఠం

# 13 గ్రామ పంచాయతీలు

## పౌర సౌకర్యాలు కల్పించడం

గ్రామంలో ఒక ప్రాంతంలో చేతిపంపు మరమ్మతు చేయాలి. మరొక ప్రాంతంలో మురికి కాలువలు నిండి రోడ్డు పైకి నీరు వస్తుంది. ఇటువంటి సమస్యలను ఎవరు పరిష్కరిస్తారు? మురికి కాలువలైనా, చేతిపంపులైనా, వీధి దీపాలైనా, రోడ్లయినా ఇవన్నీ ప్రజలందరికీ సంబంధించినవి. వీటన్నింటినీ ప్రజా సౌకర్యాలు అంటారు. ఈ సౌకర్యాలను ఎవరు కల్పిస్తారు? ఎవరు వీటిని నిర్వహిస్తారు? వీటి నిర్వహణ కోసమే గ్రామాలలో పంచాయతీలు, పట్టణాలలో పురపాలక సంఘాలు ఉన్నాయి.

- మీ ప్రాంతంలో గల పౌర సౌకర్యాలను తెలపండి.
- మీ గ్రామ పంచాయతీ లేదా పురపాలక సంఘం అమలుపరుస్తున్న వివిధ పథకాలను గురించి మీ తరగతిగదిలో చర్చించండి.

## గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్యం

అన్ని పౌర సౌకర్యాలు ప్రభుత్వ శాఖలే అమలు పరుస్తాయి. కాని వారు రాష్ట్ర రాజధానిలో ఉన్న ఉన్నత అధికారుల నుంచి అందిన ఉత్తర్వుల మేరకు పనిచేస్తారు. ఈ ఏర్పాటు వల్ల గ్రామ ప్రజలకు ఆయా విషయాలలో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఎటువంటి పాత్ర ఉండదు. అంతేకాకుండా ప్రజల అవసరాలు, సమస్యలు వాళ్ళకు తెలిసినంతగా పై అధికారులకు తెలియవు. ఎవరి సమస్యను వారే పరిష్కరించుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా ప్రజా పనులలో సామాన్య ప్రజలకు అవకాశం ఉండాలి. అందుకే స్థానికంగా మౌలిక సౌకర్యాలు కల్పించటానికి గ్రామ పంచాయతీలు, మున్సి పాలిటీలు ఏర్పాటు చేయబడ్డాయి.

ఈ ఉద్దేశంతో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించ-టానికి ప్రతి గ్రామంలో 'గ్రామసభను' ఏర్పాటు చేశారు. గ్రామసభలో గ్రామ ఓటర్లు అందరూ సభ్యులుగా ఉంటారు. ఇది గ్రామ పంచాయతీ పనులను పర్యవేక్షిస్తుంది, పరిశీలిస్తుంది. ఇది గ్రామ పంచాయతీ తీసుకునే నిర్ణయాలపైన ప్రభావం చూపిస్తుంది. ఓటర్లు గ్రామ పంచాయతీ సభ్యులను (వార్డు సభ్యులు), సర్పంచ్‌ను ఎన్నుకొంటారు. సర్పంచ్ గ్రామ పంచాయతీలో ప్రతిరోజూ జరిగే పనిని పర్యవేక్షిస్తారు.

### గ్రామసభ :

ఇంతకు ముందు పాఠంలో మనం ప్రజాస్వామ్య ప్రభుత్వం గురించి, ఆ ప్రభుత్వంలో పౌరులకు సంబంధించిన పనులలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం గురించి చదువుకున్నాం. దేశ, రాష్ట్ర స్థాయిల్లో అందరు కలసి నిర్ణయాలు తీసుకోడం కష్టం కాబట్టి గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఈ భాగస్వామ్యం గ్రామసభ ద్వారా జరుగుతుంది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ విధమైన పద్ధతి మన దేశంలో ఆచరణలో ఉంది. ఒక ఉదాహరణ చూద్దాం.

SCERT TELANGANA



చిత్రం 13.1: గ్రామసభ

రేషన్‌కార్డ్‌కోసం కూపన్లు ఇస్తున్నారని తెలిసి కనకమ్మ గ్రామసభకు హాజరైంది. కాని ఆమెకు గ్రామసభ ఎందుకు జరుగుతుందో తెలియదు. ఆ గ్రామసభకు దాదాపు 70 మంది ప్రజలు వస్తే అందులో 20 మంది స్త్రీలు ఉన్నారు. వాళ్ళు కనకమ్మ లాగే కూపన్లు ఇస్తున్నారని వచ్చారు. సమావేశంలో సర్పంచ్ గత సంవత్సరంలో జరిగిన పనుల గురించి వివరిస్తూ, ఈ సంవత్సరం జరిగే పనుల గురించి గ్రామసభ ముందుంచగా గ్రామ సభకు వచ్చిన జనం అతను చెప్పే విషయం పూర్తిగా వినకుండానే చప్పట్లు కొడుతూ సర్పంచ్ చేసిన పనిని అభినందించారు. తరవాత ఆయన దారిద్ర్యరేఖకు దిగువన (Below Poverty Line) గల ప్రజల వివరాలు వెల్లడించాడు. ప్రభుత్వం ఇస్తున్న సహాయానికి వీరు లబ్ధిదారులవుతారని తెలియజేసాడు.

ఆయన మాట్లాడడం ఆపగానే కనకమ్మ నిలబడి నాపేరు కూడా లబ్ధిదారుల జాబితాలో ఉంచాలని, నాకు ఉద్యోగం గాని, భూమి గాని వేరే ఏ ఆధారంగాని లేదని తెలిపింది. సర్పంచ్, ఆమె పేరు తప్పకుండా ఈ జాబితాలో ఉండేటట్లు చూస్తానని చెప్పగా కనకమ్మ సంతోషిస్తూ గ్రామసభ నుంచి వెళ్లింది. చివరిగా రేషన్‌కార్డు కోసం వచ్చిన వాళ్ళందరికి కూపన్లు ఇవ్వడంతో గ్రామసభ ముగిసింది.

పైన చెప్పిన గ్రామసభ ఒక ఉదాహరణ మాత్రమే. చాలా గ్రామాలలో గ్రామసభ గురించి ప్రజలందరికీ సరైన అవగాహన లేదు. అవగాహన ఉన్న ప్రజలందరూ గ్రామసభకు హాజరు కారు. హాజరైన వారిలో చాలామంది ఏమీ మాట్లాడరు. కాని ప్రజాస్వామ్యంలో ప్రజలు చురుకుగా పాల్గొనడం (క్రియాశీలత) చాలా అవసరం. ప్రతి ఒక్కరూ గ్రామసభలో గత సంవత్సరపు నివేదికమీద చర్చించాలి. గత సంవత్సరం పనులు సక్రమంగా జరిగాయా, జరిగితే సంతృప్తికరంగా ఉన్నాయా చర్చించాలి. అలాగే వచ్చే సంవత్సరం పనిని గురించి వివరంగా చర్చించాలి. ఇంకా అవసరమయితే ఇంకొక పని గురించి, తమ అవసరాలను గురించి చర్చించాలి. అలాగే ఈ పనులు ఎలా చేస్తే బాగుంటాయో, ఆర్థికంగా తక్కువ ఖర్చుతో ఎలా చేయగలమో చర్చించాలి. దారిద్రరేఖకు దిగువన గల వ్యక్తుల పేర్లు చదివినప్పుడు ఇవి నిజమైన లబ్ధిదారుల పేర్లేనా అని సరిచూసుకోవాలి. నిజమైన పేదవ్యక్తికి అన్యాయం జరగకుండా గ్రామసభ చూడాలి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటివి సరిగ్గా అమలు జరుగుతున్నాయో లేదో గ్రామసభ పర్యవేక్షణ చేయాలి.

కాని ఆచరణలో గ్రామసభ అవసరమైనప్పుడు సమావేశం కావడం లేదు. ఒకవేళ సమావేశమయితే చాలా తక్కువ మంది హాజరు అవుతున్నారు. హాజరైన వారిలో తక్కువ మందే చర్చల్లో పాల్గొంటున్నారు.

- మీరు గ్రామంలో నివసిస్తున్నట్లయితే మీ తల్లిదండ్రులను అడిగి గ్రామసభ ఎలా జరుగుతుందో తెలుసుకోండి. అలాగే గ్రామసభ జరిగితే ఆ సమాచారం ముందుగా

SCERT TELANGANA

అందరికీ తెలుస్తుందా? కనుక్కోండి. మీ గ్రామసభకు ఎంత మంది స్త్రీ, పురుషులు హాజరౌతారో తెలుసుకోండి. మీ గ్రామసభకి శివారు పల్లె ప్రజలు కూడా హాజరౌతారేమో తెలుసుకోండి. గ్రామసభలో చర్చించాల్సిన విషయం ముందుగానే అందరికి తెలుస్తుందా? విషయాలను అందరూ కలిసి చర్చిస్తారా? ఆ తరవాతే ఒక నిర్ణయానికి వస్తారా?

- గ్రామ పంచాయితీ సక్రమంగా పని చేయడానికి పై అంశాలు ఎంత వరకు దోహదం చేస్తాయి?
- గ్రామసభలో ప్రజలు పాల్గొనటానికి కొన్ని నినాదాలను రాయండి.

### గ్రామ పంచాయతీ నిర్మాణం

గ్రామ పంచాయతీని ఎన్నికలద్వారా ఏర్పాటు చేస్తారు. ఈ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది.

### ఓటర్ల జాబితా

18 సంవత్సరాల వయస్సు నిండిన గ్రామంలోని ప్రతి వ్యక్తి ఓటర్ల జాబితాలో తనపేరు నమోదు చేసుకుంటే అతడు ఓటు వేయడానికి అర్హుడు. సాధారణంగా ఒక ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ముందు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో ఏమైనా మార్పులు అవసరమయితే చేస్తాడు. అదే సమయంలో ఓటర్ల జాబితాలో పేరు నమోదుచేయడం గాని, తీసి వేయడం గాని జరుగుతుంది.

- ఓటర్ల జాబితాలో కొత్తగా నమోదు చేయడం, తీసివేయడం ఎందుకు అవసరమో చెప్పగలవా?
- మీ ఇంట్లో 18 సంవత్సరాల పైబడిన వ్యక్తులు ఎందరున్నారు?
- మీ ఉపాధ్యాయులను అడిగి ఓటర్ల జాబితాను ఎవరు, ఎప్పుడు ఆధునీకరిస్తారో (update) తెలుసుకోండి.

- 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు గల బాలలను ఓటు వేయడానికి ఎందుకు అనుమతించరని నీవు భావిస్తున్నావు?

### వార్డులు

సాధారణంగా ప్రతి గ్రామాన్ని కొన్ని వార్డులుగా విభజిస్తారు. ప్రతి వార్డులో దాదాపుగా ఓటర్ల సంఖ్య సమానంగా ఉంటుంది. ప్రతి వార్డు నుంచీ ఒక వార్డు సభ్యుడు గ్రామ పంచాయతీకి ఎన్నికవుతారు. ఈ విధంగా ప్రతి వీధి /ప్రాంతం నుంచి ఒక వ్యక్తి గ్రామ పంచాయితీకి ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రతి గ్రామ పంచాయతీకి జనాభాను బట్టి 5 నుంచి 21 మంది వరకు వార్డు సభ్యులుంటారు. 21 సంవత్సరాలు నిండినవారు గ్రామ పంచాయతి ఎన్నికలలో పోటీ చేయవచ్చు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన దరావతును సర్పంచ్ మరియు వార్డు సభ్యులుగా పోటీ చేయు అభ్యర్థులు చెల్లించాలి.

### గ్రామ పంచాయతీలో రిజర్వేషన్లు

మన సమాజంలో స్త్రీలు ఎన్నికలలో పోటీ చేయడం, వార్డు మెంబరు గానో, సర్పంచ్ గానో ఎన్నిక కావడం అంత సులభం కాదు. ఎందుకంటే స్థానిక సంస్థలలో పురుషుల ఆధిక్యం ఉంది. దీని వల్ల సగం జనాభాకు ప్రాతినిధ్యం లేకుండా పోతుంది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని పార్లమెంట్ స్త్రీలకు స్థానిక సంస్థలలో 50% స్థానాలను కేటాయించింది. అలాగే షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు, వెనకబడిన తరగతులకు వారి జనాభా ప్రాతిపదిక ప్రకారం స్థానాలు కేటాయించారు. ఆ విధంగా అన్ని వర్గాలవారికీ ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది.

### ఎన్నికలు

సాధారణంగా గ్రామ పంచాయతీకి ఎన్నికలు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. ఈ సమయంలో ప్రతి వార్డులో నివసించే వ్యక్తి (ఓటరుగా నమోదు అయినవారు) రెండు ఓట్లు వేస్తారు. ఒక

SCERT TELANGANA


ఓటును వార్డుసభ్యుణ్ణి ఎన్నుకోడానికి, రెండోది సర్పంచ్ ఎన్నికకు వినియోగిస్తారు. ఎక్కువ ఓట్లు వచ్చినవారిని గెలిచినట్లు ప్రకటిస్తారు.

మీరు గ్రామ పంచాయితీలో నివసించినట్లైతే వీటిని గురించి తెలుసుకోండి.

- మీ గ్రామ పంచాయతీలో ఎంతమంది వార్డు సభ్యులున్నారు?
- మీ ఇంట్లో ఎంతమంది ఓటర్లున్నారు?
- మీ ఇల్లు ఏ వార్డులో ఉంది?
- మీ వార్డు సభ్యుని పేరు ఏమిటి?
- మీ తల్లిదండ్రులను అడిగి ఎంతమంది మీ వార్డు సభ్యులుగా పోటీ చేశారో తెలుసుకోండి. ఎన్నికల సమయంలో నిజంగా ఏమి జరిగింది? మీరు తెలుసుకున్న విషయాలను తరగతి గదిలో ప్రదర్శించండి.

## సర్పంచ్, ఉప సర్పంచ్, సెక్రటరీ

సర్పంచ్ గ్రామ పంచాయతీకి పెద్ద. గ్రామానికి మొదటి పౌరుడు. గ్రామ పంచాయతీ నిర్ణయాలను అమలుచేసే బాధ్యత సర్పంచ్‌ది. ప్రతిరోజూ జరిగే కార్యకలాపాలు కూడా సర్పంచ్ ఆధ్వర్యంలోనే జరుగుతాయి. గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయ, వ్యయాలకు కూడా సర్పంచే బాధ్యత వహిస్తాడు.




*చిత్రం 13.2: మాదిరి బ్యాలెట్ మరియు ఓటర్ గుర్తింపు కార్డు*

ఆవిధంగా సర్పంచ్ గ్రామ పంచాయతీలో చాల బాధ్యతలు కలిగి ఉంటాడు. చాలా గ్రామాలలో సర్పంచ్ క్రియాశీలంగా ఉండడంవల్ల గ్రామాలు అభివృద్ధి చెందిన విషయం మనకు తెలుసు.

## ఉప సర్పంచ్

ఎన్నికల తరవాత సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి తమలో ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకొంటారు. సర్పంచ్ లేనప్పుడు ఉప సర్పంచ్ ఆ బాధ్యతలు నిర్వహిస్తాడు.

**కార్యదర్శి, కార్యనిర్వాహక అధికారి**

ప్రతి పంచాయతీకి ఒక ప్రభుత్వ ఉద్యోగి కార్యదర్శిగా ఉంటాడు. ఆయన గ్రామ పంచాయతీ లెక్కలను, సమావేశాల విషయాలను (minutes) నమోదు చేస్తారు. పెద్ద (major) గ్రామ పంచాయతీ అయితే ఆ పంచాయతీకి ఎక్కువ ఆదాయం ఉంటుంది. కాబట్టి ఒక కార్యనిర్వహణ అధికారిని కూడా ప్రభుత్వం నియమిస్తుంది.

## గ్రామ పంచాయతీ ఏమి చేస్తుంది?

గ్రామ పంచాయతీ ప్రజలకు పౌర సౌకర్యాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. గ్రామ రహదారులను నిర్వహించడం, మురికి కాలువలను శుభ్రం చేయడం, కొత్తవి కట్టడం, త్రాగునీరు వీధిదీపాలు, వీధుల శుభ్రత, చౌక ధరల దుకాణాలు మొదలయిన వాటితోపాటు పాఠశాలలు నడుస్తున్న తీరు, అంగన్‌వాడీలు, స్త్రీ, శిశు సంక్షేమ పథకాల గురించి పర్యవేక్షణ చేస్తుంది. గ్రామ పంచాయతీలు చిన్న నీటిపారుదల (Minor), వాటర్‌షెడ్‌లను నిర్వహిస్తాయి. భూ సంస్కరణల మీద కూడా ప్రణాళికలను తయారు చేసి ఆచరణలో పెడతాయి.

SCERT TELANGANA

చాలా రాష్ట్రాలలో గ్రామ పంచాయతీకి ఎక్కువ అధికారాలు ఇచ్చారు. ఆ పంచాయతీల బాధ్యతలు కూడా ఎక్కువే. కాని తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు ఇంకా కొన్ని ముఖ్యమైన అధికారాలు గ్రామ పంచాయతీకి ఇవ్వలేదు. అందులో కొన్ని: సంత (మార్కెట్) మీద అధికారం, భూమి అభివృద్ధి, అటవీ ఉత్పత్తి, కుటీర పరిశ్రమలు, పేదలకు గృహ సౌకర్యాలు, విద్యుత్తు, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ మొదలయినవి. ఇవి గ్రామ పంచాయతీకి ఇవ్వడం వల్ల చాలా గ్రామ సమస్యలను ప్రజలే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. గ్రామాల అభివృద్ధికి సమర్థవంతమైన ప్రణాళికను రూపొందించుకోగలరు.



*చిత్రం 13.3: గ్రామ పంచాయతి సమావేశం*

గ్రామ పంచాయతీ సమావేశం ప్రతి నెలకు ఒకసారి జరుగుతుంది. ప్రతి సమావేశానికీ కనీసం సగం మంది సభ్యులు హాజరు కావాలి. అలా జరగని పక్షంలో సమావేశం రద్దుచేస్తారు. సాధారణంగా గత సమావేశం నివేదికతో సమావేశం ప్రారంభం అవుతుంది. తరవాత సర్పంచ్ గత నెలలో జరిగిన పనుల గురించి నివేదిక చదువుతాడు. ఆ నివేదికలో ఆ నెలలో పెట్టిన ఖర్చు గురించి సమావేశంలో తెలియజేస్తారు. సభ్యులు ఏమైనా అడగదలుచుకుంటే అందరు కలిసి చర్చించి పనులు జరుగుతున్న విషయాల గురించి వివరాలు సేకరిస్తారు. అలాగే వార్డుసభ్యులు కొత్తపనుల గురించి, ఇంకా మిగిలి ఉన్న పనుల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు.

ప్రతి ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్‌ను వార్డు సభ్యులతో చర్చించి తయారు చేసుకుంటారు. సర్పంచ్, కార్యనిర్వహణ అధికారి అవసరమైన బడ్జెట్ గురించి, ఆదాయాల గురించి చర్చించి, సంవత్సర బడ్జెట్‌కు ఒక రూపం ఇస్తారు. దీన్ని గ్రామసభలో చర్చించి తుదిరూపం ఇస్తారు. ఈ బడ్జెట్ ప్రతిపాదన మండల, జిల్లా పరిషత్తులకు ఆమోదం కోసం పంపిస్తారు. నిధులు విడుదలైన తరవాత సర్పంచ్ పనులు చేయిస్తూ పర్యవేక్షణ చేస్తాడు.

చాలా గ్రామ పంచాయితీలలో అందరితో చర్చించకుండానే సర్పంచ్ ప్రణాళిక సిద్ధం చేసి ఆమోదం కోసం పంపిస్తారు. ఇటువంటి సందర్భాలలో వచ్చిన నిధులు వేరొక పనికి వినియోగిస్తారు. లేదా దుర్వినియోగం చేస్తారు. ఈ విషయాలు చాలా కొద్దిమందికే తెలుస్తాయి. ఇలా జరుగకుండా ఉండాలంటే గ్రామ పంచాయతీ సభ్యులు తప్పకుండా సమావేశాలకు హాజరు కావాలి. చర్చల్లో పాల్గొనాలి. ప్రణాళిక సిద్ధం చేయాలి. పథకాల అమలుపై పర్యవేక్షణ చేయాలి.

SCERT TELANGANA

- మీరు మీ గ్రామ పంచాయతీకి వెళ్లి చివరిగా జరిగిన సమావేశం ఎప్పుడు జరిగిందో తెలుసుకోండి. ఆ సమావేశంలో ఏ విషయాలు చర్చించారో తెలుసుకోండి.
- గ్రామ పంచాయతీ సమావేశానికి ఖచ్చితంగా సగం మంది సభ్యులు హాజరు కావాలి అనే నిర్ణయం సమంజసమా? కాదా? ఎందుకు?
- మీ వార్డు అభివృద్ధి కోసం ఈ సంవత్సరం ఎటువంటి ప్రణాళిక అమలు చేస్తే బాగుంటుంది? తయారు చేయండి.

## గ్రామ పంచాయతీ నిధులు

గ్రామ పంచాయతీకి అవసరమైన నిధులు ఎక్కడ నుంచి సమకూరుతున్నాయి?

గ్రామ పంచాయతీకి కొన్ని రకాల పన్నులు వసూలు చేసే అధికారం ఉంది. ఇంటి పన్ను, భూమిశిస్తు, మొదలయిన వాటిని వసూలు చేస్తుంది. గ్రామ పంచాయతీకి సుమారుగా 1/3 వంతు ఆదాయం ఈ పన్నుల వల్ల సమకూరుతుంది.

కాని గ్రామ పంచాయతీలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కొన్ని ప్రత్యేకమైన పథకాల అమలుకు ఇచ్చే నిధులపైన ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఆ నిధులతో పంచాయతీ ముందుగా నిర్ణయించుకున్న పనులను చేబడుతుంది. కొన్ని నిధులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా సమకూర్చుకుంటుంది.

గ్రామ పంచాయితీలకు వచ్చే నిధులు అంతంత మాత్రమే. వాటితో అంత అభివృద్ధి చెందడం సులభం కాదు. అందువల్ల గ్రామ పంచాయతీలు తామే సరైన ప్రణాళికలు వేసుకొని నిధులు సమకూర్చుకొని అభివృద్ధి చెందవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## మండల పరిషత్, జిల్లా పరిషత్

ఇంతకుముందు భాగంలో మనం గ్రామ పంచాయతీని గురించి చదువుకున్నాం. ప్రతి మండలంలో దాదాపుగా 20 గ్రామ పంచాయతీలు ఉంటాయి. జిల్లాలో ఉన్న అన్ని మండల పరిషత్తులు జిల్లా పరిషత్తు ఆధ్వర్యంలో పనిచేస్తాయి. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (MPTC - Mandal Parishad Territorial Constituencies) సభ్యులను ప్రజలు ఎన్నుకొంటారు. అలాగే జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ZPTC - Zilla Parishad Territorial Constituencies) సభ్యులను కూడా ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎన్నుకుంటారు. కొంత మంది నామినేట్ చేయబడతారు. జిల్లా పరిషత్, మండల పరిషత్తులు జిల్లాలోని గ్రామ పంచాయతీల పనులను జిల్లా, మండల పరిషత్‌లు సమన్వయపరుస్తాయి. పంచాయతీల ప్రణాళిక ఆమోదించి నిధుల కేటాయింపును సమన్వయపరుస్తాయి.

## జంగమ్మ – హాజిపల్లి

హాజిపల్లి రంగారెడ్డి జిల్లాలో ఒక చిన్న గ్రామం. గ్రామంలో సర్పంచ్ జంగమ్మ ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. సిమెంట్ రోడ్లు వేయించారు, అంతర్భూభాగ మురికి కాలువలు నిర్మించారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణం అయ్యేట్లు చేశారు. పాఠశాలలో, అంగన్‌వాడీలలో, గ్రామ పంచాయతీలో కూడా మరుగుదొడ్ల నిర్మాణంగావించారు. గ్రామంలో మంచినీటికోసం నీటిని నిలవ ఉంచే ట్యాంక్




*చిత్రం 13.4: నిర్మల గ్రామ పురస్కార్ అవార్డును డిసెంబర్ 2008న రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ చేతుల మీదుగా హాజిపల్లి సర్పంచ్ జంగమ్మ తీసుకున్నారు.*

SCERT TELANGANA

కట్టించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు అన్ని అర్హతలు ఉన్న వారికి వచ్చేటట్లు చూశారు. ఫలితంగా 2008లో హాజిపల్లి గ్రామ పంచాయతీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 'శుభ్రం' (*Shubram*) అవార్డుకు ఎన్నికైంది. అనంతరం డిసెంబర్ 2008లో భారత ప్రభుత్వం నిర్మల గ్రామ పురస్కారం ఈ గ్రామ పంచాయతీకి రాష్ట్రపతి (శ్రీమతి ప్రతిభాపాటిల్) చేతులమీదుగా బహుకరించారు.

(సూచన : గ్రామంలో ఉన్న ఇళ్లలో, కార్యాలయాల్లో, పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించి, బయటి ప్రదేశంలో బహిర్భూమికి పోని గ్రామాలకు ఈ అవార్డులు బహుకరిస్తారు. మన రాష్ట్రంలో చాలా గ్రామాలు ఈ అవార్డులను గెలుచుకున్నాయి. మీ దగ్గరలో ఏవైనా గ్రామ పంచాయతీలకు ఈ అవార్డు వచ్చిందేమో తెలుసుకోండి.)

- హాజిపల్లిలో ఏఏ పౌర సౌకర్యాలు ఉన్నాయి?
- హాజిపల్లి రోడ్లు, మురికి కాలువల నిర్మాణం ప్రత్యేకత ఏమిటి?
- మీ గ్రామంలో/ పాఠశాలలో మరుగుదొడ్లు, మురికి కాలువల నిర్మాణం, మంచినీటి సరఫరా ఎలా ఉంది?

## గ్రామసభను సక్రమంగా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీలు ఉన్నాయా?

తెలంగాణలో చాలా గ్రామాలు గ్రామసభ ద్వారా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో సఫలీకృతమయ్యాయి.

మన రాష్ట్రంలో వరంగల్ గ్రామీణ జిల్లాలోని గంగదేవిపల్లి, కరీంనగర్ జిల్లాలోని రామచంద్రాపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామాలు తమ గ్రామ పంచాయతీలను విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. అలాగే మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లాలోని హివారే బజార్ గ్రామం కూడా గ్రామ పంచాయతీని విజయవంతంగా నిర్వహించడానికి ఒక మంచి ఉదాహరణ.

## గంగదేవిపల్లి గ్రామ పంచాయతీ

గంగదేవిపల్లిలో 18 కమిటీలను గ్రామసభ ద్వారా ఏర్పాటు చేశారు. ఆ కమిటీలలో మంచినీటి (తాగునీటి) కమిటీ, పారిశుధ్య కమిటీ, (Sanitation), ఉత్తర ప్రత్యుత్తరాల కమిటీ (Communication Committee) మొదలైనవి ఉన్నాయి. ఈ కమిటీలు ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందిస్తున్నాయి. ఈ గ్రామం సాధించిన కొన్ని అంశాలు :

- పాఠశాలలో నూరు శాతం పిల్లల నమోదు
- సంపూర్ణ అక్షరాస్యత
- పరిశుద్ధమైన తాగునీటి సరఫరా
- కుటుంబ నియంత్రణ
- పిల్లలందరికీ టీకాలు వేయించటం
- అన్ని కుటుంబాలు బ్యాంకు పాస్ పుస్తకాలు కలిగి ఉండటం
- గ్రామంలో పూర్తి పారిశుధ్య పరిరక్షణ
- సంపూర్ణ మద్యపాన నిషేధం

అంతేకాకుండా గంగదేవిపల్లి గ్రామపంచాయితీలో ప్రతి గ్రామస్థుడూ 18 కమిటీలలో ఖచ్చితంగా ఏ ఒక్క కమిటీలోనైనా సభ్యుడిగా ఉండడం చెప్పుకోదగినది, మెచ్చుకోదగినది కూడా. ప్రాతినిధ్య ప్రభుత్వానికి ఇది మంచి ఉదాహరణ. ఏ అభివృద్ధి కార్యక్రమమైనా ముందుగా గ్రామ సభలోనే చర్చ జరుగుతుంది. ఆ గ్రామసభ నిర్ణయాలు అందరూ శిరసావహిస్తారు.



*చిత్రం 13.5: గంగదేవిపల్లి గ్రామసభ*

SCERT TELANGANA

- గంగదేవిపల్లి ఏ జిల్లాలో ఉంది?
- గంగదేవిపల్లిలో ఎన్ని కమిటీలు ఉన్నాయి?
- గంగదేవిపల్లి గురించి మీ అభిప్రాయం ఏమిటి?
- గంగదేవిపల్లి పంచాయితీ విజయానికి కారణం ఏమిటి?
- మీ గ్రామ పంచాయితీని, గంగదేవిపల్లి గ్రామ పంచాయితీతో ఎలా పోలుస్తారు?

## కీలకపదాలు

గ్రామసభ పౌర సౌకర్యాలు ఎన్నికలు స్థానిక స్వపరిపాలన

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. మీరు స్థానికసంస్థలో సభ్యునిగా ఉంటే ఏ ఏ సమస్యలను లేవనెత్తుతావు?
2. మీ పంచాయతీ/ మున్సిపాలిటీలో సామాన్య ప్రజలు ఏ సమస్యపైన అయినా నిర్ణయం తీసుకోడంలో పాలు పంచుకొంటున్నారా? కొన్ని ఉదాహరణలు ఇవ్వండి.
3. గ్రామసభ సమావేశాలకు తక్కువమంది హాజరు కావడానికి కారణాలు ఏమై ఉండవచ్చు?
4. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (BPL) గ్రామస్తుల జాబితాను గ్రామసభ సమావేశంలో ఎందుకు చదువుతారు?
5. పంచాయతీలోని దళిత సభ్యులుగాని, సర్పంచులు గాని మీకు తెలిసి ఏవైనా సమస్యలను ఎదుర్కొంటున్నారా? దీని గురించి చిన్న వ్యాసం రాయండి.
6. అభివృద్ధి కార్యక్రమాలు జరపడానికి పంచాయతీలు పన్నులు పెంచాలా, లేదా ప్రభుత్వ నిధులమీద ఆధారపడాలా? మీ అభిప్రాయం తెలపండి.
7. అంకితభావంతో పని చేసే సర్పంచులు ఎదుర్కొనే సవాళ్లను వివరించండి.
8. మీ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఉప సర్పంచ్, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వివరాలు సేకరించి, పట్టిక తయారు చేయండి.
9. పేజి నెం. 118లోని 'గంగదేవిపల్లి గ్రామ పంచాయతీ' అంశాన్ని చదివి, వ్యాఖ్యానించండి.

### ప్రాజెక్టు

1. మీ గ్రామ సర్పంచ్‌ని గాని, మండల పరిషత్ అధ్యక్షున్ని గాని మీ పాఠశాలకు ఆహ్వానించండి. పంచాయతీ పని విధానం గురించి చర్చించండి. ముందే కొన్ని ప్రశ్నలు తయారు చేసుకోండి. వారు వచ్చిన తరవాత అడగండి.
2. మీ వార్డ్‌మెంబర్‌తోగాని/ సర్పంచ్‌తోగాని మాట్లాడి వారు చేస్తున్న పనుల గురించి అవగాహన పొందుటకు గ్రామపంచాయతీ చేస్తున్న పనుల గురించి ఒక పోస్టరులో రాసి మీ తరగతి గదిలో ప్రదర్శించండి.
3. పాఠశాల ఆవరణలో కాగితాలు కనిపిస్తే మీకేమనిపిస్తుంది? పాఠశాల పరిశుభ్రత, మొక్కల పెంపకం కోసం జట్లుగా విడిపోయి, రోజుకొక జట్టు ద్వారా 'పచ్చదనం-పరిశుభ్రత' కార్యక్రమాన్ని నిర్వహించండి.

SCERT TELANGANA

పాఠం 14

# పట్టణ ప్రాంతంలో స్థానిక స్వపరిపాలన

*కింద ఉన్న చిత్రాన్ని చూడండి. ఇది ఒక పట్టణంలోని కొంత ప్రాంతాన్ని చూపుతుంది. గ్రామాలకూ, పట్టణాలకూ మధ్యగల భేదాలేమిటి? పట్టణాలలో ఎటువంటి పౌరసౌకర్యాలు అవసరం? ఎటువంటి పౌర సౌకర్యాలు ఉంటాయి? పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల జీవనవిధానం ఎలా ఉంటుంది? దానికి ఏవిధమైన సౌకర్యాలు వాళ్ళకి అవసరం? ఈ విషయాలను తరగతిలో చర్చించండి.*




*చిత్రం 14. 1: పట్టణంలోని ఒక దృశ్యం*

SCERT TELANGANA

సాధారణంగా నగరాలు, పట్టణాలలో చాలామంది నివసిస్తారు. చాలా ప్రాంతాలలో పట్టణపు రోడ్లు వెడల్పుగాను, రద్దీగాను ఉంటాయి. అలాగే దుకాణాలు, వాహనాలు, పరిశ్రమలు కూడా ఎక్కువే. ఫలితంగా గ్రామాలకంటె ఎక్కువగా, సమగ్ర ప్రణాళిక తయారు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే పౌరసౌకర్యాలు కూడా ఎన్నో రెట్లు ఎక్కువ కల్పించాలి.

వీటితోపాటు పట్టణాలకు నిరంతరం ఉద్యోగాలకోసం, బతుకుతెరువుకోసం వచ్చే ప్రజల సంఖ్య ఎక్కువ. అందుకే పట్టణ వైశాల్యం రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. కొత్త కాలనీలు ఏర్పాటు అవుతూనే ఉన్నాయి. చాలా కాలనీలు పేద ప్రజలతో సరైన మౌలిక వసతులు లేక మురికివాడలుగా మారుతున్నాయి. వీళ్ళందరికీ నీరు, విద్యుత్తు, రవాణా, విద్య, ఆరోగ్యం, మొదలయిన సౌకర్యాలు

కల్పించవలసిన అవసరం ఉంది. నగరాలలో వచ్చే పెద్ద సమస్య చెత్తను వదిలించుకోడం, మురికి కాల్వల నిర్వహణ.

నగరాల్లోను, పట్టణాల్లోను పౌర సౌకర్యాలు కల్పించటం చాలా కష్టమైన పని. దీనికి పెద్ద వ్యవస్థ అవసరం. ఈ వ్యవస్థనే పురపాలక సంస్థ అంటారు. జనాభాను దృష్టిలో పెట్టుకొని మనకు మూడు రకాల పురపాలక సంస్థలు ఉన్నాయి.

నగర పంచాయతి: 20,000 – 40,000 జనాభా

మున్సిపల్ కౌన్సిల్: 40,000–3,00,000 జనాభా

మున్సిపల్ కార్పొరేషన్: మూడు లక్షలపైన జనాభా

### మునిసిపాలిటీల ఏర్పాటు

గ్రామ పంచాయతి లాగానే పురపాలక సంస్థలు కూడా ఎన్నికల ద్వారానే ఏర్పాటవుతాయి. నగర ప్రాంతాలను కూడా వార్డులుగా, డివిజన్లుగా విభజిస్తారు. వార్డులకు ప్రతినిధులను ప్రజలు ఎన్నుకొంటారు. ఈ ప్రతినిధులను పురపాలక సంస్థలో కౌన్సిలర్ అని, కార్పొరేషన్‌లో కార్పొరేటర్ అని పిలుస్తారు. వార్డు కౌన్సిలర్లతోపాటు పంచాయతీలకు సర్పంచ్‌ల మాదిరిగానే ఛైర్మన్/ మేయర్ ఈ సంస్థలకు పెద్దగా వ్యవహరిస్తారు. గ్రామ సర్పంచ్ ఎన్నిక విధానం లాగానే ఛైర్మెన్ మరియు మేయర్‌ను కూడా మున్సిపాలిటి మరియు కార్పొరేషన్‌లలో నమోదైన ఓటర్లు ప్రత్యక్ష ఎన్నిక విధానం ద్వారా ఎన్నుకుంటారు.

- గ్రామ పంచాయతి ఎన్నికల నిబంధనలలాగే పురపాలక సంస్థ ఎన్నికలకు కూడా నిబంధనలు వర్తిస్తాయి. ఈ కింద ఇచ్చిన సమాచారాన్ని పంచాయితీతో పోల్చి తప్పుగా ఉన్న వాక్యాలను సరిచేయండి.

1. పురపాలక సంఘాల ఎన్నికలు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి.
2. ఓటరుకు 18 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉండాలి.
3. ప్రతి వార్డుకి ఇద్దరు ప్రతినిధులను ఎన్నుకొంటారు.



*చిత్రం 14.2 :*
*ఇ.వి.యమ్. (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రము)*

4. అతను లేదా ఆమె పేరు ఓటర్ల జాబితాలో వారి వార్డులో రిజిష్టర్ అయి ఉండాలి.
5. వార్డు మెంబర్లు అందరూ పురుషులే.
6. 21 సంగులు దాటిన ప్రతి వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.

- మీ ఉపాధ్యాయుని సహాయంతో మీ జిల్లాలోని పురపాలక సంఘాలను లేదా నగర కార్పొరేషన్‌లను గుర్తించండి.

### పురపాలకసంఘం ఏవిధంగా పని చేస్తుంది?

పురపాలక సంఘాలు చాలా పనులు చేస్తాయి. ఉదా : నీటి సరఫరా, వీధి దీపాలు, కొత్తరోడ్లు వేయడం, మరమ్మతులు, మురికి కాలువల మరమ్మతు, నిర్వహణ, చెత్తను తొలగించడం, పాఠశాలలను నడపడం, చౌకధరల దుకాణాలు, ఆసుపత్రుల నిర్వహణ మొదలయినవే కాకుండా ఇంకా ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేస్తాయి. ఇవన్నీ చేయడానికి ఎన్నో మానవ వనరుల అవసరం ఉంది. కేవలం కౌన్సిలర్లు/ కార్పొరేటర్ల వల్ల ఈ పనులు కావు. ఈ పనుల కోసం పురపాలక సంఘాలు చాలామంది ఉద్యోగులను, అధికారులను, అకౌంటెంట్‌లను, గుమాస్తాలను నియమిస్తుంది. అలాగే ప్రతి మున్సిపాలిటీని ఎన్నో విభాగాలుగా విభజిస్తారు. ప్రతి విభాగానికి ఒక అధికారిని నియమించి ఆయనకు బాధ్యతలు అప్పజెపుతారు.

SCERT TELANGANA

ఉదాహరణకు నీటి సరఫరా విభాగం, విద్యుత్ సరఫరా విభాగం, విద్యా విభాగం, చెత్త తొలగింపుకోసం ఒక విభాగం వంటివి ప్రతీ పురపాలక సంఘంలో ఉంటాయి.

మరి కౌన్సిలర్లు ఏం చేస్తారు అని ఆశ్చర్యపోతున్నారా? నిజానికి కౌన్సిలర్లు ప్రజలతో ఎల్లప్పుడు కలిసి ఉండి వారి అవసరాలు, సమస్యలు పురపాలక సమావేశంలో చర్చిస్తారు. వివిధ రకాల పనులు చేపట్టడానికి పురపాలక సంఘానికి కొన్ని కమిటీలు ఉంటాయి. వీటిలో కౌన్సిలర్లకు ముఖ్యభూమిక ఉంటుంది. ఈ కమిటీలు వివిధ విభాగాలు చేస్తున్న పనిని పరిశీలిస్తాయి. ఇవి పురపాలక ప్రణాళికను కూడా తయారు చేస్తాయి. తరవాత ప్రతిపాదనలను తయారుచేసి, పురపాలక సంఘాల సమావేశంలో చర్చించి అన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఈ నిర్ణయాలను అధికారులు, ఉద్యోగులు అమలుపరుస్తారు.

ప్రతి వార్డు కౌన్సిలరూ తన వార్డు సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తారు. అలా చేస్తూనే ప్రజలతో మమేకమై వాళ్ళ సమస్యలపట్ల సానుకూల దృక్పథం కలిగి ఉంటారు. ప్రజలు ఎలా వార్డు కౌన్సిలర్‌ను కలిసి తమ సమస్యను పరిష్కరించుకుంటారో ఇప్పుడు ఒక ఉదాహరణ చూద్దాం.

- పురపాలక సంఘ విధులకు, గ్రామ పంచాయతి విధులకు గల భేదాలను తెలియజేయండి.
- పురపాలక సంఘం పని చేయడంలో వివిధ రకాల విభాగాలు ఎలా తోడ్పడతాయి?
- మీ పాఠశాల సక్రమంగా నడపటానికి కమిటీలు వేయాలనిపిస్తే, ఎటువంటి కమిటీలను నియమించాలి?

### ప్రజల వినతి

ఇటీవల కొత్తగా ఏర్పడిన ఒక కాలనీవాసి యాస్మిన్ ఖాలా (యాస్మిన్ పిన్నమ్మ) "మా కాలనీలో అన్ని



*చిత్రం 14.3: అధికారులకు వినతి పత్రం సమర్పించడం*

*ప్రాంతాలలో ఎప్పుడూ చెత్త నిండి ఉంటుంది."* ఇలాగే *ఉంటే ఇది పందులకు, కుక్కలకు, ఈగలకు, ఎలుకలకు నిలయం అవుతుంది. దీని వల్ల ప్రజలు అనారోగ్యంపాలవుతారు. ఈ పరిస్థితి గురించి స్త్రీలు చాలా అసంతృప్తితో ఉన్నారు"* అని ఆమె చాలా బాధపడుతూ చెప్పింది. అంతలో గంగాభాయి *"మనమందరం కలిసి వార్డు కౌన్సిలర్‌ను అడుగుదాం. ఆయనను మనమే కదా ఎన్నుకున్నాం."* అంది. గంగాభాయి కొంత మందిని పోగుచేసి వాళ్ళందరిని పిలుచుకొని వార్డు కౌన్సిలరు దగ్గరకు వెళ్లగా ఆయన, వాళ్ళు చెప్పిన విషయం విన్న తరవాత, రేపు అందరం కలిసి కమిషనర్‌ను కలుద్దామని తెలియజేశాడు. తమ కాలనీలో చెత్త తొలగించడం లేదని ఒక వినతి పత్రం రాసి కాలనీలోని వయోజనుల సంతకాలు తీసుకొని రావాలని గంగాభాయిని కోరాడు. ఆ రోజు సాయంత్రం వినతిపత్రం రాసి అందులో చెత్త పేరుకుపోవటం వల్ల కలుగుతున్న అనర్థాల గురించి విపులంగా వివరించి పిల్లలకు ఇచ్చి ఇంటింటికి వెళ్లి పెద్దలందరి సంతకాలు చేయించారు.

ఆ తరువాత ఉదయం చాలామంది స్త్రీలు, వార్డు కౌన్సిలర్‌తోపాటు మున్సిపల్ కార్పొరేషన్‌కు వెళ్ళారు. అప్పుడు కమిషనర్ వారికి పురపాలక సంస్థకు సరిపడ వాహనాలు లేవని తెలియజేశాడు. కాని గంగాబాయి బదులిస్తూ *"ఇతర కాలనీల్లోని చెత్తను తీయడానికి వాహనాలుంటాయి గాని మా కాలనీకి ఉండవా?"* అని

SCERT TELANGANA

అడిగింది. ఆయన తొందరగా మీకు న్యాయంచేస్తానని బదులివ్వగా యాస్మిన్ పిన్నమ్మ మాట్లాడుతూ "రెండు రోజులలో చెత్తను శుభ్రం చేయించకపోతే కార్పొరేషన్ ఎదుట అనేక మందితో నిరసన తెలియజేస్తామని," చెప్పింది. "వీధులన్నీ శుభ్రంగా ఉండాలని, సమస్యలన్నీ పరిష్కరించాలని" రెహనా కోరింది. అప్పటినుంచి వాళ్ళ కాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు క్రమమైన పద్ధతిలో జరుగుతున్నాయి.

- తమ వార్డుల్లో అన్ని సౌకర్యాలనూ కల్పించడానికి వార్డు కౌన్సిలర్‌లు ఏం చేస్తారు?
- మీ ఇంటిముందర చెత్త పేరుకుంటే మీరు ఏమి చేస్తారు?

## పురపాలక సంఘం – నిధులు

పురపాలక సంఘం ఎన్నో రకాల పన్నులను విధిస్తుంది. ఉదా : ఇంటిపన్ను, నీటిపన్ను, వీధి దీపాలపై పన్ను, దుకాణాలమీద పన్ను, సినిమా టికెట్లమీద పన్ను మొదలైనవి. పన్నులమీద వచ్చే ఆదాయం పురపాలక సంస్థ పనులకు సరిపోదు. ఈ సంస్థ ప్రభుత్వం ఇచ్చే గ్రాంటుల మీద ఆధారపడుతుంది. ప్రభుత్వం ఎన్నో రకాల పనులకు (రోడ్లు వేయడానికి, లేదా నీటి ట్యాంక్ నిర్మాణం, మున్సిపాలిటీ రోజువారీ పనులకు) నిధులను మంజూరుచేస్తుంది.

### సబ్ కాంట్రాక్టింగ్ వర్క్

మెరుగైన సేవలు అందించటానికి దేశంలో చాలా పురపాలక సంఘాలు చెత్త సేకరించడం, తొలగించడం వంటి పనులకు ప్రైవేటు కాంట్రాక్టర్లపైన ఆధారపడుతున్నాయి. దీనినే సబ్–కాంట్రాక్టింగ్ అంటారు. అంటే ఇంతకు ముందు ఈ పనులను పురపాలక సంఘ ఉద్యోగులు చేసేవారు. ఇప్పుడు వీటిని ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్నారు. చెత్తను సేకరించడం చాలా ప్రమాదకరమైన పని. వీళ్ళు ఈ పనిచేసేటపుడు సరియైన జాగ్రత్తలు తీసుకునేవిధంగా అంటే చేతి తొడుగులు, మాస్కులు ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- మీ నగరం/ పట్టణంలో పురపాలక సంఘంలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టర్లు నియమించిన సిబ్బంది ఎంతమంది ఉన్నారు? వారు ఎదుర్కొనే సమస్యలు ఏవి?
- పురపాలక సంఘాలు సబ్ కాంట్రాక్ట్ వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నాయి?

## పురపాలక సంఘ కార్మికులు

ఇప్పుడు పురపాలక సంఘ కార్మికుల ఒక రోజు పని గురించి తెలుసుకుందాం.

*ఆరోజు సోమవారం ఉదయం 5 గంటలకు, చిన్నాకు నిద్ర లేవడం ఇష్టం లేదు. పనికి పోవటం ఇష్టం లేదు. నిన్న ఆదివారం కనుక పని చేయలేదు. అంటే సోమవారంనాడు ఎక్కువ ఊడ్చాలి. ఎక్కువ చెత్తకుండీలు శుభ్రం చేయాలి. స్టార్‌లైట్ కాలనీలో ఉన్న వాళ్ళకు ఆదివారం సెలవు కాబట్టి వారుకూడా ఎక్కువ చెత్తను బయట పారేస్తారు. సోమవారం ఉదయం వీధిలో ఎక్కువ ప్లాస్టిక్ సంచులు*



*చిత్రం 14.4: రోడ్లు శుభ్రపరుచుట*

SCERT TELANGANA

పారవేస్తుంటారు. ప్రజలు ఎంత ఎక్కువ చెత్తను వేస్తే దాన్ని శుభ్రం చేయడం అంత కష్టం. చిన్నా ఉండే కాలనీలో చెత్తకుండీలు లేకపోవటం, మురికి కాలువ నుంచి నీరు కారడం వల్ల వీధి అంతా సోమవారం అపరిశుభ్రంగా ఉంటుంది. వీటికి ఇంకా పక్కనే ఉన్న చేతిపంపు నుంచి వచ్చే నీరు కలిసి చేరడం వలన అపరిశుభ్రత ఎక్కువగా ఉంటుంది. చిన్నా అతికష్టం మీద ఇంటికి నీరు పట్టి, తన ఇంటిని శుభ్రం చేసి తయారవుతుండగా నజ్మ తన ఇంటి గుమ్మం దగ్గర చిన్నా కోసం ఎదురు చూస్తోంది. "చిన్నా తొందరపడు, త్వరగా మనం ఇంకో 10 నిముషాలలో స్టార్‌లైట్ కాలనీకి వెళ్ళి వీధులను శుభ్రంచేయాలి. తొందరగా వెళ్లకుంటే మన వాహనం మనకు దొరకదు. అది 6:45కి వచ్చేస్తుంది." చిన్న కొన్ని వేడినీళ్ళు తాగి, తన కుమార్తెను తట్టి నిద్రనుంచి లేపి "నేను వెళుతున్నాను. స్కూలుకు ఆలస్యంగా వెళ్లవద్దు," అంది.

చిన్న, నజ్మ నడుచుకుంటూ స్టార్‌లైట్ కాలనీకి వెళ్లారు. వాళ్ళు చీపుర్లు తీసుకొని, చెత్త బండిని నడుపుకొంటూ, శుభ్రం చెయ్యటానికి పూనుకున్నారు. ఆ బండి చాలా పురాతనమైనది. రోడ్డుకు రెండు పక్కలకు వెళ్ళి ఇద్దరూ రోడ్డును శుభ్రం చేయటం ప్రారంభించారు. దాదాపు అన్ని చెత్త కుండీలూ చెత్తతో నిండి ఉన్నాయి. ప్రజలు చెత్తను చెత్త కుండీల పక్కన కూడా పారవేశారు.

వీధిని శుభ్రం చేయడం వాళ్ళ పనిలో ఒక భాగం. తరవాత చెత్తను బండిలో వేసి ట్రక్కులో వేయాలి. ఒక్కోసారి చెత్తను చేతితో ఎత్తాలి. సీసాలు, సంచులు, కూరగాయల చెత్త, ఎముకలు మొదలైన జీవసంబంధ పదార్థాలు బండిలో నింపి ట్రక్కులో వేయాలి. నిజానికి ప్రజలు ఆకుపచ్చ చెత్త కుండీని, నీలపు రంగు చెత్తకుండీని సరిగ్గా ఉపయోగించాలి. అలా చేయడం వలన చెత్తని మళ్ళీ పునఃవినియోగం చేసే అవకాశం ఉంది. కాని కొంతమంది అలా చెత్తను వేరు చేయకుండానే వేయడం వల్ల చిన్న, నజ్మా ఆ పనిని చేయాలి.

చెత్తను పారవేయడానికి వారికి బళ్ళు ఇచ్చారు. చాలామంది వాళ్ళ వృత్తిని చిన్నచూపు చూస్తారని చిన్నాకు తెలుసు. పట్టణం మొత్తం శుభ్రంచేసి ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించడానికి తోడ్పడుతుంటే పట్టణ ప్రజలు మాత్రం వీరిపట్ల, వీరి వృత్తిపట్ల గౌరవం చూపడం లేదు.

వీధులను ఊడ్చేవాళ్ళే కాకుండా, ట్రక్కు డ్రైవర్లు, సహాయకులు ఎంతోమంది కాంట్రాక్టర్ కింద పనిచేస్తారు. వీళ్ళు సేకరించిన చెత్తనంత చిన్న నివసిస్తున్న కాలనీకి కొంచెం దూరంలోనే కేటాయించిన స్థలంలో పడేస్తారు.

- చిన్నా ఎక్కడ పనిచేస్తుంది? ఆమెకు ఎవరు ఉద్యోగం ఇచ్చారు?
- కాలనీ శుభ్రంచేయడానికి వాళ్ళు ఏమేమి చేస్తారు?
- చిన్నా, నజ్మా చేస్తున్న పనిని సమాజంలోని అందరూ గౌరవిస్తున్నారా?
- రెండు కాలనీలకూ మధ్య ఉన్న వ్యత్యాసాలపై మీ అభిప్రాయమేమిటి?
- మీరు ఊహించి రెండు కాలనీల పటాన్ని తయారు చేయండి.

## వేములవాడ నగర పంచాయితి – కేస్‌స్టడి

వేములవాడ నగర పంచాయతి సిరిసిల్ల రాజన్న జిల్లాలో ఉంది. 20 వార్డులు కలిగియున్న ఈ నగర పంచాయతి 2011 వరకు మేజర్ గ్రామపంచాయతిగా ఉండేది. ఇక్కడి శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానము ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రము. దేవాలయానికి అనేక మంది యాత్రికులు వస్తూ ఉంటారు. దేవాలయ అధికారులు, దేవాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఈ పట్టణము ప్రత్యేకమైన తాగునీటి వ్యవస్థను కలిగి ఉన్నది. ఈ వ్యవస్థను 'ఆకాశగంగ' గా పిలుస్తారు. ఇది 2003లో ప్రారంభమైనది. స్తంబాల ఆధారంగా పైనుండి పైపులైను వేసి నీటిని సరఫరా చేస్తారు. 'స్వజలధార

SCERT TELANGANA

పథకం' ద్వారా వేయబడిన ఈ పైపులైను ప్రతి పది, పదిహేను కుటుంబాలకు కలిపి ఒక నల్లా ఏర్పాటు చేసారు. ఈ విధంగా 5 వేల కుటుంబాలకు రక్షిత మంచినీటి సరఫరా జరుగుతుంది. నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తారు.

పట్టణములో ప్రతిరోజు చెత్తను సేకరిస్తారు. పారిశుధ్య కార్మికులకు చక్రాల బండ్లు, చేతులకు, ముఖాలకు తొడుగులు, యూనిఫారాలు ఇస్తారు. హైడ్రాలిక్ డంపర్ బిన్స్, ట్రాలీ ఆటోరిక్షాలు, ట్రాక్టర్లు ఉపయోగించి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు పంపిస్తారు. ఈ డంపింగ్ యార్డు పట్టణానికి 5 కి.మీ. దూరంలో ఉంది. చెత్తనుండి ప్లాస్టిక్‌ను వేరు చేసి, ఆ చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రతిపాదన ఉంది.

దాదాపు అన్ని ఇండ్లలో వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థల మరియు ప్రభుత్వ నిధులతో వీటిని నిర్మించారు.

పట్టణాన్ని ఆనుకొని ఉన్న వాగులో బతుకమ్మ వేడుకల నిర్వహణకోసం ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లు పట్టణానికి మరొక ముఖ్య ఆకర్షణ. పండుగల సందర్భములో ఈ ప్రాంతంలో ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు మరియు లైటింగ్ ఏర్పాటు చేస్తారు.



*చిత్రం 14.6: త్రాగునీటి కోసం పైపు లైన్లు (ఆకాశగంగ)*



*చిత్రం 14.5: తాగునీరు*



*చిత్రం 14.7: బతుకమ్మ తెప్ప*

**కీలకపదాలు**

స్వపరిపాలన
పురపాలక సంఘం
పురపాలక కార్పొరేషన్
సబ్ కాంట్రాక్టింగ్
జీవ సంబంధ వ్యర్థ పదార్థాలు

SCERT TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. మీ ప్రాంతంలో చెత్తను ఎలా సేకరిస్తారు? దాన్ని ఏం చేస్తారు?
2. పురపాలకసంఘం కల్పిస్తున్న ఏయే పౌర సౌకర్యాలను గ్రామపంచాయతి కల్పించటం లేదు?
3. మీ పట్టణంలో/ నగరంలో గత రెండు సంవత్సరాలలో పురపాలక సంఘం చేస్తున్న పనుల జాబితాను తయారుచేయండి.
4. పోచమ్మ ఉన్న వీధిలో కొళాయి నుంచి నీరు 30 నిమిషాలు కూడా రాదు. అందువల్ల చాలామంది బకెట్లు నింపుకోడానికి వరుసలో నిలుచుంటారు. ఆమె సమస్య పరిష్కారం కావటానికి మీరు పోచెమ్మకు ఏవిధమైన సలహా ఇస్తారు?
5. జేవియర్ వీధి దీపాలు బాగు చేస్తాడు. ఆయన పురపాలక సంఘపు విద్యుత్ కాంట్రాక్టర్ దగ్గర ఉద్యోగం చేస్తాడు. జేవియర్ పనిచేసేటప్పుడు విద్యుత్ షాక్‌వల్ల గాయమయింది. చేయి బాగా కాలిపోయింది. ఆయన రెండు నెలల వరకు పని చేయకుండా విశ్రాంతి తీసుకున్నాడు. ఆయనకు ఈ రెండు నెలలకు వేతనాలు ఇవ్వలేదు. అంతే కాకుండా కాంట్రాక్టర్ ఆయన్ని ఉద్యోగంలోనుంచి తీసివేశాడు. జేవియర్‌కు మీరు ఏం సలహా ఇస్తారు?
6. పేద ప్రజలకు సహాయం చేయడానికి మున్సిపాలిటీ ఎలాంటి సేవలు అందిస్తుంది?
7. గ్రామాన్ని పట్టణం నుండి వేరుచేసే అంశాలు ఏమిటి?
8. మీకు పట్టణాలలో, గ్రామాలలో బాగా ఇష్టమైనవి ఏవి?
9. మీ జిల్లా పటంలో మున్సిపాలిటీలను గుర్తించండి.
10. స్థానిక కార్పొరేటర్/ కౌన్సిలర్‌ను కలిసి పురపాలక సంఘం చేసే పనుల గురించి తెలుసుకోవడానికిగాను కొన్ని ప్రశ్నలు తయారు చేయండి.
11. పేజి నెం. 124లోని 'వీధులను ఊడ్చేవాళ్ళే కాకుండా..... కేటాయించిన స్థలంలో పడేస్తారు.' పేరాను చదివి, వ్యాఖ్యానించండి.
12. పురపాలక సంఘం పౌరసౌకర్యాలను తక్కువ ధరకే కల్పించాలి అని కొందరు భావిస్తారు. పురపాలక సంఘంలో పనిచేసే వాళ్ళందరికి హుందాతనంతో కూడిన పనిచేసే పరిస్థితులు ఉండాలని మరికొందరు అంటారు. ఈ అంశాల మీద మీ వాదనలు రాయండి.

### ప్రాజెక్టు

1. మున్సిపాలిటీలు ప్రజలకు కల్పిస్తున్న ప్రజా సౌకర్యాలను బస్‌స్టాండ్, ఆసుపత్రి, పాఠశాల, సంత, మరుగుదొడ్లు, మొదలైనవి సందర్శించి ఒక నివేదికను తయారు చేయండి. వీటిపై ఒక పోస్టరు రూపొందించండి.
2. ఇద్దరు మున్సిపాలిటీ కార్మికులతో మాట్లాడి వారి రోజువారీ కార్యక్రమాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను చార్ట్‌పై రాసి తరగతి గదిలో ప్రదర్శించండి.
3. వార్తా పత్రికలలో పురపాలక సంఘాల గురించి వచ్చిన వార్తలను ఒక వారంపాటు సేకరించి ఆ వార్తల సారాంశాన్ని తయారు చేయండి.

SCERT TELANGANA

పాఠం
15

# మన సమాజంలో వైవిధ్యం

*ఇంతకుముందు అధ్యాయం (పాఠం)లో మనం నివసించే ప్రాంతాలలోని వైవిధ్యాన్ని, అక్కడి ప్రజల జీవన విధానంలోని భిన్నత్వాన్ని చూశాం. వైవిధ్యం అనేది కేవలం వేరువేరు ప్రాంతాలలోనే కాకుండా మన తరగతి గదిలోను, పరిసరాలలోను కనిపిస్తుంది.*

## మన పరిసర ప్రాంతంలో వైవిధ్యం

మీ తరగతి గదిని చూడండి. మీతోటి విద్యార్థులలో ఎవరైనా ఖచ్చితంగా మిమ్మల్ని పోలి ఉన్నారా? ప్రజలు అనేక విధాలుగా ఉంటారని మీరు ఈ అధ్యాయంలో తెలుసుకుంటారు. వాళ్ళు చూడడానికి వేరుగా ఉండడమే కాకుండా వేరువేరు ప్రాంతాల వాళ్ళు, సంస్కృతుల వాళ్ళు, మతాలవాళ్ళు కూడా కావచ్చు. ఈ భేదాలు మన జీవితాలను అనేక విధాలుగా సుసంపన్నం చేస్తాయి; మన జీవితాలను ఆసక్తి దాయకంగా కూడా చేస్తాయి! రకరకాల ప్రజలు అంటే రకరకాల నేపథ్యాలుగలవాళ్ళు, వివిధ మతాలవాళ్ళు, సంస్కృతులవాళ్ళు భారతదేశాన్ని ఆసక్తిదాయకంగా, వైవిధ్యభరితంగా ఉండడానికి దోహదపడతారు. వైవిధ్యం జీవితాలకు ఏమి సమకూరుస్తుంది? భారతదేశం ఈ విధంగా ఎలా రూపుదిద్దుకుంది? అనేక రకాల ఈ భేదాలు భిన్నత్వంలో భాగాలేనా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు ఈ అధ్యాయంలో దొరుకుతాయి.

ఈ కింది బొమ్మలను గమనించండి. ఇవి దాదాపు మీ వయస్సున్న ముగ్గురు పిల్లలు గీసినవి. మీరుకూడా ఈ కింద ఉన్న ఖాళీ చట్రంలో ఒక మనిషి బొమ్మ గీయండి.



మీ వయసున్న పిల్లలు గీసిన చిత్రాలు

SCERT TELANGANA

మీరు గీసిన బొమ్మ మీ తోటి విద్యార్థులు గీసిన బొమ్మలను పోలి ఉందా? మీ బొమ్మ ఆ ముగ్గురు గీసిన బొమ్మలకంటే పూర్తిగా భిన్నంగా ఉండటానికే అవకాశముంది. మనలో ప్రతి ఒక్కరికి బొమ్మలు వేయడంలో ఒక ప్రత్యేక శైలి ఉంటుంది.

**మీకు సంబంధించిన సమాచారాన్ని ఖాళీలో నింపండి**

- బయటకి వెళ్ళేటప్పుడు నేను.................. ధరించటానికి ఇష్టపడతాను.
- ఇంట్లో నేను.............. భాషలో మాట్లాడతాను.
- నాకు ఇష్టమైన ఆట .................
- నేను............ పుస్తకాలను చదవటానికి ఇష్టపడతాను.

ఇప్పుడు మీ టీచర్ సహాయంతో ఎంతమంది ఒకే రకమైన సమాధానాలు రాశారో చూసుకోండి. అన్ని ప్రశ్నలకు మీరిచ్చిన సమాధానాలే ఇంకొకరు ఇచ్చే అవకాశాలు తక్కువ. కాని మీలో చాలామంది ఒకే రకమైన సమాధానాలు ఇచ్చి ఉంటారు. ఈ సమాచారం ఆధారంగా మీ తరగతిలో చర్చించండి. ఉదాహరణకు ఒకే రకమైన పుస్తకాలను చదవటానికి ఎంతమంది ఇష్టపడతారు? మీరు నివసిస్తున్న ప్రాంతంలో ఎన్ని భాషలు మాట్లాడతారు? కొన్ని అంశాలలో మీరు కొంతమంది తోటి విద్యార్థులను పోలి ఉంటే, మరికొన్ని అంశాలలో వేరుగా ఉన్నారని మీరు గుర్తించి ఉంటారు.

## స్నేహం చెయ్యటం

మీకంటే భిన్నంగా ఉన్నవాళ్ళతో స్నేహం చెయ్యటం తేలిక అనిపిస్తుందా? ఈ కింది కథ చదవండి.

*సుమన్ తల్లి వికారాబాద్‌లోని ఒక రద్దీ కూడలిలో కూరగాయల దుకాణం నడుపుతుంది. ఈ దుకాణాన్ని నడపటంలో తల్లికి సుమన్ సహాయం చేస్తుంటాడు. అందరూ అతన్ని కూరగాయల సుమన్ అని పిలుస్తారు.*

*ఒకరోజు దాదాపు అదే వయసుగల ఒక పిల్లవాడు సైకిల్‌మీద వస్తూ ఆ దుకాణం దగ్గర ఆగాడు. కూరగాయల సుమన్, ఆ పిల్లవాడిని ఏమి కావాలని అడిగాడు. స్కూల్ యూనిఫామ్‌లో ఉన్న ఆ పిల్లవాడు బెండకాయలు అర కిలో అని అన్నాడు. 'బోలేతో భేండీ ఆదా కిలో' అని కూరగాయల సుమన్ అన్నాడు. ఔనంటూ స్కూల్ యూనిఫాంలోని పిల్లవాడు తల ఊపాడు. తరవాత డబ్బులు చెల్లించి కూరగాయలు కొనుక్కొని సైకిల్ మీద ఇంటికి వెళ్ళిపోయాడు.*



*చిత్రం 15.1: కూరగాయలు కొనడానికి దుకాణం ముందు నిలబడి ఉన్న బడి పిల్లవాడు*

*మరుసటి రోజున బడి పిల్లవాడు కూరగాయల దుకాణం దగ్గరికి మళ్ళీ వచ్చాడు. కూరగాయల సుమన్ చిరునవ్వుతో, 'భయ్యా, క్యా చాహియే' అని ఆప్యాయంగా పలకరించాడు. బడి పిల్లవాడు కూడా చిరునవ్వు చిందిస్తూ 'ఏయే కూరగాయలున్నాయి?' అని అడిగాడు. అప్పుడు 'కద్దూ, తురాయి, భిండీ, టమాటా, ఆలు, ప్యాజ్' అని కూరగాయల సుమన్ సమాధానమిచ్చాడు. బడి పిల్లవాడు అతన్ని, 'నీకు తెలుగురాదా? ఎక్కడి నుంచి వచ్చావు?' అని అడిగాడు. 'హమ్ బీహార్‌కే హై, మేరే ఘర్‌మే హిందీ బోల్‌తే హై. నాకు కొంచెం కొంచెం తెలుగు వచ్చు!' అని సుమన్ బదులిచ్చాడు. 'నీపేరేమిటి?' అని బడి పిల్లవాడు అడిగాడు. 'నా పేరు సుమన్, నన్ను అందరూ కూరగాయల సుమన్ అని పిలుస్తారు!' అని కూరగాయల సుమన్ చెప్పాడు. 'ఓ! నా పేరు కూడా సుమన్' అని చెబుతూ కూరగాయల సుమన్‌తో చేతులు కలిపాడు. తరవాత ఇద్దరూ స్నేహితులు–య్యారు. ఆదివారాలలో క్రికెట్ ఆడుకునే సమయంలో చదువుకుంటున్న సుమన్ కూరగాయల సుమన్‌ను క్రికెట్ ఆడటానికి పిలుస్తూ ఉండేవాడు. కూరగాయల*

SCERT TELANGANA

సుమన్ మంచి ఫీల్డర్. తాను కూరగాయలను నేలమీద పడకుండా చాలా అభ్యాసం చేశానని, కాబట్టి తాను ఫీల్డర్‌గా రాణించగలనని కూరగాయల సుమన్ చమత్కరించేవాడు.

కొన్ని వారాల తర్వాత చదువుకుంటున్న సుమన్ కూరగాయల దుకాణం దగ్గరికి వెళ్ళినప్పుడు దుకాణదారైన కూరగాయల సుమన్ బాధతో ఉన్నట్లు గమనించి, 'ఏమైంది?' అని అడిగాడు. మునిసిపాలిటీ వాళ్ళు "ఈ స్థలాన్ని మీరు ఆక్రమించారు. దీన్ని ఖాళీ చేయండి అని ఒత్తిడి చేస్తున్నారు. వాళ్ళు మమ్మల్ని పెద్ద మార్కెట్ దగ్గరికి వెళ్ళండని అంటున్నారు, కాని మేము పేదవాళ్ళం. అక్కడ అద్దె, మేము చెల్లించలేనంత ఎక్కువగా ఉంది. మేము ఇక ఇప్పుడు ఎక్కడికి వెళతామో నాకేమీ అర్థం కావడం లేదు!" అని కూరగాయల సుమన్ చెప్పాడు. చదువుకుంటున్న సుమన్ కలత చెందుతూ ఇంటికి వెనుతిరిగాడు. తన స్నేహితునికి తాను ఎలాంటి సహాయం చేయగలనని ఆలోచించసాగాడు. రెండు రోజుల తర్వాత కూరగాయలు కొనడంకోసం ఆ కూరగాయల దుకాణం గల స్థలానికి వెళ్ళేసరికి అతనికి ఆ దుకాణం కనిపించలేదు. మునిసిపాలిటీ వాళ్ళు ఆ స్థలంలోని ఆక్రమణలన్నింటిని తొలగించారని అక్కడివాళ్ళ ద్వారా తెలుసుకున్నాడు. చదువుకుంటున్న సుమన్ దానిమీద విచారం వ్యక్తంచేశాడు.

ఇద్దరు సుమన్‌లలో చాలా తేడాలు ఉన్నాయి. మాతృభాష, వాళ్ళ సొంత రాష్ట్రాలు, వాళ్ళు చేసే పనులు, వాళ్ళకు లభించే అవకాశాలు వంటి వాటిల్లో తేడాలు ఉన్నాయి. అయినప్పటికీ వాళ్ళిద్దరు స్నేహితులు కాగలిగారు.

- వారిద్దరి మధ్యగల భేదాల జాబితాను తయారు చేయండి.
- బీహార్ లేదా ఏదైనా ఇతర రాష్ట్రాల ప్రజలు జరుపుకునే పండుగలు, వారు తీసుకునే ఆహారం గురించి తెలుసుకోండి.
- చదువుకుంటున్న సుమన్ తినే ఆహారం, జరుపుకునే పండుగలు ఏమిటి?

- వారిరువురు ఏరకమైన ఇళ్ళల్లో నివసిస్తూ ఉండి ఉంటారు?
- వారిద్దరి మధ్య ఇంకా ఏ యితర తేడాలను మీరు గమనించి ఉంటారు. కూరగాయల సుమన్ బడికి వెళ్ళటం లేదు, కూరగాయలు అమ్ముతున్నాడు. అతడు ఎందుకు బడికి వెళ్ళలేకపోయాడని అనుకుంటున్నారు?
- అతడు బడికి వెళ్ళాలనుకుంటే ఎటువంటి సమస్యలు ఎదుర్కొని ఉండేవాడు?

## భారతదేశంలో వైవిధ్యం

విభిన్న సామర్థ్యాలు, భాషలు, సంస్కృతులు, మతాలు మొదలైనవి ఉన్న ప్రజలతో మనం సహజీవనం సాగిస్తున్నాం. ఇది మన జీవితాలను సుసంపన్నం చేస్తుంది. భారతదేశంలోని 29 రాష్ట్రాలవారికి తమ సొంత భాష, సంస్కృతి, ఆహారపు అలవాట్లు మొదలైనవి ఉన్నాయి. ఒక రాష్ట్రంలో గల ప్రజలు కూడా వేర్వేరు భాషలు మాట్లాడటం, వివిధ మతాలు అనుసరించడం, తినే ఆహారం వేరుగా ఉండటం, వివిధ రకాల పండుగలు జరుపుకోవడం, భిన్న రకాల దుస్తులు ధరించడం చూస్తూ ఉంటాం. ఒకరి దుస్తులు, ఆహారం, పండుగలు, భాష, మత సంప్రదాయాలను మరొకరు కాలక్రమంలో అలవాటు చేసుకోవటం ఆసక్తికరంగా ఉంటుంది. దీనివల్ల ప్రతి ఒక్కరి జీవితం మరింత వైవిధ్యంతో సుసంపన్నంగా రూపొందుతుంది. మీ పరిసర ప్రాంతంలోనుంచి దీనికి అనేక ఉదాహరణలు మీరు ఇవ్వగలుగుతారు.

- మీ తాత ముత్తాతలు తినని, ఇప్పుడు మీరు ఇష్టంగా తింటున్న ఆహార పదార్థాల జాబితా తయారు చేయండి. తరగతిలో చర్చించండి.

| అంశాలు | అవి ఎక్కడి నుంచి వచ్చాయి? |
|---|---|
| ఆహారం | |
| బట్టలు | |
| ఆటలు | |
| పండుగలు | |

తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2020-21



SCERT TELANGANA

ఇప్పుడు మనం ఈరకమైన వైవిధ్యం ఎలా ఏర్పడుతుందో మన దేశంలో దూరాన గల రాష్ట్రాల ఉదాహరణల ద్వారా తెలుసుకుందాం.

మన సొంత రాష్ట్రమైన తెలంగాణలోని ప్రజలలో విస్తారమైన వైవిధ్యాన్ని చూడవచ్చు. ఈ పాఠ్యపుస్తకం మన రాష్ట్రంలో మాట్లాడే దాదాపు ఏడు భాషల్లో ప్రచురింపబడింది. అంతేకాక, తమ సొంత భాషలను మాట్లాడుతూ, విలక్షణ జీవన విధానం గల అనేక గిరిజన సమూహాలు ఇక్కడ ఉన్నాయి. లంబాడ, బంజార వంటి అనేక సంచార తెగలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్నారు. గోల్కొండ సుల్తాన్‌ల, నిజామ్‌ల కాలంలో ఆఫ్రికన్ సంతతికి చెందిన బానిసలు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తీసుకురాబడినారు. హైదరాబాద్‌లోని హబ్సిగూడ వంటి కొన్ని కాలనీలు కూడా వారి పేరిట వెలిశాయి. అదేవిధంగా సామర్‌ఖండ్, బొఖారా, ఇరాన్, టర్కీ వంటి సుదూర ప్రాంతాల ప్రజలు ఎన్నో తరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు. ఇతర వ్యక్తులతో కలసి వీరందరూ తెలంగాణ యొక్క ప్రత్యేకమైన ఒక భిన్న సంస్కృతిని సృష్టించారు. ఆ విధంగా దేశంలోని ఇతర ప్రాంతాలలో మాట్లాడే భాషల కంటే భిన్నంగా ఉన్న తెలుగు, హిందీ మరియు ఉర్దూ (దక్కాని అని పిలుస్తారు) భాషలను చూడవచ్చు. హైదరాబాద్ తెలుగు మరియు ఉర్దూ రెండు భాషల కవిత్వానికి ప్రధాన కేంద్రంగా ఉంది. ఇటువంటి వైవిధ్యం కలిగిన ప్రజల వలన గొప్ప సాంస్కృతిక సాంప్రదాయం ఏర్పడింది. ఇందులో విభిన్న మతాలు, ఆహార సంస్కృతులు, పలు రకాల భవన నిర్మాణ శైలులు, అనేక రకాల దుస్తులు కనిపిస్తాయి.

## వైవిధ్యం ఎలా ఏర్పడుతుంది?

అన్ని కాలాలలో ప్రజలు కొత్త ప్రాంతాలను వెతుక్కుంటూ వెళ్ళి అక్కడ స్థిరపడేవారు. కొన్నిసార్లు వర్తకం కోసం, కొత్త ప్రదేశాలను ఆక్రమించి స్థిరపడడం కోసం వెళ్ళారు. కొన్నిసార్లు వరదలు లేదా కరవు కాటకాలు లేదా అంటువ్యాధుల వల్ల ఇళ్ళను వదలి వెళ్ళారు. మరికొందరు యుద్ధాలు, సంఘర్షణల వల్ల దూరప్రాంతాలకు వెళ్ళారు. వారితో పాటు వారి భాషలు, మతాలు, సంస్కృతులను కొత్త ప్రదేశాలకు తీసుకొని వెళ్ళారు. ఆ కొత్త ప్రదేశాలలో కూడా వాటిని అనుసరించారు. క్రమంగా వాళ్ళు ఆ ప్రాంతపు ప్రజలతో కలిసిపోయి అక్కడి వాళ్ళ సంప్రదాయాలను తమలో విలీనం చేసుకున్నారు. తమ విషయాలను అక్కడి వారికి నేర్పేవారు. వివిధ ప్రాంతాలలోని ప్రజల జీవనం వైవిధ్యభరితంగా ఎలా రూపొందిందో చూద్దాం.

- రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను తెలిపే భారతదేశ పటాన్ని 12వ పాఠంలో చూడండి. అందులో తెలంగాణ, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాలను గుర్తించండి.

## థార్ ఎడారి

భారతదేశం పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో థార్ ఎడారి ఉంది. దానిలోని చాలాభాగం రాజస్థాన్ రాష్ట్రంలోని మార్వార్ ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతంలో వర్షపాతం చాలా తక్కువ. పెద్ద నదులు లేవు. ఫలితంగా చెట్లు తక్కువగా పెరుగుతాయి. కొన్ని పంటలను పండించవచ్చు. గడ్డి మాత్రమే పెరుగుతుంది. ఇక్కడ ప్రజలు గొర్రెలను, మేకలను, ఒంటెలను మేపడం మీద ఆధారపడతారు. సాధారణంగా గొర్రెల కాపరులు అనేక రాష్ట్రాలకు వాళ్ళ పశువులతో సహా వెళతారు; వర్షాకాలానికి ముందే థార్‌కు తిరిగి చేరుకుంటారు.


చిత్రం 15.2: థార్ ఎడారి



SCERT TELANGANA

ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి వచ్చేవారు లేదా ఆ దేశాలకు వెళ్ళే వర్తకులు ఈ ఎడారి ప్రాంతంగుండానే వెళతారు. వారికి అనువైన ప్రాంతాలలో ఇక్కడ విడిది చేస్తారు. వర్తకులతోపాటు గుజరాత్‌లోని ద్వారకా, రాజస్థాన్ లోని అజ్మీర్, పుష్కర్ సరస్సును, అరబ్‌లోని మక్కా, మదీనాను సందర్శించే యాత్రికులు ఈ ప్రాంతం నుంచే వెళతారు. అందువల్ల క్రమంగా ఈ ప్రాంతంలో జైసల్మేర్, బికనేర్, జోధ్‌పూర్ వంటివి ముఖ్యమైన పట్టణాలుగా ఎదిగాయి. ఈ విధంగా శతాబ్దాలకు పైబడి వివిధ మతాలకు చెందిన ప్రజలు, బొహరా ముస్లిములు, సున్నీ ముస్లిములు, షియా ముస్లిములు, జైనులు, శైవులు, వైష్ణవులు, సిక్కులు ఇక్కడి పట్టణాలు, గ్రామాలలో స్థిరపడ్డారు. ఇంకోవైపు అనేకమంది మార్వాడీ వర్తకులు ఇక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు.

చిత్రం 15.3: జైసల్మేర్ కోట



ఉపఖండంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎందరో రాజులు, ఈ ప్రాంతాల్లో రాజ్యాలను స్థాపించారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, ఎడారి నేలను సాగు చేయడం వంటి క్లిష్టమైన పద్ధతులను ఇక్కడి ప్రజలందరూ అభివృద్ధి చేశారు. తద్వారా థార్ ఎడారి ప్రపంచంలోనే అత్యంత జనసాంద్రత కలిగిన ఎడారిగా మారింది.

ఇక్కడి ప్రజలు ఒకప్పుడు సజ్జ రొట్టెలను పెసరపప్పు లేదా మినప పప్పుతో తినేవారు. సంగ్రీ చెట్లు, ముళ్ళ పొదలకు కాసే కూరగాయలను తినేవారు. వీటిని ఎండబెట్టి నిలవ చేసుకుని ఏడాది పొడవునా తినేవారు. అయితే ఇప్పుడు మనకు అక్కడ ఇడ్లీ సాంబార్ నుంచి పిజ్జాలు, ఐస్‌క్రీముల వరకు అన్ని రకాల ఆహార పదార్థాలు దొరుకుతున్నాయి.

ఈ ప్రాంతపు పశువులు బాగా పాలిస్తాయి. వీటితో పసందైన మిఠాయిలను చేస్తారు. థార్ ఎడారిలోని బికనీర్ నగరం మిఠాయిలు, చిరుతిళ్ళకు ప్రసిద్ధి.

థార్‌కు వచ్చిన ప్రజలంతా కొత్త హస్తకళలను, కొత్త బట్టలను, రకరకాల ఆహార పదార్థాలను వెంటబెట్టుకొని వచ్చారు. థార్ ఎడారి వైవిధ్యాన్ని చూసి ఆనందించటానికి ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వేలాది యాత్రికులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు.

**సిక్కిం**

హిమాలయాల తూర్పు ప్రాంతంలో ఉన్న సిక్కిం చిన్న రాష్ట్రం. హిమాలయాలలో ఎత్తైన శిఖరాలలో ఒకటైన కాంచనగంగ సిక్కింలోనే ఉంది. ఈ ప్రాంతం సంవత్సరం పొడవునా చల్లగాను, శీతాకాలంలో మంచుతోను కప్పి ఉంటుంది. వర్షాకాలంలో అధిక వర్షపాతం ఉంటుంది. లోయల గుండా అనేక నదులు ప్రవహిస్తాయి.

భారతదేశంలో నేపాల్, భూటాన్, టిబెట్ (చైనా)ల సరిహద్దు ప్రాంతంలో సిక్కిం రాష్ట్రం ఉంది. అందువల్ల ఇక్కడ అన్ని ప్రదేశాల ప్రజలూ స్థిరపడ్డారు. అందులో కొందరు నేపాలీయులు, మరికొందరు టిబెటన్‌లు,



చిత్రం 15.4: రూమ్‌టెక్ మఠం

SCERT TELANGANA

భూటానీయులు ఉన్నారు. సిక్కింలో ప్రజలు పదకొండు భాషలు మాట్లాడతారు! బౌద్ధమతాన్ని తెచ్చిన టిబెటన్ లామాలతో వీళ్ళకు అత్యంత సన్నిహితత్వం ఉంది. సిక్కింలో వీరు చాలా సుందరమైన మఠాలు నిర్మించారు.



చిత్రం 15.5: కాంచనగంగ

1975 సంవత్సరం వరకు సిక్కిం స్వతంత్ర రాజ్యంగా ఛోగ్యాల్ రాజుల ఏలుబడిలో ఉండేది. ఆ సంవత్సరంలోనే భారతదేశంలో సిక్కిం ఒక రాష్ట్రంగా కలిసి ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడింది.

థార్, సిక్కింలు రెండూ భారతదేశంలోనే ఉన్నాయి. థార్ అనేది ఎడారి ప్రాంతాన్ని కలిగి ఉంది. సిక్కిం హిమాలయ పర్వతశ్రేణిలో ఉంది. భిన్నమైన సంస్కృతుల ప్రభావం కేవలం గతానికి సంబంధించినదేకాదు. మనం ప్రస్తుత కాలంలో కూడా ఉపాధికోసం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళుతున్నాం. మనతోపాటు మన ఆచార వ్యవహారాలను తీసుకువెళతాం. కాలక్రమంలో కొత్త ప్రదేశంలో మన జీవన విధానం ఒక భాగమవుతుంది. అదేవిధంగా ఇతర ప్రాంతాల ప్రజలతో కలిసి నివసిస్తాం. మనమందరం కలిసి చేసే పనులు మన రోజువారీ జీవన విధానాలు అవుతాయి. ఆచారాలు, సంప్రదాయాలు జీవన ప్రక్రియలో భాగం అవుతాయి.

## పాండిచ్చేరి

పాండిచ్చేరి భారతదేశం యొక్క ఆగ్నేయ తీరంలో గల చిన్న రాష్ట్రం. పాండిచ్చేరి అనేక యూరోపియన్ వ్యాపార సంస్థలను డచ్, పోర్చుగీస్, ఇంగ్లీష్ మరియు ఫ్రెంచ్ వారిని ఆకర్షించింది. వారు వర్తకపు కేంద్రాలను మరియు చిన్న చిన్న కాలనీలను స్థాపించారు. కాలక్రమంలో 1954 వరకు పాండిచ్చేరి ప్రజలు ఇండియన్ యూనియన్‌లో చేరడానికి ఓటు వేయడంతో ఫ్రెంచ్ వారు పాండిచ్చేరిపై తమ అధికారం వదులుకున్నారు. పాండిచ్చేరి తమిళులతో పాటు చాలా మంది ఫ్రెంచ్ మాట్లాడేవారు మరియు ఇతరులు ఉన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో స్వాతంత్ర్య ఉద్యమం నడుస్తున్న సమయంలో, తమిళనాడుకు చెందిన గొప్ప జాతీయవాద కవి అయిన సుబ్రమణ్య భారతికి మరియు మొదట్లో బెంగాల్ నుండి విప్లవ జాతీయవాదిగా పనిచేసి తదనంతరం ఆధునిక భారతదేశం యొక్క ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక రుషిగా అవతరించిన అరవిందఘోష్‌లకు పాండిచ్చేరి ఆశ్రయమిచ్చింది. అందువల్ల భారతదేశం అంతటి నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. అరవిందఘోష్ మరియు అతని ఫ్రెంచ్ శిష్యురాలు అయిన 'అమ్మ' అరవిందాశ్రమాన్ని స్థాపించారు. శాంతి మరియు ప్రపంచ సహకారం అనే సందేశాన్ని వ్యాప్తి చేయడానికి ఐక్యరాజ్యసమితి యొక్క మద్దతుతో ఆరోవిల్లే అనే అంతర్జాతీయ గ్రామం స్థాపించబడింది. భారతదేశంలో విభిన్న సంస్కృతులు కలిసిపోవడం మాత్రమే కాదు, మానవజాతి ఏకత్వాన్ని వేడుక చేసుకునేందుకు మొత్తం ప్రపంచంలోని ప్రజలు కలిసి ఉంటారనడానికి పాండిచ్చేరి ఉదాహరణగా ఉంది.



చిత్రం 15.6: ఆరోవిల్లే మైత్రి మందిర్

## భిన్నత్వంలో ఏకత్వం

గత అనేక శతాబ్దాల నుండి వైవిధ్యం ఉన్నప్పటికీ తమ సంస్కృతులు, మతాలు, రాజకీయ వ్యవస్థల కలయికతో భారత్ ఒక దేశంగా ఆవిర్భవించింది.

SCERT TELANGANA

ఈ వైవిధ్యం, సమ్మిళితం యొక్క చరిత్ర భారతీయులను ఒక జాతిగా ఏకం చేసి బ్రిటీష్ పాలనతో పోరాడడానికి సహాయపడుతుంది. ఈ సామూహిక పోరాటమే జాతీయోద్యమం.

> రక్తపుటేరులు ప్రవహించిన రోజు మరిచిపోవద్దు,
> ఓ స్నేహితుడా
> మీ సంతోషాల మధ్య మమ్మల్ని తలుచుకుని ఒక కన్నీటి చుక్క రాల్చండి
> వేటగాడు ప్రతి పూరేకు రాల్చేశాడు
> ఎడారితోటలో ఒక పూలమొక్కనాటు,
> ఓ స్నేహితుడా
> తూటాలకు రాలిన మేం జలియన్‌వాలాబాగ్‌లో నిద్రిస్తున్నాం
> ఈ ఒంటరి సమాధిపై ఒక దీపం వెలిగించు,
> ఓ స్నేహితుడా
> హిందువులు, ముస్లిముల రక్తం ఈ రోజు కలసి ప్రవహిస్తోంది
> నీ బట్టలను ఈ రక్తపుటేరులో ముంచు ప్రియ స్నేహితుడా
> కొందరు జైళ్లల్లో మగ్గుతున్నారు, కొందరు సమాధుల్లో నిద్రిస్తున్నారు
> వాళ్లకోసం కన్నీళ్లు కార్చు, ఓ స్నేహితుడా
>
> భారత ప్రజానాయక మండలి (ఇప్టా)

జలియన్ వాలా బాగ్ దారుణ మరణకాండ తరువాత ఈ పాట పాడసాగారు. అమృత్‌సర్‌లో ఎటువంటి ఆయుధాలు లేకుండా ప్రశాంతంగా సమావేశమైన ప్రజలపైన కాల్పులు జరపాలని బ్రిటిష్ జనరల్ ఆదేశాలు జారీ చెయ్యటంతో ఎంతోమంది చనిపోయారు, ఇంకా ఎంతోమంది గాయపడ్డారు. బ్రిటీష్ ధమనకాండ, హత్యాకాండ, అనిచివేతపట్ల తమ నిరసనను తెలియచెయ్యటానికి స్త్రీలు, పురుషులు; హిందువులు, సిక్కులు, ముస్లింలు, ధనికులు, పేదలు సమావేశమయ్యారు. ఆ సాహసికులకు గౌరవ సూచకంగా ఈ పాట రాశారు, పాడుతున్నారు.

వైవిధ్యతను గౌరవించే మన దేశ ఘన సంప్రదాయాన్ని స్వాతంత్ర పోరాటంలో తయారైన పాటలు, సంకేతాలు తెలియచేస్తాయి. జాతీయ జెండా కథ మీకు తెలుసా? బ్రిటిష్‌కి వ్యతిరేకంగా నిరసన సంకేతంగా దానిని ప్రజలు దేశమంతటా ఉపయోగించారు.

జవహర్‌లాల్ నెహ్రూ "డిస్కవరి ఆఫ్ ఇండియా" అన్న తన పుస్తకంలో భారత ప్రజల ఐక్యత బయటి నుంచి నేర్చుకుందికాదనీ, "అది చాలా లోతైనది, విభిన్న ఆచారాలు, నమ్మకాలు పట్ల విస్తృత సహనాన్ని కనబరిచింది. అన్ని వైవిధ్యాలను గుర్తించటమే కాకుండా ప్రోత్సహించింది". మన దేశం గురించి చెప్పటానికి 'భిన్నత్వంలో ఏకత్వం' అన్న దానిని నెహ్రూయే రూపొందించాడు.

- భారతదేశ ఐక్యతను చాటే మరొకటి రవీంద్రనాథ్ టాగూర్ రాసిన జాతీయగీతం. ఈ ఏకత్వాన్ని జాతీయగీతం ఎలా వివరిస్తోంది?



*చిత్రం 15.7: స్వాతంత్ర్య దినోత్సవము నాడు ఎర్రకోట నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న భారతదేశ మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ*

**కీలకపదాలు**

వైవిధ్యం
వలసపాలన
సంస్కృతి
లామా
దేశభక్తి

SCERT TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. మీ పరిసరాలలో భిన్నత్వం ఉందని తెలిపే రెండు ఉదాహరణలను పేర్కొనండి.
2. వేర్వేరు మతాలలోని ఏకత్వాన్ని తెలిపే అంశాలతో పట్టికను తయారు చేయండి.
3. జాతీయ క్రీడల పోటీలు భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందిస్తాయని ఎలా చెప్పగలరు?
4. మీ ప్రాంతంలో వివిధ ప్రాంతాల, మతాల ప్రజలు కలిసి జరుపుకొనే పండుగల జాబితాను తయారు చేయండి.
5. వైవిధ్యభరితమైన వారసత్వమున్న భారతదేశంలో నివసించటం మీ జీవితాన్ని ఎలా సుసంపన్నం చేస్తుంది?
6. వివిధ ప్రాంతాలలోని స్వాతంత్ర్యోద్యమ నాయకుల చిత్రాలను, వారు చేసిన సేవలను తెలిపే వివరాలు సేకరించి వారి జీవిత చరిత్రలతో కూడిన ఒక పుస్తకాన్ని తయారు చేయండి.
7. భారతదేశం 'భిన్నత్వంలో ఏకత్వం' కలిగిన దేశం అనే లక్షణాన్ని తెలియజేసే ఒక కరపత్రాన్ని ఉదాహరణల ద్వారా రూపొందించండి.
8. కింది పట్టికను పూరించండి.

| క్ర.సం. | అంశం | నేను | స్నేహితుడు | స్నేహితురాలు |
|---|---|---|---|---|
| 1 | ఆహారం | | | |
| 2 | దుస్తులు | | | |
| 3 | ఇల్లు | | | |
| 4 | మాతృభాష | | | |
| 5 | మతం | | | |
| 6 | పండుగలు | | | |
| 7 | ఇతరములు | | | |

పై అంశాలు మీ స్నేహాన్ని కొనసాగించడానికి అవరోధాలని మీరు భావిస్తున్నారా? మీ అభిప్రాయాలను సమర్థించండి.

9. భారతదేశ పటంలో ఈ కింది వాటిని గుర్తించండి.
   అ. థార్ ఎడారి ఆ. సిక్కిం ఇ. పాండిచ్చేరి ఈ. కేరళ
   ఉ. తెలంగాణ ఊ. పంజాబ్
10. వైవిధ్యం ఏవిధంగా వెలుగులోకి వచ్చింది? మీ సమాధానాన్ని థార్ ఎడారి, సిక్కిం, పాండిచ్చేరిల గురించి నీవు నేర్చుకున్నదాని ఆధారంగా రాయండి.

SCERT TELANGANA

పాఠం
16

# స్త్రీ, పురుష సమానత్వ దిశగా పయనం

*తెలంగాణలో ఇంటిగడపదాటి బయట ఉద్యోగాలకు వెళ్ళే మహిళల సంఖ్య పెరుగుతోంది. నేడు పౌరజీవనంలో మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. ఎన్నికలలో పోటీచేస్తున్నారు, పురుషులతో సమానంగా గృహంలో ముఖ్యమైన నిర్ణయాలను చేయగలుగుతున్నారు. వివిధ ఉద్యమాలలో మహిళలు సమష్టిగా పాలుపంచుకోవడానికి, ప్రభుత్వాలు 1980 - 1990 దశకాలలో మహిళలకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలు దానికి కారణమయ్యాయి. అయినప్పటికీ తెలంగాణలోని మహిళలు సమానత్వాన్ని, హుందాతనాన్ని పొందడంలో వెనుకబడి ఉన్నారని చెప్పక తప్పదు. గతం కంటే నేడు మునుపెన్నడూ లేనివిధంగా చిన్నారి ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం ఇందుకు ఉదాహరణ. తెలంగాణలో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వాన్ని సాధించడంలో అడ్డంకిగా ఉన్న కొన్ని ముఖ్య అంశాలను ఈ అధ్యాయంలో చర్చిద్దాం.*

- పొలాలలో, పరిశ్రమలలో పనికి, ఉద్యోగాలకు వెళ్ళే మహిళల గూర్చి మీకు తెలుసా? వారు నిత్యం ఎదుర్కొనే సమస్యల గురించి తెలుసుకోండి.
- స్త్రీ, పురుషులు వేరు వేరుగా చేసే పనుల జాబితాను తయారుచేయండి.

స్త్రీలు ఎప్పుడూ ఇంటిపనులు, అంటే వండటం, బట్టలు ఉతకటం, ఇంటిని శుభ్రం చేయటం, పిల్లల సంరక్షణ మొదలైనవి చేస్తున్నారు. అదే మగవాళ్ళయితే వ్యవసాయంలో, పరిశ్రమలలో పని చేస్తారు. కానీ చాలా కుటుంబాల్లో ఆడవాళ్లు ఉద్యోగాలు చేస్తూ, ఇంటిపని కూడా చేస్తున్నారు. చాలా కుటుంబాలలో మగవాళ్ళు సహాయం చేయకపోగా తాగి ఇంటికి రావటం, స్త్రీని, పిల్లల్ని హింసించటం, దాన్ని వారు భరించటం జరుగుతూవుంది.

## స్త్రీలు సహజంగా ఇలాగే ఉంటారా?

స్త్రీలు సహజంగానే పురుషులకన్నా బలహీనులని, చాలా బాధ్యతాయుతంగాను, ప్రేమగాను ఉంటారని, అంతేకానీ సమస్యలకు ఎదురుతిరిగే తత్వం వాళ్ళలో ఉండదని కొంతమంది భావిస్తారు. వాళ్ళకు వంటపని, ఇంటిపని, కుట్లు, అల్లికలులాంటివి పుట్టుకతోనే వస్తాయని అనుకుంటారు. అందుకే ఆడవాళ్ళు ఎప్పుడు వేరొకరి సంరక్షణలో (మగవారి) ఉండాలని అంటారు. ఆడవాళ్ళే పిల్లల్ని ఎంతో జాగ్రత్తగా, ప్రేమతో పెంచుతారు. వాళ్ళలోని ఈ సహజగుణంవల్ల గృహనిర్వహణ వాళ్ళే చూసుకోవాలని అంటారు.

- పక్క పేజీలోని పట్టికలో ప్రజల మనోభావాలకు సంబంధించిన కొన్ని ప్రధాన అంశాలు పొందుపరిచిఉన్నాయి. వాటిలో మగవారివి ఏవి, ఆడవారివి ఏవి, అలాగే ఇద్దరివీ ఏవో తెలపండి. ప్రతి విద్యార్థి ఈ పట్టికను సొంతంగా నింపాలి.

SCERT TELANGANA

| వరస సంఖ్య | లక్షణం | ఆడవారు | మగవారు | ఇద్దరివీ |
|---|---|---|---|---|
| 1 | ధైర్యం – దూకుడు, పోరాడడంలో ముందుండటం | | | |
| 2 | తార్కిక ఆలోచన – గణితం, సామాన్య శాస్త్రంలో ప్రతిభ | | | |
| 3. | కళాత్మకత – చిత్రాలు వేయడం, నృత్యంలో, సంగీతంలో ప్రతిభ | | | |
| 4. | సాధన – అభ్యసనంలో ప్రతిభ | | | |
| 5. | దృఢత్వం – పని చేయడంలో ప్రతిభ, | | | |
| 6. | బలహీనం, తేలికపని మాత్రమే చేయగలుగుతారు. | | | |
| 7. | భావోద్వేగాలు – ఏడుపు మొదలుపెట్టడం, అర్ధరహిత కోపం | | | |
| 8. | సిగ్గు – బయటకు రావటానికి ఇష్టపడకపోవటం | | | |
| 9. | మాటకారితనం – గలగలా మాట్లాడుతూ ఉండడం | | | |
| 10. | గుంభనంగా ఉండటం – తక్కువ మాట్లాడుతూ నిశ్శబ్దంగా ఉండటం | | | |
| 11. | ప్రేమ – జబ్బుపడినవాళ్ళను సాకడం, పిల్లల సంరక్షణ చూడడం | | | |
| 12. | కండలుతీరి పొడవుగా ఉండడం–క్రీడలలో ప్రతిభ చూపడం | | | |
| 13. | దుస్తులు ధరించడంలో ఇష్టపడటం | | | |

- ఈ పట్టికను తరగతిలోని విద్యార్థులందరూ పూర్తి చేసిన తర్వాత, ఎక్కువ మంది విద్యార్థుల అభిప్రాయాల్ని టీచరు నల్లబల్ల మీద రాయాలి.
- ఇప్పుడు ప్రతి ఒక్క లక్షణాన్ని కూలంకషంగా చర్చించి ఎక్కువ మంది అభిప్రాయాలను నిర్ధారించి దాన్ని ఉదాహరణలతో చర్చించాలి.

దీన్ని చాలా లోతుగా చర్చించగలిగితే పై అంశాలు ఇద్దరికి వర్తిస్తాయని అర్థమవుతుంది. ఉదా: పిరికితనం, ధైర్యం అనేవి ఇద్దరిలో కనిపిస్తాయి. అలాగే పిల్లల్ని ఎంతో ప్రేమగా, బాధ్యతగా చూసుకొనే పురుషులు, బాధ్యతారహితంగా ఉండే స్త్రీలు కనిపిస్తారు. అయితే ఇలాంటి కొన్ని లక్షణాలను మనం స్త్రీ, పురుషులకు ఆపాదిస్తాం. నిజానికి వాళ్ళ భౌతిక స్వరూపాన్నిబట్టి ఇటువంటి ఆపాదనలకు ఆస్కారం లేదు. స్త్రీ,పురుషుల శారీరక నిర్మాణంలో ఉండే కొన్ని తేడాలవల్ల స్త్రీలు గర్భందాల్చి శిశువులకు జన్మనిచ్చి, వాళ్ళకి కొన్ని నెలల వరకు పాలిచ్చి పోషించగలుగుతున్నారు. అంత మాత్రాన పిల్లలకు స్నానం చేయించడం, వంట చేయటం, బట్టలు శుభ్రం చేయటం లాంటివి ఆడవాళ్లే చేయాలనటం అర్థరహితం, శోచనీయం. పురుషులు కూడా ఈ పనులన్నీ చేయవచ్చు. చాలా ప్రాంతాల్లో పురుషులు కూడా ఈ పనులన్నింటిని సమర్థవంతంగా చేస్తున్నారు. సాధారణంగా ఆడవాళ్ళే ఈ పనులన్నీ చేస్తూ ఉండడంతో అది వాళ్ళకు సహజలక్షణం అని, ఆ పాత్రలకు వాళ్ళే సరి అనే భావన వృద్ధి చెందింది.

ఈ లక్షణాలను కొన్ని వందల, వేల సంవత్సరాల నుంచి మహిళలకు ఆపాదిస్తూ వచ్చారు. చాలా సంవత్సరాల నుంచి ఇలా జరగడంతో మనమంతా ఇది సహజమే అనే నిర్ధారణకు వచ్చాం. వాస్తవానికి ఇటువంటి నియమాలను సమాజం రూపొందించింది. వనరులపై పురుషుల నియంత్రణ ఉంది, నియమాలూ వాళ్ళేచేస్తారు. కొన్ని వందల సంవత్సరాలుగా పురుషానుకూల సామాజిక వ్యవస్థ కొనసాగుతోంది. చరిత్రలో చూస్తే రాజులుగా, మత పెద్దలుగా, ప్రధాన అధికారులుగా పురుషులే ఉన్నారు. చట్టం, న్యాయం లాంటి అంశాలన్నీ పురుషులే తయారుచేశారు.

SCERT TELANGANA

పశువులు, భూమి మాదిరి స్త్రీలు కూడా పురుషులకు లోబడి ఉండేలా చేశారు.

మనకు స్త్రీ, పురుషుల మధ్య ముఖ్యంగా రెండు రకాల భేదాలు కనిపిస్తాయి. మొదటిది సహజంగా కనిపించే శారీరకమయిన తేడా. దీని వల్లనే స్త్రీలను తక్కువగా చేసి చూడడంలేదు. ఇక రెండోది సామాజికమైన చిన్నచూపు. స్త్రీలను పురుషులకంటే తక్కువగా భావించే కొందరు పురుషుల భావనే స్త్రీల అసమానతకు, వివక్షతకు ఒక కారణం. దీన్నే సామాజికమైన తేడా లేదా లింగపరమైన తేడా అని చెప్పుకోవచ్చు.

**బాలబాలికల పెంపకం**

అమ్మాయిలను, అబ్బాయిలను పుట్టుకతోనే తేడాగా పెంచడం మొదలవుతుంది.

ఈ కింది విషయాల్లో అమ్మాయిలను, అబ్బాయిలను ఎలా పరిగణిస్తున్నారో తరగతిలో చర్చించి ఆయా విషయాలు ఎంత వరకు నిజమో తెలుసుకోండి.

- కొడుకు పుడితే స్వాగతించి పండుగ జరుపుకునే కుటుంబాలు కూతురు పుడితే భారంగా ఎందుకు భావిస్తున్నాయి?
- అబ్బాయిల్ని వాళ్ళ స్నేహితులతో బయటికివెళ్లి ఆడుకోటానికి, అందరితో కలిసి తిరగటానికి స్వేచ్ఛనిస్తారు. అమ్మాయిల్ని ఇంట్లోనే ఉంచి ఇంటి పనులు చేయడానికి ప్రోత్సహిస్తారు.
- అబ్బాయిలకు ఆడుకోవటానికి తుపాకులు, కార్లు, లారీలు లాంటి బొమ్మలు ఇచ్చి ప్రోత్సహిస్తారు. అమ్మాయిలకేమో వంటకు , ఇంటికి సంబంధించిన ఆట బొమ్మలు ఇచ్చి ఆడుకోమంటారు.
- అబ్బాయిలను పరుగెత్తటానికీ, చెట్లెక్కటానికీ, పాకటానికీ అనుకూలంగా ఉండే దుస్తుల్ని ధరించమంటారు. శరీరమంతా కప్పివేస్తూ- నడవటానికి కాని, పరుగెత్తటానికి కాని వీలులేని దుస్తులను అమ్మాయిలతో ధరింపజేస్తారు.
- మగపిల్లవాళ్ళకి ముందుగా భోజనం పెట్టి మిగిలిన ఆహారాన్ని మాత్రమే ఆడపిల్లలకు ఎందుకు పెడుతున్నారు?
- బడికి వెళ్ళి చదువుకోమని అబ్బాయిలను ప్రోత్సహిస్తూ అమ్మాయిలకు చదువుకోవడానికి కావలసిన సమయం ఇవ్వకపోవడం లేదా బడికి పంపకపోవడం ఎంత వరకు సరియైనది?
- అబ్బాయిలతో పోల్చినపుడు చాలా తక్కువమంది అమ్మాయిలను మాత్రమే పెద్ద చదువులు చదువుటకు అనుమతిస్తున్నారు.
- ఆరోగ్యం క్షీణించిన అబ్బాయికి సత్వరమే వైద్య సహాయం అందజేస్తారు. అదే ఆడపిల్లకైతే ఎందుకు చేయరు?
- అబ్బాయిలు వాళ్ళకు నచ్చిన వృత్తిలో స్థిర పడటానికి ప్రణాళికలను రూపొందిస్తారు. అమ్మాయిలు మాత్రం పెళ్లిచేసుకొని గృహిణిగా స్థిరపడాలని పెద్దవాళ్ళు కోరుకుంటారు.

**తగ్గుతున్న బాలికలు, స్త్రీలు**

ఇలాంటి వివక్ష ధోరణులవల్ల చాలా విచారకరమైన పరిణామాలు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు దేశ జనాభాలో స్త్రీల సంఖ్య క్రమేపి తగ్గిపోతోంది. ఎలాగంటే: 1951వ సంవత్సరంలో ప్రతి 1000 మంది పురుషులకు 946 మంది స్త్రీలు ఉంటే, 1981 వచ్చేసరికి ప్రతి 1000 మంది పురుషులకు 934 మందే స్త్రీలు ఉన్నారు. 2011లో స్త్రీల సంఖ్య కాస్త మెరుగై 940కి చేరింది.

అదే తెలంగాణ రాష్ట్ర పరిస్థితిని పరిశీలిస్తే 1991వ సంవత్సరంలో ప్రతి 1000 మంది పురుషులకు 969 మంది స్త్రీలు ఉన్నారు. 2011 సంవత్సరంనాటికి స్త్రీల సంఖ్య కాస్త పెరిగి ప్రతి 1000 మంది పురుషులకు 988 మంది స్త్రీలు ఉన్నారు. ఇలా తెలంగాణ రాష్ట్రం అన్ని రాష్ట్రాలకంటే లింగనిష్పత్తిలో ముందంజలో ఉన్నప్పటికీ దీనివల్ల మన రాష్ట్రంలో అంతా బాగుందని చెప్పలేం. 6 సంవత్సరాలలోపు పిల్లల సంఖ్యను పరిశీలిస్తే ఆడపిల్లల సంఖ్య జనాభాలో గణనీయంగా తగ్గి పోయింది. ఎంత అనేది ఈ కింది పట్టికలో కనిపిస్తుంది.

SCERT TELANGANA

| సంవత్సరం | బాలురు | బాలికలు |
|---|---|---|
| 1991 | 1000 | 978 |
| 2001 | 1000 | 963 |
| 2011 | 1000 | 933 |

అమ్మాయిల పరిస్థితిలో ఎలాంటి అభివృద్ధి లేదని, మరింత క్షీణిస్తోందని దీనివల్ల తెలుస్తుంది.

సాధారణంగా ఆడపిల్లలు మగ పిల్లలతో సమానంగా పుట్టవలసి ఉంది. కాని అమ్మాయిల నిష్పత్తి తక్కువగా ఉండడం వలన స్త్రీలు, ఆడపిల్లలు ఆరోగ్యకరమైన జీవితాన్ని మనదేశంలో కొనసాగించలేక పురుషుల కన్నా ఎక్కువ మంది స్త్రీలు ముందుగా చనిపోతున్నారు. ఈ శాతం ఎందుకిలా దిగజారిపోతోంది?


దీనికి ఎన్నో కారణాలున్నాయి. కొన్ని కుటుంబాలలో చిన్నారి బాలికలకు సరిపడినంత పోషకాహారం లభించకపోవడంతో అనారోగ్యానికి గురై మరణిస్తున్నారు. మరికొన్ని కుటుంబాలలో సరియైన వైద్య చికిత్స అందక వివక్షకు లోనవుతున్నారు. భ్రూణ హత్యల కారణంగా ఆడపిల్లల సంఖ్య ఇటీవల కాలంలో బాగా తగ్గిపోతున్నది. పుట్టడానికి ముందే తల్లి గర్భంలోనే శిశువును చంపడాన్ని భ్రూణహత్య అంటారు. సాంకేతిక పరిజ్ఞాన పురోభివృద్ధిని మగ శిశువులకు మాత్రమే జన్మనిచ్చే అవకాశంగా వినియోగించుకోవడం దురదృష్టకరం.

- ఇలాంటి సంఘటనలేమైనా మీరున్న ప్రాంతాల్లో జరుగుతున్నాయా అని ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అడిగి తెలుసుకొని దానిమీద ఒక నివేదికను తయారుచేసి పాఠశాల గోడపత్రికలో ప్రదర్శించాలి.

### అక్షరాస్యతలో అంతరాలు

మనందరి జీవితాలలో బడికి వెళ్ళి చదవడం, రాయడం నేర్చుకోవడమనేది ముఖ్యమైన అంశం. పటం 16.1 ను గమనించండి. రెండు వేరు వేరు రంగులలో ఉన్న బార్‌గ్రాఫ్ అక్షరాస్యుల శాతాన్ని తెలియజేస్తున్నాయి - 7 సంవత్సరాల పైబడిన స్త్రీ, పురుషులలో తెలుగు భాష లేక ఏదైనా ఇతర భాషలో చదవడం, రాయడం వచ్చిన వారిని సూచిస్తున్నాయి. స్త్రీలతో పోల్చినప్పుడు పురుషులలో అక్షరాస్యులు ఎక్కువ అని తెలుస్తున్నది. తెలంగాణలో ప్రతి 100 మంది స్త్రీలలో 28 మంది మాత్రమే 1991వ సంవత్సరం నాటికి అక్షరాస్యులని గమనించి ఉంటారు. 2011 నాటికి ఈ సంఖ్య 58 ని చేరింది. ఇదే కాలంలో పురుషుల అక్షరాస్యత 52 నుండి 75కు పెరిగింది. స్త్రీ, పురుష అక్షరాస్యతా శాతంలో తేడా తగ్గడాన్ని గమనించి ఉంటారు.

భారతదేశంలో బాగా విస్తరించిన విద్యా వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రం కలిగి ఉన్నాయి. లక్షకు పైగా పాఠశాలలు, కళాశాలల్లో 1.50 కోట్లమంది విద్యార్థులు చదువుతున్నారు. బడిని మధ్యలో మానివేస్తున్న పిల్లల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. 30 సంవత్సరాల క్రితం ఈ సమస్య ఆడపిల్లల్లో మరింత జటిలంగా ఉండేది. ఉదాహరణకు 100 మంది బాలికలు బడిలో చేరితే 65 మందికి మించి 5వ తరగతి ఆపై చదువు కొనసాగించడంలేదు, కేవలం 15 మంది ఆడపిల్లలు మాత్రమే ఇంటర్‌మీడియట్ వరకు విద్యను అభ్యసించ గలుగుతున్నారు.




*16.1: తెలంగాణ అక్షరాస్యతా స్థాయి (%)*

ఈ వివక్షతకు మరో కారణం ఏమంటే స్త్రీలు తక్కువగా చదువుకొని ఉండటం. ఆడపిల్లల చదువును ప్రోత్సహించకుండా వాళ్ళకు ఇంటిపని, పొలంపని, షాపుల్లో పని అప్పగిస్తున్నారు, ఒకవేళ ఏ ఆడపిల్లయినా

SCERT TELANGANA

బడికి వెళ్ళిచదువుకున్నా అక్కడ నేర్చుకున్న విషయాల్ని ఇంటివద్ద మననం చేసుకునే అవకాశం దొరకడం లేదు. దీనికి కారణం ఇంటి పనులవల్ల సమయం లేకపోవటం. ఒకవేళ ఇలాంటి వాటినన్నింటిని సరిదిద్దుకుని ఆడపిల్లలు చదువుకున్నా ఉన్నత చదువుల్లో వాళ్ళకు నచ్చిన సైన్స్, గణితం లాంటి విషయాలు తీసుకోవటాన్ని నిరుత్సాహపరుస్తారు. ఇవి అబ్బాయిలు మాత్రమే చదవాలని, అమ్మాయిలకి భాషా, సాహిత్యం, హోంసైన్స్‌లాంటి సబ్జెక్ట్‌ని సూచిస్తారు. ఇలాంటి విషయాల్లో కొన్ని విద్యాసంస్థలు కూడా లింగ వివక్షత ఆధారంగా అబ్బాయిలు హోమ్‌సైన్స్ చదవటానికి వీలులేదని అమ్మాయిలు మాత్రమే చదవాలని నిర్బంధిస్తున్నాయి.

ప్రస్తుతం పరిస్థితి మెరుగైంది. అయినప్పటికీ బాలబాలికలలో 1/6 వ వంతు ఐదవ తరగతి తరవాత పాఠశాలకు దూరమవుతున్నారు. ఈ విషయంలో బాలబాలికల మధ్య పెద్ద వ్యత్యాసం అంటూ ఏమీ లేదు.

- మీరు చదువుకొనే పాఠశాలల్లో అమ్మాయిలు కాని, అబ్బాయిలు కాని వివక్షకు గురయ్యే అంశాల జాబితాను తయారు చేయండి.
- మధ్యలో చదువు మానివేసి ఇంటి దగ్గర ఉన్న స్త్రీ, పురుషులిద్దరితో తరగతిలోని ప్రతి విద్యార్థి మాట్లాడాలి. చదువు మానివేయడానికి గల కారణాలను కనుక్కొని వాటిని తరగతిలో చర్చించాలి.
- మీరున్న ప్రాంతం, గ్రామంలో ఎంత మంది బాలికలు ఈ సంవత్సరం బడి మానేశారో తెలపండి.వాళ్లతో కారణాలు ఏమిటో చర్చించండి.

### ఆస్తి హక్కు

మన దేశంలో చాలా వరకు భూములు, ఇళ్ళు, పరిశ్రమలన్నీ పురుషుల పేరుపై ఉంటున్నాయి. తల్లిదండ్రుల ఆస్తులపై పిల్లలందరికీ సమాన హక్కుంది అనే చట్టాలున్నా, చాలా కొద్దిమంది అమ్మాయిలు మాత్రమే తల్లిదండ్రుల ఆస్తిలో భాగం పొందుతున్నారు. సాధారణంగా అబ్బాయిలే ఆస్తికి హక్కుదారులు అవుతున్నారు. దీని ఫలితంగా స్త్రీలకు పొలాలు, దుకాణాలు, పరిశ్రమల ద్వారా వచ్చే ఆదాయాలు ఏవీ లేకపోవటం వల్ల వాళ్లు ఆర్థికంగా తండ్రిమీద, భర్త మీద, కొడుకుల మీద, అన్నదమ్ములపై ఆధారపడుతున్నారు.

ఈ మధ్య కాలంలో తెలంగాణ పరిస్థితి కొంత మెరుగైంది. 1980 దశకంలో వచ్చిన చట్టాలు దీనికి కారణమని చెప్పవచ్చు. ఈ చట్టాలద్వారా వారసత్వంగా వచ్చే తల్లిదండ్రుల ఆస్తిలో కొడుకులతోపాటు కూతుళ్లకు కూడా సమాన వాటా కల్పించడం తప్పని సరి అయ్యింది. వారసత్వంగా వచ్చే ఆస్తిలో లింగ వివక్ష లేకుండా స్త్రీలకు సమాన హక్కులను కల్పించిన మొదటి రాష్ట్రం మన రాష్ట్రమే.

### ఉపాధి

స్త్రీలు ఇంటి పనితోపాటు ఉద్యోగాలు చేయడం వల్ల స్వతహాగా ఆర్థికంగా నిలదొక్కుకునే స్థితికి వచ్చారు. తెలంగాణలోని చాలామంది మహిళా కార్మికులు వ్యవసాయంలో, తాత్కాలిక ఉద్యోగాలలో పనిచేస్తూ వారిలో కొందరు సొంతంగా చిన్న దుకాణాలను, సంస్థలను నిర్వహించడం ద్వారా ఉపాధిని పొందుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ఇతరులపై ఆధారపడవలిసిన అవసరం లేదు.

చాలా కుటుంబాలలో బాలికలు పౌష్టికాహార లోపంతో, సరైన చదువు లేకుండా పెరుగుతున్నారని చూశాం. దాని ఫలితంగా మంచి జీతభత్యాలు పొందే అవకాశం లేకుండాపోతోంది. స్త్రీలు బాగా చదివిన వారైనప్పటికీ వాళ్ళను ఉద్యోగాలు చేయనీయకుండా ఇంటి పనులకే పరిమితం చేయటం గ్రామీణ భారతంలో అత్యధికంగా చూస్తున్నాం. అలాగే ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళను ఇంటి పనికోసం సెలవులు పెట్టిస్తూ, వాళ్ళ ఉద్యోగానికి ఆటంకం కల్పిస్తున్నారు. బాగా చదివిన స్త్రీలు మంచి వృత్తి, ఉద్యోగాలు చేయలేకపోవటానికి వాళ్ల కుటుంబీకులు ఒప్పుకోకపోవటం, స్త్రీలు కుటుంబాన్ని విడిచి చాలా

SCERT TELANGANA

రోజులు ఉండవలసిరావడం కారణాలుగా చెప్పవచ్చు. అంతేకాక స్త్రీలకు వీలైనప్పుడు చేసే ఉద్యోగాలే అనుకూలమంటూ తీర్మానిస్తారు. చాలా మంది స్త్రీలు సరైన విద్యార్హత లేకపోవటంతో ఎక్కువగా వ్యవసాయ కూలీలుగా, గనుల్లో, ధనికుల ఇళ్లలో పనివాళ్ళుగా ఉంటున్నారు. ఇలాంటి పనులు వాళ్ళను శారీరకంగా ఒత్తిడికి గురిచేయటమేకాక, వాళ్ళకి సామాజిక మర్యాద, భద్రత లేకుండా ఉంది. వారు నిరంతరం అవమానాలకు, అవహేళనలకు గురవుతున్నారు.

మనదేశ రాజధాని అయిన ఢిల్లీలోని ఒక ఇంట్లో పనిచేసే మాలిని అనే ఆమె ఏమి చెపుతోందంటే...

> *నేను మూడంతస్తుల భవనంలో నివసిస్తున్న ఒక ధనవంతుల ఇంట్లో పనిచేసేదాన్ని. నాకు ఏ పని చెప్పాలన్నా ఆ ఇంటి యజమానురాలు అరుస్తూ చెప్పేది. నేను వంటింట్లో పనిచేసే దాన్ని. ఇంటిని శుభ్రం చేయటానికి ఇంకా ఇద్దరు అమ్మాయిలున్నారు. మా పని ఉదయం 5 గంటలకు మొదలయ్యేది. మాకు వాళ్ళిచ్చేది ఒక కప్పు టీ, రెండు ఎండిపోయిన రొట్టెలు మాత్రమే. మూడో రొట్టె కావాలన్నా ఇచ్చేది కాదు. సాయంత్రం నేను వంట చేయగానే ఆ ఇద్దరు అమ్మాయిలూ రాత్రి భోజనంలో మూడవ రొట్టె కావాలని అడిగేవారు. చాలా రహస్యంగా వాళ్లకి ఇచ్చి నేను కొన్ని రొట్టెలు తినేదాన్ని. యజమానురాలు ఏ సమయంలో కేకలు వేస్తుందోనని భయపడిపోయేదాన్ని. అవమానంతో కూడిన ఏడుపు వచ్చేది. రోజంతా మేం కష్టపడి పనిచేయలేదా? మేం కొంత గౌరవానికి నోచుకోలేమా?*

- మీకు తెలిసిన పనివాళ్ళను గురించి చర్చించి వాళ్ళను ఇంటివాళ్ళు ఎలా చూస్తున్నారో, పనివాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలేమిటో, వాళ్ళు ఎంత సంపాదిస్తున్నారో తెలుసుకోండి.
- మాలిని లాంటి వాళ్ళు రోజంతా కష్టపడ్డా 100/- రూపాయలు కూడా ఎందువల్ల సంపాదించలేక పోతున్నారు?
- సాధారణంగా స్త్రీలు చేపట్టే ఇతర వృత్తులు ఏమిటి? వారి స్థితిగతుల గురించి నీకు తెలిసిన విషయాలను మీ తరగతిలో చర్చించండి.

కొన్ని దశాబ్దాలనుంచి స్త్రీలు చేపట్టే వృత్తులలోను, ఉద్యోగాలలోను క్రమేపి మార్పులు వచ్చాయి. చాలా మంది స్త్రీలు ఎక్కువ విద్యార్హతలు సంపాదించి, అప్పటి వరకు ఇవి పురుషులకు మాత్రమే అనుకొనే ఉద్యోగాల్లో కూడా ప్రవేశించగలిగారు. 1980 దశకంలో మన రాష్ట్రంలో వచ్చిన రిజర్వేషన్ల విధానాలు చాలామంది స్త్రీలు కళాశాలల్లో చేరడానికి, ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడడానికి దోహదపడ్డాయి. వీటివల్ల మహిళలు కళాశాలలో చేరి విద్యావంతులై వేతనం తీసుకునే ఉద్యోగాలలో చేరుతున్నారు. ప్రస్తుతం పేరు పొందిన శాస్త్రవేత్తలుగా, రాయబారులుగా, ఇంజనీర్లుగా మొదలైన ఉద్యోగ వృత్తులలో అనేక మంది కొనసాగుతున్నారు.



*చిత్రం 16.2: భారత్‌లో ప్రథమ మహిళా రైలింజన్ డ్రైవర్ అయిన సురేఖా యాదవ్*

ప్రస్తుతం స్త్రీలు రక్షణ, నౌకాదళం, వైమానికదళంలో కూడా పనిచేస్తున్నారు. నేడు మహిళా పైలెట్లు కూడా ఉన్నారు. రైలింజన్ డ్రైవరుగా కూడా స్త్రీలు ఎంపిక అయ్యారు. ఉన్నత విద్యకోసం స్త్రీలు సాగించిన పోరాటంవల్ల, లింగవివక్షను ఎదిరించి ఆయా వృత్తులలో చేరడం వల్ల ఇదంతా సాధ్యమయింది.

## గుర్తింపులేని స్త్రీ శ్రమ

మనం స్త్రీలు చేసే రోజువారీ పనిని పరిశీలిస్తే వారు తమ సమయాన్నంతా పనుల్లోనే గడుపుతున్నట్లు తెలుస్తుంది. అయినా చాలాసార్లు వాళ్ళ పనికి తగిన గుర్తింపుగానీ, ఆదాయంగానీ ఉండటం లేదు. వాళ్ళు చేసే కష్టమైన పనులు ఎవరి దృష్టికీ రావటం లేదు.

SCERT TELANGANA

- పొలంలో పనిచేస్తున్న రైతుల చిత్రపటాన్ని కింద ఇచ్చిన ఖాళీ స్థలంలో గీయండి. గీసిన తరవాత మీ ఉపాధ్యాయులకు చూపించండి.

పై చిత్రపటంలో, మీలో పురుష రైతులను, స్త్రీ రైతులను, స్త్రీ, పురుషులిద్దరినీ పని చేస్తున్నట్లుగా ఎంత మంది చిత్రీకరించారు.

రైతు అంటే పురుషులనే అనుకుంటాం, స్త్రీలని అనుకోం. నిజానికి భారతదేశంలో పొలంలో పనిచేసే వాళ్ళలో ప్రతి 10 మందిలో 8 మంది స్త్రీలే. భూమిని దున్నటం, విత్తనాలు చల్లటం, నాట్లు వేయడం, కలుపుతీయడం, పంట కోయడం, నూర్పు చేయటం, ఇలా లెక్కలేనన్ని పనులన్నింటినీ స్త్రీలు చేస్తున్నారు. అయితే వీటిలో కొన్ని పనులను స్త్రీలు మాత్రమే చేస్తున్నారు. వరినాట్లు వేయటం, కలుపు తీయటం, వేరుసెనగకాయలు తవ్వి తీయటం లాంటి పనులను వారికి కేటాయించారు. వాటితోపాటు పొలాల్ని స్త్రీలే స్వయంగా సాగుచేస్తున్నారు. పురుషులు పట్టణాలకు, ఫ్యాక్టరీల్లో పనిచేయటానికి వెళ్ళిపోయినప్పుడు వ్యవసాయ బాధ్యతలు వీళ్ళే నిర్వర్తిస్తున్నారు.

స్త్రీలు వాళ్ల సొంత పొలంలో చేసిన పనికి ఎలాంటి గుర్తింపు కాని ఆదాయం కాని పొందకుండానే పనిచేస్తున్నారు. ఒక వేళ వేరేవాళ్ళ పొలంలో కూలికోసం పనిచేసినా వాళ్ళ కూలి పురుషులకంటే తక్కువ.

దీంతో మనకు అర్థమయ్యేదేమంటే స్త్రీ తన ఇంటికోసం ఎంతో కష్టపడితేనేగానీ ఆ ఇల్లు నడవదు. స్త్రీ ఇంట్లో చేసే ప్రతీ పనికి (వంట పనికీ, ఊరగాయ పచ్చళ్ళ తయారీ, పిల్లల సంరక్షణ, చదువు, అనారోగ్యంతో ఉన్న వాళ్లకోసం చేసే సేవలకు, బట్టలు



*16.3: చిత్రాన్ని చూడండి: ఉద్యోగం చేస్తున్న మహిళ కూడా గృహసంబంధ పనులు తానొక్కరే చేయక తప్పడంలేదు కదా! స్త్రీల పనిని కూలిపనిగా గుర్తించగలమా?*

కుట్టటం, నీళ్ళుపట్టటం, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి తేవడం మొదలైనవాటికి) మనం డబ్బు ఇవ్వాలంటే ప్రతి నెలా ఎంత ఇవ్వవలసి ఉంటుంది? ఒక్కసారి ఆలోచించండి.

వాళ్ళు చేసే పనికి ఎవరూ ఏమీ ఇవ్వకపోగా, సమయానికి చేయలేదని, రుచిగా తయారుచేయలేదని దూషిస్తారు. అదే పురుషులు పనిచేస్తే వాళ్ళకు డబ్బు వస్తుంది. వాళ్ళకు నచ్చినట్లు ఖర్చు చేస్తూ జీవితాన్ని గడుపుతారు.

- మీ ఇంట్లో మీ అమ్మ, అక్క, చెల్లెలు, వదిన మొదలైన వాళ్ళంతా చేసే పనులను ఒక పట్టికగా తయారుచేయండి. వాళ్ళు ఎప్పుడు నిద్ర లేస్తారో, ఎప్పుడు భోజనం చేస్తారో, ఎప్పుడు విశ్రాంతి తీసుకుంటారో, ఎప్పుడు నిద్రపోతున్నారో పట్టికలో రాయండి.

**మారుతున్న నేటి పరిస్థితులు**

మీరు 13, 14 పాఠాలలో గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక స్వపరిపాలన తెలంగాణలో ఏవిధంగా పనిచేస్తుందో చదివారు. ఆ వ్యవస్థల్లోని సభ్యుడు తాను నివసించే ప్రాంతం, గ్రామం, సమాజాభివృద్ధికి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడతాడు. జనాభాలో సగం ఉన్న స్త్రీలు, యువతులు అటువంటి పరిపాలనా విభాగాలలో సభ్యులుగా, నాయకులుగా రావడానికి వారి కుటుంబాలు, వారి భర్తల ప్రోత్సాహం ఇప్పుడిప్పుడే

SCERT TELANGANA

లభిస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా పంచాయితీరాజ్ వ్యవస్థలో, ఇతర సంస్థల ఎన్నికలలో పోటీచేసి ప్రజాసంబంధ వ్యవహారాల్లో మరింత చురుకుగా ఎక్కువమంది స్త్రీలు పాల్గొనడం తప్పనిసరి అయింది.

8వ పాఠంలో ఎండుమిర్చి వ్యాపారాన్ని ఇంద్ర స్వయం సహాయక సంఘాలద్వారా తీసుకున్న డబ్బుతో ఏవిధంగా నిర్వహిస్తోందో గుర్తుచేసుకోండి. మండల, గ్రామ స్థాయిలో కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడానికి స్త్రీలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడ్డారు. కుటుంబాలలో ముఖ్యమైన నిర్ణయాలు చేయడంలో భర్తలు, ఇతర పురుషులతో కలిసి వీరు పాలుపంచుకుంటున్నారు. సమాజంలో, గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలు, ఇతర ముఖ్యమైన విషయాలు చర్చించడానికి, వాటిని పరిష్కరించుకోడానికి పరిపాలనా వ్యవహారాలలో పాల్గొనడానికి స్వయం సహాయక సంఘాలద్వారా అవకాశం లభిస్తోంది. ఈ విషయంలో కొన్ని అవాంతరాలు ఎదురైనప్పటికి స్త్రీలు తమకు లభించిన అవకాశాలతో విజయవంతంగా ముందుకు వెళుతున్నారు.

### కీలకపదాలు

| | |
|---|---|
| ఉపాధి | అక్షరాస్యత |
| ఆస్తిహక్కులు | లింగనిష్పత్తి |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. అబ్బాయిలకన్నా అమ్మాయిలు సహజంగానే బలహీనులని అనుకోవడం సరైనదేనా? కారణాలు తెలపండి.
2. మీ ఇంట్లో మీరు, మీ సోదరులు, సోదరీమణులు చేసే పనుల జాబితాను రూపొందించండి.
3. పది మంది మహిళా ఉద్యోగులను వ్యక్తిగతంగా కలిసి వాళ్లు చేసే పని, సంపాదన వివరాలు తెలుసుకోండి.
4. మీ ఇంట్లో పెద్దామె ఉంటే 20 సంవత్సరాల క్రితం బడిలోని ఆమె అనుభవాలను తెలుసుకొని వాటిని మీ అనుభవాలతో పోల్చుకోండి.
5. తల్లిదండ్రుల ఆస్తిలో కూతురుకు సమానమయిన వాటా ఎందుకివ్వటంలేదో చెప్పగలరా?
6. స్త్రీల ఆర్థిక స్వేచ్ఛకు, గౌరవానికి స్వయం సహాయక సంఘాలు ఎలా సహాయం చేస్తాయో, మీ ప్రాంతాలలో ఉన్న స్వయం సహాయక సంఘాలను చూసి చెప్పండి.
7. పేజి నెం. 135లోని ('స్త్రీలు సహజంగానే......చూసుకోవాలని అంటారు') పేరాను చదివి, ఈ కింది ప్రశ్నకు జవాబు రాయండి.

   అబ్బాయిలకన్నా అమ్మాయిలు బలహీనులు అని చెప్పడం సమంజసమేనా? దీనిపై మీ అభిప్రాయాన్ని రాయండి.

### ప్రాజెక్టు

1. మీ పాఠశాల రికార్డుల ప్రకారం ఎంతమంది అమ్మాయిలు 1, 5, 8, 10 తరగతుల్లో ఉన్నారు? అమ్మాయిలకంటే ఎక్కువ మంది అబ్బాయిలే పాఠశాల విద్యను పూర్తిచేయగలుతున్నారనే విషయాన్ని ఈ సమాచారం సమర్థిస్తుందా?
2. ముఖ్యమైన వార్తాపత్రికలు చూసి పురుషులు చేసే వృత్తులలోకి ప్రవేశించి పేరుపొందిన స్త్రీల జీవిత గాథలను, వాళ్ళు ఎదుర్కొన్న సవాళ్ళను, వాటిని అధిగమించిన తీరును చూపిస్తూ ఒక ఆల్బమ్ తయారుచేయండి.
3. మీ గ్రామం/ప్రాంతంలో పిల్లలు చదువు మానేయడం గురించి తల్లిదండ్రులను కలిసి కింది సమాచారాన్ని సేకరించండి.

| వరుస సంఖ్య | విద్యార్థి పేరు | సామాజిక వర్గం SC/ST/BC/OC/మైనారిటీ | ఏ తరగతిలో మానేశాడు | మానేయడానికి గల కారణాలు |
|---|---|---|---|---|
| | | | | |

పై సమాచారం ఆధారంగా ఏఏ వర్గాల ప్రజలు ఎక్కువగా బడిమాని వేస్తున్నారు? ఎందుకు? తరగతి గదిలో చర్చించి, విశ్లేషించండి.



SCERT TELANGANA

పాఠం
# 17
# ప్రాచీనకాలంలో మతం - సమాజం


భారతదేశంలో అనేక మతాలున్నాయి. భారతదేశంలోని ప్రజలు వివిధ రకాలుగా ప్రార్థనలు చేస్తారు. కొందరు తమ ఇష్టదైవానికి పూలు, పండ్లు సమర్పిస్తూ పూజలు చేసి ప్రార్థనలు చేస్తారు. కొందరు యజ్ఞాలు చేస్తారు. కొందరు నిశ్శబ్దంగా దైవాన్ని స్మరిస్తారు. మరికొందరు జంతువులను బలి ఇచ్చి తమభక్తిని ప్రదర్శిస్తారు. ఇంకా కొంతమంది అసలు ప్రార్థనలే చెయ్యరు! ఇప్పుడు ప్రాచీన భారతీయ సమాజానికి చెందిన వివిధ వర్గాల మతవిశ్వాసాలను గురించి తెలుసుకొందాం.

### వేట - ఆహార సేకరణ ఆధారిత సమాజం

పూర్వకాలంలో వేటమీద ఆధారపడిన వాళ్ళ గురించి, ఆహారాన్ని సేకరించే వారి ఇళ్ళను గురించి మీరు చదివారు కదా! వాళ్ళ మత విశ్వాసాలను తెలుసుకోడానికి వాళ్ళ వర్ణచిత్రాలు, మృతులను పూడ్చిపెట్టిన సమాధులు ఉపకరిస్తాయి. ఆహారం కోసం వేటమీదా, సేకరణమీదా ఆధారపడే నేటి చెంచు జాతి వాళ్ళ మతవిశ్వాసాలను అధ్యయనం చేయడం ద్వారా పూర్వకాలంలో వేట-సేకరణ ఆధారిత సమాజం వాళ్ళ మతవిశ్వాసాలను ఊహించవచ్చు.

- వీళ్ళు ఎవరిని, ఎందుకు ప్రార్థించేవారో తెలుసా?

ఈ సమాజంవాళ్ళు అడవులలో నివసించేవారు. అడవులను, అందులోని జంతువులను పవిత్రంగా భావించి వాటిని పూజించేవారు. అవసరమైతే తప్ప జంతువులను వేటాడేవారు కాదు. గుహలలో వాళ్ళు చిత్రించిన అనేక రకాల జంతువుల బొమ్మల ఆధారంగా జంతువులను పూజించేవారని తెలుస్తుంది. వాళ్ళు జంతువుల వేషాలు ధరించి, ముఖాలకు ముసుగులు వేసుకొని సాముహిక నృత్యాలు చేస్తూ ఆరాధించే వారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. వీళ్ళు తమకు మంచి వేట లభించాలని ప్రార్థించేవారు.



*చిత్రం 17.1: ముసుగులు ధరించి నృత్యం చేస్తున్న దృశ్యం. నృత్యకారుని తలపాగా, చేతిదండం, అలంకరణలను గమనించండి.*



*చిత్రం 17.2: భింబెట్కాకు చెందిన అడవి పంది*

SCERT TELANGANA

వీళ్ళ సమాజానికి సంబంధించిన మరికొన్ని ఆసక్తికర మతవిశ్వాసాలను గురించి పురాతత్వ ఆధారాలు వివరిస్తాయి. వేట–సేకరణపై ఆధారపడిన సమాజంవాళ్ళు మృతులతోపాటు కొన్ని వస్తువులను పూడ్చి పెట్టేవారు. మరణం తర్వాత జీవితం ఉందనే నమ్మకం వాళ్ళలో ఉండేది. పూడ్చిపెట్టిన వస్తువులు మృతులకు ఉపకరిస్తాయనే భావన వాళ్ళలో ఉండేది.

శ్రీకాళహస్తి ప్రాంతంలో నివసించిన వేట–సేకరణ ఆధారిత సమాజం వాళ్ళ జీవనశైలిని, మత విశ్వాసాలను గురించి క్రీ.శ. 12వ శతాబ్దంనాటి తమిళ 'పెరియపురాణం' వివరిస్తుంది. ఈ పురాణంలో తెలుగువారికి సుపరిచితుడైన 'భక్త కన్నప్ప' కథ ఉంది. ఈ భక్త కన్నప్ప ఎవరో తెలుసా? ఈయన వేట–సేకరణ ఆధారిత సమాజానికి చెందినవాడు. ఈయన పూజారిగా వ్యవహరిస్తూ మాంసం, తేనె, పూలు, పండ్లు మొదలైనవాటిని మహాశివునికి సమర్పించేవాడని 'పెరియ పురాణం' ద్వారా తెలుస్తోంది.

నల్లమల అరణ్య ప్రాంతంలో నివసించే నేటి చెంచు జాతివారు గారెల మైసమ్మ (లేక) గంగమ్మ అనే తమ ఇష్ట దేవతను నృత్యంద్వారా ఆరాధిస్తూ ఆమెకు ప్రీతికరమైన వస్తువులను భక్తితో సమర్పిస్తారు. వీళ్ళు శ్రీశైలం మల్లికార్జునస్వామిని, అహోబిలం శ్రీ నరసింహ స్వామిని కూడా కొలుస్తారు. ఈ ఇద్దరు దేవుళ్లు తమ జాతి ఆడబిడ్డలను పరిణయం చేసుకొన్నారు కాబట్టి వాళ్ళను తమ అల్లుళ్ళుగా చెంచుజాతి వాళ్ళు భావిస్తారు.



*17.3: చెంచుజాతి వాళ్ళునృత్యం చేసే చిత్రం*

- తొలి రైతులు, పశువుల కాపరుల కాలం నుండి మతంలో ఎలాంటి మార్పులు సంభవించి ఉంటాయని మీరు భావిస్తున్నారు?

## తొలి వ్యవసాయదారులు – పశుపోషకులు

పురాతత్వ పరిశోధనల ఆధారంగా వీళ్ళు 'అమ్మతల్లి' లేదా 'నేలతల్లి'ని ఆరాధించేవారని తెలుస్తుంది. పశువులు, పంటలు సమృద్ధిగా విలసిల్లాలంటే అమ్మతల్లి అనుగ్రహం ఆవశ్యకమని వీళ్ళు భావిస్తారు. అమ్మతల్లిని చిన్న చిన్న రాతి ప్రతిమలు లేదా చెట్ల రూపాలలో పూజిస్తారు.



*చిత్రం 17.4: మెహర్‌నగర్‌లోని కాల్చిన బంకమట్టితో చేసిన అమ్మతల్లి ప్రతిమ (5000 సం॥ల క్రితం)*

దక్కన్ ప్రాంతంలో కనుక్కొన్న 'బూడిద దిబ్బల' వల్ల పూర్వకాలంలోని పశుపోషకులు మంటలను వెలిగించి కొన్ని ఆచారాలను నిర్వహించేవారని అవగతమవుతుంది. ఇటువంటి ఆచారాలే నేటి హెూళి, దీపావళి, సంక్రాంతి పండగ రోజుల్లో మనం చూస్తున్నాం కదా!

SCERT TELANGANA



17.5: రాళ్లమీద చెక్కిన జంతువుల బొమ్మలు, (మస్కి – 4000 సం॥ల క్రితం నాటి చిత్రపటం)



చిత్రం 17.6: 5000 సంవత్సరాల నాటి ఆఫ్ఘనిస్తాన్‌లోని ముండిగాక్‌లో బయల్పడిన కుండపాత్రలు, వాటిపైన ఉన్న రావి ఆకులు

భారతదేశంలో ప్రస్తుతం నివసిస్తున్న పశుపోషకులను వివిధ పేర్లతో పిలుస్తారు. మహారాష్ట్రలో ధంగర్, కర్నాటకలో 'కురుబ', తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లో కురుమ, గొల్ల, యాదవ కులాల వాళ్ళు పశుపోషక సమాజానికి చెందినవారు. వీరు 'మల్లన్న, భీరప్ప'లను కొలుస్తారు. అలాగే కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనివారు 'రేణుకామాత', 'ఎల్లమ్మ', 'మైసమ్మ', 'పోచెమ్మ' మొదలైన పేర్లతో ఉన్న స్త్రీ దేవతలను పూజిస్తారు. తొలి వ్యవసాయదారులు, పశుపోషకులు ఇంచుమించు ఒకే ఆరాధనా పద్ధతులను అవలంభించారు. వీళ్ళు గ్రామంలోని ఒక ప్రదేశంలో చిన్న ఆలయాన్ని నిర్మించి అందులో దేవతను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. ప్రత్యేక పండుగ రోజులలో పొట్టేలు, కోడిపుంజు, మొదలైన వాటిని బలిఇచ్చి వాటి మాంసాన్ని, వండిన ఆహారాన్ని 'ప్రసాదంగా' ఆరగిస్తారు. మంచి పంటలు పండాలని, రోగాల బారినుండి తాము రక్షణ పొందాలని, తమ సంతానానికి సౌఖ్యం కలగాలని తమ ఇష్ట దేవతలను ప్రార్థిస్తారు.

పూర్వకాలం నుండి కొంతమంది రావి, వేప, జమ్మి, మర్రి చెట్లను, తులసి వంటి మొక్కలను పూజిస్తున్నారు. పురావస్తు తవ్వకాలలో రావి ఆకులను చిత్రించిన కుండపాత్రలు బయల్పడడం వల్ల ఆనాటి ప్రజలు వృక్షాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చే వాళ్ళని తెలుస్తుంది.

మరికొంతమంది వ్యవసాయ సమాజంవాళ్ళు ఏనుగులు, పులులు, పాములు, కోతులు మొదలైన వాటిని పూజిస్తారు. ఇటువంటి పూజాపద్ధతులు ప్రాచీన కాలంలోనే ఆరంభమయ్యాయి.

## సింధులోయ నాగరికతనాటి మతం

భారత ఉపఖండంలోని వాయవ్య ప్రాంతంలోని (పశ్చిమోత్తర) సింధునదీ పరివాహక ప్రాంతాలలో సుమారు నాలుగు వేల ఆరువందల సంవత్సరాల క్రితం అనేక నగరాలు విలసిల్లాయి. ఇవి తొమ్మిది వందల ఏండ్లు వర్ధిల్లి ఆ తర్వాత పతనం చెందాయి. దీన్ని హరప్పా సంస్కృతి అనికూడా అంటారు. (హరప్పా – పురావస్తు తవ్వకాలలో మొదట బయల్పడిన ప్రాంతం). ఆ నగరాలలో రకరకాలైన పనివాళ్ళు (కుమ్మరివాళ్ళు, వడ్రంగివాళ్ళు, రాతిని మలిచేవాళ్ళు (శిల్పులు), స్వర్ణకళాకారులు, చేనేత పనివాళ్ళు మొదలయినవాళ్ళు), వర్తకులు, పరిపాలకులు, అధికారగణం మొదలైనవాళ్ళు నివసించేవాళ్ళు. ఇక్కడి శిథిలాలలో స్నానవాటికలు, ధాన్యాగారాలు, గిడ్డంగులు, ప్రజాభవనాలు, రోడ్లు, కాలువలు, సాధారణ ప్రజల ఇండ్లు బయల్పడ్డాయి. అయితే ఇక్కడ పెద్ద దేవాలయం ఒక్కటి కూడా బయల్పడలేదు. అమ్మతల్లి విగ్రహాలు చాలా కనిపించాయి. వీళ్ళు చాలా రకాల చెట్లను, ముఖ్యంగా రావిచెట్టును పవిత్రంగా భావించేవాళ్ళు, కొన్ని జంతువులను కూడా ఆరాధించేవాళ్ళు. పురుష దేవత చిత్రం లభ్యమైంది.

SCERT TELANGANA

- ఈ కింది చిత్రపటాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఇది మీకు తెలిసిన ఏదైనా దేవతను ప్రతిబింబిస్తూ ఉందేమో వివరించండి.



*17. 7: హరప్పాకాలంనాటి పురుష దేవత చిత్రపటం*



*చిత్రం 17. 8: హరప్పాకాలంనాటి అమ్మతల్లి*

ఈ దేవుడు, ఆ తర్వాతి కాలంలో పూజలందుకొన్న శివుణ్ణి పోలిఉన్నాడు. మరికొన్ని ఇతర చిత్రాల ద్వారా సింధుప్రజలు పర్వదినాలలో పతాకాలు కట్టి ఊరేగింపులు జరుపుతూ తమ ఇష్టదైవాల పట్ల భక్తిభావాలను ప్రదర్శించేవాళ్ళని తెలుస్తుంది.

## వేదకాలంలో మతం

వేదాలు, భారత ఉపఖండంలోని మొట్టమొదటి సాహిత్యం. వేదాలు నాలుగు అవి : (1) ఋగ్వేదం (2) యజుర్వేదం (3) సామవేదం (4) అధర్వణవేదం. వీటిలో ఋగ్వేదం అతిప్రాచీనమైనది. దీన్ని 3500 సంవత్సరాల క్రితం సంకలనం చేసి ఉంటారని ఊహ. వేదాలలో దేవతలను కీర్తించే మంత్రాలు, ప్రపంచశాంతి, సంక్షేమం కోసం చేసే ప్రార్థనలు ఉన్నాయి. వీటిని ఋషులు సంకలనం చేశారు.

ఈ మంత్రాలు వివిధ దేవదేవతలను కీర్తిస్తాయి. వీరిలో ముగ్గురు దేవుళ్లు చాలా ముఖ్యమైనవాళ్ళు. వాళ్ళు (1) అగ్ని (2) ఇంద్రుడు (యుద్ధదేవత) (3) సోమలత (ఒక ప్రత్యేక పానీయం చేయడానికి వాడే తీగ మొక్క). ప్రతిపదాన్ని, వాక్యాన్ని సరైన స్వరంతో ఎలా జాగ్రత్తగా ఉచ్చరించాలో, వల్లె వేయించాలో గురువులు విద్యార్థులకు బోధించే వాళ్ళు. చాలా శ్లోకాలను పురుషులు సంకలనం చేశారు, బోధించారు. కొన్నింటిని మాత్రమే స్త్రీలు సంకలనం చేశారు. యజ్ఞాలు, క్రతువులు చేసేటప్పుడు ఈ మంత్రాలను పఠించేవారు. అగ్నికి ఆహుతులు యిచ్చేవారు. ఇప్పుడు ఒక మంత్రానికున్న అర్థాన్ని చదివి వాళ్ళు దేనికోసం ప్రార్థించేవారో తెలుసుకుందాం.

**భగవంతుని కోసం ప్రార్థన**

అసోతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మ అమృతంగమయ
ఓం శాంతి శాంతి శాంతిః

తాత్పర్యము : ఓ భగవంతుడా

నన్ను అజ్ఞానం నుండి జ్ఞానం వైపు
చీకటి నుండి వెలుతురు వైపు
మరణం నుండి ముక్తి వైపు నడుపు
ముల్లోకాలకు శాంతిని ప్రసాదించు.

SCERT TELANGANA

విశ్వామిత్రుడు – నదులు

**విశ్వామిత్రుడు**

ఓ నదులారా! పర్వతాలనుంచి జలజలా కిందికి దిగి రండి. వేగంగా దూసుకొనివెళ్లే అశ్వాలలాగా, తమ లేగదూడలను సున్నితంగా స్పృజించి మెరుస్తున్న గోవులలాగా కిందికి రండి. మీరు ఇంద్రుని శక్తి వల్ల రథాలలాగ సముద్రంవైపు దూసుకొని వెళుతున్నారు. మీలో నిండుగా నీరు ఉంది. మీరు సముద్రంతో సంగమం చెందడానికి ఉవ్విళ్లూరుతున్నారు.

**నదులు :**

నిండుగా నీటితో నిండిన మేము దేవతల మార్గాలలో పయనిస్తాం. ఒకసారి మేము ప్రవహించడం ప్రారంభిస్తే ఇక ఆగం. ఓ మునీశ్వరా! నీవెందుకు మమ్మల్ని ప్రార్థిస్తున్నావు?

**విశ్వామిత్రుడు**

ఓ సోదరీమణులారా! దయ ఉంచి నా మాట వినండి. ఈ గాయకుడు చాలాదూరంనుంచి రథాలు, బండ్లతో వచ్చాడు. మీలోని జలాన్ని మా పాదాలకంటే ఎత్తుగా ప్రవహించ నీయకండి, సురక్షితంగా మమ్మల్ని దాట నివ్వండి.

**నదులు**

మేము నీ ప్రార్థనలు వింటాం. నిన్ను సురక్షితంగా సాగిపోనిస్తాం.

- ఈ శ్లోకాలు ఎవరిని ఉద్దేశించినవి?
- దేవతలకు ఋషులు ఏమి సమర్పించేవారని మీరు భావిస్తున్నారు?
- వాళ్ళు దేనికోసం ప్రార్థన చేస్తున్నారు?
- వాళ్ళు వేట సమాజానికి లేదా పశుపోషక సమాజానికి లేదా గ్రామాలకు, పట్టణాలకు చెందిన ప్రజలని మీరు భావిస్తున్నారా?

ఋగ్వేదంలో పశువులకోసం, సంతానం కోసం, అశ్వాల కోసం, చాలా ప్రార్థనలున్నాయి. వేదాలను అధ్యయనం చేసిన చరిత్రకారుల అభిప్రాయంలో వేదకాలం నాటి ప్రజలు ఆవులను, అశ్వాలు మొదలైనవాటిని పెంచేవారని తెలుస్తోంది. భారతదేశ వాయవ్య భాగంలోని హిందూకుష్ పర్వతశ్రేణులకు, యమునా నదికి మధ్య భాగంలో వీళ్ళు నివసించేవారు.


వేదకాలపు ప్రజలు చిన్న చిన్న జన సముదాయాలుగా లేదా తెగలుగా నివసించేవారు. వీరికొక నాయకుడు ఉండేవాడు. వాళ్ళ తెగలలో పురోహితులుగా బ్రాహ్మణులుండేవారు. వాళ్ళు యజ్ఞాలను చేయించేవారు. మంత్రాలను చదివేవారు. తెగ ప్రజలు, తెగ నాయకుడు వీరికి దక్షిణలిచ్చేవాళ్ళు. ఈ తెగల మధ్య తరచుగా గోవులకోసం, నీటికోసం, పచ్చిక బయళ్ళకోసం పోరాటాలు జరిగేవి. గుర్రాలను రథాలకు కట్టి యుద్ధాలలో ఉపయోగించేవారు.

కొన్ని వందల సంవత్సరాల తర్వాత ఈ తెగలు గంగా–యమునా వంటి నదుల ఒడ్డునున్న గ్రామాలలో స్థిరపడి వరి, గోధుమ వంటి పంటలు పండించారు. ఈ కాలంలో జనపదాలు ఏర్పడి తెగనాయకులు రాజులుగా రూపాంతరం చెందారు. ఈ కాలంలో యజుర్వేదం, అధర్వణవేదంలోని శ్లోకాలు సంకలనం అయ్యాయి. సుదీర్ఘమైన, అధిక ధన వ్యయంతో కూడిన క్రతువులు, అగ్నిబలులు, జంతుబలుల గురించి ఇవి వివరించాయి. ఈ మంత్రాలలో రాజులు తమ తెగవారిమీద ఆధిపత్యం, మంచి పంటలు, యుద్ధాలలో విజయం కోసం ప్రార్థించేవారు.

ఇదే కాలంలో విభిన్న వృత్తులు చేయడానికి సమాజం వర్ణాలుగా విభజించబడాలనే భావన వృద్ధిచెందడాన్ని మనం గమనించవచ్చు. బ్రాహ్మణులు అత్యున్నతమైన వారిగా పరిగణించబడ్డారు. వారు యజ్ఞాలను చేయడం, వేదాలను వల్లించడం, జరిగింది. వారి తరువాత వారు క్షత్రియులు. వీరు రాజ్యాన్ని పాలించే వారిగా, ప్రజలను రక్షించేవారిగా పరిగణింపబడ్డారు. వైశ్యులు పశుపోషకులుగా, భూమిని సాగుచేసేవారిగా ఉంటూ బ్రాహ్మణులకు మరియు క్షత్రియులకు బహుమతులు మరియు కప్పమును కట్టెడివారు. చివరగా వేదకాలము తర్వాత శూద్రులు

SCERT TELANGANA

పటం-1 వేదకాలంలో ప్రజలు స్థిరపడిన ప్రాంతాలను చూపే పటం.




విభిన్న వర్గాలుగా ఉద్భవించారు. వారు నాల్గవ వర్ణంగా ఉంటూ వ్యవసాయం, వడ్రంగం, కమ్మరి మొదలయిన వివిధ వృత్తులను చేసేవారు. అదే సమయంలో స్త్రీ, పురుషుల మధ్య అని విభజన కూడా చోటుచేసుకొంది.

## చనిపోయిన పూర్వీకుల ఆరాధన - దక్కనులోని రాక్షసగుళ్లు

పెద్ద పెద్ద బండరాళ్లతో నిర్మించిన వాటిని 'రాక్షసగుళ్లు' అంటారు. వీటిని ప్రజలు ఒక క్రమపద్ధతిలో పేర్చి సమాధులను నిర్మించేవారు. ఈ రాక్షసగుళ్లను నిర్మించే పద్ధతి సుమారు మూడు వేల సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. ఈ పద్ధతి దక్కన్ ప్రాంతంలోను, దక్షిణ భారతదేశంలోను, ఈశాన్య భారతదేశంలోను, కాశ్మీర్‌లోనూ ఉండేది.

ఈ రాక్షసగుళ్లలో కొన్నింటిని నేల పై భాగంలోను, మరికొన్నింటిని భూమిలోను చూడవచ్చు. వృత్తాకారంలో వున్న కొన్ని బండరాళ్లు లేదా నిటారుగా నిలబడి ఉన్న ఒకే పెద్ద బండరాయిని కూడా పురాతత్వ శాస్త్రవేత్తలు కనుక్కొన్నారు. వీటి కింది భాగంలో సమాధి ఉందనడానికి ఈ రాయి సూచన. ఈ రాక్షసగుళ్లలో కొన్నింటిలో ఒకటి కంటే ఎక్కువ అస్థిపంజరాలు బయల్పడ్డాయి. దీనిని బట్టి ఒక కుటుంబంవారిని ఒకేచోట పూడ్చి పెట్టేవారని తెలుస్తోంది.

ఈ సమాధులన్నింటిలోను ఒకే రకమైన లక్షణాలు గోచరిస్తాయి. సాధారణంగా మృతులతోబాటు నలుపు, ఎరుపు రంగులు కలిగిన కుండలను పూడ్చి పెట్టేవారు. వీటితోపాటు పనిముట్లు, ఇనుముతో తయారుచేసిన ఆయుధ పరికరాలు, గుర్రాల అస్థి పంజరాలు, గుర్రాలకు సంబంధించిన పరికరాలు, రాళ్లతో,

SCERT TELANGANA

బంగారంతో తయారుచేసిన ఆభరణాలు కూడా ఇందులో లభించాయి.

ఉపఖండ ప్రాంతంలో ప్రజలు ఎక్కువగా ఇనుప పరికరాలు వాడేవారని తెలుస్తోంది. ఇంతే కాకుండా వరిని పండించే వారని, చెరువు సాగు నిర్వహించే వారని కనుక్కొన్నారు. చనిపోయిన పూర్వీకులను పూజించడం అత్యంత ప్రాధాన్యమైనదిగా భావిస్తూ వీళ్ళు రాక్షసగుళ్లను నిర్మించారు.

- చనిపోయిన పూర్వీకులను మీ కుటుంబ సభ్యులు పూజిస్తారా లేదా శ్రద్ధాభక్తులను కనబరుస్తారా? మీ పూర్వీకులను (ఆడ, మగ) ఎలా పూజిస్తారో మీ తరగతి వాళ్ళతో చెప్పండి.







## మెగాలిథిక్స్ – తెలంగాణ (బృహత్ శిలాయుగం)

కొండ ప్రాంతాలలో, పంట పొలాలలో మరియు చెరువులలో అధిక సంఖ్యలో మెగాలిథిక్ కాలం నాటి సమాధులు బయల్పడినాయి. దాదాపు తెలంగాణలోని అన్ని జిల్లాలలో బృహత్ శిలాయుగం కాలంనాటి కట్టడాలైన మెన్‌హిర్స్ (పొడవైన రాళ్ళు), గుండ్రని బండరాళ్ళు, శిలలతో చిన్న గదిలాగా నిర్మించిన సమాధులు బయల్పడినాయి. ఈ క్రింది చిత్రాలు పరిశీలించండి.




ఈ మెగాలిథిక్ సమాధులలోనలుపు, ఎరుపు రంగులతో కూడిన అనేక రకాలైన పెద్ద కుండలు వాటితో పాటు నల్లని నునుపైన ఇనుప వస్తువులు బయటపడ్డాయి. చనిపోయిన వారి అవశేషాలు వుంచిన రాతిపెట్టెలు లేదా మట్టిపెట్టెలు (సర్కోఫగి), చితాభస్మాన్ని పెట్టిన కుండలు కొన్ని సమాధులలో కనుగొన్నారు.




*చిత్రం 17.9: ఎ) టెర్రకోట మట్టితో తయారుచేయబడిన సర్కోఫగి, ఏలేశ్వరం, నల్గొండ బి) మెన్‌హిర్స్, దేవునిగుట్ట, వరంగల్ సి) మెగాలిథిక్ కాలంనాటి డోల్‌మెన్ (చిన్న గదిలాంటి సమాధి నిర్మాణం), పొతనపల్లి, మహబూబ్‌నగర్ డి) గుండ్రటి రాళ్ళు, రేపుని గ్రామం, వరంగల్*

SCERT TELANGANA

## జనపదాలు – నగరాల కాలం నాటి కొత్త ప్రశ్నలు

మీరు గంగానదీ ప్రాంతంలోని జనపదాలు, మహాజనపదాలు, నగరాల గురించి చదివారు కదా! ఈ ప్రదేశాలలో అనేక రకాలైన ప్రజలు నివసించేవారు. వాళ్ళలో వేటగాళ్లు, పశుపోషకులు, పనివాళ్ళు, పేద ప్రజలు స్థిరనివాసాలు ఏర్పరచుకొని తమ అభిప్రాయాలను ఒకరికొకరు తెలుపుకోవడం వల్ల ఒకరి మతవిశ్వాసాలు మరొకరికి తెలిసి వాటిని ఆచరించారు. ఈవిధంగా ఒక మిశ్రమ సంస్కృతికి నాంది ఏర్పడి ప్రజలు వేదకర్మలు చెయ్యడం, అగ్నికార్యం చేయడం, సూర్యుడు, నదులు, అమ్మతల్లి, కోతి, ఏనుగు, సర్పాలు, చెట్లు వంటివాటిని పూజించడం ప్రారంభించారు. చనిపోయిన తమ పూర్వీకులను కూడా వీళ్ళు పూజించనారంభించారు. మనుషులు చనిపోయిన తర్వాత కూడా ఆత్మలు బతికి ఉంటాయని వాళ్ళ నమ్మకం. అయితే ప్రజలు కేవలం మతకర్మలను ఆచరించడంతోనే సంతృప్తి చెందక కొత్త ప్రశ్నలను లేవనెత్తారు. ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించడానికి బయలుదేరారు. ఈ అన్వేషణల్లో పాల్గొన్నవాళ్ళ గురించి తెలుసుకొంటారా?

## మరణం తర్వాత ఏం జరుగుతుంది?

బాగా ప్రాచుర్యం పొందిన ఒక బాలుని కథ ఉంది. ఆ బాలుడు ఎవరో తెలుసా? నచికేతుడు. ఇతని కథను మీరు బహుశా వినే ఉంటారు. ఒకసారి నచికేతుని మనసులో ఒక ప్రశ్న ఉదయించింది. మరణం తర్వాత ఏం జరుగుతుంది? మరణ దేవత యముడు కాబట్టి యముడే ఈ ప్రశ్నకు చక్కగా సమాధానం చెప్పగలడని తలచి వెంటనే యముని దగ్గరకు వెళ్ళాడు. తన జ్ఞానసాధనలో నచికేతునికి యముడంటే కూడా భయం కలగలేదు. నేరుగా యముని దగ్గరకు వెళ్ళి మరణం తర్వాత ఏమి సంభవిస్తుంది అని ప్రశ్నించాడు.

యముడు ఈ క్లిష్టమైన ప్రశ్నకు సమాధానాన్ని దాటవేయడానికి ప్రయత్నించాడు. ఈ ప్రశ్నను ఉపసంహరించుకుంటే బంగారు, వెండి, గోవులను వరాలుగా ఇస్తానని నచికేతునితో యముడు అన్నాడు. అయితే యముడు సమాధానం చెప్పేంతవరకు నచికేతుడు తన పట్టును విడవలేదు.

నచికేతుని పట్టుదల , తృష్ణ చూసిన యముడికి ముచ్చట వేసింది. సరే చెబుతా విను. మీ మానవులు గుడ్డివాళ్లని అనుసరించి గుడ్డివాళ్లలాగా, అన్నీ భౌతిక సుఖాలలోనే ఉన్నాయను భ్రమలో ఉంటారు. తమ కోరికలను చంపుకోలేక, పునరావృతమవుతున్న ఆ కోరికలను పూర్తిగా తీర్చకోనూలేక మళ్లీ మళ్లీ భూలోకంలో జన్మిస్తూనే ఉంటారు. నిజానికి ఈ లోకంలో శాశ్వతమైనది ఒక్క ఆత్మ ఒక్కటే! దానిని అశాశ్వతమైన వాటితో ఎలా పొందగలరు?... అంటూ ఆత్మతత్వం గురించి సుదీర్ఘంగా వివరిస్తాడు యమధర్మరాజు, ఆ మాటలకు సంతృప్తి చేందిన నచికేతుడు తన ఇంటికి సంతోంగా తిరుగుముఖం పడతాడు. ఈ కథ 'కఠోపనిషత్తు' లో ఉంది.

- మరణం తర్వాత ఏం జరుగుతుందని అనుకొంటున్నారు? తరగతిలో దీన్ని గురించి చర్చించండి.

## నాశనం లేనిది ఏది?

పూర్వకాలంలో చాలామంది ప్రజలు అడవులలోని ఆశ్రమాలలో నివసించేవారు. వీళ్ళు ధ్యానం చేస్తూ



చిత్రం 17.10: ఆశ్రమంలో శిష్యులకు గురువు బోధిస్తున్న దృశ్యం

SCERT TELANGANA

ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించేవారు. సందర్శకులతో వాద-సంవాదాలు జరిపేవారు, చర్చించేవారు. భావాలను పంచుకునేవారు. ఈ ఆశ్రమాల్లో నివసించేవాళ్ళని ఋషులు లేదా మునులు అంటారు. చాలామంది రాజులు కూడా యిటువంటి ఆలోచనలే కలిగి వుండేవారు. ఋషులు, రాజుల ఆలోచనలు, అభిప్రాయాలను 'ఉపనిషత్తులు' అనే గ్రంథాల ద్వారా చదవవచ్చు. యాజ్ఞవల్క్యుడు, ఉద్దాలక ఆరుణి చాలా ప్రసిద్ధి చెందిన ఋషులు.

ఈ ఋషులు వినాశనంలేని, చావులేని, దుఃఖంలేని విషయాలను గురించి అన్వేషించారు. వినాశనం లేని దానికి 'ఆత్మ' లేక 'బ్రహ్మము' అని పేరు పెట్టారు. 'ఆత్మ'ను లేదా 'బ్రహ్మము' తెలుసుకొంటే అమరత్వాన్ని పొందగలమని వారు తలచారు. 'ఆత్మ'ను అర్థం చేసుకోడానికి తపస్సు చేయాలని వాళ్ళు బోధించారు.

- ఆత్మ, తపస్సు అనే వాటిని గురించి మీకు తెలిసిన దాన్ని మీ తరగతివాళ్ళకి తెలియజేయండి.

**పరివ్రాజకులు**

సత్యాన్వేషకులకు స్థిరనివాసం ఉండదు. వీళ్ళు అన్వేషణలో ఇంటిని వదిలి ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి, ఒక అరణ్యం నుంచి మరొక అరణ్యానికి తిరుగుతూ ఉంటారు. అందుకే వీరిని 'పరివ్రాజకులు' అన్నారు. వీరిని 'భిక్షువులు' (తిరిగేవాళ్ళు) అని కూడా అంటారు. ఇటువంటి పరివ్రాజకులలో వర్ధమాన మహావీరుడు, గౌతమబుద్ధుడు, మక్కలిగోశాల, అజిత కేశకంబలి చాలా గొప్పవారు.



*చిత్రం 17.11: సారనాథ్‌లోని గౌతమ బుద్ధుడు*

**పుట్టుక - చావు అనే చక్రబంధంనుంచి విమోచనం ఎలా? - వర్ధమాన మహావీరుడు**

వర్ధమాన మహావీరుడు ఒక గణసంఘంలో జన్మించాడు. 30 సంవత్సరాల వయస్సులో ఇంటిని వదిలి పరివ్రాజకుడు అయ్యాడు. 'పుట్టుక - చావు అనే చక్రబంధం నుంచి విమోచనం ఎలా?' అనే ప్రశ్నకు సమాధానంకోసం అన్వేషించాడు. పన్నెండున్నర సంవత్సరాల ధ్యానం - తపస్సు ఫలితంగా మహావీరుడు జినుడు (కోరికలను జయించినవాడు) అయ్యాడు.

ఇతరులకు దుఃఖాన్ని కలుగజేస్తే మన పాపాలు పెరుగుతాయని మహావీరుడు బోధించాడు. చిన్న ప్రాణికి కూడా హింస తలపెట్టకూడదని చెప్పాడు. పాపాలనుంచి విముక్తి పొందడానికి సాధారణ జీవితం గడుపుతూ శరీరాన్ని కఠోరశ్రమకు గురిచేయాలని ఉద్బోధించాడు. ఈవిధంగా చేస్తే పాపవిముక్తులు కాగలరని ఆయన చెప్పాడు.

మహావీరుడు తన బోధనలను వ్యాప్తిచేస్తూ విస్తృతంగా పర్యటించాడు. చాలామంది అతని బోధనలకు ఆకర్షితులయ్యారు. ఈ విధంగా జైనమతం ప్రాచుర్యంలోకి వచ్చింది.

**ప్రపంచమంతా ఎందుకు దుఃఖమయంగా ఉంది? దుఃఖాన్ని జయించడం ఎలా? - గౌతమ బుద్ధుడు**

మహావీరునిలాగ సిద్ధార్థుడు కూడా ఒక గణసంఘంలో జన్మించాడు. ఆయన ప్రజలలో దుఃఖాన్ని గమనించాడు. 'దుఃఖాన్ని పోగొట్టుకోవడం ఎలా?' అని ఆలోచించసాగాడు.

ఒకరోజున ఇంటిని, భార్యను, కొడుకును వదిలి తన ప్రశ్నకు సమాధానాన్ని వెతుక్కొంటూ పరివ్రాజకుడుగా మారి బయలుదేరాడు. ఆరు సంవత్సరాల ధ్యానం - తపస్సుల ఫలితంగా అతడు బుద్ధుడు అయ్యాడు.

SCERT TELANGANA

గౌతమ బుద్ధుని అభిప్రాయమేమిటంటే దుఃఖానికి కారణం కోరికలు. కోరికలను అదుపులో ఉంచితే దుఃఖం నుంచి విముక్తి లభిస్తుంది అని చెప్పాడు. కోరికలను అదుపులో ఉంచడానికి నియమితమైన సమతులిత జీవితాన్ని గడపాలని, ఎవరినీ బాధించ కూడదని బోధించాడు. అమితమైన ప్రాయిశ్చిత్తాలకు, సంతోషాలకు బదులుగా బుద్ధుడు చూపిన మార్గమే మధ్యేమార్గం. బౌద్ధమతం దీనినే గొప్ప మధ్యేమార్గంగా పిలిచింది. ఈ బుద్ధుని బోధనలే బౌద్ధమతంగా వ్యాప్తి పొందాయి.

బుద్ధుని, అతని అనుయాయుల బోధనలను 'త్రిపీటకాలు' అనే పేరుతో సంకలనం చేశారు. అవి సుత్త, అభిధమ్మ, వినయ అనే మూడు త్రిపీటకాలు.

- నచికేతునికి ఉదయించిన ప్రశ్న ఏది?
- ఋషులు దేన్ని కోరుకునేవారు?
- ఇతర ప్రాణులను బాధ పెట్టకూడదని మహావీరుడు ఎందుకు ప్రబోధించాడు?
- దుఃఖాన్ని పోగొట్టుకోడానికి బుద్ధుడు ప్రవచించిన మార్గమేది?
- అనేకమంది సాధువులు సంచార జీవనం చేయటం చూసే ఉంటారు. వీళ్ళు దేన్ని ప్రబోధిస్తారు? ఏం చేస్తారు? తరగతిలో చర్చించండి.

## కీలకపదాలు

| | | |
|---|---|---|
| గణసంఘం | మంత్రం | త్రిపీటకాలు |
| బూడిద దిబ్బలు | యజ్ఞం | తపస్సు |
| అమ్మతల్లి | రాక్షసగుళ్లు | మధ్యేమార్గం |
| మృణ్మయపాత్రలు | పరివ్రాజకుడు | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. ఈ కింది సమాజాల మత విశ్వాసాలను కొన్నింటిని పట్టికలో రాయండి.

| వేట – ఆహార సేకరణ ఆధారిత సమాజం | ప్రస్తుత సమాజం |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |

SCERT TELANGANA

**2. బౌద్ధ, జైన మతాలలోని కొన్ని సారూప్యాలను రాయండి.**

## చర్చించి రాయండి

3. ప్రకృతికి మనం ఎలా అభినందనలు తెలపవచ్చు?
4. మనలో కొంతమంది జంతువులను బాధ పెట్టడం, హింసించడం చూస్తూ ఉంటాం. దీని మీద మీ అభిప్రాయం ఏమిటి? ప్రాణులను హింసించే హక్కు మనకుందా?
5. నాటి ప్రజలు చనిపోయిన తమ పూర్వీకులను ఎందుకు పూజించారు? పూడ్చిపెట్టిన చోట పెద్ద బండరాళ్ళను ఎందుకు పెట్టారు?
6. రాక్షస గుళ్ళు గల ప్రాంతాలను భారతదేశ పటంలో గుర్తించి వాటికి రంగు వేయండి.
7. మీ ప్రాంతంలో వివిధ మతాచారాలు ఎలా పాటిస్తున్నారో తెలపండి.
8. పేజి నెం. 150 లోని 'నాశనం లేనిది ఏది' అనే అంశాన్ని చదివి, వ్యాఖ్యానించండి.

## ప్రాజెక్టు

1. వివిధ ప్రార్థనాపద్ధతుల బొమ్మలు సేకరించి ఒక చిన్న పుస్తకం తయారు చేయండి. దాన్ని మీ పాఠశాల గ్రంథాలయంలో భద్రపరచండి.
2. మీ ప్రాంతంలోని వివిధ ఆరాధనా స్థలాలను దర్శించండి. అక్కడి మత గురువులతో ఇష్టాగోష్ఠి నిర్వహించండి. ఈ కింది ప్రశ్నలను అడిగి వారు ఇచ్చిన సమాధానాలతో ఒక నివేదిక తయారు చేయండి.

   అ) ప్రజలు ఇక్కడికి ఎందుకు వస్తారు?

   ఆ) వారు ఎలా ప్రార్థనలు చేస్తారు?

   ఇ) మీ అభిప్రాయంలో మోక్షం అంటే ఏమిటి?

   ఈ) ఈ రకమైన ఆరాధన మానవాళికి అవసరమేనా? ఎలా?

SCERT TELANGANA

పాఠం

18

# దేవునియందు ప్రేమ, భక్తి

*కిందటి అధ్యాయంలో మనం మన ఉపఖండంలోని ప్రాచీన కాలపు ప్రజల నమ్మకాలు, సాంప్రదాయాలు, కర్మకాండల గురించి తెలుసుకొన్నాం. మౌర్యుల కాలంలోను, ఆ తర్వాత కాలంలోను ఉపఖండంలోని వివిధ ప్రాంతాలలో నివసించిన ప్రజల మతపరమైన ఆచారాలలో చాలా మార్పులు వేగంగా చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో వర్తకులు వేట, వ్యవసాయ సమాజాలతో సంబంధాలు ఏర్పరచుకున్నారు. ఆనాటి రాజులు వారందరినీ నియంత్రించడానికి ప్రయత్నించారు. అదేకాలంలో బ్రాహ్మణులు వేదప్రమాణాన్ని అంగీకరించేవారు, అనుసరించేవారు. బౌద్ధులు, జైన శ్రమణులు దేశమంతటా వ్యాప్తిచెంది సమాజంతో సంబంధాలను ఏర్పరచుకున్నారు.*

SCERT TELANGANA

బ్రాహ్మణులు వివిధ ప్రాంతాలలో ఆశ్రమాలను నెలకొల్పి, యజ్ఞాలు వంటి క్రతువులను, మత సంబంధమైన చర్చలను నిర్వహించేవారు. అలాగే శ్రమణులు కూడా విహారాలను, స్థూపాలను స్థాపించి, బౌద్ధ- జైన బోధనలను కొనసాగించారు. ఆ సమయంలో బ్రాహ్మణులు, శ్రమణులు కూడా వాళ్ళతో సంబంధమున్న ప్రజల మతపరమైన అంశాలలో చాలా వాటిని అనుసరించారు. బ్రాహ్మణులు, బౌద్ధులు, జైనులు మాతృదేవతలను, పాములను, చెట్లను, మరణించిన పూర్వీకులను ఆరాధించేవారు. అందువల్ల వాటి చిత్రపటాలను, శిల్పాలను కూడా భగవంతుని రూపాలుగా ఆరాధించారు. చాలామంది అహింసా పద్ధతిని నమ్ముతూ, జంతుబలులను తిరస్కరించి నప్పటికీ, క్రమంగా మిశ్రమ మతాచారాలను, నమ్మకాలను అనుసరించడం మొదలుపెట్టారు.

- మీ ఇళ్లలో ఆచరించే మత సాంప్రదాయాలు, ఆచారాలను గురించి చర్చించండి.

**హిందూమతం:**

నేడు ప్రపంచంలోనే పెద్ద మతాలలో హిందూ మతం ఒకటి. ఇది మన చుట్టూ ఆవరించి ఉన్న సహజ ప్రపంచంలోని ప్రజలందరూ ఒకరితో ఒకరు, వారి మధ్య శాంతియుత సహ జీవనం కొనసాగాలనే సూత్రమును పునరుద్ఘాటిస్తుంది. "సర్వేజనా సుఖినోభవంతు", "లోకాసమస్తా సుఖినోభవంతు" అనే సూత్రాలను హిందువులు విశ్వసిస్తారు. హిందూ మతం ఒక జీవన విధానాన్ని ఆచరిస్తుంది. కాని ఎటువంటి ఖచ్చితమైన నమ్మకాలు లేదా నియమావళులు అంటూ ఏమీ లేవు. అయినప్పటికీ చాలా మంది హిందువులు వేదాల యొక్క అధికారాన్ని అంగీకరిస్తారు. ఇది వేద కాలం నుండి వేల సంవత్సరాలుగా మనకు ఈనాటికి పరిణామం చెందుతూనే ఉన్నది. కాలానుగుణంగా ఎందరో ఋషుల మరియు తాత్వికుల బోధనలను ఇముడ్చుకుంది. వాస్తవంగా సా.శ. 1000 తర్వాతనే హిందూ మతం వాడుకలోకి వచ్చింది. అంతకుముందు ఎక్కువ మందికి హిందువులు వేద లేదా వైధికుల యొక్క అనుచరులు అని తెలుసు.

సా.శ. 500 సంవత్సరాలకు పూర్వమే హిందూమతంలోని కొన్ని ముఖ్య లక్షణాలు రూపుదిద్దుకున్నాయి. వీటిలో వైదికయజ్ఞాలు చేయడం, శివుడు, విష్ణువు, దుర్గ వంటి దేవతలను పూజించడం,



*చిత్రం 18.1: విదిశ (మధ్యప్రదేశ్)లోని సా.శ. 400 నాటి శివలింగం*

దేవాలయాలు నిర్మించడం, తపస్సు ద్వారా మోక్షాన్ని పొందడం వంటివి ముఖ్యమైనవి. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం (భగవద్గీతతో కలిపి), పురాణాలు పవిత్ర గ్రంథాలుగా పరిగణించబడ్డాయి.

## భాగవతులు, శైవులు:

భాగవతులు విష్ణువు లేదా నారాయణుణ్ణి ఆరాధించేవారు. వారు విష్ణువునే 'పరమాత్మ' అనీ, విశ్వాన్ని సృష్టించినవాడనీ, అతిశక్తివంతుడనీ, అన్ని తెలిసినవాడనీ విశ్వసిస్తారు. ఈ ప్రపంచాన్ని దుర్మార్గంనుంచి రక్షించడానికి విష్ణువు భూమి మీద అనేక రూపాలలో అవతరించాడని నమ్మారు. ఇలాంటి అవతారాలలో రాముడు, కృష్ణుడు రూపాలు ముఖ్యమైనవి. దాదాపు 2000 సంవత్సరాలకు పూర్వమే ఈ అవతారాలు మన దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రాముఖ్యం పొందాయి.

బౌద్ధులు, జైనులు, తత్వవేత్తలు 'మోక్షం పొందటానికి భగవంతుడి ఆరాధనయే మార్గం' అనే భావనకు ప్రాధాన్యం ఇవ్వలేదని మనకు తెలుసు. వీళ్ళు పశ్చాత్తాపం ద్వారా పవిత్రులుగా మారటం, కోరికలను నియంత్రించటం, ధ్యానం చేయటం అనే భావనలను సమర్థించారు. కానీ విష్ణువును పూజించటం, భక్తితో ఆరాధించటం ద్వారా మాత్రమే మనం సమస్యలనుంచి బయటపడి మోక్షాన్ని పొందగలమని 'భాగవతుల' నమ్మకం. యజ్ఞాలు చేయటం, బ్రాహ్మణులకు దానాలివ్వటం, వేదాలను వల్లె వేయటం అవసరం లేదని వారు భావించారు. అనేక దేవాలయాలను నిర్మించి, అందులో తమ దేవుడైన శ్రీకృష్ణుణ్ణి ప్రతిష్ఠించి ఆరాధించారు. మధ్యప్రదేశ్‌లోని విదిశలో 2000 సంవత్సరాల క్రితం నిర్మించిన ఇలాంటి దేవాలయాల శిథిలాలను పురావస్తు శాస్త్రవేత్తలు కనుక్కొన్నారు.



*చిత్రం 18.2: బలరాముడు, కృష్ణుల ఊహా చిత్రాల పురాతన నాణేలు (సుమారు 2200 సంవత్సరాల క్రితానికి చెందినవి). బలరాముడు నాగలి, ముసలములు ధరించగా; కృష్ణుడు చక్రము, శంఖము, ఖడ్గములను ధరించినాడు.*

ఆ కాలంలోనే మరి కొంతమంది ఇదే తరహాలో శివున్ని ఆరాధించేవారు. వారు శివలింగాలను ప్రతిష్ఠించి చిన్న చిన్న ఆలయాలను నిర్మించారు. కొందరు ఇదే విధంగా దుర్గాదేవిని ఆరాధించారు.

శివుణ్ణి, విష్ణువును, దుర్గాదేవిని ప్రధాన దైవాలుగా పూజించినప్పటికీ, బౌద్ధులు, జైనులు కూడా బుద్ధుణ్ణి, తీర్థంకరులను (జైన మతగురువులు) అదేవిధంగా ఆరాధించటం మొదలుపెట్టారు. వారు బుద్ధుణ్ణి, తీర్థంకరుల అందమైన విగ్రహాలను తయారుచేసి పూజించేవారు. వీటిని ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, తెలంగాణాలోని నేలకొండపల్లి, ఫణిగిరి మొదలైన ప్రాంతాలలో చూడవచ్చు.

- భాగవతులకు, శైవులకు, బౌద్ధులకు మధ్య ఏమైనా పోలికలున్నాయా?
- దేవాలయాలలో దేవుళ్ళను పూజించటం మీరు చూసే ఉంటారు. అక్కడ ఏం జరుగుతుందో మీరు వివరించగలరా? మీకు తెలిసిన విషయాలను తరగతి గదిలో చర్చించండి.

## కథకులు

పెద్దలు చెప్పే కథలు వినడం, కథకులు చెప్పే మత సంబంధమైన కథలు వినడం, తోలుబొమ్మలాటలు లాంటి ప్రదర్శనలు చూడటం అంటే మీకు ఇష్టం ఉండే ఉంటుంది.

- మీరు చూసిన ఏదైనా ఒక ప్రదర్శనను గురించి తరగతిలో వివరించండి.
- మీరు ఆలయాలలో చెప్పే కథలను వినడానికి ఎప్పుడైనా వెళ్ళారా? అయితే దాన్ని గురించి వివరించండి.

ప్రాచీన కాలపు ప్రజలకు కథలమీద చాలా ఆసక్తి ఉండేది. ఆరోజుల్లో కవులు, కథకులూ పురాణాలను, రామాయణ, మహాభారతాల్లోని వృత్తాంతాలను, శివుడు, విష్ణువు, దుర్గ మొదలైన దేవతల వృత్తాంతాలను చెప్పేవారు. కొన్ని బుద్ధునికి సంబంధించిన కథలు కూడా ఉండేవి. ప్రజలు వాటిని వినడానికి పెద్ద సంఖ్యలో గుమిగూడే వారు. ఈ కథలు చెప్పేవారు తమ పూర్వీకుల దగ్గరినుంచి నేర్చుకొన్న కథలే కాకుండా, ప్రజల అనుభవాలనుంచి కొత్త కథలను నేర్చుకొనేవారు. ఒకవేళ కొంతమంది సర్పాలను పూజిస్తూ, వాళ్ళకేమైనా నాగదేవతల కథలు తెలిసి ఉంటే కథకులు వాటిని కూడా తెలుసుకొని, ఆ కథలను వాళ్ళకి తెలిసిన పాత కథలతో జోడించేవారు. ఈ విధంగా కథకులు దేవుళ్ళు, దేవతల వృత్తాంతాలు, మతపరమైన బోధనలు, పూజించే పద్ధతులు మొదలైన విషయాలను కలగలిపి కథలు చెప్పేవారు. క్రమంగా వీటన్నిటినీ రాయడం మొదలు పెట్టారు. బుద్ధుని కథలను 'జాతక కథలు' గాను, శివుని లేదా విష్ణువు కథలను 'పురాణాలు' అనే పేరుతోను రాశారు.

ఈ పురాణాలు వివిధ మత సంప్రదాయాలను కలుపుకొన్నప్పటికీ, అత్యంత శక్తిమంతుడైన అన్నీ తెలిసినటువంటి ఒక దేవుణ్ణి 'పరమాత్మ'గా స్తుతించేవారు. సమస్యల పరిష్కారానికి, మోక్షాన్ని పొందటానికి దేవుణ్ణి ఆరాధించడమే సులభమైన మార్గమని వారు చెప్పారు.

## భగవంతుడి పట్ల ప్రేమ – భక్తి ఉద్యమం

సా.శ. 550 లో తమిళనాడులో భగవంతుడిమీద భక్తి గురించిన ఒక ఉద్యమం మొదలైంది. వారు శివుడు, విష్ణువుల ఆరాధకులు. యజ్ఞాలు, జంతుబలులు వంటి ఆచారాలమీద వాళ్ళకి నమ్మకం లేదు. దేవుడిమీద నమ్మకం లేని మతాలైన బౌద్ధ, జైన మతాలను కూడా వారు బాగా వ్యతిరేకించారు. వీటికి ప్రత్యామ్నాయంగా శివుణ్ణో లేదా విష్ణువునో నమ్మి దేవునిలో ఐక్యం కావడం ఒక్కటే మార్గమని వారు భావించారు. తమ సమస్యల పరిష్కారం కోసం గాని, ధనంకోసం గాని, అధికారం కోసం గాని వారు దేవుణ్ణి ప్రార్థించలేదు. దేవుని సాన్నిధ్యాన్ని పొందటమే వాళ్ళ ధ్యేయం. అంతేగాక కుల, మత భేదాలు లేకుండా ఎవరైనా దేవుని సేవించవచ్చునని నమ్మారు. భక్తులంతా కలసి భగవంతుని ప్రేమకోసం సంతోషంతో పాడుతూ, నృత్యాలు చేసేవారు.

కొందరు భక్తులు వివిధ దేవాలయాలను దర్శించి ఆ దేవుడిని స్తుతిస్తూ స్థానిక భాషలలో (తెలుగులోను, తమిళంలోను, మరికొన్ని భాషలలో) పాటలు రాశారు. ఈ పాటలను తరతరాలుగా పాడుతూ వచ్చారు. వాటిని సా.శ. 1100లో గ్రంథస్థం చేశారు. ఫలితంగా ఆయా దేవాలయాలకు అధిక ప్రాధాన్యం వచ్చింది. తిరుమల, శ్రీకాళహస్తి దేవాలయాలు వాటిలో ముఖ్యమైనవి. ఈ భక్తులతో ప్రభావితమైన ప్రజలు క్రమంగా శివుడు లేదా విష్ణువును ఆరాధించసాగారు.

SCERT TELANGANA

- ఆదిమానవుల మతవిశ్వాసాలకు మరియు వేట–ఆహార సేకరణ దశ, భక్తి ఉద్యమమునాటి మానవులకు, విశ్వాసాలకు పోలికలు తెలపండి.
- భక్తి ఉద్యమం, వేదకాలం నాటి ప్రజల మత విశ్వాసాలను పోల్చండి.

## ఆళ్వార్లు – నయనార్లు

12 మంది ప్రధానమైన విష్ణుభక్తులను ఆళ్వార్లు అంటారు. పెరియాళ్వారు, నమ్మాళ్వారు వాళ్ళలో ముఖ్యులు. పెరియాళ్వారు కుమార్తె అయిన ఆండాళ్ ఆళ్వార్లలోని ఒకే ఒక మహిళ. వీరిలో చాలామంది అనేక వైష్ణవాలయాలను సందర్శించి పద్యమాలికలను అల్లి విష్ణువును స్తుతిస్తూ పాడారు. వాటినే 'పాశురాలు' అంటారు. నమ్మాళ్వారు పాడిన పాటలు కొన్ని దిగువన ఉన్నాయి. వీటిని చదివి అర్థం చేసుకోండి.

**సృష్టి**

తండ్రివి నీవే ఓ పరమాత్మా (విష్ణు),
తండ్రివి నీవే
అగ్ని, నీరు, ఆకాశం నీ సృష్టేనయ్యా
దివారాత్ర కారకులౌ సూర్యచంద్రులు
పర్వతాలు, సముద్రాలు, వర్షపాతాలు
ఓ శ్రీహరీ, నీ సంకల్పాలయ్యా!

ఈ పద్యంలో నమ్మాళ్వారు విష్ణువును ఈ ప్రపంచ సృష్టికర్తగాను, తన తండ్రిగాను చెప్పాడు. ఎంతో గొప్ప వాడైన భగవంతుడు ఒక తండ్రి బిడ్డకెంత సన్నిహితంగా ఉంటాడో, అంత సన్నిహితంగా ఉంటాడంటారు.

నమ్మాళ్వార్లు ఇంకా ఎన్నో ఇతర పద్యాలలో, శ్లోకాలలో సర్వోత్తమంగా ప్రతి చోట మానవులకు కనిపించని పరమాత్మను దృష్టిని కోరుకుంటారు.

నాయనార్లు దాదాపు 63 మంది ఉన్నారు. వీరంతా శివభక్తులే. వీళ్ళు వివిధ కులాలలో పుట్టినవారు. వీరిలో కన్నప్పలాంటి వేటగాళ్లు, నందనర్, పుల్లయ్య లాంటి నిమ్న కులాలవారు ఉన్నారు. అప్పర్, మణిక్కవాచకర్ లాంటి వారు ఒక ఆలయం నుంచి మరొక ఆలయానికి వెళ్లి అక్కడ శివుణ్ణి గురించి కీర్తనలు పాడేవారు. వీరిలో కరైక్కాలమ్మ, అమ్మయ్యార్ అనే ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. నాయనార్లు కూర్చిన కొన్ని పద్యాలు:

భయంలేదు మాకు ఏ రాజైనా
భయంలేదెప్పుడు మృత్యువెదురైనా
భయంలేదు నరకలోక బాధలకైనా
భయమన్నది లేదు ఏ ఒత్తిళ్ళకైనా
మాకురావు ఏ రుగ్మతలు
మాకు లేవు ఏ భయాలు
బాధలేని, భయంలేని
మేము నిత్య సంతోషులం
మేమెవ్వరికీ కాదు దాసులం

**–అప్పార్**

పై పద్యంలో శివభక్తులు ఏ రాజుకూ, చావుకూ, రుగ్మతలకూ (రోగాలకు), నరకానికీ కూడా భయపడరు, వారెప్పుడూ నిత్య సంతోషులేనని అప్పార్ చెబుతాడు.

ఈ పద్యంలో అప్పార్ తమకు అశాశ్వతమైన ప్రాపంచిక సౌఖ్యాలు, సకల సంపదలు లెక్క లేదంటాడు. పేదలైనా, రోగులైనా, దళితజాతి వారైనా, శైవభక్తులైతే చాలు వాళ్ళపట్ల తమకు అపార గౌరవ మర్యాదలంటాడు.

పరమశివా, నిను భజియింతును,
నాకు ముక్తినిమ్మని
లేత మొక్కన దిగిన ముల్లువోలె
సముద్రాన తేలియాడు అలలవోలె
నీపై నా భక్తి ఓలలాడె పరవశమై

SCERT TELANGANA

నన్నీ ప్రపంచం పిచ్చివాడన్నా
లోకులు నన్ను చూసి పరిహసించినా
నేనెన్నడూ సిగ్గుపడను
అన్నీ భూషణాలుగా భావిస్తా
**– మాణిక్యవాచకర్**

ఈ పద్యంలో మాణిక్యవాచకర్ శివుని ధ్యానంలో తాను పొందే ఆనందాన్ని గురించి, ఇతరులు దాన్ని అర్థం చేసుకోలేకపోవటం గురించి తెలిపాడు.

## క్రైస్తవ మతం

భక్తితో, ప్రేమతో ఒకే దేవుణ్ణి ఆరాధించడం వల్లనే సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మిన భారత దేశ ఉపఖండంలోని ప్రజల లాగానే ప్రపంచంలోని ఇతర దేశాలలో కూడా ఇలాంటి ఆలోచనలే ప్రారంభమయ్యాయి. తూర్పు మధ్య ప్రాంతంలోని ఇజ్రాయెల్, పాలస్తీనాలలో క్రైస్తవం అనే ఒక కొత్త మతం అభివృద్ధి చెందింది.



*చిత్రం 18.3: సెయింట్ థామస్ బాసిలికా చర్చి, చెన్నై, దీనిని 1523 లో నిర్మించారు. 2000 సం॥ల క్రితం భారతదేశానికి వచ్చిన సెంట్ థామస్ పేరు మీద దీన్ని నిర్మించారు.*

క్రైస్తవ మతం ఏసుక్రీస్తు పేరుమీద స్థాపించబడింది. దాదాపు 2000 సంవత్సరాల క్రితం ప్రస్తుత ఇజ్రాయెల్ లోని జెరుసలేమ్‌కి దగ్గరలోగల బెత్లెహామ్‌లో ఏసుక్రీస్తు జన్మించాడు. ప్రజలంతా సమానమని ఏసుక్రీస్తు బోధించాడు. ఒకరిపట్ల మరొకరు ప్రేమతో మెలగాలన్నాడు. శాంతి, ప్రేమ, కరుణల ప్రాముఖ్యాన్ని చాటి చెప్పాడు. ఆయన "దెబ్బకు దెబ్బ" వంటి పద్ధతులు అనుసరించకూడదన్నాడు. మనం శత్రువునైనా ప్రేమతోనే గెలవగలమని నమ్మాడు.

'బైబిలు' క్రైస్తవుల పవిత్ర గ్రంథం. అందులో క్రీస్తు బోధనలు ఉన్నాయి. ఆయన చేసిన ప్రముఖ బోధన అయిన 'పర్వతం మీది ప్రసంగం (సెరిమన్ ఆన్ ద మౌంట్)'లోని కొన్ని వాక్యాలు కింద ఉన్నాయి.

- ఆత్మవిషయమై దీనులైన వారు ధన్యులు, పరలోక రాజ్యం వాళ్ళది.
- సాత్వికులు ధన్యులు, వారు భూలోకానికి వారసులు.
- కనికరం గలవారు ధన్యులు, వారు కనికరం పొందుతారు.
- హృదయశుద్ధి గలవారు ధన్యులు, వారు దేవుణ్ణి చూస్తారు.
- సమాధాన పరిచేవారు ధన్యులు, వారు దేవుని కుమారులు అనబడతారు.
- నీతినిమిత్తం హింసను భరించేవారు ధన్యులు, పరలోకరాజ్యం వాళ్ళది.
- మీరు పరలోకంలో ఉన్న మీ తండ్రికి కుమారులై ఉండేందుకు మీ శత్రువులను ప్రేమించండి.

ఆనాటి పాలకులు అతణ్ణి నిర్బంధించి, కఠినంగా శిక్షించారు.

SCERT TELANGANA

సెయింట్ థామస్ ఏసుక్రీస్తు శిష్యుడు. రోమను వర్తకులతో కలసి భారత దేశానికి ఏసు బోధనలను తీసుకొని వచ్చాడు. ఈయన క్రైస్తవ మతాన్ని దక్షిణ భారత దేశంలో ప్రచారం చేశాడు.

- చర్చిలో దేవుని స్తుతించే విధానం చూశారా? ఆ విధానం గురించి వివరించండి.

## ఇస్లాం మతం


భారతదేశంలో అప్పర్, తదితరులు దేవుడొక్కడే అనే భావనను వ్యాప్తి చేసిన కాలంలోనే 'అరేబియా'లో ఒక కొత్త మతం రూపుదిద్దుకుంది. ఆ కొత్తమతమే మహ్మద్ ప్రవక్త స్థాపించిన 'ఇస్లాం'.

మహ్మద్ ప్రవక్త అరేబియాలోని మక్కాలో సా.శ. 570లో జన్మించాడు. ఈయన దేవుడొక్కడేనని, మానవులంతా భగవంతుని సృష్టి అని బోధించాడు. తల్లిదండ్రుల దృష్టిలో పిల్లలంతా సమానమైనట్లే, దేవుడి దృష్టిలో కూడా మానవులంతా ఒక్కటే అన్నాడు. దేవునికి లేదా అల్లాకు రూపం లేదన్నాడు. కాబట్టి విగ్రహాలను పూజించటం సరికాదన్నాడు. మానవులంతా అన్నదమ్ముల్లా మెలగాలని చెప్పాడు. మానవజాతికి ప్రేమ ప్రాధాన్యాన్ని గురించి ఆయన వివరించాడు.

మహమ్మదును 'అల్లా దూత'గా పరిగణిస్తారు. అల్లా బోధనలు 'ఖురాన్'లో ఉన్నాయని ముస్లింలు అంటారు. 'ఖురాన్' ఇస్లాం పవిత్ర గ్రంథం. ఖురాన్‌లోని కొన్ని వాక్యాల అనువాదం దిగువన ఉన్నది.

### అల్‌ఫతిహ

*అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన సకల లోకాలకు ప్రభువు. అనంత కరుణామయుడు. అపార కృపాశీలుడు. మేము నిన్నే ఆరాధిస్తాం. సహాయంకోసం నిన్నే అర్థిస్తాం. మాకు రుజుమార్గం చూపించు – నువ్వు అనుగ్రహించిన వారూ, నీ ఆగ్రహానికి గురికానివారూ, మార్గభ్రష్టులు కానివారూ అనుసరించిన మార్గం వైపు మమ్ము నడిపించు.*



*చిత్రం 18.4: కేరళలోని చెరమాన్ మసీదు భారతదేశంలోని మొట్టమొదటగా నిర్మింపబడిన మసీదుగా నమ్ముతారు*

SCERT TELANGANA

భారతదేశంలోని ఓడరేవులను సందర్శించిన అరబ్ వర్తకుల ద్వారా ఇస్లాం మతం భారతదేశానికి రావడం జరిగింది. ఇస్లాంలోకి మారిన అరబ్, తుర్కిష్ విజేతల ద్వారా కూడా వచ్చింది. ఇస్లామిక్ పండితులు, ఋషులు, సన్యాసులు, వర్తకులు, రాజులతో పాటు వచ్చి భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డారు. వారు పరమాత్ముడే (Supreme God) ఏకైక దేవుడని, వారి ముందు మానవులంతా సమానమని ఆరాధించేవారు. వీరు సింహాసనం గురించి బోధించారు.

- మసీదులో ప్రార్థనా విధానం మీరు చూశారా? దాని గురించి వివరించండి.

## భగవంతునిపై విశ్వాసం

మీరు హిందువులలోను, క్రైస్తవులలోను, ముస్లిములలోను ఏమైనా ఒకే రకమైన ఆలోచనలను గమనించారా! వీరంతా భగవంతుణ్ణి నమ్ముతారు, పూజిస్తారు. వీరంతా తమ డబ్బు, చదువు, అంతస్తులతో సంబంధం లేకుండా భగవంతుణ్ణి గౌరవిస్తారు. సమానత్వాన్ని, ప్రేమను నమ్ముతారు. ఇలాంటి ఆలోచనలు కొద్ది కాలంలోనే చాలామంది ప్రజలలో కలిగాయి. రాజులు, పాలకులు కూడా వీటిని బాగా నమ్మారు. మతాలను ప్రోత్సహించారు. ప్రజలు పూజించడానికి ఎన్నో దేవాలయాలు, చర్చిలు, మసీదులు నిర్మించారు.

ఆకాలంలో ఇలాంటి కొత్త ఆలోచనలు రావడానికి, ప్రజల్లో బాగా ప్రాచుర్యం పొందడానికి గల కారణాలను తెలుసుకోడానికి చరిత్రకారులు ప్రయత్నించారు. చిన్న రాజ్యాలు, తెగలు పెద్ద రాజ్యాలతో కలిసిపోవడం వల్ల, వాళ్ళవాళ్ళ తెగలు, కులాలు, చిన్న రాజ్యాల దేవుళ్ళకు బదులుగా అందరికీ ఒక్కడే దేవుడు కలిగి ఉండాలన్న ఆలోచన ప్రజలకు కలిగిందని చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. రాజులు, చక్రవర్తులు కూడా ఇటువంటి ఆలోచనలను ప్రోత్సహించటమే కాకుండా తాము భగవంతుని ప్రతినిధులమని తెలియజెప్పటానికి ప్రయత్నించారు. తద్వారా వారు ప్రజల ఆమోదాన్ని పొందాలని ప్రయత్నించారు.

పేద–ధనిక, అధికార – అనధికార వర్గాల మధ్య విభేదాలు పెరిగాయి. చాలామంది ప్రజలు ఈ అసమానతలను, పేద, బలహీనవర్గాల అణచివేతను చూసి చాలా బాధపడ్డారని చరిత్రకారుల నమ్మకం. ఒకే దేవుణ్ణి పూజించటం ద్వారా ప్రజలలో ఒకే ఆచార వ్యవహారాలను, సంస్కృతిని పెంపొందించే ప్రయత్నాలు జరిగి ఉండవచ్చు. తమ సమస్యలను దేవుడు పరిష్కరిస్తాడని ప్రజలు నమ్మారు.

అదే సమయంలో చాలామంది ప్రజలు ఇలాంటి కొత్త ఆలోచనలను అంగీకరించకుండా, తమ పాత మత విధానాలనే అనుసరించసాగారు. కొందరు అసలు దేవుడు ఉన్నాడనే భావననే నమ్మడం లేదు.

**కీలకపదాలు**

శిల్పాలు

అవతారాలు

మోక్షం

జాతక కథలు

SCERT TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. ఒక బౌద్ధ సన్యాసికి, వేటగాడికీ మధ్యన సంభాషణ జరిగిందనుకుంటే, ఒకరినుంచి మరొకరు ఏం తెలుసుకొంటారు? సంభాషణను ఊహించి రాయండి.
2. వైదిక మతానికి, భాగవతులకు మధ్యన గల పోలికలు, భేదాలు తెలపండి.
3. భాగవత, శైవ మతాల ఆలోచనలు బౌద్ధ, జైన మతాలకు ఏవిధంగా భిన్నమైనవి?
4. మన దేశంలో వివిధ మతాల ఆచారాలను ఒక్కటిగా చేయటంలో పురాణాలు ఏవిధంగా దోహదపడ్డాయి? చర్చించండి.
5. భాగవత మతానికి, తమిళనాడులోని భక్తుల నమ్మకాలకు మధ్య గల ప్రధాన భేదాలను గుర్తించండి.
6. మానవులంతా సమానమని మొహమ్మద్ ప్రవక్త ఏవిధంగా వివరించారు?
7. పేజి నెం. 160 లోని 'భగవంతునిపై విశ్వాసం' అనే పేరాను చదివి, వ్యాఖ్యానించండి.
8. ఈ మధ్యకాలంలో మీ ప్రాంతంలో జరిగిన మతపరమైన ఒక కార్యక్రమం గురించి వ్యాఖ్యానించండి.
9. ప్రపంచ పటంలో ఈ క్రింది వాటిని గుర్తించండి?

   అ. జెరూసలేం　　ఆ. మక్కా　　ఇ. కేరళ రాష్ట్రం

   ఈ. చెన్నై　　ఉ. అమరావతి

SCERT TELANGANA

పాఠం

19

# భాష, లిపి, గొప్ప గ్రంథాలు

దీపిక తను ఊరువెళ్ళడానికి షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌కెళ్ళింది. రైల్వే సమాచారాన్ని అనేక భాషలలో చెప్పడాన్ని విని ఆశ్చర్యపడింది. అలాగే షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో 'షాద్‌నగర్' అనే పేరును మూడు భాషలలో రాసి ఉండడాన్ని గమనించింది. ఎందుకు ఇన్ని భాషలు, రాతలు అని ఆశ్చర్యపోయింది!




*చిత్రం 19.1: షాద్‌నగర్‌లోని రైల్వే బోర్డు*

## భాష అంటే ఏమిటి?

కుక్కలు మొరగడం, పక్షులు అరవడంలాంటివి మీరు వినే ఉంటారు. కానీ ఈ భూ ప్రపంచంలో భాషను మాట్లాడేది ఒక్క మనుషులు మాత్రమే. మనుషులు తమ నోటితో ఏ జంతువులు, పక్షులు చేయలేని అనేక శబ్దాలను చేయగలరు. ఇలా శబ్దాలను చేయగలిగే శక్తి మనం మాట్లాడడానికి, భాషను అభివృద్ధి చేసుకోడానికీ దోహదపడింది.

- పక్షుల, జంతువుల శబ్దాలను అనుకరించండి. వర్షం పడుతున్న శబ్దాన్ని అనుకరించండి. లేదా కారు, ట్రక్కు చేసే శబ్దాన్ని చేయండి. ఇలా మనం ఎన్ని రకాల శబ్దాలను చేయగలమో చూడండి.

భాష అనేది మానవ జీవితంతో ఎంతగా ముడిపడి పోయిందంటే అసలు దాన్ని గురించి మరిచిపోలేమని చెప్పవచ్చు. మనం భాష ద్వారానే ఆలోచించి అర్థం చేసుకోగలుతున్నాం. ఒకరితో ఒకరం భాష ద్వారానే మాట్లాడుకోగలుగుతున్నాం. ఇతరుల నుంచి నేర్చుకునేది భాష ద్వారానే. ఆటలకీ భాషను ఉపయోగిస్తాం. ఇలా అనేక పనులు భాష ద్వారానే జరుగుతున్నాయి.

1) మన పనులన్నీ క్రమపద్ధతిలో, ప్రణాళికాబద్ధంగా చేసుకోడానికి కూడా మనం భాషనే ఉపయోగిస్తున్నాం. మనం చేస్తున్న పనులను గురించి మనం మాట్లాడుకునేది భాష ద్వారానే కదా.

2) ఇతరుల దృష్టిని మన వైపు తిప్పుకోడానికి లేదా ఇతరుల ద్వారా పనులు సాధించుకోడానికి భాష అవసరం.

ఉదా: ఆ పక్షి వైపు చూడు.

అమ్మా! నాకు ఆ బొమ్మ కొనిపెట్టవా?

ఆగు! కదలవద్దు.

ఇలా అనేక మాటలను మాట్లాడుతుంటాం.

3) కొత్త విషయాలను సృష్టించడానికి/ కనిపెట్టడానికి లేదా సరదాగా నవ్వించడానికి భాష అవసరం – హాస్యభరిత వాక్యాలు, పదాలు, పద్యాలు నవ్వడానికి, పది మందిని నవ్వించడానికి భాషను వాడతాం.

SCERT TELANGANA

4) మనం భాష ద్వారా బాహ్య ప్రపంచాన్ని అర్థం చేసుకోడమే కాకుండా అనేక విషయాలను ఊహించుకోగలుగుతున్నాం. అసలు భాష లేకుండా ఉంటే ఎలా ఉండేదో ఊహించగలమా? మనం ఏదైనా విషయాన్ని గురించి పరిశోధన చేసి కారణాలను తెలుసుకుంటున్నాం. భాష లేకపోతే మనం ఇవన్నీ చేయలేం.

5) మన భావాలను, అనుభవాలను ఇతరులతో పంచుకోడానికి మనం భాషను ఉపయోగిస్తాం. ఆదిమానవుల కాలంలో చెట్టునిండా పండిన పండ్లను చూసి దూరంగా ఉన్న తన వాళ్ళతో భాష ఉపయోగించకుండా ఎలా చెప్పి ఉంటుందో ఊహించండి. ఒక వేళ మీకే దెబ్బ తగిలి నొప్పి పుడితే భాష లేకుండా తల్లిదండ్రులకు ఎలా చెపుతారు?

ఈ విధంగా మనకు భాష ఎన్ని రకాలుగా తోడ్పడుతోందో ఆలోచించండి. అలాగే భాష మనకు ఎలా దోహదపడుతుందో పరిశీలించండి. జీవ రాశులన్నింటిలో మనుషులకు మాత్రమే భాష మాట్లాడే శక్తి ఉంది. అడవుల్లో ఆహారం సంపాదించే నాటినుండి మానవుడు భాషను ఉపయోగిస్తూనే ఉన్నాడు. తరతరాలుగా పెద్దలు తమ పిల్లలకు సమాచారాన్ని అందించడానికి భాష తోడ్పడుతూనే ఉంది. మునుపటి తరం వాళ్ళ అనుభవాలను ఈ తరంవారు తమ అనుభవాలతో జోడించుకుంటూ పోతున్నారు. ఈవిధంగా భాష గతించిన కాలాల వాళ్ళని ఈ కాలం వాళ్ళతో, అలాగే సుదూర ప్రాంతాలలోని వాళ్ళని దగ్గరగా చేయడానికి దోహద పడుతోంది. ఎంతో వింతగా ఉందికదూ!

## అనేక భాషలు ఎందుకున్నాయి?

సహజీవనం చేసే ప్రజల మధ్య భాష అభివృద్ధి చెందింది. వారు దాహాన్ని తీర్చే సహజ పానీయాన్ని 'వాటర్' అని పిలిచారు. ఇలాగే దూరప్రాంతాలలో నివసించే మరికొంత మంది దీనిని 'నీళ్ళు' అని చెప్పుకొని ఉంటారు. ఇంకొంతమంది దీన్ని 'తణ్ణి' అని పిలిచారు. ఇక్కడ పదార్థం ఒక్కటే కానీ పిలిచే విధానాలు, శబ్దాలలో తేడాలు ఉన్నాయి. అంతే. ఇదే విధంగా ప్రపంచంలోని ప్రజలంతా గుంపులుగా విడిపోయి దూర ప్రాంతాలకు వలసపోయి వివిధ భాషలను ఏర్పాటు చేసుకుని ఉంటారు. ఉదా: ఆంగ్లం, సంస్కృతం, పార్సీ, చైనీస్, హిందీ, తెలుగు వగైరా.

ఒకే భాష మాట్లాడే వాళ్ళలో కొందరు దూర ప్రాంతాలకు పోయి నివాసాలను ఏర్పరుచుకొన్నప్పుడు, క్రమక్రమంగా వాళ్ళ భాషలో మార్పులు వస్తాయి. ఎక్కడికీ పోకుండా ఉన్నచోటనే ఉన్నవాళ్ళ భాషలో కూడా కొన్ని మార్పులు వస్తాయి. ఈ మార్పుల వల్ల ఒక ప్రాంతంవాళ్ళ భాష మరొక ప్రాంతంవాళ్ళకు తెలియకుండాపోయినప్పుడు అవి స్వతంత్ర భాషలవుతాయి. తెలుగు, తమిళం వంటివి ఒకే మూల ద్రావిడభాష నుంచి వచ్చాయి. ఇలా మూలద్రావిడ భాషనుండి ఏర్పడినవే తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, గోండు భాషలు. ఇవన్నీ ద్రావిడ భాషా కుటుంబంలోనివి. భారతదేశంలోని మరొక భాషా కుటుంబాన్ని 'ఇండో ఆర్యన్ భాష కుటుంబం' అని అంటారు. సంస్కృతం, హిందీ, మరాఠీ, బెంగాలీ మొదలయినవి ఈ భాషా కుటుంబంలోనివి. మరికొన్ని భాషా కుటుంబాల గురించి మీ పై తరగతుల్లో తెలుసుకుంటారు.

ప్రజలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళి స్థిరపడుతుండడంతో వాళ్ళ వాళ్ళ భాషలు కూడా సమ్మిళితమైపోయి అనేక పదాలు ఒక భాష నుంచి మరొక భాషలోకి చేరుతుంటాయి. ఈ రోజు తెలుగు భాషలో కూడా అనేక ఇతర భాషల పదాలు వచ్చి చేరిపోయాయి. ఉదా: సంస్కృతం, మరాఠీ, అరబ్బీ (అరబిక్), పార్సీ (పర్షియన్) పదాలు తెలుగులోకి చేరిపోయాయి.

## లిపి, రచనలు

మనం భాషను లిపిద్వారా చదువుతాం, రాస్తాం. మనం అనేక రకాల లిపులు వాడుతున్నాం. రోమన్ లిపి (ABCDEF), దేవనాగరి లిపి *(अ, आ, इ, ई)*, అరబిక్ లిపి, తెలుగు లిపి, తమిళ లిపి మొదలైనవి. వాస్తవానికి మనం ఏ భాషనైనా ఏ లిపిలోనైనా

SCERT TELANGANA

రాయవచ్చు. ఉదా : హైదరాబాద్ అనే పదాన్ని రోమన్, దేవనాగరి, తెలుగు, తమిళం, అరబిక్‌లాంటి ఏ భాషలో అయినా రాయవచ్చు.

నిజానికి మనం కూడా వివిధ కొత్త లిపులను తయారు చేయవచ్చు. మీకు కూడా ఇలా మీ సొంత రహస్య లిపిని తయారు చేయాలని ఉందా? చేసి చూడండి. తమాషాగా ఉంటుంది.

చూడడానికి సులభంగా, తమాషాగా అనిపించినా నేడు మనం ఉపయోగిస్తున్న లిపులను కనుక్కోవడానికి వేల సంవత్సరాలు పట్టింది.

మొదట్లో అక్షరాల బదులు బొమ్మలను ఉపయోగించి రాసేవారు. ఒక మేక పరుగెత్తుతోంది అని చెప్పడానికి మేక బొమ్మ వేసి పక్కన పరుగెత్తుతున్న కాళ్ళ బొమ్మని వేసేవారు. ఇలా నిదానంగా నేటి భాషలు అభివృద్ధి చెందాయి. నాలుగు వేల సంవత్సరాల క్రితం సింధూలోయ ప్రజలు ఇలా బొమ్మల లిపినే వాడారు. కానీ మనకి ఇంతవరకూ వాటిని చదవడం తెలియలేదు.

| | |
|---|---|
| मेरा नाम रघु है। | Hindi |
| నా పేరు రఘు | Telugu |
| ראַגהו דיא נאָמען ןיימ | Yiddish |
| میرا نام رگھو | Urdu |
| jina langu ni raghu | Swahili |
| **Mi Nombre es Raghu** | Spanish |

చిత్రం 19.2: వివిధ భాషల లిపులు



చిత్రం 19.3: సింధు ప్రజల బొమ్మల లిపి

ఇప్పుడు భారతదేశంలో వాడుతున్న అనేక లిపులకు మూలం అశోకుడు ఉపయోగించిన బ్రాహ్మీ లిపి అని చెప్పవచ్చు (దేవనాగరి, తెలుగు, తమిళం వంటి భారతీయ భాషలన్నిటికీ మూలలిపి). పురాతన శిలాశాసనాలలో ఒకటి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలోని భట్టిప్రోలు స్థూపంలో ఉంది. ఇది సుమారు క్రీ. పూ. 200 సంవత్సరాల నాటికి చెందినది.



చిత్రం 19.4: భట్టిప్రోలు శిలాశాసనం

- అట్టమీద లేదా కార్డ్‌బోర్డ్ మీద మీ పేరును మీకు తెలిసిన లిపులలో రాసి తరగతి గదిలో ప్రదర్శించండి.
- తెలుగులో మూడు పదాలను ఎంచుకొని వాటిని కనీసం మూడు ఇతర భాషలలోకి తర్జుమా చేయండి. దీనికోసం తెలుగు లిపిని ఉపయోగించి ఇతర భాషలలో రాయవచ్చు.
  ఉదా: తెలుగు – అమ్మ, తమిళం – తాయ్, ఆంగ్లం – మదర్, సంస్కృతం – మాతృ, పర్షియా –మదర్, మరాఠీ – ఆయి, హిందీ – మా.
- ఈ కింది వారు లిపిని ఏవిధంగా ఉపయోగించి ఉంటారో ఆలోచించండి. వీరిలో ఎవరికి ఎక్కువగా లిపి అవసరమై ఉంటుందో ఊహించండి.
  రాజులు, చక్రవర్తులు, వ్యాపారస్తులు
  బ్రాహ్మణ పురోహితులు
  బౌద్ధ గురువులు
  కవులు, చేతివృత్తుల వారు, స్త్రీ, పురుష
  కూలీలు, సైనికులు

SCERT TELANGANA

## దేనిమీద రాసేవారు?

మొదట్లో గుడ్డమీద, ఆకులమీద, చెట్లబెరడు మీద రాసేవారు. అయితే ఇవి కాలక్రమేణా పాడైపోయేవి. కొంతమంది కుండలమీద గీస్తూ రాసేవారు. కొన్ని కుండలు నేటికి లభ్యమవుతున్నాయి. అయితే అశోకుని కాలంలో రచించిన శిలశాసనాలు మాత్రం నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

దక్షిణ భారతదేశంలో అనేక ప్రాంతాలలో తాటి ఆకులను ఒకే కొలతలతో కత్తిరించి దానిమీద ఘంటంతో రాసేవారు. నల్లరంగు సిరా పూసేవారు. ఉత్తర భారత దేశంలో హిమాలయాలలో పెరిగే భూర్జపత్రాలనే చెట్ల బెరడు పొరలను కాగితంలాగ ఉపయోగించి రాసేవారు. అప్పట్లో కాగితం వాడుకలో లేదు.

## పద్యాలు, పాటలు, కథలు

మీరు అనేక పద్యాలు, పాటలు, సామెతలు, కథలు మీ తల్లిదండ్రుల ద్వారా, తాత, అవ్వల ద్వారా వినే ఉంటారు. ఇవన్నీ వాస్తవంగా చేతితో రాసి పెట్టినవి కావు. నోటి మాటలతో నిలిచి ఉన్నవి. ఒక తరం నుంచి మరొక తరానికి చేరుతూ మౌఖికంగా నిలిచి ఉన్నవి. ఇలాంటి వాటిని మౌఖిక సాహిత్యం అంటారని మీ తల్లిదండ్రులు చెప్పి ఉంటారు. అంటే ఒకరి నుండి మరొకరికి ముఖతః (నోటిమాట) అందినవి. మొట్టమొదటి సాహిత్యం ఇవి. మన పూర్వీకులు కూడా ఇలా పాటలు, పద్యాలు, కథలు అల్లి తమ పిల్లలకు చెప్పేవారు. అలాగే ప్రపంచ జ్ఞానాన్ని చిన్న చిన్న సామెతలు, మాటల ద్వారా పిల్లలకు నేర్పేవారు.

- కనీసం మూడు కథలు, మూడు పాటలు, పది నీతివాక్యాలు/ సామెతలను మీ పెద్దల నుంచి సేకరించి చార్టు మీద రాసి తరగతిగదిలో ప్రదర్శించండి.
- సొంతంగా చిన్న చిన్న కథలను రాసి చిన్న చేతి పుస్తకాన్ని తయారు చేయండి.

## వేదాలు

వేదాలు కూడా మొదట్లో మౌఖిక రూపంలోనే బోధించారు. 3000 సంవత్సరాల కాలంపాటు వాటిని మరిచిపోకుండా అలా కాపాడారు. తరవాత వీటిని లిఖితం చేశారు.

ఈ విశ్వం ఎలా ప్రారంభమైందో ఋగ్వేదంలో ఆసక్తికరమైన మంత్రం ఉంది. దానిని చదవండి.

> "ఎవరు ఖచ్చితంగా చెప్పగలరు ఈ విశ్వం ఎలా ఆవిర్భవించిందో? దేని నుంచి సృష్టి అయిందో? దేవుళ్ళు విశ్వం ఆవిర్భవించిన తరవాతే ప్రత్యక్ష మైనారు. దేనిలోంచి ఈవిశ్వం ఆవిర్భవించిందో ఎవరికి తెలుసు? ఈ సృష్టి ఎక్కడి నుంచి వచ్చింది? అసలు భగవంతుడు సృష్టించిందేనా? కాదా? ఈ జగత్తుకు నిర్వాహకుడు సమున్నత స్వర్గంలో ఉంటాడు. ఆయన ఒక్కడికే తెలిసి ఉండాలి లేదా ఆయనకీ తెలిసి ఉండకపోవచ్చు."
>
> **– నాసదీయ సూక్త, ఋగ్వేదం**

- ఈ జగత్తు ఎలా మొదలైందోనని మీరు ఆశ్చర్యపోయి ఉంటారు కదూ! పై మంత్రం ద్వారా సృష్టికి ముందు జగత్తు ఎలా ఉండేదని ఊహించారు?
- ఈ సృష్టి ప్రారంభానికి, సృష్టి ఎలా ప్రారంభమైందో అనే సమస్యమీద మీ ఆలోచనలు ఏమిటో రాయండి.

## గొప్ప ఇతిహాసాలు–రామాయణం, మహాభారతం

గొప్పవ్యక్తులు చేసిన పనులను ఇతిహాసాలు తెలుపుతాయి. అవి మంచి – చెడులకు, ధర్మం–అధర్మానికి మధ్య కలిగే సంఘర్షణలను వివరిస్తాయి. ప్రతి దేశానికీ తనదైన ఇతిహాసం ఉంటుంది. భారతదేశానికి రెండు ముఖ్యమైన ఇతిహాసాలు ఉన్నాయి. అవి రామాయణం, మహాభారతం. సీతారాముల చరిత్రను, రామ రావణ యుద్ధాన్ని వర్ణించి చెప్పేది రామాయణం. రామాయణ కావ్యం ఆదర్శపురుషుడు, ఆదర్శ పుత్రుడు, ఆదర్శ

SCERT TELANGANA

భార్య, ఆదర్శ సోదరుడు, ఆదర్శ పరిపాలకుడు గురించి వివరిస్తుంది. వాల్మీకి మహర్షి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని 'ఆదికావ్యం'గా పరిగణిస్తారు. మొదట్లో ఈ కథలను కథకులు పాడుతూ ప్రచారం చేసేవారు. క్రమంగా ఈ కథలన్నిటిని గ్రంథస్థం చేశారు.

మహాభారతం విభిన్న మనస్తత్వాలు కలిగిన దాయాదుల మధ్య ఏర్పడిన సంఘర్షణను వివరిస్తుంది. కౌరవ, పాండవుల మధ్య ఏర్పడిన ఘర్షణ మహాభారత సంగ్రామంతో ముగిసింది. ఆ సంగ్రామంలో శ్రీ కృష్ణుని సహాయంతో పాండవులు కౌరవులపై విజయాన్ని సాధించారు. ఈ మహాభారతం వివిధ రకాల వ్యక్తుల గురించి, నైతిక సందిగ్ధతల గురించి, వాటి పరిష్కారం గురించి తెలుపుతుంది. ప్రపంచంలోకెల్లా ఎక్కువ శ్లోకాలు కలిగిన, వందలకొద్ది చిన్న చిన్న కథలు కలిగిన కావ్యంగా మహాభారతాన్ని చెప్పవచ్చు. భారతాన్ని కూడా మొదట్లో వీధిభాగవతులు చెప్పేవారు. మహాభారతాన్ని వ్యాస మహర్షి సంస్కృతంలో రచించాడు. మొదట్లో దాన్ని గానం చేసేవారు. తరువాతే గ్రంథస్థం అయింది.

ఈ ఇతిహాసాలు ఎప్పుడో రూపొందించినప్పటికీ గ్రంథస్థ రూపం దాల్చింది మాత్రం సుమారు 1600 సంవత్సరాల క్రితమని చరిత్రకారులు భావిస్తున్నారు.

### జాతక కథలు

మీరు ఇంతకు ముందు పాఠాలలో గౌతమబుద్ధుని గురించి చదివియున్నారు కదా! గౌతమబుద్ధుడు ధర్మాన్ని ప్రవచించడానికిగాను చాలా జన్మలు ఎత్తినట్లుగా విశ్వసిస్తారు. ఈ జన్మల గూర్చి అనేక కథలు కూర్చారు. అవే జాతక కథలు. ఇవి చదువరులకు ఆనందాన్ని కలిగిస్తాయి. వీటిని మీరు చదువుటకు ఇష్టపడతారు. 1600 – 1800 సంవత్సరాల క్రితం వీటిని సంకలనం చేశారని భావిస్తున్నారు. ఈ కింది కథను చదవండి.

### కిసాగోతమి కథ (కిసా గౌతమి కథ)

బుద్ధుణ్ణి గురించిన ప్రసిద్ధమైన కథను ఇక్కడ చెప్పుకుందాం.

అనగనగా కిసాగోతమి అనే ఒక మహిళ ఉండేది. ఆమె కుమారుడు చనిపోయాడు. ఆమె చాలా విచారానికి లోనై తన పిల్లవాణ్ణి ఎత్తుకొని వీధులలో తిరుగుతూ తన పిల్లవాణ్ణి బతికించమని వేడుకొంటుంది. దయగల ఒక ఆసామి ఆమెను బుద్ధుని వద్దకు తీసుకొనిపోయాడు.

"ఒక దోసెడు ఆవాల గింజలను తీసుకొని నా వద్దకు రా, నీ కుమారుణ్ణి బ్రతికిస్తాను," అని బుద్ధుడు ఆమెకు చెప్పాడు.

కిసాగోతమి ఆనందపరవశురాలై ఒక్కసారిగా బయలుదేరబోయింది. బుద్ధుడు ఆమెను నమ్రతగా ఆపి ఆమెతో "నువ్వు తీసుకురాబోయే ఆవగింజలు ఎవరూ మరణించని ఇంటినుంచే తేవాలి" అని చెప్పాడు.

కిసాగోతమి ప్రతీ గుమ్మానికీ వెళ్ళినపుడు అక్కడివారు వాళ్ళ ఇంటిలో తండ్రి, తల్లి, సోదరి, సోదరుడు, భర్త, భార్య, పిల్లలు, మామలు, అత్తలు, తాతలు, అవ్వలు మొదలైన వాళ్ళలో ఎవరో ఒకరు చనిపోయారని తెలిపారు.

విషాదంలో ఉన్న తల్లికి బుద్ధుడు ఎటువంటి బోధన చేయడానికి ప్రయత్నించాడు?

### తమిళ సంగమవాఙ్మయం

పూర్వకాలంలో దక్షిణ భారతదేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో తమిళ భాషను మాట్లాడేవారు. సంగమ వాఙ్మయమంటే అనేక మంది కవులు, కవయిత్రులు, పండితులు, రాసిన పద్యాలు అని అర్థం. తమ జాతి సంరక్షణకోసం చేసిన యుద్ధాలు, యుద్ధనాయకుల గాథలు, అందమైన, ధైర్యసాహసాలు కలిగిన నాయకుల కథలు, ప్రేమగాథలు, ప్రకృతి అందాలు, మనుషుల మీద ఋతువుల ప్రభావాలు తదితర విషయాలను గురించి ఈ పద్యాలు తెలుపుతాయి.

SCERT TELANGANA

సంగమ వాఙ్మయంలో రాజును ఉద్దేశించి చెప్పిన పద్యాన్ని చూడండి!

"నీ రాజ్యం ఏనుగులతో నిండి ఉన్న దట్టమైన అడవిలాగా ఉంది. అవి ఆవులలాగ, నల్లని దున్నపోతులలాగ విస్తరించినట్లుంది. ఎదుగుతున్న పిల్లల్ని ఎంత శ్రద్ధగా చూసుకుంటామో అలాగే నీ రాజ్యాన్ని కూడా అంత శ్రద్ధగా చూసుకోవాలి."

## వైద్య, శస్త్ర చికిత్స రంగాలలోని విశిష్ట గ్రంథాలు

ప్రజలు అనారోగ్యాలతో ఎందుకు బాధ పడుతున్నారనే విషయాన్ని పూర్వకాలంలో చాలామంది పరిశోధకులు అధ్యయనం చేశారు. ఆ అనారోగ్యాలను ఎలా నయంచేసుకోవాలి, యుద్ధంలో గాయపడిన వాళ్ళకి ఎలాంటి చికిత్స చేయాలి అని ఆలోచించేవారు. వాళ్ళు కొన్ని రకాల మూలికలు, ఆకులు, గింజలు వంటి వస్తువులను సేకరించి మందులను తయారుచేసి అవి ఎలా తయారు చేయాలో, ఎలా వాడాలో, ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపడం ఎలా అనే విషయాలను గ్రంథ రూపంలో మనకు అందించారు. ఇలాంటి గొప్ప గ్రంథమే 'చరక సంహిత.' ఇలాంటి మరొక గ్రంథమే 'శుశ్రుత సంహిత'. ఇది శస్త్ర చికిత్సలను గురించి తెలుపుతుంది. ఈ గ్రంథాలు ఆయుర్వేద వైద్య విధానానికి ఆది గ్రంథాలని చెప్పవచ్చు. ఇవి కేవలం అనారోగ్యాలకి మందులను సూచించడమే కాకుండా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో, సమతుల్యమైన ఆరోగ్యవంతమైన జీవనం ఎలా గడపాలో తెలిపాయి.

- మీ ఇంట్లో లేదా పరిసరాలలో ఉండే ఔషధ మొక్కలను గుర్తించి వాటి పేర్లు, ఉపయోగాలను రాయండి.
- ఆరోగ్య చిట్కాలను మీ పెద్దలదగ్గర సేకరించి తరగతిలోని అందరూ సేకరించిన చిట్కాలతో చిన్న పుస్తకాన్ని తయారు చేయండి.

## ఖగోళ, గణిత శాస్త్రాలలోని గ్రంథాలు

మన పూర్వీకులు ఎక్కువగా సూర్య, చంద్ర, నక్షత్రాలు, గ్రహాల వంటి వాటిని చూసి సమ్మోహితులైనారు. ఇవి ఆకాశంలో రోజూ మార్పు చెందుతుండడాన్ని గ్రహించి రోజుల తరబడి వాటి గమనాలను, స్థితిగతులను పరిశీలించి నమోదు చేశారు. కొన్ని మార్పులు నిమిషాలలో జరిగితే కొన్ని మార్పులు నెమ్మదిగా వారాలు, నెలలు, సంవత్సరాల తరబడి జరిగేవి. ఇలా గమనించిన తరవాత ఆకాశంలో రెండు, మూడు రకాల పదార్థాలున్నాయని, సూర్యుడు రోజు పగలు ఉదయించి రాత్రిళ్ళు అస్తమిస్తున్నాడని, చంద్రుడు నెలకొకసారి తగ్గుతూ, పెరుగుతూ ఉంటాడని, నక్షత్రాలు స్థిరంగా ప్రకాశిస్తుంటాయని, గ్రహాలు కదులుతుంటాయని ఇలా అనేక విషయాలను నిర్ధారించారు. ఈ నక్షత్రాలు, గ్రహాలు, సూర్యుడు, చంద్రుడు, వీటిలో విశ్వానికి సంబంధించిన అనేక రహస్యాలు దాగి ఉన్నాయని గ్రహించి వాటిని మరింత శ్రద్ధతో పరిశీలించారు. ఇలాంటి పరిశీలకులలో ఒకరైన ఆర్యభట్టు "ఆర్యభట్టీయం" అనే పుస్తకాన్ని రాశాడు. భూభ్రమణం వల్ల రాత్రి పగలు ఏర్పడుతున్నాయని, సూర్యుడు భూమి చుట్టూ తిరగడం లేదని చెప్పాడు. ఆరోజుల్లో ప్రజలు ఈయనను వ్యతిరేకించారు. ఇతని సిద్ధాంతాలను నమ్మలేదు. ఇదే విధంగా ఆర్యభట్టు, ఇతరులు కూడా గణితంలో దశాంశ పద్ధతిని, స్థానపు విలువలను, సంఖ్యామానాన్ని కనుక్కొన్నారు. ప్రస్తుతం గణితంలో ఈ విధానాలనే మనం వాడుతున్నాం. పూర్వం 'రోమన్'లు నూట రెండుని ఇలా రాసేవారు : CII, లేక నూట ఇరవై ఏడుని ఇలా రాసేవారు : CXXVII (C = 100, X = 10, V = 5, I = 1). వారు సున్నాను ఉపయోగించేవారు కాదు. కూడికలలో ఈ పద్ధతి చాలా గందరగోళాన్ని సృష్టించేది.

దశాంశ పద్ధతి, స్థాన విలువల ద్వారా పై సంఖ్యలను సులభంగా 102, 127 గా రాయవచ్చు. ఇప్పుడు ప్రపంచమంతటా ఈ సంఖ్యామాన పద్ధతినే ఉపయోగిస్తున్నారు.

SCERT TELANGANA

## సంస్కృత సాహిత్యము

ప్రాచీన భారతదేశానికి చెందిన ప్రముఖ మేధావులలో పాణిని ఒకరు. ఇతను సంస్కృత భాషలో అష్టాధ్యాయి అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. ఇది భాషకు ఒక క్రమ పద్ధతిని, ఇతరులు భాషను సులభంగా నేర్చుకోడానికి తోడ్పడింది. పాణిని వ్రాసిన గ్రంథంపై పతంజలి ఒక సుదీర్ఘ వ్యాఖ్యానాన్ని రాస్తు దీన్ని ముందుకు తీసుకెళ్ళాడు.

కుషానుల కాలంలో అశ్వఘోషుడు బుద్ధుని జీవిత చరిత్రను తెలుపుతూ బుద్ధ చరితము అనే గ్రంథాన్ని రచించాడు. ఇది సంస్కృతంలోని మొట్టమొదటి పద్య కావ్యము.

గుప్తుల కాలంలో సంస్కృతంలో కొన్ని గొప్ప కావ్యాలు రచించబడ్డాయి. రెండవ చంద్రగుప్తుని ఆ స్థానంలోని అమరసింహుడు అమరకోశము అనే ప్రసిద్ధ సంస్కృత నిఘంటువు రచించాడు. ఈ కాలంలో నాటకం బాగా అభివృద్ధి చెందిన సాహిత్యరూపం గానూ మరియు జనాదరణ పొందిన వినోదంగా ఉండేది. భాస అనే ప్రసిద్ధిగాంచిన నాటకకర్త రామాయణ, మహాభారతాల ఆధారంగా 13 నాటకలు రాశాడు. కాళిదాసు మహాభారతంలోని శకుంతల, దుష్యంతుల ప్రేమను వర్ణిస్తూ అభిజ్ఞాన శాకుంతలము అనే గొప్ప నాటకాన్ని రాశాడు. శూద్రకుడు పట్టణ ప్రజల జీవితాలను వర్ణిస్తూ మృచ్ఛకటికం అనే ఆసక్తికరమైన నాటకాన్ని వ్రాశాడు. కాళిదాసు వివిధ రకాలైన పద్యాలను రచించాడు. ఇవి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధిచెందాయి.

- కాళిదాసు యొక్క రచనల గురించి తెలుసుకోండి. వాటిని తరగతిలో చెప్పండి. అవి మీకు ఎందుకు ఆసక్తికరంగా ఉన్నాయి? కారణాలు తెలపండి.

**కీలకపదాలు**

| | |
|---|---|
| ఇతిహాసము | సంగమ సాహిత్యం |
| శాసనాలు | దశాంశ పద్ధతి |
| ఆయుర్వేదం | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. భాష ప్రాముఖ్యాన్ని వివరించండి.
2. ఆర్యభట్టు ఖగోళ శాస్త్రానికి ఆద్యుడని ఎలా చెప్పగలరు?
3. చరక సంహిత, శుశ్రూత సంహితల మధ్య గల తేడాలను వివరించండి.
4. గణితంలో కొన్ని కొత్త ఆవిష్కరణలను తెలపండి.
5. కరెన్సీ నోటును చూసి దానిపై ఉన్న వివిధ లిపులను గుర్తించండి. ఏ యే భాషలు దీనిమీద రాసి ఉన్నాయి? ఒకే లిపిలో వివిధ భాషలు రాసి ఉన్నాయి, అవి ఏవి?
6. ఏదైనా జనరల్ నాలెడ్జ్ పుస్తకం పరిశీలించి, ఐదు తెలుగు భాషలోని ముఖ్య గ్రంథాల పేర్లను, ఐదు ఇతర భాషలకు చెందిన ముఖ్య గ్రంథాల పేర్లను తెలిపే పట్టిక తయారు చేయండి.
7. ప్రాచీన భారతీయ శాస్త్రవేత్తలు వివిధ రంగాలలో చేసిన కృషి నేటి శాస్త్రవేత్తలకు ఎలా స్ఫూర్తినిచ్చింది?
8. భారతదేశ పటంలో కింది వాటిని గుర్తించండి.

   అ. బీహార్ ఆ. తమిళనాడు ఇ. ఉత్తరప్రదేశ్ ఈ. మహారాష్ట్ర ఉ. పశ్చిమ బెంగాల్
9. పేజి నెం. 165లోని 'గొప్ప ఇతిహాసాలు' అంశాన్ని చదివి, వ్యాఖ్యానించండి.

SCERT TELANGANA

పాఠం

20

# శిల్పం, కట్టడాలు

ప్రాచీన సింధులోయ నగరాలలో తవ్వకాలు జరిపిన పురాతత్వ శాస్త్రజ్ఞులు రాతిపైన చెక్కిన ముద్రలను, కాల్చిన బంకమట్టి ఆకృతులతో పాటు అందమైన రాతి, కంచు శిల్పాలను కనుక్కొన్నారు. నాలుగు వేల సంవత్సరాల క్రితం చేసిన చిత్రాలను కొన్నింటిని మీరు ఇక్కడ చూడొచ్చు. ఇవన్నీ సహజసిద్ధమైన అంశాలను ప్రతిబింబిస్తాయి. అయితే, వాటిని ఎందుకోసం ఉపయోగించారో మనకు తెలియదు.



*చిత్రం 20.1: సింధులోయ కాలం నాటి ఒక ముఖ్య వ్యక్తి ప్రతిమ, ఇతను పూజారా? లేదా రాజా?*



*చిత్రం 20.3: నిలబడినట్లున్న ఓ బాలిక కంచు విగ్రహం*



*చిత్రం 20.2: ఎద్దు బొమ్మ కలిగిన అందమైన హరప్పా ముద్ర*




*చిత్రం 20.4: టెర్రకోటతో చేసిన అమ్మతల్లి ఆకృతి*

SCERT TELANGANA

## హరప్పా నగరాలు – ఉపఖండము యొక్క మొట్టమొదటి నగరాలు

మానవులు చాలాకాలం పాటు వేట మరియు ఆహార సేకరణ జరుపుతూ, వలస మరియు సంచార జీవనం గడిపేవారని మీరు 6వ అధ్యాయంలో చదివియున్నారు. కేవలం 10,000 సంవత్సరాల పూర్వం నుండే నవీన సిరియా మరియు పాలస్తీనా వాసులు వ్యవసాయం మరియు జంతువులను మచ్చిక చేసుకోవడం ప్రారంభించారు. భారత ఉపఖండంలో ఏడు నుండి ఎనిమిది వేల సంవత్సరాల నాటి పురాతన గ్రామాలు బెలూచిస్తాన్‌లోని వాయవ్య ప్రాంతంలో బయల్పడ్డాయి. వివిధ ప్రాంతాలలోని ప్రజలు వ్యవసాయం చేస్తూ, గ్రామీణ జీవితాన్ని నెమ్మదిగా స్వీకరించినా, ఇప్పటికి చాలా మంది వేట మరియు ఆహార సేకరణను కొనసాగిస్తున్నారు. మరి, మొట్టమొదటి నగరాలు ఎప్పుడు నిర్మింపబడి ఉంటాయి? సుమారు 5000 సంవత్సరాల క్రితం, భారత ఉపఖండంలోని వాయవ్య ప్రాంతాలైన బెలూచిస్తాన్, సింధ్, పంజాబ్ మరియు గుజరాత్‌లలో ఇవి ఉద్భవించాయి. పురావస్తు శాస్త్రజ్ఞులు తమ త్రవ్వకాలలో పెద్ద పెద్ద నగరాల అవశేషాలను కనుగొన్నారు. ఆ నగరాల అసలు పేర్లు మనకు తెలియకపోయినా, వాటి అవశేషాలు బయల్పడిన ఆధునిక గ్రామాల పేర్లతో వాటిని పిలుస్తాం. మీరు ప్రఖ్యాతిగాంచిన హరప్పా, మొహెంజొదారో, కాళీబంగన్ మరియు లోథాల్ నగరాల పేర్లను వినే ఉంటారు. భారత ఉపఖండంలో పేరుగాంచిన ప్రాచీన నగరాలలో ఇవి ప్రముఖమైనవి. ఈ నగరాలు ఉత్తరాన ఉన్న ఆఫ్ఘనిస్తాన్ నుండి దక్షిణాన ఉన్న గుజరాత్ వరకు మరియు తూర్పున పంజాబ్ మరియు హర్యానాల నుండి పశ్చిమాన బెలూచిస్తాన్ వరకు అనేక ఒకే రకమైన (ఉమ్మడి) లక్షణాలతో విస్తరించబడ్డాయి. చరిత్రలోని ఈ దశను పురావస్తు శాస్త్రజ్ఞులు 'హరప్పా సంస్కృతి' అనే పేరుతో సూచిస్తారు. ఈ సంస్కృతిలోని ముఖ్యమైన ప్రాంతాలలోని అధిక భాగం సింధూనది మరియు దాని ఉపనదులతో ఏర్పడిన మైదాన ప్రాంతాలలో ఉండటం వల్ల కొన్నిసార్లు దీనిని 'సింధూలోయ నాగరికత' అని కూడా పిలుస్తారు.

- ఈ ప్రాంతాలలో ప్రవహించే నదుల పేర్లను కనుగొనండి. ఈ ప్రాంతాలను పటంపై గుర్తించి, అవి హైద్రాబాదు నుండి ఎంత దూరంలో ఉన్నాయో గమనించండి.
- తెలంగాణ హరప్పా సంస్కృతిలో భాగమని మీరు భావిస్తున్నారా? తెలంగాణలో నివసించే ప్రజలకు హరప్పా సంస్కృతి గురించి తెలుసా? ఎట్లు?
- మీరు ఏదైనా ఒక ప్రాంతాన్ని సందర్శిస్తే, అది ఒక గ్రామమా లేదా పట్టణమా అని ఎలా నిర్ణయిస్తారు?
- గ్రామానికి భిన్నంగా ఉండే నగరంలో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహింపబడతాయి?
- పురావస్తు శాస్త్రజ్ఞులు ప్రాచీన అవశేషాల ఆధారంగా ఒక ప్రాంతం గ్రామమా లేదా నగరమా అని ఎలా నిర్ణయిస్తారని నీవు అనుకుంటున్నావు? గ్రామ అవశేషాలలో ఉండని ఏ ప్రత్యేక లక్షణాలు నగర అవశేషాలలో ఉంటాయని నీవు భావిస్తావు?




SCERT TELANGANA

## నగరాలంటే ఏమిటి ?

జీవనోపాధికోసం వ్యవసాయం లేదా వేట మరియు ఆహార సేకరణలపై ఆధారపడకుండా జీవించే అధిక జనాభా కలిగిన ప్రాంతాలను 'నగరాలు' అని మనం అంటాము. నగరాలు ముఖ్యంగా మూడు లేదా నాలుగు రకాల ప్రజలను కలిగి ఉంటాయి. ఉదా॥ చేతివృత్తుల వారు–కుండల తయారీదార్లు, లోహపు పనివారు, వడ్రంగి పనిచేసే వారు, భవన నిర్మాణం చేసే మేస్త్రీలు, రాళ్ళను కొట్టేవారు, మొదలైనవారు; వర్తకులు–నగరం లోపల మరియు బయట ఉండేవారు తయారు చేసిన వస్తువులను కొనడం లేదా అమ్మడం చేసే వ్యాపారులు; పరిపాలకులైన రాజులు, కులీనులు, పూజారులు మరియు పరిపాలనాధికారులు; చివరగా పేద శ్రామికులు లేదా సైనికులు వీరు ఇతరులకు సేవ చేసేవారు. వీరిలో చాలా మంది వ్యవసాయం చేయరు లేదా పంటలను పండించరు. అందువలన ధాన్యము ఉత్పత్తి చేసే రైతులపై, పాలు మరియు మాంసం ఉత్పత్తి చేసే పశుపోషకులపై ఆధారపడతారు. నగరాలు ఈ ధాన్యాలను రైతులపై విధించే పన్నుల ద్వారా లేదా చేతిపనుల ద్వారా వచ్చే ఉత్పత్తులకు బదులుగా పొందుతాయి. నేడు ఉన్న పరిస్థితులలాగానే ఆ ప్రాచీన యుగంలో కూడా అధిక శాతం మంది ప్రజలు బహుశా గ్రామాలలోనో లేదా అడవులలోనో నివసించి ఉండవచ్చు.

- పరిపాలకుల మరియు పనివారి శిథిల భవనాలు ఒకేలాగా ఉన్నాయా? విభిన్నంగా ఉన్నాయా? ఎలా?
- కేవలం శిథిలాలను అధ్యయనం చేసి, ఆకాలంలో వర్తకులున్నారో లేదో, వారి నివాస ప్రాంతాలు ఎక్కడున్నాయో తెలుపడం సాధ్యమని మీరు అనుకుంటున్నారా?
- రైతులు తమ ఉత్పత్తిని నగరవాసులకు ఇవ్వడానికి ఎందుకు ఒప్పుకున్నారని మీరు భావిస్తున్నారు?

## నగరాల లక్షణాలు

సుమారు నాలుగువేల ఆరు వందల సంవత్సరాల క్రితం హరప్పా నగరాలు వేగంగా ఏర్పడి దాదాపు ఏడు వందల సంవత్సరాలు వెలుగొందాయి. సుమారు మూడువేల తొమ్మిది వందల సంవత్సరాలలో క్రమేణ కనుమరుగయ్యాయి. హరప్పా నగరాలలోని భవనాలు బాగా కాల్చిన, నిర్దిష్ట ఆకారము, పరిమాణము గల ఇటుకలతో నిర్మించబడటం ఆ నగరాల ఒక విశిష్ట లక్షణం. దాదాపు అన్ని ప్రముఖ నగరాలు జాగ్రత్తగా రూపొందించిన ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధిని కలిగి, చదరంగంలోని గడులవలె ఒకదానినొకటి ఖండించుకుంటున్న వంకరలు లేని రహదార్లతో నిర్మించబడ్డాయి. రహదారులన్నీ గృహాల నుండి వచ్చే మురుగు నీటి పారుదల, వర్షపునీటి పారుదల కోసం చక్కటి కాలువలతో నిర్మించబడ్డాయి. దాదాపు అన్నీ నగరాలు రెండుగా విభజింపబడి నిర్మించబడ్డాయి. ఒక భాగంలో ఎత్తైన భవనాలు, ప్రధాన రాజ ప్రసాదాలు (కోటలు), నివాసాలు, కార్యాలయాలు, ధాన్యా గారాలతో ఉండగా, మరియొక భాగంలో చేతి వృత్తులు, వర్తకులు మరియు ఇతర సామాన్య ప్రజల నివాసాలుండేవి. పరిపాలకులు రాజ ప్రసాదాలలో నివసిస్తూ పని చేస్తూ, ఇతర సామాన్య ప్రజల నుండి విడిగా ఉంటూ తమ ప్రత్యేకతను చాటుకుంటూ ఉండేవారు.

- నేటి పట్టణాలలో స్థితిమంతులైన ప్రజలు నివసించే ప్రాంతాలు లేదా పనిచేసే స్థలాలకును సామాన్య ప్రజల నివాస ప్రాంతాలకును మధ్యన మీరు ఏవైనా తేడాలు గమనించారా? ఈ తేడాలు ఎందుకున్నాయి?

హరప్పా నగరాలలో ఎటువంటి చేతి వృత్తుల వారు నివసించేవారు? భవనాలు, అవి నిర్మింపబడిన ఇటుకల ప్రాముఖ్యతను బట్టి చేతి వృత్తుల పనివారిలో ఒక రకాన్ని మీరు ఊహించవచ్చు – ఇటుక తయారీదారులు లేదా భవననిర్మాణ మేస్త్రీలు లేదా మట్టితో పనిచేసే కుండల తయారీదారులు. హరప్పా కాలం నాటి కుండల తయారీదారులు భారత చరిత్రలోనే అత్యంత నాణ్యతగల కుండలను, విభిన్న రకాల మట్టి పాత్రలను, బొమ్మలను తయారు చేసేవారు. హరప్పా ప్రజలు వివిధ రకాల లోహాలతో తయారైన అనగా రాగి, వెండి, తగరం, మిశ్రలోహమైన ఇత్తడి మొదలైన వాటితో తయారయిన వస్తువులను

SCERT TELANGANA



*చిత్రం 20.5: లోథల్ నౌకానిర్మాణ కేంద్రం–ఇక్కడ సరిపోయే నావ పరిమాణాన్ని ఊహించండి (కొలతలు: తూర్పు–పడమరల మధ్యం దూరం –37మీ, ఉత్తర–దక్షిణాల మధ్య దూరం–22మీ.)*

విస్తృతంగా ఉపయోగించే వారు. అయినా, భారతదేశంలో ఆలస్యంగా వాడుకలోనికి వచ్చిన ఇనుమును వీరు ఉపయోగించలేదు. రాగి అరుదుగా లభించేది దాని ఉపయోగం పరిమితిగా ఉండేది. హరప్పా ప్రజలు తమ నిత్యావసరాల కోసం రాయి మరియు చెక్కతో చేసిన పనిముట్లను ఎక్కువగా ఉపయోగించేవారు. నరికేపని కోసం రాతితో చేయబడిన పొడవుగా ఉండే విశిష్టమైన రంపాలను, వర్తకం కోసం చక్కగా చెక్కబడని రాతి ముద్రలను, ఆభరణాల కోసం అందమైన, రంగులతో నునుపుగా తయారు చేసిన రాతి పూసలను, వ్యాపారం కోసం రాతిబాట్లను (బరువును సూచించే రాళ్ళు) ఉపయోగించేవారు. పత్తి, ఉన్ని బట్టలను తయారు చేసేవారు. వీటిలో చాలా తక్కువ పరిమాణంలో కొన్ని చరిత్రకారులకి లభ్యమయ్యాయి. ప్రతిరోజూ ఉపయోగించే వస్తువులైన గరిటెలు, కాడలు, గాజులను తయారు చేయడానికి సముద్రంలో లభ్యమయ్యే గవ్వలు, శంఖాలను ఉపయోగించేవారు. రాతిముద్రలు, బరువుల (తూనిక బాట్లు) ఉపయోగాన్ని గమనిస్తే, ఆ కాలంలో వివిధ ప్రదేశాల మధ్య వర్తక వ్యాపారాలు అధిక సంఖ్యలో జరిగేవని తెలుస్తుంది. నిజానికి, వారు ఎన్నో అభివృద్ధి చెందిన నగరాలు కలిగిన ఇరాక్ లాంటి సుదూరదేశాలకు ఓడలపై ప్రయాణించి వర్తక వ్యాపారాలు కొనసాగించేవారు. సరుకుల రవాణాకు ఎద్దుల బండి మరియు పడవలను వారు తప్పకుండా ఉపయోగించి ఉంటారు.

- ఈ వస్తువులన్నీ ఒకే పనివారు చేస్తుంటారా? లేదా వివిధ వృత్తిపనివారు చేస్తుంటారా? ఈ విధంగా మీరు ఎందుకు భావిస్తున్నారు?

### భాష

హరప్పా ప్రజలు రాసిన పుస్తకాలేవి మనకు లభించలేదు. కొన్ని చిన్న శిలాఫలకాలు, ముద్రలు మాత్రము లభించినప్పటికీ వాటిని ఎలా చదవాలో మనకు నేటికి తెలియదు. వారు ఏ భాషను



*చిత్రం 20.6: మొహెంజొదారో దుర్గం*

SCERT TELANGANA



చిత్రం 20.7: మొహెంజాదారో మహాస్నాన ఘట్టం (కొలతలు : 11.8మీ × 7 మీ)

మాట్లాడారో, అన్ని చోట్ల ఒకే భాషను మాట్లాడారా అన్న విషయం కూడా తెలియదు. వారు ఏయే పేర్లతో పిలుచుకున్నారని గాని, రాజులను, దేవుళ్ళను ఎలా పిలిచారో గాని, చివరికి వారి నగరాల పేర్లు కూడా తెలియదు. వారి మత విశ్వాసాలను గురించి మీరు తర్వాత పాఠంలో చదువుతారు.

### పాలకులు

ఈ నగరాలను ఎవరు పరిపాలించారో తెలియదు. నగరాలు చాలా విశాల ప్రాంతాలలో నిర్మాణం అయివున్నాయి. దాదాపు అన్ని నగరాలలోను సాధారణంగా ఉండే అంశాలు ఒకే రకంగా ఉండటంచే, కొంతమంది అభిప్రాయం ప్రకారం వీటిని అజమాయిషీ చేయడానికి ఒక కేంద్రీకృత వ్యవస్థ ఉండేదని తెలుస్తుంది. ఈ కేంద్రీకృత వ్యవస్థను రాజు, పూజారి లేదా ఎన్నుకోబడిన కొంత మంది నాయకులు వీరిలో ఎవరు అజమాయిషీ చేసారో తెలియలేదు. బహుశా వారు పెద్ద పెద్ద కోటలలో నివసిస్తూ, నగర ప్రజలను పరిపాలించి ఉండవచ్చు.

### జీవనోపాధిలో మార్పు

దాదాపు ఏడు వందల సంవత్సరాల తరువాత గొప్ప నగరాలుగా అభివృద్ధి చెందిన పట్టణాలు, వర్తకం, చేతి వృత్తుల వారి ఉత్పత్తి తగ్గిపోయి, క్రమేణ క్షీణించి, ఇక్కడి ప్రజలు పట్టణాల నుండి గ్రామాలకు తరలి వెళ్లారు. కొంత మంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం ఈ ప్రాంతంలో ప్రవహించే చాలా నదులు ఎండిపోవడంచే, ఇక్కడి ప్రజలు తూర్పుగా గంగానదివైపుకు తరలిపోయారు. అక్కడ వారు వ్యవసాయ, పశుపోషకులతో కలిసిపోయారు. ఏది ఏమైనప్పటికి హరప్పా సంస్కృతిలోని గొప్ప నగరాలు కనుమరుగై, భూమిలో కలిసిపోయారు. అంతరించిపోయిన ఈ నాగరికత గురించి పురావస్తు శాస్త్రజ్ఞులు ఇరవైవ శతాబ్ధంలో కనుగొని క్రమబద్ధమైన అధ్యయనం చేయడం మొదలుపెట్టారు.

- రైతులుగా ఉంటూ కర్మాగార కార్మికులుగా లేదా కార్యాలయ పనివారుగా లేదా దుకాణదారులుగా నీకు తెలిసిన వారు ఎవరైన తమ జీవనోపాధిని మార్చుకున్నారా? లేదా కర్మాగార కార్మికులు ఎవరైనా మార్కెట్‌లో చిన్న చిన్న పనులు చేసే వారిగా మారారా? లేదా తమ పూర్వీకుల ప్రాంతాన్ని వదిలి పెట్టి ఉపాధికోసం కొత్త ప్రదేశాలకు వెళ్లారా? వారి జీవితాలను మరియు వారు ఎదుర్కొనే సమస్యలను, సవాళ్లను వర్ణించండి?



చిత్రం 20.8: మొహెంజాదారో వీధిలోని మురుగు నీరు పారుదల వ్యవస్థ

SCERT TELANGANA

## సింధూ లోయ నాగరికత తరువాత కాలం శిల్పకళ

కొద్దికాలం తరవాత ఖనిజాలతో ఆకృతులను పోతపోయడం మహారాష్ట్రకు విస్తరించింది. అద్భుతమైన కంచు పోతబొమ్మలు తవ్వకాలలో బయటపడ్డాయి. బహుశా అవి మూడువేల సంవత్సరాలకు పూర్వం పోతపోసినవి అయి ఉండొచ్చు. అవి ఆట బొమ్మలు కూడా అయి ఉండవచ్చునని మీకు అనిపిస్తోందా?



*చిత్రం 20.9: దయిమాబాద్ కంచు పోతబొమ్మలు*

శిల్పానికి సంబంధించి ముఖ్యమైన తరవాత ఘట్టం 2200 సంవత్సరాల క్రితం నాటి మౌర్యుల కాలం. అశోక చక్రవర్తి అనేక ప్రాంతాలలో బాగా పొడవైన నునుపుదేలిన స్తంభాలను పాతించాడు. వీటిని ఒకే రాతిలో చెక్కారు. వీటిపైన అశోకుని సందేశాలను చెక్కేవారు. ఈ స్తంభాల చివరి భాగాన కొన్ని జంతువుల ఆకృతులు కూడా ఉండేవి. వీటిని రాజచిహ్నాలు (కాపిటల్స్) అంటారు. వీటిలో ప్రముఖమైనది బుద్ధుడు మొదటిసారిగా బోధించిన సారనాథ్‌లోని సింహ శిఖరం. దీన్ని అశోకుడు స్థాపించాడు. రాజసం ఉట్టిపడే ఈ నాలుగు సింహాల తలలు నాలుగు దిక్కులను సూచిస్తూ 'ధర్మచక్రాన్ని' చూపిస్తూ ఉన్నాయి.

- శిల్పంలోని సింహాలు చూడటానికి సహజంగా లేక కృత్రిమంగా కనిపిస్తున్నాయని మీరు భావిస్తున్నారా?
- తరచుగా చూసే సింహాల బొమ్మలను వేటిమీద చూశారు?

ఈ రాతి స్తంభాలు, సింహశిఖరం మౌర్యచక్రవర్తుల శక్తికి, రాజసానికి ప్రతీకలు. ఈ సింహశిఖరాన్ని రాంపూర్వాలోని వృషభ శిఖరంతో పోల్చండి – ఈ ఎద్దు, హరప్పాలోని ఎద్దును పోలి ఎంతో సహజంగా కనిపిస్తోంది కదా!



*చిత్రం 20.10: సారనాథ్‌లోని సింహశిఖరం*



*చిత్రం 20.11: రాంపూర్వలోని వృషభ శిఖరం*

SCERT TELANGANA

## బౌద్ధస్థూపాలు, విహారాలు

భారతదేశంలో ప్రఖ్యాతిపొందిన సాంచీ స్థూపపు చిత్రం దిగువన ఉంది. ఒకసారి చిత్రాన్ని చూడండి. మనం ఆకాశంవైపు చూసినపుడు ఎలా కనిపిస్తుందో అదేవిధంగా అర్ధగోళం (సగం బంతి)లా ఈ స్థూపం కనిపిస్తుంది. ఒక వేదికపైన నిర్మించిన అర్ధగోళపు ఆకారమే స్థూపం. దీని మధ్యలో బుద్ధుడు లేక బౌద్ధ భిక్షువు అవశేషాలు (దంతం, ఎముక, జుట్టు వంటి శరీర భాగాలు) ఉంటాయి. ఈ అర్ధగోళం పూర్తిగా మూసి ఉంటుంది. దీని లోపలికి మనం గుడిలోకి ప్రవేశించినట్లు ప్రవేశించలేం. దీనిపైన ఒక స్తంభం, దాని చివర ఛత్రం ఉంటాయి. చుట్టూ అందంగా అలంకరించిన ముఖద్వారాలు ఉన్న రాతి ప్రహరీ ఉంటుంది. అశోకుని కాలంలో వీటిని మట్టి, ఇటుక, చెక్కతో నిర్మించేవారు. తరవాత రాతితో నిర్మించేవారు.

స్థూపానికి అనేక అర్థాలున్నాయి. దీన్ని బుద్ధునికి ప్రతీకగా భావిస్తారు. అలాగే స్థూపపు గుమ్మటాన్ని విశ్వంగాను, ఈ స్తంభాన్ని భూమిని, స్వర్గాన్నీ కలిపే వారధిగాను భావిస్తారు. యాత్రికులు పుష్పాలతో దీన్ని పూజిస్తారు. దాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. స్థూపానికి వెలుపలి వైపు ధ్యానం చేస్తారు.

- స్థూపానికీ, దేవాలయానికీ పోలికలను, తేడాలను పేర్కొనండి. వీటిని ప్రజలు ఎలా పూజిస్తారో చెప్పండి.



*చిత్రం 20.132 మధ్యప్రదేశ్‌లో ఉన్న సాంచీ స్థూపం. అశోకుడు నిర్మించిన అత్యంత ప్రాముఖ్యమున్న స్థూపమిది. ఈ చిత్రంలో అర్ధగోళాన్ని, వేదికను, ఛత్రాన్ని, ప్రహరీని గుర్తించండి.*

SCERT TELANGANA

ఆంధ్రప్రదేశ్‌లోని చాలా ప్రాంతాలలో ముఖ్యంగా అమరావతి, భట్టిప్రోలు, రామతీర్థం, సాలిహుండం మొదలైన ప్రదేశాల్లో పురాతత్వ శాస్త్రజ్ఞులు అనేక ప్రాచీన స్థూప శిథిలాలను కనుక్కొన్నారు. భట్టిప్రోలు వద్ద బుద్ధుని అస్థిక కలిగిన ఒక స్ఫటిక పేటికను కనుక్కొన్నారు.



*చిత్రం 20.13: నేలకొండపల్లిలోని బుద్ధ స్థూపం, ఖమ్మం జిల్లా. చక్కగా అమర్చిన ఇటుకలను గుర్తించారా.*

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఉన్న అమరావతి స్థూపం అత్యంత ప్రసిద్ధమైనది. 1900 సంవత్సరాలకు పూర్వం శాతవాహనుల కాలంలో దీన్ని నిర్మించారు.

చిత్రం 20.15 శిల్పకళతో కూడిన స్థూపాన్ని వర్ణిస్తుంది. పై భాగంలో కొన్ని ఎగిరే ఆకృతులను చూశారా? బుద్ధున్ని పూజించేందుకు స్వర్గము నుండి దిగి వచ్చిన దేవతలుగా వీరిని భావిస్తారు. దిగువ భాగంలో కొద్దిమంది స్త్రీ, పురుషులు అణకువగా పూజిస్తున్నట్లుంది. ముఖ ద్వారం దగ్గర నాలుగు సింహాలను చూడవచ్చు. ఇవి ఏ అంశాన్ని స్ఫురింపచేస్తాయి?


అమరావతి నేడు చిన్నాభిన్నమైన రాళ్ళతో కూడిన గుట్ట. ఇది 1900 సంవత్సరాల క్రితం శిల్పతోరణాలతో ఎంత అద్భుతంగా ఉండేదో ఊహించుకోవాల్సిందే. బుద్ధుడు, అతని బోధనల గురించి ఈ శిల్ప తోరణాలు తెలియచేస్తాయి. వీటిని బ్రిటిషువారు కనుక్కొని లండన్‌కు తరలించారు. తరలించలేనివాటిని మద్రాసు మ్యూజియంలో భద్రపరిచారు. ఈ తోరణాలు

*చిత్రం 20.14: అమరావతి స్థూపం*



ఆధారంగా స్థూపం ఏవిధంగా ఉండేదో అంచనావేస్తున్నారు. దీని పునర్నిర్మాణం ఈ తోరణాలు ఆధారంగా జరిగింది. వాటిని సరిపోల్చండి.

నాగార్జునకొండ స్థూపం మరొక ముఖ్య స్థూపం. ఇక్ష్వాకుల రాజధాని అయిన విజయపురిలో ఇదొక భాగం. కృష్ణానది ఒడ్డున ఇది ఉంది. విజయపురిలో అనేక స్థూపాలు, విహారాలు, రాజప్రాసాదాలు ఉన్నాయి. అందమైన క్రీడాప్రాంగణాన్ని (స్టేడియమ్‌ను) పోలిన నిర్మాణం, నదీ స్నానఘట్టాలు ఉన్నాయి. దురదృష్టవశాత్తూ మొత్తం నగరం




*చిత్రం 20.15: అమరావతి స్థూప పునర్నిర్మాణ నమూనా*

నాగార్జునసాగర్ నీటిలో మునిగిపోయింది. చాలా శిల్పాలను, అవశేషాలను అక్కడి నుండి తొలగించి దగ్గరలోని మ్యూజియంలో పొందుపరచారు.

SCERT TELANGANA

కింద ఉన్న నాగార్జునకొండ, అమరావతిలోని శిల్ప తోరణాలలోని భాగాలను చూడండి. దక్షిణ భారతదేశంలోని ప్రాచీన శిల్ప నిర్మితులకు ఇవి ప్రతీకలు. వీటినిబట్టి అప్పటి ప్రజల రూపాలను మలచిన రీతిని గమనించండి.



చిత్రం 20.17: అమరావతిలోని శిల్పసంపద

*పిచ్చిపట్టిన నలగిరి అనే ఏనుగును బుద్ధుడు శాంతింప చేయటాన్ని ఈ చిత్రం చూపిస్తుంది. రాజుగారి ఈ ఏనుగు అదుపు తప్పి చెలరేగటంతో వీధుల్లోని ప్రజలు భయభ్రాంతులయ్యారు. అయినప్పటికీ బుద్ధుణ్ణి చూడగానే ఆ ఏనుగు శాంతించి అతనికి మోకరిల్లింది. ఒక చిత్రం కథనెలా చెప్పిందో చూశారా? ఈ కథ సందేశం ఏమై ఉంటుందో ఆలోచించండి.*



*చిత్రం 20.17: నాగార్జునకొండలో లభించిన ఈశిల్పంలో ఆరుగురు యువరాజులు, ఉపాలి అనే క్షురకుడు బౌద్ధ సంఘంలో ప్రవేశానికి అనుమతి పొందటం చూడవచ్చు. మానవత్వాన్ని బోధించేందుకుగాను, బుద్ధుడు ముందుగా సంఘంలోకి ఉపాలిని అనుమతించి తర్వాత మిగిలిన వాళ్ళని అనుమతించారు. బుద్ధునికి ఎడమవైపున చిన్న ఆసనంమీద కూర్చున్న ఉపాలిని చిత్రంలో చూడవచ్చు.*



*చిత్రం 20.18: సాంచీ నుంచి సేకరించిన ఈ శిల్పం గ్రామాలలోని దినచర్యను తెలుపుతుంది. ఈ అందమైన ఫలకం ఒక గ్రామంలో బుద్ధుని సందర్శనాన్ని తెలుపుతుంది. ఈ ఫలకంలో కనిపిస్తున్న ప్రజల దైనందిన కృత్యాలను పట్టికగా రాయండి. ప్రస్తుతం ఇలాంటి కృత్యాలను ఇప్పటి గ్రామాల్లో చూడగలమా? ఆలోచించండి.*

కాలక్రమంలో శిల్పులు, ఇక్కడ కనిపిస్తున్న ఇలాంటి శిల్ప ఖండికలలో కనిపించే ఆకృతులను మాత్రమే కాకుండా సంపూర్ణమైన పెద్ద ఆకృతులను చెక్కడం ప్రారంభించారు. బుద్ధుని పెద్ద ప్రతిమలు ప్రశాంతమైన, పవిత్రమైన బుద్ధుని వ్యక్తిత్వాన్ని ప్రజలకు చూపించాయి. ప్రఖ్యాత బౌద్ధశిల్పాలు వాయవ్య దిశలోని గాంధారనుంచి ఉత్తర ప్రదేశ్‌లోని మధుర, సారనాథ్ నుంచి లభించాయి. ఇలాంటి శిల్పాలను నాగార్జున కొండలో కూడా చూడవచ్చు.

"విహారాల"నేవి బౌద్ధ భిక్షువులు నివసించిన సన్యాసుల పీఠాలు లేదా ఆవాసాలు. వీటిలో మతపరమైన విద్య నేర్పేవారు. సాధారణంగా విహారాల్లో బహిరంగ ఆవరణ ఉంటుంది. దాని చుట్టూ చిన్న గదులు ఉండేవి. మరొకవైపు ఒక చిన్న పూజా మందిరం లేదా ఒక స్థూపం లేదా బుద్ధుని ప్రతిమ ఉండేవి. ఈ పూజా మందిరాన్నే "చైత్యమ"ని, బౌద్ధ భిక్షువుల ప్రార్థనాస్థలమని అంటారు.

నాసిక్, కార్లేలలో గుహవిహారాలను కనుక్కొన్నారు. వీటిలోకూడా చెక్కిన కొన్ని అందమైన శిల్పాలు ఉన్నాయి.

SCERT TELANGANA

తక్షశిల, నాగార్జునకొండ, నలంద వంటి మిగిలిన విహారాలను ఇటుకతో లేదా రాతితో నిర్మించారు. ఇవి గొప్ప విద్యా బోధన కేంద్రాలుగా రూపొందాయి. ఈ విహారాల్లో శిష్యులకు బౌద్ధ భిక్షువులు బౌద్ధగ్రంథాలను బోధించేవారు. కేవలం విద్యనే కాకుండా శారీరక రుగ్మతలకు కూడా భిక్షువులు ఈ విహారాల్లో చికిత్స చేసేవారు. ఈ విహారాల్లో చాలా శాసనాలు లభ్యమయ్యాయి. అనేకమంది స్త్రీలు, పురుషులు, రైతులు, వర్తకులు, సైనికులు, వృత్తిపనివారు ఈ విహారాల నిర్మాణానికి, వాటి నిర్వహణకు విరాళాలిచ్చేవారని ఈ శాసనాలు చెబుతున్నాయి.

బౌద్ధుల ఈ పవిత్ర విద్యాలయాలు ఇతర దేశాల నుండి అనేక మంది యాత్రికులను ఆకర్షించాయి. చైనా యాత్రికులు ఫాహియాన్, ఇత్సింగ్, హ్యూయన్ త్సాంగ్‌లు బుద్ధుని జీవితంతో సంబంధం కలిగిన ప్రాంతాలను, ప్రముఖ బౌద్ధసన్యాసుల విద్యాపీఠాలను సందర్శించేందుకు విచ్చేశారు.

> పవిత్ర స్థలాలను పూజించేందుకు / దర్శించేందుకు వెళ్లే ప్రజలను **యాత్రికులు** అంటారు.

హ్యూయన్‌త్సాంగ్ తదితరులు ఆనాటి ప్రఖ్యాత బౌద్ధ సన్యాసుల విద్యాపీఠమైన నలందా (బీహార్)లో విద్యనభ్యసిస్తూ కాలం గడిపారు. దీన్ని గూర్చి అతను ఇలా వివరించాడు.

> *"ఇక్కడి ఉపాధ్యాయులందరూ అత్యంత సామర్థ్యం, నైపుణ్యం కలిగినవారు. వీరంతా బుద్ధుని బోధనలను చిత్తశుద్ధితో అనుసరించేవారు. ఈ విద్యా పీఠాల నియమాలు కఠినంగా ఉండేవి. వాటిని ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలి. రోజంతా చర్చాగోష్టులు జరిగేవి. వృద్ధులు, యువకులు పరస్పరం సహకరించుకొనేవారు. తమ సందేహాలను నివృత్తిచేసుకొనేందుకు వివిధ నగరాలనుండి విద్యార్థులు ఇక్కడికి వచ్చేవారు. కొత్తగా వచ్చేవాళ్ళని కాపలాదారులు కఠినమైన ప్రశ్నలు వేసేవారు. వారు వాటికి సరైన సమాధానాలను ఇస్తేనే ప్రవేశానికి అనుమతించేవారు. పదిమందిలో ఏడెనిమిది మంది ఆ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేకపోయేవారు".*

## రాతిని తొలచి చైత్యాలు – మొదటి దేవాలయాలు

శాతవాహనుల కాలంలో వర్తకులు, వృత్తి కళాకారులు, రాజులు ఒక ప్రత్యేక శైలిలో విహారాల నిర్మాణానికి విరాళాలిచ్చేవారు. ఇలాంటివి మహారాష్ట్రలో – ముఖ్యంగా కార్లే, భాజా, కన్హేరి, నాసిక్‌లలో చూడొచ్చు. పర్వత ప్రాంతాలలో వీటిని గుహలుగా నిర్మించేవారు. రాతిపనివారు ఉలి, సుత్తి ఉపయోగించి రాళ్ళను తొలిచి వడ్రంగులు తయారుచేసే నిర్మాణాలను పోలిన ఆకృతులను ఆవిష్కరించారు. వీళ్ళు పెద్ద ప్రార్థనా ప్రాంగణాలను, స్థూపాలను, బౌద్ధ భిక్షువుల కోసం చిన్నగదులను రాళ్ళలో నిర్మించేవారు. మనుషుల మరియు జంతువుల అందమైన ప్రతిమలను, కొన్ని సందర్భాలలో బుద్ధుని విగ్రహాలను కూడా వీళ్ళు చెక్కేవారు. 2100 సంవత్సరాలకు పూర్వం నిర్మించిన కార్లే చైత్యపు చిత్రాలను పక్క పేజీలో పరిశీలించండి.

- ఈ శిల్పాలలో స్త్రీ, పురుషులకు సమాన హోదా ఉందని మీరు భావిస్తున్నారా? కారణాలు చెప్పండి.
- ఈ చైత్యంలో మొదటగా ఏ భాగం చెక్కి ఉంటారు? చివరగా ఏ భాగం చెక్కి ఉండవచ్చని మీరు భావిస్తున్నారు?

ఈ కాలంలో కూడా వడ్రంగులు, తాపీపనివారు దేవాలయాల, చైత్యాల నిర్మాణంలో మట్టిని, చెక్కను, రాతిని ఉపయోగించేవారు. ఈ దేవాలయాల్లో కొన్ని కృష్ణునికి, మరికొన్ని బుద్ధునికి సంబంధించినవి ఉన్నాయి.

SCERT TELANGANA



చిత్రం 20.19: కార్లే చైత్యపు వెలుపలి ద్వారం

అయితే ఇవి ప్రస్తుతం పదిలంగా లేవు. మధ్యప్రదేశ్‌లోని సాంచీవద్ద ప్రాచీన కాలపు రాతి ఆలయమొకటి పదిలంగా ఉంది. దీని నిర్మాణం సరళంగా ఉంది. గర్భ గృహ అని పిలిచే ఒక చిన్న గదిలో బుద్ధుని విగ్రహం ఉండేది. ఈ చిన్న తెరిచి ఉన్న వాకిలి లేదా మంటపం ఏవిధమైన గోడలు లేకుండా కేవలము స్తంభాలతో మాత్రమే ఉంది. ఈ స్తంభాలను అందంగా చెక్కారు. ఈ ఆలయ పైకప్పు సమతలంగా ఉంది. దీనికి ఏ విధమైన శిఖరమూ లేదు. దీన్ని 1600 సంవత్సరాలకు పూర్వం నిర్మించారు.



చిత్రం 20.20: చైత్యపు లోపలి భాగం



చిత్రం 20.21, 20.22: కార్లే శిల్పాలు.



చిత్రం 20.23: సాంచీలోని ప్రాచీన బౌద్ధ ఆలయం

SCERT TELANGANA

## కీలకపదాలు

| | | |
|---|---|---|
| చైత్యం | బౌద్ధ సన్యాసులు | స్థూపం |
| అవశేషాలు | విహారం | ఆరామం |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. అశోక చక్రవర్తి తన స్తంభాలపై గోవుల, లేదా రామచిలుకల శిల్పాలకు బదులుగా సింహాలనో లేదా ఎద్దులనో ఎందుకు ఎంపిక చేశాడు? అతని స్థానంలో మీరు ఉంటే ఏ జంతువును ఎంపిక చేస్తారు? మీ ఎంపికకు గల కారణాలు ఇవ్వండి.
2. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక స్థూపాలు నదీ తీరాలలోనే ఉన్నాయి.

   (ఉదా: సాలిహుండం, నాగార్జునకొండ, అమరావతి మొదలైనవి) స్థూపాల నిర్మాణానికి భిక్షువులు/సన్యాసులు, ఈ ప్రాంతాలనే ఎందుకు ఎంపిక చేశారు?
3. ఏనుగును శాంతపరిచే శిల్పంలో కొంతమంది కొంత ఎత్తులో ఉండి ఆ సంఘటనను గమనించడాన్ని చూడండి. ఆ ప్రజలు ఎవరని మీరు భావిస్తున్నారు?
4. రాతిని తొలచిన విహారాలు, చైత్యాలు ఈ నాటికీ పదిలంగా ఉండడానికి కారణం ఏమిటి?
5. చైత్యపు లక్షణాలను, దేవాలయాల లక్షణాలతో పోల్చండి. చైత్యంలో పూజావిధానానికీ, దేవాలయంలో పూజావిధానానికి తేడాలు ఉన్నాయా? ఏమిటి?
6. స్థూపాలను, చైత్యాలను బౌద్ధులు ఎందువల్ల పవిత్రమైనవిగా చూస్తారు?
7. విహారాలు, చైత్యాలు ఎలా ఉపయోగపడ్డాయి?
8. తెలంగాణ పటంలో బౌద్ధ, జైన క్షేత్రాలను గుర్తించండి.
9. పేజి నెం.177లోని 'విహారాలనేవి బౌద్ధ భిక్షువులు ...... ప్రార్థనా స్థలమని అంటారు' పేరాను చదివి, వ్యాఖ్యానించండి.

### ప్రాజెక్టు

మీ గ్రామంలో గాని, పట్టణంలో గాని ఒక దేవాలయాన్ని సందర్శించి దాని నిర్మాణపు రేఖా చిత్రాన్ని గీయండి. ఆ నిర్మాణంలోని ప్రతి భాగం పేరూ, దాని ఉపయోగాన్ని, అర్థాన్ని రాసేందుకు ప్రయత్నించండి. ఆ దేవాలయం గురించి ఒక నివేదికను తయారు చేసి, మీ తరగతిలో ప్రదర్శించండి.

SCERT TELANGANA

పాఠం 21

# తెలంగాణలో పచ్చదనం

- క్రింద ఇవ్వబడిన చిత్రాలను పరిశీలించి, ఆ రెండింటిని పోల్చండి.



చిత్రం. 1



చిత్రం. 2

- మొదటి చిత్రంలోని పరిస్థితులకు గల కారణములను గురించి ఆలోచించండి.
- మీ ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకొని పై చిత్రములలోని పరిస్థితులను పోల్చండి.
- మన ప్రాంతాలు రెండవ చిత్రం వలె ఉండాలంటే మనం ఏమి చేయాలి?

తెలంగాణ $15^{0}46'$ మరియు $19^{0}47'$ ఉత్తర అక్షాంశాలు, $77^{0}16^{1}$ మరియు $81^{0}43'$ తూర్పు రేఖాంశాల మధ్యన ఉంది. ఇది దక్కను పీఠభూమిలోని అర్థశుష్క ప్రాంతంలో గలదు. ఇక్కడి శీతోష్ణస్థితి ప్రధానంగా వేడిగా, పొడిగా ఉంటుంది. క్రమరహిత మరియు తక్కువ వర్షపాతం కలిగి యుండడం వల్ల శుష్క, ఆకురాల్చు అడవులు, చిన్న పొదలతో కూడిన భూ భాగాలు ఏర్పడుటకు దారితీసింది.

భారత జాతీయ అటవీ విధానం (1988) ప్రకారం పరిసరాల సుస్థిరత, పర్యావరణ సమతౌల్యం సాధించడానికి మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో 33% చెట్లతో విస్తరించి యుండాలి. అన్ని రకాల జీవులు, మానవులు, జంతువులు మనుగడ సాగించడానికి ఇది చాలా అవసరం. చెట్లను నరికి వేయడం వలన తెలంగాణలో చెట్లతో విస్తరించిన ప్రాంతం 24% మాత్రమే యుండి తక్కువ వర్షపాతానికి, నీటికి సంబంధించిన సమస్యలకు దారితీసింది. నిరంతరం అడవులను నరికివేయడం, అడవులు క్షీణించిపోవడం, ఆ క్షీణించిన అడవులలో నేలకోత అధికం కావడంతో నీరు, ఆహారం లభించక అడవి జంతువులైన కోతులు, ఎలుగుబంట్లు, చిరుతపులులు గ్రామాలలో ప్రవేశించి కుటుంబాలను ఇబ్బందుల పాలుజేయడం, మనం గమనిస్తూనే ఉన్నాం.

మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో అటవీ విస్తీర్ణాన్ని ఆశించిన 33% నికి పెంచడానికై తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం బృహత్తరమైన మొక్కలునాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇది రెండు విధాలుగా ఉంది.

i) గుర్తించిన అటవీ ప్రాంతాలలో చేపట్టేవి

ii) గుర్తించిన అటవీ ప్రాంతాల బయటచేపట్టేవి

SCERT TELANGANA

రోడ్డుకు ఇరువైపులా, నదుల ఒడ్డున-కాలువల గట్టున, చెట్లులేని గుట్టలపై, చెరువులపై పాఠశాలలు, కళాశాలలు, మతపరమైన స్థలాలు, గృహసముదాయ కాలనీలు, కమ్యూనిటీ స్థలాలు, మునిసిపాలిటీ-పారిశ్రామిక ఉద్యానవనాలు, వ్యవసాయ క్షేత్రాలలో ఈ బృహత్తర మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.



చిత్రం.3 మొక్కలు నాటుతున్న పిల్లలు

- మీ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం ఎలా జరిగింది?
- మీ పాఠశాలలో నాటిన వివిధ మొక్కల జాబితా తయారు చేయండి.

దీనిని సాధించుటకుగాను రాష్ట్రంలో 230 కోట్లు మొక్కలు నాటాలని ప్రతిపాదించడం జరిగింది. అటవీశాఖ మరియు ప్రభుత్వ ఇతర శాఖలచే 4000కు పైగా నర్సరీలు ప్రారంభించబడ్డాయి. ఈ పచ్చదనం కార్యక్రమంలో పాల్గొనే వారికెవరికైనా నర్సరీల ద్వారా మొక్కలు పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలు, జిల్లా కలెక్టర్ల లాంటి అధికారులు, ప్రముఖ పౌరులు, ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బహుళప్రజాదరణ పొందిన క్రీడాకారులు, కళాకారులు మొదలగు అన్ని రంగాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటూ విజయవంతం చేస్తున్నారు.

వేప, తులసి వంటి ఔషధ మొక్కలు, బాదం, మామిడి, సపోట, జామ, సీతాఫలం వంటి పండ్లు-గింజలు ఇచ్చే మొక్కలు, మల్లె, బంతి, గులాబి, గుల్‌మొహర్ వంటి పూల మొక్కలతో బాటు సిల్వర్ ఓక్, రావి, మర్రి, నేరేడు వంటి ఇతర మొక్కలను పైన పేర్కొన్న ప్రాంతాలలో నాటుతున్నారు.

మనం మొక్కలు, చెట్లు బాగా పెంచినట్లయితే ఉష్ణోగ్రతలు తగ్గించడానికి, వర్షాలు ఎక్కువ కురవడానికి, ఉపరితల, భూగర్భ జలమట్టం పెరగడానికి ఉపయోగపడతాయి. చెరువులు, బావులు నీటితో నిండి వ్యవసాయానికి అవసరమైన సాగునీటి సదుపాయం కల్పించవచ్చు. గొర్రెలు, మేకలు, ఆవులు వంటి పశువులకు సరిపడునంత మేత లభిస్తుంది. గడ్డిభూములు, పచ్చికబయళ్లు పశువులు మేయడానికి అనువుగా అందుబాటులో ఉంటాయి. పరిశ్రమలు, వాహనాలు, ఇంధనాలు కాల్చడం ద్వారా విడుదల అయ్యే కాలుష్యం తగ్గుతుంది. అడవుల వలన కలప, వెదురు, ఔషధాల తయారీలో ఉపయోగించే ఆకులు, బీడీల ఆకులు, వంట చెరకు, తేనె, పండ్లు, గింజలు లభిస్తాయి. పక్షులు, క్రూరమృగాలు అడవులలో ఆశ్రయం పొంది మానవ ఆవాసాల్లోకి రాకుండా ఉంటాయి.

- పెరిగిన అటవీ విస్తీర్ణం అధిక వర్షపాతానికి దోహదపడుతుందని ఎలా చెప్పగలవు?
- మీ గ్రామం/పట్టణం, ప్రాంతం పూర్తిగా చెట్లు, పచ్చదనంతో నిండియున్నట్లయితే ఎలాంటి పరిస్థితులుంటాయో ఊహించండి.

మనలో చాలా మందికి మొక్కలు నాటడం అనేది చాలా ఇష్టమైన పని, కానీ ఆ మొక్కలను సంరక్షించి కాపాడటమే సమస్య. మనం సాధారణంగా చాలా మొక్కలు నాటుతుంటాం కానీ మన నిర్లక్ష్యం వలన చాలా వరకు పెరగకుండా పోతున్నాయి.

SCERT TELANGANA



చిత్రం.4 ట్రీగార్డ్స్

అవసరమైన చోట ట్రీ గార్డ్స్ (Tree gaurds) సరఫరా చేస్తున్నారు. ఈ మొక్కలను సంరక్షించడం మనకు ముఖ్యమైన విధి. పాఠశాలల్లోల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సమాజం కూడా మొక్కలు నాటడంలో పాల్గొంటున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయ మొక్కలను తరగతి వారీగా లేదా జట్ల వారీగా దత్తత ఇచ్చి వాటి సంరక్షణ చేపడుతున్నారు. వారికి గల విరామ సమయంలో, పాఠశాల సమయానికి ముందు, తరువాత మొక్కలకు నీరుపోయడం, ట్రీగార్డ్స్ అమర్చడం, చుట్టూ కంచెవేయడం వంటి పనులు చేస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో ఇలాంటి పచ్చదనం కార్యక్రమానికి అవార్డులిస్తూ ప్రోత్సహిస్తోంది.

కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు మొక్కలను విద్యార్థులకు పంపిణీ చేసి వారి ఆవాస ప్రాంతాల్లో నాటిస్తున్నారు. ఆ విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు మరియు సమాజం పరోక్షంగా భాగస్వాములౌతున్నారు. ప్రజలు, సమాజమంతా శ్రద్ధతో పాల్గొంటేనే 230 కోట్ల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమం విజయవంతమౌతుంది. మరి కొన్ని పాఠశాలల్లో **'ప్రతి ఒకరు-ఒక మొక్క' (Each one, plant one)** నాటాలనే కార్యక్రమం అమలు చేస్తున్నారు.

**భారతదేశపు ఫారెస్ట్‌మ్యాన్**

జాదవ్ మొలాయ్ పయేంగ్ అస్సాంలోని జోర్హాట్ జిల్లాలోని ఒక అటవీ కార్మికుడు. తన 16వ ఏట, 1979లో సామాజిక అటవీ కార్యక్రమం అనే ప్రాజెక్టులో 5 సంవత్సరాలు కార్మికుడుగా కొనసాగాడు. ఆ ప్రాజెక్టు పని పూర్తి అయిన తర్వాత కార్మికులందరూ వెళ్లిపోయారు. కానీ తాను సొంతంగా చెట్లు నాటడాన్ని కొనసాగించాడు. 20 సంవత్సరాల కాలంలో బ్రహ్మపుత్రానది యొక్క ఇసుక తిన్నెలపై తాను దాదాపు 1360 ఎకరాల విస్తీర్ణంలో ఎన్నో చెట్లు నాటి వాటిని సంరక్షించాడు. ఆయన చేసిన ఈ పనితో మొత్తం ఆ ప్రాంతమంతా అడవిగా మారిపోయింది. దానితో ఆ అడవిని ఆయన పేరుతోనే "మొలాయ్ అడవి"గా పిలువ సాగారు. ఆయనను "భారతదేశపు ఫారెస్ట్ మ్యాన్" అని పిలుస్తూ, దేశంలోనే నాల్గవ అత్యున్నత పౌరపురస్కారం అయిన పద్మశ్రీతో గౌరవించడం జరిగింది.

నాటిన మొక్కలు అన్నీ సంరక్షించబడుతున్నదీ, లేనిదీ, తెలిసికోవడానికి రాష్ట్రప్రభుత్వం 'జియో-ట్యాగింగ్' (*geo tagging*) ద్వారా పరిశీలిస్తుంది. పాఠశాలలు, కార్యాలయాలు మరియు ఇతర స్థలాల్లో

- మీ ప్రాంతంలో మొక్కల పెంపకం ఎలా జరుగుతుందో తరగతి గదిలో చర్చించండి.
- మీ గ్రామం/పట్టణం లేదా ప్రాంతంలో అందుబాటులో ఉన్న చెట్లు, ఉద్యానవనాలు, పార్కుల గురించి చర్చించండి.




SCERT TELANGANA

**వనజీవి రామయ్య**

తెలంగాణా రాష్ట్రంలోని ఖమ్మం గ్రామీణ మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన 70 ఏళ్ల వయసుగల దరిపల్లి రామయ్య వనజీవి రామయ్యగా ప్రజాదరణ పొందాడు. 'మొక్కలు నాటండి-ప్రాణాన్ని కాపాడండి' అనే వాక్యం యొక్క ఉపయోగాల గురించి ఉపన్యాసాలివ్వడం కాకుండా ఆయన దానిని సార్థకం చేసి చూపించాడు. జేబునిండా విత్తనాలతో, సైకిలునిండా మొక్కల బరువుతో మైళ్ల దూరం సైకిలు తొక్కుతూ వెళ్లే వాడిగా స్థానికులకు తాను తెలుసు. పర్యావరణాన్ని కాపాడటానికి మొక్కలు నాటడం ఎంత అవసరమో ఆయన వాస్తవంగా గుర్తించాడు. అతడు వెళ్లే ప్రతిచోటా, తన వెంట ఎవరూ లేకున్నా ఒక్కడే బీడు భూముల్లో మొక్కలు నాటాడు. మొక్కలు నాటడమే కాదు. ఇతర వ్యక్తులకు, సంస్థలకు మొక్కలు నాటడానికి ప్రేరణ ఇచ్చి వాటిని పెంచి, సంరక్షించాడు. పర్యావరణాన్ని కాపాడడానికి తాను చేసిన అవిశ్రాంతమైన కృషి పచ్చదనాన్ని పెంచడానికి తాను చేసిన అద్భుతమైన ప్రయత్నం దేశంలోనే గౌరవప్రదమైన పద్మశ్రీ పురస్కారం పొందేలా చేసింది.

**కీలకపదాలు**

పర్యావరణ సమతౌల్యం    కాలుష్యం    భూగర్భ జలమట్టం    పచ్చదనం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. తెలంగాణలో పచ్చదనాన్ని పెంచడం ఎందుకు అవసరం?
2. అడవుల వలన ఉపయోగాలేమి?
3. మొక్కలను కాపాడుటకు కొన్ని చర్యలను సూచించుము.
4. రోడ్డుకు ఇరువైపుల గల చెట్లు మనకు ఎలా సహాయపడతాయి?
5. మొక్కలను నాటడానికి సంబంధించిన వార్తలను సూచించు పత్రికా క్లిప్పింగులను సేకరించి ఒక ఆల్బమ్ తయారుచేయండి.
6. ఈ సంవత్సరము మీ ప్రాంతంలో వనమహోత్సవం ఎలా నిర్వహించారు.
7. వనాలను పెంచడంపై కొన్ని నినాదాలు తయారుచేయండి.

SCERT TELANGANA

## విద్యా ప్రమాణాలు (Academic Standards)

**పుస్తకంలో ఇచ్చిన విషయాన్ని విద్యార్థులు అవగాహన చేసుకోడానికి తగినంత సమయం వెచ్చించాలి. మధ్యమధ్యలో ప్రశ్నలు వేయడం ఇందుకు దోహదపడతాయి. హేతువు, కారణకార్యాలు, సమర్థన, మానసిక పటం/భావనల పటం, పరిశీలన, విశ్లేషణ, ఆలోచన, ఊహ, సమాలోచన, వ్యాఖ్యానం వంటి వాటికి సంబంధించి ఈ ప్రశ్నలు ఉండాలి. ప్రతి అధ్యాయంలోను అంశాలవారిగా కీలక భావనలను చర్చించారు. కీలక పదాలను కూడా ఇచ్చారు.**

**1) విషయావగాహన (Conceptual Understanding) (AS1) :**

ప్రశ్నించడం, చర్చించడం, సమాలోచన, కేస్ స్టడీల ద్వారా ఉదాహరణలు, వ్యాఖ్యానించడం, పరిశీలించడం, వంటి వాటి ద్వారా కీలక భావనలను నేర్చుకోవడాన్ని ప్రోత్సహించవచ్చు.

**2) పాఠ్యాంశాన్ని (ఇచ్చిన) చదివి, అర్థం చేసుకుని, వ్యాఖ్యానించడం (Reading the text(given), Understanding and Interpretation) (AS2):**

రైతులు, కర్మాగారాలలోని కార్మికులకు సంబంధించి కొన్ని కేస్‌స్టడీలు, పాఠ్యపుస్తకంలో ఉపయోగించిన కొన్ని చిత్రాలు వంటివి నేరుగా భావనను తెలియజేయవు. ముఖ్య భావనలను విద్యార్థులు అర్థం చేసుకోటానికి, చిత్రాలను వ్యాఖ్యానించటానికి తగినంత సమయం కేటాయించాలి.

**3) సమాచార నైపుణ్యాలు (Information Skills) (AS3):**

సామాజిక శాస్త్రంలోని వివిధ అంశాల అధ్యయనానికి కేవలం పాఠ్యపుస్తకాలు సరిపోవు. ఉదాహరణకు పట్టణ ప్రాంతంలో ఉంటున్న విద్యార్థులు తమ ప్రజా ప్రతినిధుల గురించి, గ్రామీణ ప్రాంతంలో ఉంటున్న విద్యార్థులు తమ ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలు, చెరువుల గురించి సమాచారం సేకరించవచ్చు. విద్యార్థులు సేకరించిన సమాచారం పాఠ్యపుస్తకంలో ఉన్న దానితో పూర్తిగా సరిపోలక పోవచ్చు, దీనిని వివరించాలి. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు సేకరించిన సమాచారాన్ని తెలియజేయడం కూడా ఒక ముఖ్యమైన నైపుణ్యం. ఉదాహరణకు ఒక చెరువు గురించి సమాచారం సేకరించి ఉంటే దాని లిఖిత నివేదికతోపాటు ఒక చిత్రమో, పటమో జతపరచాలనుకోవచ్చు లేదా సమాచారాన్ని పోస్టర్లు, బొమ్మల రూపంలో ప్రదర్శించవచ్చు. సమాచార సేకరణ, రికార్డులు/పట్టికలలో క్రోడికరించటం, విశ్లేషణ, నిర్ధారణ వంటివి సమాచార నైపుణ్యాల కిందికి వస్తాయి. ప్రాజెక్టు పనులు నిర్వహించగలగాలి.

**4) సమకాలీన అంశాలపై (సామాజిక/సాంఘిక) ప్రతిస్పందన - ప్రశ్నించడం (Reflection on contemporary issues and questioning) (AS4) :**

విద్యార్థులు తమ తమ జీవన విధానాలను వివిధ కాలాలలోని, వివిధ ప్రాంతాలలోని ప్రజల జీవన విధానాలతో సరిపోల్చి, భేదాలకు గల పలు కారణాలను సూచించుటను, నిర్ధారించుటను మరియు వానిపై వ్యాఖ్యానించునట్లుగా ప్రోత్సహించాలి.

**5) పట నైపుణ్యాలు (Mapping Skills) (AS5):**

పాఠ్య పుస్తకంలో అనేక రకాల పటాలు, చిత్రాలు ఉన్నాయి. ఒక ప్రదేశానికి సంబంధించి నైరూప్య ప్రతిబింబమైన పటాల అధ్యయన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ముఖ్యం. ఈ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంలో అనేక దశలు ఉన్నాయి. తరగతి గది పటం తయారు చేయడం, పటంలో దూరం, ఎత్తులను చూపించే విధానాన్ని అర్థం చేసుకోవడం. ఈ పాఠ్యపుస్తకంలో బొమ్మలు, పోస్టర్లు ఫోటోలను ఉపయోగించాం. పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దడం కోసం కాకుండా వీటికి, పాఠ్యాంశానికీ సంబంధం ఉంది. కొన్ని సార్లు వీటికి సంభందించి కొన్ని కృత్యాలు కూడా ఉన్నాయి. ఉదా; బొమ్మకి శీర్షిక రాయటం, భవన నిర్మాణ చిత్రాలను చదవటం మొదలైనవి.

**6) ప్రశంస, సున్నితత్వం (Appreciation and sensitivity) (AS6) :**


భాష సంస్కృతి, కులం, మతం, లింగబేధం వంటి విషయాల్లో మన దేశంలో ఎంతో వైవిధ్యత ఉంది. సాంఘిక శాస్త్రం ఈ భిన్నత్వాన్ని పరగణనలోకి తీసుకోవాలని, ఈ తేడాల పట్ల సున్నితంగా ఉండాలని విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

SCERT TELANGANA

# అనుబంధం

ఈ అదనపు పటములను అవసరమైన సందర్భములలో ఉపయోగించండి.


ప్రపంచ రాజకీయ పటం




SCERT TELANGANA

# భారతదేశ నైసర్గిక స్వరూప పటం







SCERT TELANGANA


భారతదేశం 600 సా.శ.పూ.
మహోజనపదాలు మరియు రాజధానులు
కాంబోజ
(రాజపురం)
గాంధార
(తక్షశిల)
కురు
(హస్తినాపురం, ఇంద్రప్రస్థం మరియు ఇసుకారా)
పాంచాల
(అహిచ్ఛత్ర/కాంపిల్య)
సురసేన
(మథుర)
మత్స్య
(విరాటనగరం)
కోసల
(శ్రావస్తి)
వజ్జి
(వైశాలి)
మల్ల
(కుశీనగరం/పావాపురి)
వత్స
(కౌశాంబి)
కాశీ
(వారణాసి)
అవంతి
(ఉజ్జయిని)
చేది
(శుక్తిమతి)
మగధ
(గిరివ్రజ లేదా రాజగృహ)
అంగ
(చంపానగరం)
అరేబియా సముద్రం
అస్మక
(పౌదాన్య)
బంగాళాఖాతం
హిందూ మహాసముద్రం

## తెలంగాణ రాజకీయ పటం



SCERT TELANGANA

# తెలంగాణ రాష్ట్ర చిహ్నాలు

| క్ర.సం | రాష్ట్ర చిహ్నం | సాధారణ నామము | తెలుగు పేరు |
|---|---|---|---|
| 1. | రాష్ట్ర జంతువు | జింక | జింక |
| 2. | రాష్ట్ర పక్షి | ఇండియన్ రోలర్ | పాలపిట్ట |
| 3. | రాష్ట్ర చెట్టు | జమ్మి చెట్టు | జమ్మి చెట్టు |
| 4. | రాష్ట్ర పుష్పం | తంగేడు పుష్పము | తంగేడు పువ్వు |


రాష్ట్ర జంతువు


రాష్ట్ర పక్షి


రాష్ట్ర చెట్టు


రాష్ట్ర పుష్పం


రాజ ముద్ర

# భారతదేశ జాతీయ చిహ్నాలు

**జాతీయ జెండా :**
రూపకర్త –
శ్రీ పింగళి వెంకయ్య



**జాతీయ రాజ ముద్ర :**
సార్‌నాథ్ వద్ద ఉన్న అశోకుని ధర్మ స్థూపములోని మూడు సింహాల గుర్తు నుండి తీసుకొనబడినది.





**జాతీయ వృక్షం :**
మర్రి చెట్టు

**జాతీయ పుష్పము :**
తామరపువ్వు




**జాతీయ భాష :**
హిందీ






**జాతీయ ఫలము :**
మామిడిపండు



**జాతీయ నది :**
గంగ

**జాతీయ జంతువు :**
రాయల్ బెంగాల్ పులి



**జాతీయ గీతం :**
శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్‌చే రచించబడినది.

జన
గణ
మన...





**జాతీయ పక్షి :**
నెమలి




**జాతీయ ప్రార్థన:**వందేమాతరం శ్రీ బంకిం చంద్ర ఛటర్జీచే రచించబడినది.

**జాతీయ జలచర జంతువు :** డాల్ఫిన్



**జాతీయ క్యాలెండరు :** శక సంవత్సరం ఆధారితము (చైత్ర మాసం నుండి ఫల్గుణ మాసం వరకు). ప్రపంచ దేశముల వలనే గ్రెగరియన్ క్యాలెండరును అధికార క్యాలెండరుగా ఉపయోగిస్తాము.

Indian National Calendar (Saka calendar)

| S. No. | Month | Length | Start date (Gregorian calendar) | Ritu | Season |
|---|---|---|---|---|---|
| 1 | Chaitra | 30/31 | March 22 | Vasanta | Spring |
| 2 | Vaishākh | 31 | April 21 | | |
| 3 | Jyaishtha | 31 | May 22 | Grishma | Summer |
| 4 | Āshādha | 31 | June 22 | | |
| 5 | Shrāvana | 31 | July 23 | Varsha | Monsoon |
| 6 | Bhādrapad | 31 | August 23 | | |
| 7 | Āshwin | 30 | September 23 | Sharat | Autumn |
| 8 | Kārtik | 30 | October 23 | | |
| 9 | Agrahayana | 30 | November 22 | Hemant | Winter |
| 10 | Paush | 30 | December 22 | | |
| 11 | Māgh | 30 | January 21 | Sishira | Cold & dewy season |
| 12 | Phālgun | 30 | February 20 | | |



**జాతీయ వారసత్వ జంతువు :** ఏనుగు

**భారత ప్రామాణిక కాలము :**
82 1/2 డిగ్రీల తూర్పు రేఖాంశ ఆధారితము. గ్రీన్విచ్ ప్రామాణిక కాలము కన్నా మనదేశ కాలము 5 గం.30ని.లు. ముందు ఉంటుంది.



SCERT TELANGANA

# ఆశించిన అభ్యసన ఫలితాలు

## సాంఘికశాస్త్రం

6వ తరగతి

## విద్యార్థులు ఇవన్నీ నేర్చుకుంటారు.....

- గ్లోబ్ సహాయంతో పగలు, రాత్రి ఏర్పడే విధానాన్ని ప్రదర్శించి వివరిస్తారు.
- ప్రపంచ పటంపై ఖండాలను మరియు మహాసముద్రాలను గుర్తించగలరు.
- గ్లోబ్ మరియు ప్రపంచ పటంలో అక్షాంశాలు, రేఖాంశాలు, ధృవప్రాంతాలు, భూమధ్యరేఖ మొదలగునవి గుర్తించగలరు.
- భారతదేశ అవుట్‌లైన్ పటంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు సరిహద్దు దేశాలను గుర్తిస్తారు.
- వివిధ రకాలైన పురావస్తు వనరులు (రాత ప్రతులు, శాసనాలు, మిగతా సంబంధ రచనలు, పురావస్తు సంబంధ పదార్థాలు మొదలగునవి) ఉపయోగించి ఆయాకాలాలలో చరిత్ర పునర్నిర్మాణంలో వాటి పాత్రను వివరించగలరు.
- ప్రాచీన కాలంలో జరిగిన అభివృద్ధిని వివరించగలరు.
  ఉదా: వేట, వ్యవసాయం, పట్టణాలు మొదలగునవి.
- సంస్కృతి, ఖగోళశాస్త్రం, వైద్యం, గణితశాస్త్రం, తర్కశాస్త్ర విజ్ఞానంలో భారతీయులు పోషించిన ప్రధానమైన పాత్రను తెలుపుతారు.
- పురాతన కాలంలో గల వివిధ మతాల ప్రాథమిక సిద్ధాంతాలను విలువలను మరియు ఆలోచన సరళిని (విధానాన్ని) విశ్లేషిస్తారు.
- తమ చుట్టూ ఉన్న వివిధ రకాల మానవ వైవిధ్యాలు మరియు వివక్షతలను విశ్లేషిస్తారు.
- వివిధ రూపాలలో సమానత్వం మరియు అసమానత్వం మధ్య తేడాలను గుర్తించి వాటిని సరియైన పద్ధతిలో సరిచేస్తారు.
- స్కేలు, చిహ్నాలు ఆధారంగా ఒక ప్రదేశాన్ని చేరుకుంటారు. వాస్తవ దూరాన్ని దిక్కులను గుర్తిస్తారు.
- గిరిజనుల యొక్క గోండు పంచ్, పట్లా గురించి వివరిస్తారు.
- భారతదేశపటంలో మహాజనపదాలను, ముఖ్యమైన ఆధునిక పట్టణాలను గుర్తిస్తారు.
- మౌర్యచక్రవర్తి అయిన అశోకుని ఔనత్యాన్ని వర్ణిస్తారు. గుప్తరాజుల ప్రత్యేకతలను వివరిస్తారు.
- వివిధ మతాలలోని మౌలిక లక్షణాలను పోల్చుతారు, వివరిస్తారు.

విద్య మా హక్కు
సర్వశిక్షా అభియాన్

పాఠశాల విద్యా శాఖ,
తెలంగాణ ప్రభుత్వం

एन सी ई आर टी
NCERT

SCERT TELANGANA